RNI No. APTEL/2003/12253

# భావవీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 9(1) Monthly September 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



## డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Telugu Literary, Culture & Language Study**

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)



Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.



**Vol. 16 - Issue. 9(1) - September 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

భారతదేశపు మొట్టమొదటి ఉప రాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి అయిన డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్త్వాన్ని ప్రవేశపెట్టిన గొప్ప తత్వవేత్త. ఉపాధ్యాయ వృత్తికి ఆయన తెచ్చిన గుర్తింపు, గౌరవమునకు గాను ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజైన సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారు.

చాలా పేద కుటుంబంలో జన్మించిన రాధాకృష్ణన్ ఉపకార వేతనాలతోనే విద్యాభ్యాసాన్ని పూర్తిచేశారు. మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో తత్త్వశాస్త్రంలో ఎమ్.ఏ పూర్తిచేసిన తర్వాత 20 ఏళ్ళ వయస్సులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బోధకుడిగా చేరారు. ఆయన పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. రాధాకృష్ణన్ రోజులో 12 గంటల పాటు పుస్తకాలు చదవడం, ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలు రాయడం చేస్తుండేవారు. మైసూర్, కోల్‌కతా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా, ఆంధ్రా, బెనారస్ విశ్వ విద్యాలయాల్లో ఉపకులపతిగా, రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు.

ఆయన రాసిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 1952లో భారత మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారత రెండో రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టారు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఏనాడూ ఆయన ఆడంబరాలకు పోకుండా వచ్చే వేతనంలో 25 శాతం తీసుకొని మిగతాది ప్రధానమంత్రి సహాయ నిధికి తిరిగిచ్చేవారు.

బ్రిటీష్ పాలనాకాలంలోనే 1931లో బ్రిటీష్ ప్రభుత్వం వారిచ్చే ప్రతిష్ఠాత్మక 'సర్' బిరుదు ఈయనను వరించింది. 1954లో మానవ సమాజానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా భారతదేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'భారతరత్న' బిరుదును కూడా పొందారు. అంతేగాక ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయమయిన ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి మొదలగువాటి నుండి వందకు పైగా గౌరవ పురస్కారాల్ని మరియు డాక్టరేటుల్ని సంపాదించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం సర్వేపల్లి వారి సంస్మరణార్థం రాధాకృష్ణన్ చెవినింగ్ స్కాలర్‌షిప్‌ను ప్రకటించింది.

రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు, వారిపై ప్రేమాభిమానాలు చూపేవారు. ఆయన మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా వెళ్ళేటప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును కూర్చోబెట్టి రైల్వే స్టేషన్ వరకు విద్యార్థులే లాక్కుంటూ వెళ్ళారట. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులుగా ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని ఆయన కోరారట. ఆ రోజు నుంచే రాధాకృష్ణన్ గారి జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | కొలకలూరి ఇనాక్ 'రంధి' నవలలోని సామాజికత | - డా॥ చిలకా అనిత | 6 |
| 2. | తెలంగాణ సంస్కృతి - వివిధ కళారూపాలు | - డా. చవ్వా వెంకటరెడ్డి | 9 |
| 3. | రచయిత్రుల కొత్త కథలు | - మాధవి బొల్లు | 13 |
| 4. | ప్రాచీన తెలుగు సాహిత్యం - పునర్మూల్యాంకనం | - డా॥ యస్. చిన్నరెడ్డయ్య | 16 |
| 5. | గబ్బిలంలో జాషువా వర్ణించిన పంచముని దుస్థితి | - డా.కొత్తిరెడ్డి మల్లారెడ్డి | 20 |
| 6. | భక్తి - సంఘ సంస్కరణవాదిగా శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ | - డా.అజ్మీరా సిల్మానాయక్ | 23 |
| 7. | వైజయంతీ విలాసం - తులసీవనం వసంత గ్రీష్మ ఋతు వర్ణనలు | - డి. నాగరత్నమ్మ | 28 |
| 8. | గిరిజన కథాసాహిత్యం - ప్రకృతి వైపరీత్యాలు | - డా॥. నూనావత్ రాంబాబు | 33 |
| 9. | కడప జిల్లా జానపద కథలు- సాంఘిక అంశాలు | - ఉమ్మడి రవింద్రారెడ్డి & జి. పార్వతి | 38 |
| 10. | ఆంధ్ర మహాభాగవత అవతారిక - విశేషాంశాలు | - డా॥. ఎ. బాలకృష్ణ | 42 |
| 11. | స్త్రీల రామాయణపు పాటల్లో మంధర | - డా॥ జి. నళిని | 45 |
| 12. | అమెరికా తెలుగు కథలు - కుటుంబ సంబంధాలు | - డా. పలివెల చిరంజీవిరావు | 48 |
| 13. | తెలుగు సాహిత్యం - గిరిజన స్త్రీ | - డా.జరుపుల రమేష్ | 53 |
| 14. | సుగాత్రీ శాలినుల కథ - పాత్రల స్వభావం | - మెరుపుటాల సతీష్ కుమార్ | 61 |
| 15. | 'నగ్నముని' రచయిత రాయని నాటకం-కవితానుశీలన | - డాక్టర్ కె.లక్ష్మణ | 67 |
| 16. | సి.నారాయణరెడ్డి సాహిత్యం - సామాజిక దృక్పథం | - డా॥. జి.కిషన్ ప్రసాద్ | 72 |
| 17. | హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమంలో చైతన్యోద్యమాలు | - జి. ఎన్. సుదర్శన్ | 79 |
| 18. | 'చిత్తూరు కథ' - సామాజిక స్పృహ | - పూండ్ల వేంకటేశ్వరరావు | 83 |
| 19. | భవభూతి మాలతీ మాధవం - నాటక కళ | - డా॥ దోనేపూడి రామాంజనేయ శర్మ | 88 |
| 20. | ఓబుళ నారాయణరెడ్డి 'శాంతి చక్రవర్తి' - సింహావలోకనం | - డా॥ పి. విజయకుమార్ | 93 |
| 21. | సీమ కరువు, ఫ్యాక్షన్ కథలు - సామాజిక జీవితం | - కె. గీత & డా॥ భూక్య తిరుపతి | 100 |
| 22. | జాషువా సాలీడు, గిజిగాడు | - డాక్టర్ ఎం.మునిరత్నం | 105 |
| 23. | మల్లెమాల 'నిత్యసత్యాలు' - సామాజిక దృక్పథం | - డా॥. సిహెచ్. శ్యామల కుమార్ | 110 |
| 24. | 'ఆశావాది' వారి 'అంతరంగ తరంగాలు' : అంతర్వీక్షణం | - బి. వి. ఎస్. గౌతమ | 117 |
| 25. | ధిక్కార భాస్వరం 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' | - డా॥ వెల్దండి శ్రీధర్ | 120 |
| 26. | Code Mixing and Code Switching by the Youth in Andhra Pradesh Universities : A Study | - Dalavayee Loknadham | 122 |
| 27. | Telugu Students of Upper Primary and High School classes : Conversational Analysis : An Introductory Sketch | - B. Suresh Naick | 124 |

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# కొలకలూరి ఇనాక్ 'రంధి' నవలలోని సామాజికత

**– డా॥ చిలకా అనిత,** తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రక్రియలో అందెవేసిన చెయ్యిగా ఉంటారు. ఒక ప్రక్రియలో పేరు పొందిన వారు మరొక ప్రక్రియలో రాణించడం కష్టం. కాని అన్ని ప్రక్రియల్లో సృష్టికావించి పదిమంది మెప్పుపొందడమేంటే అసామాన్య మనే చెప్పుకోవాలి. అలాంటి అరుదైన సాహితీవేత్తలలో ఇనాక్ గారు ఒకరు. తెలుగు సాహిత్యంలో తమదైన ముద్రను వేసి వైశేషిక సృజన ప్రజ్ఞాపాటవాలు కలిగిన వారు ఇనాక్‌గారు.

గుంటూరు జిల్లా వేజండ్లలో అక్షరాలు నేర్వని ఇంట బుట్టి అనేక అక్షర మందార మాలికలు కట్టిన మహాజ్ఞానాం బుధి ఇనాక్ గారు. ఈయన అనేక రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పని చేయడంతోపాటు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ కులపతిగా పనిచేసిన కళాసరస్వతి జాతీయ కవి శ్రీ ఇనాక్ గారు. ఈయన రచనలు అనేకం ఉన్నా 2018లో ముద్రించబడిన 'రంధి' అనే నవల పాఠకుల మనస్సును చూరగొంది. అంతేకాక ఈయన రచనలు అనేకం వివిధ భాషల్లోకి అనువదించ బడ్డాయి.

గుంటూరు జిల్లా, వేజండ్ల గ్రామంలో కూలీనాలీ చేసి కొని జీవించే మాదిగపల్లెలో ఒకపసిబిడ్డ చదువుకోవాలన్న ఆశను గుండెల్లో నింపుకొన్న ఆ బిడ్డ ఎదుర్కొన్న పరిస్థితులను రచయిత మన కళ్ళముందు సాక్షాత్కరింప చేశారు. ఆ నవల చదువుతున్నంత సేపు పల్లెలోని మాదిగల స్థితిగతులను మన మనోనేత్రం దర్శిస్తాము.

ఎవరి గర్వం, అహంకారం, అతిశయం వాళ్ళ కుంటాయి. అది గుణం వల్ల వస్తుంది కాని కులం వల్ల కాదని తెలుసుకోవాలి. కులం, ధనం మనిషిని మూర్ఖుడిగా మార్చే ఈ దేశంలో అంటరాని వాళ్ళ కష్టాలకు అంతే ఉ ండదు. భయం అనేది మనిషి భవిష్యత్‌ను శాసించడం ఎంత ఘోరమో మాదిగ పల్లెలో ఒక ఆత్మగౌరవం కలిగిన సువ్వి తన మీద పరాయి మగవాడు చెయ్యి వేస్తే సహించ లేని గొప్ప ఆడతనం కలిగిన పిల్ల. అటువంటి పిల్లను నాంచారయ్య తన కొడుకు పైశాచిక ఆనందం కోసం సువ్వి జీవితంతో ఆడుకోవడానికి ప్రోత్సహించి చివరకు కుమారుణ్ణే పోగొట్టుకుంటారు. ఇక్కడ మనం గమనించి నట్లయితే బిడ్డల్ని ఏ తల్లి దండ్రులైనా గారాబాంగానే పెంచుతారు. వేజెండ్లలో కలిగిన నాలుగు కుటుంబాలలో నాంచారయ్యది ఒకటి. తనకున్న ఒక్కగానొక్క కొడుకు రామారావు (రాముడు) అతిగారాబంగా పెంచటం వల్ల స్కూల్‌కు వెళ్ళటానికి కూడా జీతగాడు పక్కన ఉండా ల్సిందే హైస్కూల్లో చేరి చదవాలంటే గుంటూరుకు రైలెక్కి రావాల్సిందే అది కూడా రైతుకు అక్కడ కూర్చోడానికి బెంచీలు వేయించి అవి ఖాళీగా ఉండేటట్లు చూసేవాడు నాంచారయ్య. ఉన్నతకులంలో వాడు చిన్నవాడైనా సరే ఈ నవలలో ప్రవర్తించిన తీరు దారణంగా ఉంటుంది. మాదిగలు సారు, దొర అనవలసిందే. పేదవారి కోపం పెదవికి చేటు అని మాదిగలు నమ్మే సిద్ధాంతాన్ని ఉన్నత కులం వాడు సాకారం చేశాడు.

కాకిపిల్ల కాకి ముద్దు అన్నట్లుగా సువ్వి (సువార్త) వేజెండ్ల మాదిగ కులస్థుడైన కోటి కూతురు. రూపురేఖలు తీర్చిదిద్దినట్లు ఉంటుంది. నల్లని ఛాయతో అందంతో పాటు చురుకైన, తెలివితేటలు కలిగిన పిల్ల. హైస్కూల్ చదువుకోసం గుంటూరు రావాలి. తల్లిదండ్రులను ఒప్పించి చదువుకొని టీచర్ అవ్వాలనే ఆశయం కలిగిన సువ్వి ధైర్యంగా ప్రతిరోజు గుంటూరు పాలబండి (రైలు) ఎక్కివస్తుంది. అదే బండిలో నాంచారయ్య కొడుకు రాముడు కూడా గుంటూరులో చదువు నిమిత్తం ప్రతిరోజు వచ్చేవాడు. అందగాడు మంచి శరీరచ్ఛాయ ఆరోగ్యకర మైన శరీరాకృతి కలిగినవాడు. ఐతే రాముడి దృష్టిలో మాదిగలు తమ కాళ్ళక్రింద పడి ఉండే అలగాజనం అని నీతి, న్యాయం, ధర్మం, ధనం అన్నీ కాలికింద చెప్పలని భావించే స్వభావం కలిగినవాడు. రాముణ్ని అతని జీత గాళ్ళు తీసుకొస్తే సువ్విని మాటలు రాని (మూగవాడు)

మనసున్న తల్లిదండ్రులు లేని చందిరి బండి ఎక్కించి తిరిగి దించుకొని తీసుకువెళ్ళేవాడు.

నాంచారయ్యకు డబ్బువల్ల వచ్చిన అహంకారం, అధికారం. పిల్లికి బిచ్చం పెట్టడు. బందువులు లేరు. కులం వాళ్ళు ఉన్నా కలవనీయడు, కలవడు. కలిస్తే అప్పులడుగుతారని భయం. తన ఆస్తులుతోపాటు అహంకారం కూడా పెరిగింది. చెప్పాలంటే ఒకానొకదశలో దేశానికి స్వాతంత్ర్యం రావడం కూడా పెద్ద ప్రమాదకరంగా మారింది. రైతుకు రైతు కూలీకి ఒకే ఓటు మునసబు, కరణం, పెద్దమాదిగ, వెట్టితో పాటు ఆడది కూడా సమానమా? అనే అభిప్రాయాన్ని కలిగి ఉంటాడు. "అణిగి మణిగి ఉండే మాదిగల వద్ద ప్రెసిడెంట్ ఓట్లను బిచ్చం లాగా అడ్డుక్కోవడం వల్ల మాదిగలకు కొమ్ములు మొలసి దున్నపోతులయ్యారు" అంటాడు.

అటువంటి మనస్తత్వం కలిగిన నాంచారయ్య కొడుకు రాముడుది అదే దారి. కనీసం సువ్వి రాముడు ఎక్కిడ పెట్టెలో ఎక్కినా ఊరుకునేవాడు కాదు సరికదా! "ముండ నేనెక్కిన పెట్టెలో నువ్వెందుకెక్కావు" అంటాడు. తన దృష్టిలో సువ్వి మా ఊరి మాదిగది మా మీద ఆధారపడ్డ కుటుంబంలోనిది అనుకుంటాడు. అప్పటి నుండి సువ్వి అతడు ఎక్కిన పెట్టెను వదలి మరోపెట్టెలో ఎక్కుతుంది. అనుకోకుండా అదే పెట్టెలో ఎక్కిన రాముడికి సువ్వికి మాటామాటా పెరిగి ఆత్మాభిమానం కలిగిన సువ్వి రాముణ్ని ముక్కుపై గుద్దడంతో రక్తం కారడం, తనను తన శరీరాన్ని ఎవ్వరు తాకటానికి ఇష్టపడని సువ్విని రాముడు వాటేసుకోవాలనుకోవడం తప్పించుకున్న సువ్విని లంజ అని తిట్టడంతో చెంప మీద చాచి కొట్టింది. అప్పుడు 'లంజా! నిన్ను నెత్తురు కారేటట్టు చెరచక పోతే నాపేరు రాముడేకాదు' అన్నాడు రాముడు. సత్య హరిశ్చంద్రుడుకి మునిముని మనుమడు మాటంటే మాటే ఏటంటే ఏటే మాట రామబాణం.

చందిరికి తల్లిదండ్రుల్లేరు. దగ్గరకు తీసినవారు కూడా కాలం చేయడంతో వేజండ్ల మాదిగ పల్లిలోనే సువ్వి ఇంటి ప్రక్కన ఉంటాడు. నోరు లేకపోయినా ఊరందరికి తల్లో నాలుకలా మెలగుతాడు. చందిరి ఆరోగ్యంగా ఉండటానికి కారణం వేజెండ్ల గాలి పీల్చి కాదు. అయ్యా, అమ్మా ఇచ్చిన ప్రేమను పొంది మనిషితనం, మంచితనం, పుష్కలంగా ఇచ్చి అమితంగా సంపాదించి ఏనుగంత మనిషి అయ్యాడు. పులిబిడ్డ అయ్యాడు.

రాముడు అన్నట్లుగానే సువ్విపై అఘాయిత్యానికి తలపడతాడు. రేపు ఉదయం పెండ్లి అనగా చెంబు పట్టుకుపోయిన సువ్వి రాకపోవడంతో ఆ విషయం ఊరంతా దావానంలా వ్యాపించి అందరూ తాటితోపు వైపుకు వెళ్లి చూస్తే అక్కడ తీవ్రగాయాలతో పడి ఉన్న సువ్విని కోటి ఇంటికి తెచ్చి ఆ మురికి బట్టలు తీసి శుభ్రమైన బట్టలు కట్టి మెల్లగా విషయాన్ని తెలుసుకుంటారు. పెళ్లి ఆగిపోయింది. ఎవరూ చేసుకోవడానికి ముందుకురారు. చివరకు మనసున్న మనిషి పులిబిడ్డ అయిన చందిరి సువ్విని వివాహం చేసుకుంటాడు. చందిరి సువ్వికి కొండంత అండ.

రాముడు సువ్విని చంపడానికి అనేక - పన్నాగాలు పన్నినా అవన్నీ ఫలించవు. బుర్ర బద్దలు కొట్టి చంపాలని, విషపు ఇంజక్షన్ ఇచ్చి చంపాలనుకుంటాడు. నగలు, నాణేలలు, రత్నాలు, ధనరాశులు ఉన్న లంకె బిందెల్ని కాపాడడానికి వాటి చుట్టూ నాగుపాము లాగా చందిరి సువ్వికి రక్షణగా ఉన్నాడు. చివరకు ప్రక్కనున్న చందిరిని చూసి సువ్విని ఏమి చెయ్యలేక చెరచి, పీకపిసికి, రైలు కింద పెడతానని శపదం చేస్తాడు. ఈ శపదం రాముడి అభిమానానికి, అంతస్థుకు, అధికారానికి, అహంకారానికి గుర్తు రాముడు అడుగడుగునా తన అహంకారాన్ని ప్రదర్శిస్తున్నాడు.

పెద్ద మాదిగలందరూ మునసబును ఆశ్రయిస్తే ఉన్నత కులస్థుడైన నాంచారయ్య రాడు. మునసబే నాంచారయ్య ఇంటికి రావాలి. అందరూ కలిసి పిల్ల తప్పేమి లేదు కాని దానిక్కారణమైన వాణ్ణి నిలదీయాలంటే అదివాళ్ళ వల్ల కాదు. అందుకే నాంచారయ్య కొడుకు రాముడికి శాపనార్థాలు పెట్టారు. అయితే నాంచారయ్య ఇది పెద్ద గొడవగాకుండా పోలీస్టేషనకు కోర్టుకు

తిరుగుతూ డబ్బు తగలేసే బదులు ఇక్కడే సర్ధుబాటు చేసుకుంటే పోతుంది అనుకుని డబ్బు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తే అది తప్పు చేసిన వాడే తమ మాదిగపల్లికి వచ్చి ఇమ్మనడంతో ఇష్టం లేక పోయినా రాముడు డబ్బు తీసుకుని వచ్చి సువ్వికివ్వడం. ఆమె డబ్బులు తిరిగి ఇచ్చేసి తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకుంది. అప్పుడు నాంచారయ్య 'చేసేదేమో దొరలు చేష్టలు కూసేదేమో కూలి కూతలు' అంటాడు నాంచారయ్య.

నాంచారయ్య 'సువ్విని చంపాననే వార్త నా చెవిన పడితే నువ్వు నిజంగా నా కొడుకువని నమ్ముతాను' అంటూ ఉంటాడు. దానికి అన్ని ఏర్పాట్లు చేస్తాడు. కావలసినంత డబ్బు, స్వేచ్ఛను ఇస్తాడు. అది తన కొడుకును పతనావస్థ చేర్చుతున్నానని మరిచిపోయాడు. మనిషి అందలమెక్కినా, అశ్వాలనెక్కినా, గజాలనెక్కినా, సింహాసనమెక్కినా నేలమీద పాడెమీదే పడుకోవాలన్న సత్యాన్ని గ్రహించలేకపోయాడు.

ఒక ప్రక్క రాముడు సువ్విని కోరాడు. దక్కట్లేదన్న అక్కసుతో చంపాలనుకున్నాడు. ప్రేమ చావును కోరు తుంది. ఏదేశంలోనైనా ఇదేతంతు. భారతదేశంలో మరీ అధికంగా. కారణం కులహీనత, ధనహీనత, సువ్విని చంపాలనుకున్న రాముడే రైలు కిందపడి మరణిం చడంతో నాంచారయ్య బ్రతికున్న శవంలా ఉన్నాడు. ఎంతో వైరం ఉన్న శత్రువులు కూడా కన్నీరు పెట్టి నాంచారయ్యను వాడేసుకుని ఓదార్చుతుంటే ప్రేమను రాగాలు, మమకారాలు చావలేదనిపిస్తుంది. శవయాత్రకు ఊరి వారు కాని ప్రక్క గ్రామాల వారు ఎవరూ రాలేదు. వారి దృష్టిలో నాంచారయ్య డబ్బు వడ్డీకి ఇస్తాడు. తీర్చు తాము ఆయనకు మాకు ఆర్థిక సంబంధాలే తప్ప మరేమీ లేదు అంటారు.

తనను మానభంగం చేసి చంపుతానన్న రాముడి శవాన్ని చూసి సువ్వి కూడా ఏడవడంతో అందరూ మాన వత్వం చావలేదనుకుంటారు. ఊరందరితోపాటు నాంచా రయ్యను ఆయన భార్యకూడా అసహ్యించుకుంటుంది.

సాధారణంగా మాదిగలు పాడెమోయరు. హిందువుల స్మశానానికి రారు. అటువంటిది నాంచారయ్య వంటి దుర్మార్గుడి కొడుకు పాడె పట్టడానికి ఎవరు లేకపోవడంతో నమ్మిన బంట్లైన మాదిగలే చిన్న దొరగారిని మేము ఎత్తుకొని పెంచాం. మేమే పాడెమోస్తామన్నారు. మాదిగ పెద్దలు ఐదుగురు నాంచారయ్య ఔదార్చుతూ కాళ్ళమీద పడితే 'మీ చేతుల్లోనే కదా వాడి చివరి ప్రయాణం' అన్నాడు నాంచారయ్య అంటే కొడుకు దహనం చేసేది మీరే కదా అని ఉద్దేశమైతే మీ వల్ల కదా నా కొడుకు చనిపోయిందని అర్థం గోచరించి మాదిగ పెద్దలు ఉలిక్కి పడతారు.

నాంచారయ్య తన కొడుకుకు పట్టిన గతే తనకు పడుతుందేమోనని ఆస్థి తనకు శాపం కాకూడదు. అది వరం అవ్వాలనుకున్నాడు. నాంచారయ్యలో క్రొత్త ఆలో చనలు ఊపిరి పోసుకున్నాయి. డబ్బు స్థానంలో మను షుల్ని సంపాదించుకోవాలన్న ఆసక్తి పెరిగింది. తన కాష్టా నికి వారసుడిగా చందిరిని తన ఆస్థికి వారసుడిగా చందిరికి పుట్టబోయే బిడ్డకు ప్రకటించాడు. సమయం సందర్భం వస్తే అమూర్త ప్రేమ కూడా మూర్తి దాల్చిన ప్రేమగా మారుతుందని గ్రహించాడు. దాంతో మాదిగపల్లి నాంచారయ్య ప్రేమను పొందింది. సువ్వి ఇది వరకు తండ్రి చాటు బిడ్డ ఇప్పుడు ఒకరికి ఆలి. సువ్వి ఆత్మ గౌరవం కోసం పోరాడిన పెద్దలు నిజానికి ఆత్మ గౌరవాన్ని సాధించుకుని అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఐకమత్యంతో అద్భుతాలు జరుగుతాయని గుర్తించిన వేజెండ్ల మాదిగ పెద్దలు గొప్ప పోరాట పటిమను పెంపొం దించుకోగలిగారు. ఇది శతాబ్ధాల మాదిగల నిరీక్షణ.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలంగాణ సంస్కృతి - వివిధ కళారూపాలు

- డా. చవ్వా వెంకటరెడ్డి, తెలుగు ఉపన్యాసకులు, హైదరాబాద్, తెలంగాణ.

'గతం నాస్తి కాదునేస్తం-అది మన అనుభవాల ఆస్తి'. వందసంవత్సరాల గత చరిత్రను పరిశీలిస్తే-నిజాం పరిపాలనలో తెలంగాణ ప్రాంతం మగ్గిపోయింది. ఇక్కడ తెలుగు భాష కోసం, తెలుగు సాహిత్యం కోసం, తెలుగు సంస్కృతి పరిరక్షణ కోసం కొందరు మహాత్ములు తమ జీవితాలనే పణంగా పెట్టిన విషయం తేటతెల్లం.

అతడు ప్రతాపరెడ్డి యిరులైపడియున్న తెలుంగువారి
గుం
డె తెరల దుల్పి వెల్గులను నిల్పిన మిత్రుడు! మూర్ఛవోయిన
ట్టి తెలుగు జాతి సంస్కృతికి రేకలు దీసిన మల్లినాథు
డె
న్నితరములైన ప్రాతవడనేరని సృష్టికి నాద్యుడాతడే

అని డా. సి.నారాయణరెడ్డి మూర్ఛపోయిన తెలుగు జాతి సంస్కృతిని ఉద్ధరించడానికి సురవరం ప్రతాపరెడ్డి అహరహమూ కృషిసల్పిన తీరును కనులకు కట్టినట్లు వర్ణించినారు.

తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది. కాలగమనంలో ఆంధ్ర సంస్కృతిలో భాగంగా పేర్కొని దీన్ని నష్టపరిచినప్పటికీ, ఇవాళ్టి సందర్భంలో తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవనం పొందుతోంది. భౌగోళికంగా బాగా సుసంపన్నమైన తెలంగాణకు తూర్పున కందికల్ గుట్టల వరుస, పడమట బాలాఘాట్ పర్వతశ్రేణులు, ఉత్తరాన గోదావరి, దక్షిణాన కృష్ణానదులు ఉన్నాయి. ఇలా ఎన్నో వనరులు ఉన్న ప్రదేశం కావడం వల్ల స్థానికంగా చరిత్ర, నాగరికత, సంస్కృతి ఇక్కడ వికసించినాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మిగతా సంస్కృతులకు ఇంత విస్తృతి లేదు.

తెలంగాణాలోని ప్రజలు కష్టజీవులు, వారికి అంకిత భావం ఎక్కువ. వీరి జీవితమే సంఘర్షణల మయం. పోరాటం ఇక్కడి జనుల రక్తంలోనే ఉంది. క్రీ.శ.1303లో అల్లాఉద్దీన్ ఖిల్జీ సైన్యాన్ని ఓడించి వెనక్కి పంపించారు. 1309లో మాలికా కాఫర్ సైన్యాలతో రోజుల తరబడి యుద్ధాలు చేశారు. 1321లో ఉల్గూఖాన్‌ను ఆరుమాసాలు యుద్ధంలో ఎదుర్కొన్నారు. క్రీ.శ.1303 నుండి 1433 అహ్మద్‌షా సైన్యాలతో జరిపిన ఎన్నో యుద్ధాల్లో తెలంగాణ ప్రజలు కష్ట నష్టాల పాలయ్యారు. ఆ పరంపరే కొనసాగి నిజాం రాజుల పాలనలో భాషా సంస్కృతుల అణచివేత, ఆర్థిక పీడన, జాగీర్దారుల దోపిడీ, కుట్రలు తెలంగాణాలో సాంస్కృతిక వికాసాన్ని నిరోధించాయి.

తెలంగాణాలో మతసహిష్ణుత ఎక్కువ. ఇక్కడ ఎన్నో మతాలు కలిసి ఉండేవి. తెలంగాణలో మొదట్లో జైనమత ప్రభావం ఎక్కువ అనడానికి నిదర్శనాలు పొట్లచెరువు, కొలనుపాక, జనగామ, కొల్చారం, వేములవాడలోని జైన కేంద్రాలు. మొదటి బేతరాజు జినాలయానికి, రెండవ బేతరాజు జైనబసదికి దానాలు చేసినట్లు శాసనాలు చెబుతున్నాయి. కుతుబ్‌షాహీల కాలంలో సూఫీతత్వానికి ప్రజాదరణ లభించింది. హైదరాబాద్‌లో ఎంతో వైభవంగా జరిగే బోనాల జాతరలో ముస్లింలు కూడా పాల్గొంటారు. ముస్లిం ఉత్సవాల్లో, ఉర్సుల్లో హిందువులు పాల్గొంటారు. కోర్కెలు నెరవేర్చుకోవటానికి హిందువులు పీర్లకు దట్టీలు కట్టడం, ఊదు చదివించడం ఇక్కడ మనం గమనించవచ్చు. కొమురవెల్లి జాతర, ఏడుపాయల జాతర, వేములవాడ జాతర, సమ్మక్క-సారక్క జాతర, మహంకాళమ్మ బోనాలు, పెద్దగుట్ట ఉర్సు, లతీఫ్‌సాబ్ గుట్ట ఉర్సు, జాన్‌పహాడ్ దర్గా ఉర్సు తెలంగాణ ప్రజల మత సామరస్యాన్ని తెలిపే సందర్భాలు.

ప్రస్తుతం తెలంగాణా మళ్లీ రాష్ట్ర స్థాయిని పొందిన తరువాత సాంస్కృతిక పునరుజ్జీవన ప్రయత్నంలో భాగంగా తెలంగాణ ప్రజలు బతుకమ్మ పండుగ, హోళీ పండుగ, పీర్లపండుగ, దసరా పండుగలను అత్యంతవైభవంగా జరుపుకుంటున్నారు. ఇవికాక వ్యవసాయ సంబంధమైన కొత్రావుల పండుగ, పాడిపశువుల రక్షణ కోసం బాలమ్మ

పండుగ, గ్రామరక్షణ కోసం, రోగనివారణ కోసం పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మలకు ప్రతి సంవత్సరం జరుపుకునే బోనాల పండుగలు తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే విధంగా అలరారుతూ ఉన్నాయి.

తెలంగాణా ప్రాంతం కళలకు కాణాచి. ఈ ప్రాంతాన్ని పాలించిన కాకతీయులు, కుతుబ్‌షాహీలు కళల్ని ఆదరించారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి నాటి శిల్పకళకు అద్దం పడుతున్నాయి. కాకతీయుల ఏలుబడిలో నాట్యానికి ప్రత్యేక ఆదరణ లభించింది. నృత్యం నేర్పడానికి ప్రత్యేక మైన శిక్షణా కేంద్రాలు ఉండేవి. నాటి లిఖిత సాహిత్యంలో పాలకుల, స్థానికేతరుల చరిత్రలు వర్ణితమైతే, మౌఖిక సాహిత్యంలో స్థానిక గాథలు చోటుచేసుకుంటాయి. గ్రామంలో వ్యవసాయం ప్రధానవృత్తి అయినప్పటికీ ప్రజా జీవనం సౌకర్యంగా సాగటానికి ఇతర చేతివృత్తుల వారు ఉండేవారు. పనిముట్లు చేసేవారు, అవసరాలు చూసే పనివారు పూర్వకాలం నుండి ఉండేవారు. శాతవాహనుల కాలంలో కోలిక (సాలె), కుమ్మరి, కంచరి, కమ్మరి, స్వర్ణ కారులు, వడ్రంగులు అనే వృత్తివారు ఉన్నట్లు సాహిత్యం ద్వారా తెలుస్తున్నది. కాకతీయుల కాలంలో పురోహితుడు, కంసాలి, కుమ్మరి, కమ్మరి, కంచరి, వండ్రంగి, చాకలి, మంగలి, సాలె, గొల్ల, బెస్త, ఈడిగ, గాండ్ల, చర్మకారవృత్తి వారు ఉండేవారని తెలిస్తోంది. ఈ కాలాలలో వ్యవసాయ పనిముట్లు చేసే వారికి అధిక ప్రాధాన్యత ఉండేది. తెలంగాణలో నేసిన పట్టువస్త్రాలకు ప్రపంచ ప్రసిద్ధి. గద్వాల, పోచంపల్లి మొదలైనవి ముఖ్యమైన వస్త్రోత్పత్తి కేంద్రాలు ఉండేవి. ఈ విధంగా తెలంగాణ వివిధ వృత్తికళా సంస్కృతుల సమ్మేళనమని చెప్పవచ్చు.

తెలంగాణాలో వివిధ కళా రూపాలు ఆయా కాలాల్లో విలసిల్లాయి. కళలు ఎంతగా అభివృద్ధి చెందాయంటే, అవి భిన్న సంస్కృతుల సమ్మేళనానికి దోహదం చేసే విధంగా ఉండేవి. రెడ్డిరాజుల కాలంలో గోడల మీద చిత్రాలు లిఖించేవారు. వేశ్యల పడకగదుల గోడలపై వివిధ పౌరాణిక ఘట్టాల చిత్రాలుండేవని నాటి సాహిత్యం వల్ల తెలుస్తున్నది. వారు బొమ్మలను తూలికలతో గీసేవారు. అలనాటి కొన్ని చిత్రలేఖనాలలో హిందూ - పారశీక సాంప్రదాయాలు కనబడతాయి. కాకతీయుల కాలంలో శిల్పకళ వృద్ధి చెందింది. రామప్ప దేవాలయం, అలంపురం, అహోబిలం, కాళేశ్వరం, పాలంపేట, మంథని దేవాలయాల శిల్పాలలో కాకతీయ శిల్పకళానైపుణ్యం కనబడుతుంది. మనోరంజనం కోసం ఆ రోజుల్లో యక్ష గానాలు, తోలుబొమ్మలాటలు ఆడేవారు. కిన్నెర, వీణ, భేరి, దుందుభి లాంటి వాయిద్యాలుండేవి. నాటి కళలలో ముస్లిం సంస్కృతి ఛాయలు కనబడుతూ ఒక వినూత్న మైన సంకీర్ణ తెలంగాణ సంస్కృతికి బాటలు వేసినాయి.

తెలంగాణ జానపద కళలు తెలంగాణా సంస్కృతి నిలయాలు. ఈ కళలు మట్టిలో మాణిక్యాలు, కులా శ్రయాలు, వారసత్వ కళానిధులు. జానపదులకు ఇవే వినోద సాధనాలు, విజ్ఞానప్రదాతలు. పల్లెపల్లెనా వీధి వీధినా ప్రదర్శించబడి, ఇంటింటా సంభావనలు పుచ్చు కున్న ఈ కళలు ఒకనాడు పల్లీయుల ఆదరణలో కళకళ లాడినా, నేటి ఆధునిక సామాజిక పరిస్థితుల్లో సంక్షోభంలో పడ్డాయి. వెలవెలపోతున్నాయి. కళాకారులు దిక్కులేని పక్షులయ్యారు. పొట్టకూటి కోసం అలమటిస్తున్నారు. ఒకనాడు వెలుగులు విరజిమ్మిన తెలంగాణా కళారూపా లను కొన్నింటిని తెలుసుకుందాం.

**శారద కథ :**

ఇది రెడ్డి తదితర కులాల వారిని యాచించి బతుకు వెళ్ళదీసే వీరముష్టులు, జంగాలు పాడుకునే పాట. వీరు వాయించే తంబూర పేరు శారద. ఈ వాయిద్యాన్ని వాయిస్తూ పాడే పాట శారదకథ. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి సంచారం చేస్తూ తిరిగే శారదగాండ్రు అనే గాయకులు నేటికీ చాలామంది వున్నారు. ఒక్కో కథని రెండు, మూడు రోజులు వరుసగా పాడతారు. ఒక స్త్రీ-ఒక పురుషుడుగానీ, కుటుంబంలోని ఇద్దరు ముగ్గురుగాని కలసి దీన్ని పాడుతారు. ముఖ్యంగా రెడ్ల చారిత్రక, సాంఘీక, పౌరాణిక కథలు గానం చేస్తారు. శారద గాయ కులే తెలంగాణా పోరాట కాలంలో మరణించి, నేడు

స్ఫూర్తిమంత్రాలుగా నిలిచిన రేణిగుంట రామిరెడ్డి, చింతలాపురి రామిరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి వంటి నాయకుల వీరోచిత కృత్యాలను చూసి కథలుగా మలిచారు.

## గొల్లసుద్దులు :

గొల్లసుద్దులు తెలంగాణాలో అత్యంత ప్రచారంలో వున్న ఒగ్గుకథలో ఒక భాగం. కురుమలకు బీరన్న ఆరాధ్య దైవం. ఈ దైవానికి సంబంధించిన కథలు చెబుతూ వాయించే ప్రధాన సంగీత వాద్యమైన 'ఒగ్గు'ని వాయించడం జరుగుతుంది. ఒగ్గుకథలో గొల్లలకు నీతి వాక్యాలు చెప్పే గొల్లసుద్దులు ఒక ఉపకథగా ఉంటుంది. ఈ ఉపకథలో పాడే దరువులు గొల్లసుద్దుల్లో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉంటాయి. ఆంధ్ర ప్రాంతంలో బుర్ర కథకు ఉన్న వ్యాప్తి తెలంగాణాలో గొల్లసుద్దులకు ఉన్నది. దీన్ని సులభంగా ప్రదర్శించవచ్చును. పాత్రధారి గొల్లలు కట్టే ఎర్ర అంచుపంచెని మోకాళ్ళవరకు మడిచి కట్టుకుని, భుజంమీద గొంగళి వేసుకుంటాడు. కాళ్ళకు గజ్జెలు ఉంటాయి. మొలకు బిళ్ళమొలతాడు ఉంటుంది. వంతలను ప్రేక్షకుల్లోంచి ఆహ్వానించడం ఈ గొల్లసుద్దుల ప్రత్యేకత.

## తందానా కథ :

పిచ్చుకగుంట్లు, జంగాలు అనాదిగా పాడుకుంటున్న ప్రదర్శన కళారూపం తందానా కథ. ఆ కథను ప్రదర్శించే బృందంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు లేదా ముగ్గురు జట్టుగా ఉంటారు. ప్రధాన కథకుడు తంబూర మీటుతూ అందెలు వాయిస్తూ, కథ చెబుతాడు. కథకుడికి అటొకరు, ఇటొకరు చేరి బుడికెలు వాయిస్తూ వంత పాడుతారు. ఈ కథలకే తందానా కథలనీ, సమ్మెట్ల కథలనీ వ్యవహారం ఉంది. ప్రదర్శన ధోరణిలో ఇది బుర్రకథను పోలి ఉంటుంది. వీటిని 'తందానా తానా' వరుసలోను, 'దండాలు తల్లీ' మకుటంతోను, స్త్రీలైతే 'కుశలవ' మాదిరి వరుసల్లో పాడుతారు. కథకుని ఆహార్యం కూడా బుర్రకథనే పోలి ఉంటుంది. కాళ్ళకు గజ్జెలు, తలపాగా, చేతిలో రంగురుమాలు, ధోవతి కట్టు ఉంటాయి. ఈ తందానా కథలు ఎంత ప్రభావవంతంగా ఉండేవంటే నిజాం వ్యతిరేక పోరాట కాలంలో నిజాం ప్రభుత్వం నిషేధాలు విధించింది.

## పేరిణి శితాండవం :

నాట్యకళారంగలో ఒక కళారూపం 'పేరిణి శివ తాండవం'. ఈ సృష్టి, అందులోని జీవకోటి, పంచభూతాల కలయికతో ఏర్పడింది. ఈ పంచభూతాల సమైక్య రూపానికి శివుడు ప్రతీక. శివుడు పంచముఖుడు, పంచాక్షరి ఆయన స్తోత్రం. ఐదు రేకులు కలిగిన మందారం, గన్నేరు పువ్వులు ఆయనకు ప్రీతికరమైన పుష్పాలు. అలాగే ఐదు అంగాలతో రూపొందిన పేరిణి నర్తనం ఆ శివునికి అత్యంత ప్రీతికరమైనది. గర్ఘర, విషమ, వికట, భావాశ్రయ, కవివారక అను ఐదు భాగాలు పేరిణి నాట్యంలో అంగాలు. ఈ పేరిణి పూర్తిగా శివపరమైన నర్తనం. శివశక్తిని తమపై ఆవహింప చేసుకొని, వీరులు, మైలారుదేవులు, పశుపతులు, మహేశులు అనే నాలుగు తెగలకు చెందిన వారిచే ప్రదర్శింపబడిన వీరనర్తనం. తిక్కనకాలం నాటి ఈ నర్తనం ప్రజాదరణ, ప్రభువుల ఆదరణ పొందినట్లు సాహిత్యం ద్వారా తెలుసుకోగలుగుతున్నాం. తిక్కన తన భారత విరాట పర్వంలో బృహన్నలకు తెలిసిన నృత్యాలలో 'పేరిణి'ని కూడా పేర్కొన్నాడు. కాకతీయుల కాలంలో ఈ పేరిణి విశేష ప్రచారంలో ఉండేది. శివుని పూజలో ఈ తాండవ నర్తనం లేకపోతే పూజ సంపూర్ణమయ్యేది కాదు. కాకతీయ గణపతిదేవుని బావమరిది, గజసేనాపతియైన జాయ సేనాని స్వయంగా నర్తకుడు, నాట్యశాస్త్రవేత్త. ఆయనే నృత్యశాస్త్ర గ్రంథమైన 'నృత్యరత్నావళి' రచించాడు. నేటికి తెలంగాణా ప్రాంతంలో కొన్ని పల్లెలకు 'మైలారుదేవుపల్లె' అని పేరు ఉంది.

## యక్షగానం :

ఇది అతి ప్రాచీనమైన కళారూపం. తెలుగునాట ఇది కేవలం తెలంగాణ ప్రాంతంలోనే ప్రదర్శితమౌతున్నది. సామాన్య ప్రజల అభిమాన కళగా, పల్లె ప్రజానీకంలో నేటికీ మన పురాణ, ఇతిహాసాలను సజీవంగా నిలిపి ఉంచుతోంది. దాసరి భాగవతులు, బహురూపులు, భర

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

తులు, సైంధవులు మొదలగు తెగలవారు దీన్ని ప్రదర్శి స్తారు. గానానికి తగురీతిలో హావభావాలను ప్రదర్శిస్తూ, సులభరీతిగా నృత్యం చేస్తూ కథను వివరిస్తారు. వీరి ఆభరణాలు, కిరీటాలు కాకతీయ రాజుల ఆభరణాలను పోలి ఉంటాయి.

## గంటె భాగవతులు :

ఈ ప్రదర్శనా రీతి తెలంగాణాలో తప్ప భారతదేశంలో మరే ప్రాంతంలోనూ లేదు. భాగవతాలు, వీధినాటకాలు, యక్షగానాలను తొలుత కాగడాల వెలుగులోను, ఆ తరువాత కాలంలో గ్యాసులైట్ల వెలుగులోను ప్రదర్శించడం జరుగుతున్నది. కాని ఈ గంటె భాగవతాల నర్తనంలో ప్రతి నర్తకుడు చేతిలో ఒక పెద్ద గంటె పట్టుకుని ఉంటాడు. అందులో నూనెపోసి, వత్తివేసి నర్తన సమయంలో దీపాలని వెలిగిస్తారు. ప్రతి నర్తకుడు తన పాత్రను అభినయించాల్సి వచ్చినపుడు ఆ దీపాన్ని తన ముఖం వద్దకు తెచ్చి ఆ వెలుగులో భావప్రదర్శనం చేస్తాడు. ఆ నూనె దీపపు కాంతిలో అతని ముఖం వింతకాంతులతో కనిపిస్తుంది. ఇది నేటి ఆధునిక కళారూపమైన సినిమాలో కనిపించే 'క్లోజప్'లా ఉంటుంది. గంటెలను చేతిలో పట్టుకుని ప్రదర్శిస్తారు, ఈ కళకు గంటె భాగవతాలని, ఈ కళాకారుల్ని గంటె భాగవతులని అంటారు.

## చిరుతల రామాయణం / భాగవతం :

చిరుతల భజన, భాగవతం రెండింటిని కలిపి ఒక విశిష్ట కళారూపంగా తెలంగాణ ప్రాంత ప్రజలు రూపొందించుకున్నారు. ఈ నర్తనరీతిలో చిరుతల భజన సంగీత శైలి, భాగవత బాణి రెండూ కలిసి ఉన్నందువల్ల ఇది రెండు పద్ధతుల్ని అనుసరించి ఉంటుంది. నర్తకులు రామాయణంలోని కథల్ని నర్తనమాడుతారు. వివిధ పాత్రోచిత అలంకారాలు ధరించి, వలయాకారంలో ఆడతారు. వలయం మధ్యలో మృదంగం, హార్మోనియం వాయించే సంగీతకారులు కూర్చుని ఉంటారు. ప్రతి కళాకారుడు పాత్ర తన వంతు రాగానే వలయం మధ్యలోకి వెళ్లి తమ పాత్రను అభినయిస్తూ, నర్తనం చేస్తాడు. తన వంతు అయిపోగానే తిరిగి అందరితో కలిసి వలయంగా తిరుగుతూ చిరుతలు వాయిస్తూ నాట్యమాడతాడు.

పైన చెప్పిన కళారూపాలే కాక విప్రవినోదులు, కాటి కాపలవారు, సాధనాశూరులు అనేవారు ఇంద్రజాల, మహేంద్రజాల విద్యలు తెలిసిన కళాకారులుగా తెలంగాణలోనే కనిపిస్తారు. ఇంకా చిందుమాదిగలు వీధినాటకాలను ప్రదర్శిస్తారు. ఒగ్గు గొల్లలు, బవనీలు అనే తెగలవారు ఎల్లమ్మ దేవత కథను ప్రదర్శిస్తారు. జోగువారికి నృత్యమాడడమే వృత్తి. శవాన్ని శ్మశానానికి తీసుకుపోయేటపుడు వీరు ఒక ప్రత్యేక పద్ధతిలో నృత్యం చేస్తారు.

నేటి ఆధునిక నాగరికత వ్యామోహంలో, ప్రపంచీకరణ నేపథ్యంలో, ప్రసార మాధ్యమాల ధాటిలో జానపద కళల రీవి కొడిగట్టింది. ఫలితంగా ఈ జానపదకళలు గాలికి కొట్టుకుపోతున్నాయి. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఈ జానపద కళల సంరక్షణ సంస్కృతి పరిరక్షణలో విస్మరించరాని ఒక భాగం. ఈ బాధ్యతను విస్మరిస్తే ఒక నాటి సంస్కృతి ఆనవాళ్లు కాలగర్భంలో కలిసిపోతాయి. మనం వెనక్కి తిరిగి చూసుకుంటే మనదైన సాంస్కృతిక వారసత్వంలో ఒక వెలితి కనిపిస్తుంది. ఈ కళల పరిరక్షణ ప్రజల, సమాజపు, ప్రభుత్వాల బాధ్యత.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# రచయిత్రుల కొత్త కథలు

**- మాధవి బొల్లు ,** పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, ప్రెసిడెన్సీ కళాశాల, చెన్నై, తమిళనాడు.

**పరిచయం :**

తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న రచయిత్రి జలంధర. ఆమె వ్రాసిన ఎన్నో కథలలో ఇది ఒకటి. ఈ కథ పేరు ఉత్తరం. స్త్రీని కేంద్ర బిందువుగా చేసి ఈ కథా గమనం సాగినది. ఈ కథ "రచయిత్రుల కొత్త కథలులో" ఒక కథగా ఉంది. 2017 సంIIలో ఈ కథా సంకలనము పుస్తక రూపంలో వెలువడింది

**పరిశోధన :**

రచయిత్రుల కొత్త కథలు అనే కథా సంకలనం నేను ఎంచుకున్న పరిశోధనాంశం. ఈ రచనకు 33 మంది రచయిత్రులు తమ కథలను అందించటం గొప్ప విశేషం. అందులోని రచయిత్రులందరూ తెలుగు పాఠక లోకానికి సుపరిచితులే దానిని సంకలనంగావించిన వ్యక్తి కూడా స్త్రీ కావటం. నేను , నా పర్యవేక్షకురాలు స్త్రీ మూర్తి కావడం విశేషం.

**ప్రేరణ :**

ఈ రచనకు ప్రేరణ చుట్టూ జరుగుతున్న సంఘటనలను బట్టి మనుష్యుల బలహీనతలను అంచనా వేసుకొని గొప్ప వ్యక్తిత్వం నిండిన పరిపూర్ణ స్త్రీగా ఈ కథలోని పాత్ర ఉంటుంది. సమాజంలో జరుగుతున్న కొన్ని సంఘటనలను చూసినప్పుడు కల్గిన అలజడికి ప్రతిరూపం ఈ కథకు ప్రేరణ అంటారు రచయిత్రి.

**కథ పేరు** : ఉత్తరం
**రచయిత్రి** : జలంధర
**పాత్రలు** : మాలతి ప్రధానపాత్ర , ఆమె అత్తగారి కుటుంబ సభ్యులు ఇతర పాత్రలు

**ఇతివృత్తం :**

ఈ కథలో మాలతి ఒక మధ్య తరగతి ఇంటి పెద్ద కోడలు. ఆమె కోడలిగా ఆ ఇంట ప్రవేశించిన నాటికి మరుదులు, ఆడపడుచులు చిన్నవారు. వారి ఎదుగుదలకు, ఇంటి పనులు, అత్తమామల ఆలనా పాలనా అన్నీ బాధ్యతగా నిర్వర్తిస్తుండేది.

ఎవరికి ఒంట్లో బాగుండక పోయినా విలవిలాడేది. నిద్ర పోకుండా సేవలు చేసేది. అందరి పుట్టినరోజులకి ఉన్నంతలో కొత్త బట్టలు కొని తీపి వంటలు చేసి గుడికి పంపేది. పండుగలకు వాకిళ్ళకు బంతి పూలదండలు, కార్తీక దీపాలు, తులసీ బృందావనం దగ్గర ముగ్గులు, ఉప్పు వ్రాసి ఇచ్చిన పెరటి జామకాయలు,గ్రహాలు బాగా లేవంటే పిడికిలిలో నవధాన్యలు ఉంచి గ్రహస్తోత్రం చెప్పించి పక్షులకు వేయటం ఇన్ని భాధ్యతల మధ్య మాలతి తన చదువును కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందేది. అలా వారి పెళ్ళిళ్ళు, కార్యాలు జరిగి ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళారు.

ఒకసారి మామగారు ఆస్తి పంపకాలు ఘట్టం మొIIన దగ్గర నుంచి మనుష్యుల్లో ఉండే మరోక కోణం బయటకు వచ్చింది. వారి భావాలు బైటకు వచ్చాయి. చదువు కోని, పెద్దగా ప్రయోజకుడు కాని పెద్ద కొడుక్కి ఆస్తిలో భాగం ఎక్కువ ఇచ్చి మిగతా వారికి విలువ రెట్టింపు ఆస్తి అయినప్పటికి, తక్కువ ఇచ్చారు అనే నెపంతో అందరూ మాలతిని దూషించారు. దానికి మాలతి ఒకటే సమాధానంగా మామగారిని మేము అసమర్ధులమని ఆస్తిలో ఎక్కువ వాటా రావడానికి అర్హత కాదు. కాబట్టి అలా వద్దు అని చెప్పినా మామగారు ఒప్పుకోలేదు.భర్త దానికి అంగీకరించటంతో ఆమెకు ఆవిషయం మరింత భాధ పెట్టింది. దానితో ఒకరికి ఒకరు మాట్లడుకోలేని స్థాయికి వెళ్ళారు. వాతవరణం మారిపోయి పట్నాలకి వెళ్ళి సెటిల్ అయ్యారు. దాని తరువాత అత్తగారు , మామగారు పోవటం, మాలతి ఎం.ఎ చదవటం - వ్యక్తిత్వ వికాస శిక్షణ క్లాసులు తీసుకుంటూ పేరు ప్రఖ్యాతులు గడిచింది. తన పిల్లలు అమెరికా వెళ్ళి అక్కడనే ఉండిపోయారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

భర్తకి గుండెపోటు రావటం, పోవటం ఇన్ని మార్పులతో జీవిత ప్రయాణం కొనసాగుతూనే ఉంది.

ఎంత కాలమైనా ఆప్యాయత ఉన్న చోట జ్ఞాపకాలు మరుగున పడవు. కాబట్టి అందరూ దూరం చేసుకున్నా తనకి కాన్సర్ అని చెప్పినప్పుడు అందరిని చూడాలని ఉత్తరం వ్రాసింది. నేను ఏ అనుబంధాన్ని మర్చిపోలేదు. నా పిల్లలిద్దరు అమెరికాలో ఉన్నారు. నాకు తెలుసు నాది హక్కులేని అప్యాయత అని, కానీ అప్యాయతలు, ఆనందాలు హక్కులకు అతీతమైనవి అని భావిస్తాను - నేను అయినా మీ అందరికి కూడా భార్యత్వం , కోడరికం గుర్తున్నట్లు మా వ్యక్తిత్వాలను గుర్తు చేసుకోరు అని మాలతి చెప్తుంది.

కంట్రోలింగ్ పేరెంట్ వాయిస్, మీ సబ్ కాన్షియస్‌లో రికార్డు అయి మీకు నెగెటివ్ మాటలు, అనుభూతులు, మిమ్మల్ని అదుపు చేస్తున్నాయి.నిబద్ధత కలిగిన పెద్దలుగా ఎదగలేక పోయారు అని లెటర్ వ్రాస్తుంది. అది చూసిన వెంటనే ఆమె ముందు ప్రత్యక్షమయ్యారు. మరుదులు, ఆడపడుచులు.

అపుడు చెప్తుంది. నాకు కాన్సర్ అంటున్నారు. అది అయినా కాకపోయినా ఒక్కసారి చూడాలని రమ్మన్నాను. విల్లు వ్రాశాను. మీ అందరికి నా తదనంతరంఆస్తి చెందాలని విల్లులో వ్రాశాను.అప్పుడు అందరూ ఏడుస్తుంటే ఓదార్చుతుంది. నేనేం తప్పు చేశానయ్యా నాకెందుకు దూరం అయ్యారు' అని - వారి దగ్గర జవాబు లేదు. ఇంత చిన్న వాటి కోసం విలువైనవి పోగొట్టుకుంటామా., ఆమె కన్నీళ్ళు, ఆమె ఉనికిని అక్కడ అర్థమైన వాళ్ళకు చెబుతూనే ఉన్నాయి. ఇంతటితో కథ ముగుస్తుంది.

### ఈ కథలోని మాలతి పాత్రపై విశ్లేషణ :

మాలతిని అందరూ అలా వదిలి పెడితే ఏమి చెయ్యగలదు పాపం? అనిపిస్తుంది.

కాని మాలతి ఏమి చేసింది.....జరుగుతున్న సంఘటనలను బట్టి మనుష్యుల్లో బలహీనతలను బేరీజు వేసుకోగలిగింది. నన్నెందుకు అర్థం చేసుకోరు? ఇంత మంచి దాన్ని నాకు ఇన్ని కష్టాలా అని తన మీద తాను జాలి పడలేదు, దు:ఖ పడలేదు.....ఎవరి దగ్గర నుంచి ఓదార్పు ఎదురు చూడలేదు.

కానీ నాకు నేను ఏమి చేసుకోగలను ? అని ఆలోచించడం ప్రారంభించింది. మాలతి డిగ్రీ తెచ్చు కొన్నది. ఉద్యోగం... ఆ తరువాత "మాలతి మార్గదర్శి" అన్న వ్యక్తిత్వ వికాస కేంద్రాన్ని స్థాపించింది. తన వ్యక్తిత్వ వికాసానికి ఏమేమి నేర్చుకున్నారో, ఎలా ఇలా మారిందో తనను తాను పరిక్షించుకుంటూ నేర్చుకున్న విజ్ఞాన్నాన్ని శాస్త్రీయ బద్ధంగా నలుగురికీ పంచి పెట్టడం ప్రారంభించి డబ్బు కీర్తి - రెండు సంపాదించుకో గలిగింది . దానితో పాటు తన పిల్లల్ని మంచి స్థితికి తీసుకురా గలిగింది.ఈ అభ్యుదయం మాలతికి ఏ అభ్యుదయవాది జాలిపడి ఇచ్చింది కాదు. తనంతట తాను తన పంథాలో ఎదిగి ఫలితము చూపించగలిగింది.తనను ఎవరో వచ్చి ఉద్ధరించాలని ఎదురు చూస్తూ కాలం గడపలేదు మాలతి. తన లోచూపుతో, తనలోని వెలుతురు గుర్తించ గలిగింది. ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక గౌరవము సాధించిన మాలతి ఎటువంటి దురుద్దేశాలకు అవకాశం ఇవ్వలేదు. అటు సున్నితత్వం, లాలన, ప్రేమ ఏది మర్చి పోలేదు. ఎవరు గుర్తించలేదని తనలోని సౌందర్యాన్ని చంపేసుకోలేదు.

తనని తానుగా స్వతంత్రంగా నిలబెట్టుకొని, అనారోగ్యానికి కూడా కలత చెందక నిబ్బరించున్న మాలతి.... అభ్యుదయానికి ప్రతీక . స్త్రీని కేంద్ర బిందువుగా చేసి రచయిత్రి కథ రచించారు.ఆలోచనా శక్తి పెంపొందించే విధంగా ఒక కొత్త కోణంలో మంచి చెడుల్ని ప్రస్తావిస్తూ, మానవత్వానికి ప్రాధాన్యమిస్తూనే స్త్రీకి ఆత్మవిశ్వాసంతో పాటు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని ఆమె చేసిన రచన గర్వించదగింది.

### కథాశిల్పం :

కుటుంబ సంబంధాలు వాటి అనుబంధాలకు సంబంధించిన సమస్య .ఉన్నతమైన ఆలోచనలతో పుట్టినింటి నుంచి మెట్టినింటికి అడుగిడిన మాలతికి కుటుంబంలోని వారందరికోసం బాధ్యతతో అంటే ఇల్లాలిగా,

కోడలిగా, వదినగా అందరి అభివృద్ధికి ఆరాటపడిన ఓ మాములు సగటు స్త్రీ .

అందరిని ఒక తీరుకు తీసుకు వచ్చే వరుకు ఇదేమిటి అని ప్రశ్నించకుండా బాధ్యత తన మీద వేసుకొని తన వంతు కృషి చేసి ఎంతో ఆనందంగా జీవించాలి, కుటుంబ సంబంధాలను ఉన్నతంగా ఉంచాలి అన్న ఆలోచనతో అందరి మన్ననలు పొంది ఎవ్వరికి ఏమి కానని తెలుసుకొన్న మాలతికి ఎదురయిన అనుభవాలను విప్పి చెప్పే కథ.

ఏమి తప్పు చేయని స్త్రీని ప్రతి ఒక్కరూ బంధాలకు అనుబంధాలకు : వాటి విలువ తెలియక ఎంతో అల్పమయిన వాటికోసం మనుష్యులను వారి మంచి తనాలను వదులుకున్న వారికి ఈ కథ ఒక చక్కటి ఉదాహరణ ఇలాంటి నేపథ్యం ఉన్న వారిలో ఈ కథలను చదివినప్పుడన్నా వారి అంతరంగ మథనం మొదలవ్వాలని, వారి ఆలోచనలో చిన్న మార్పు రావాలని ఆశ నాకు ఈ కథలో కన్పిస్తుంది.

## ముగింపు :

జలంధర గారి రచనాశైలి కొనియాడదగింది. చిన్న చిన్న వాక్యాలతో, చెప్పదల్చుకుంది సూటిగా చెబుతూ పాఠకురాలి మదిలో కలిగే స్పందనతో కథను నడపటంలో ఆమె సిద్ధహస్తురాలు.

ఈ కథలో మాలతీ పాత్ర ద్వారా భారతీయ ఆచార సంప్రదాయాలకు ఇచ్చిన విలువ గమనించ దగ్గవి. ఒక ఉత్తరంతో మాలతి వారిలో మార్పులుతేలేక పోయినా మరుగున పడిన అనుబంధాల్ని వెలికి తీయటంలో ఒక అడుగు ముందుకు వేసింది. ఇందులో మాలతి పాత్ర తనుకదిలి, తన చుట్టూ ఉన్న పాత్రలు వాస్తవ మనస్తత్వం కల్గి ఈనాటి సమాజానికి అద్దం పట్టే విధంగా వ్రాయటం అభినందనీయం.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# ప్రాచీన తెలుగు సాహిత్యం - పునర్మూల్యాంకనం

- డా॥ యస్. చిన్నరెడ్డయ్య అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

వెయ్యేళ్ళు దాటిన తెలుగు సాహిత్య ప్రాదుర్భావ వికాసాలకు సర్వ ప్రక్రియా సనాతమైన, సమగ్ర, ప్రామాణిక సాహిత్య చరిత్ర నిర్మాణం అత్యంత ఆవశ్యకమే అయితే, ఇంతవరకు జరిగిన సాహిత్య చరిత్ర నిర్మాణం సమగ్రంగా లేదా? ఆ గ్రంథాలు ప్రామాణికం కావా? అనే ప్రశ్నలు పుడుతున్నాయి. ఇది వరకు జరిగిన, జరుగుతున్న కృషి అంతా సాహిత్య వికాసాన్ని ఒడిసి పట్టుకొని, సమగ్రత్వ సాధన దిశగా వేసిన ముందడుగులుగా గుర్తింపు పొందాయినేది పూర్తిగా సత్యమే.

కాని, ఆ పరిశ్రమ అంతా మూలమూలల్లోని ఆకరాలను సేకరించడంలోను, వాటిని ఆనుపూర్విగా గుదిగుచ్చి, ఒక్కొక్క ప్రక్రియను నిర్దిష్టమూ అయిన క్రమ వికాస దృష్టితో, ముఖ్యంగా పి.జి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా విశ్లేషించి సమన్వయించడంలోనే మొత్తం రచనా విధానం కేంద్రీకరించబడింది.

## కొన్ని సూచనలు :

1) సాహిత్య చరిత్ర కథనంలో సాహిత్య విమర్శ అనేది కూడా ఒక అనివార్యమైన అంతర్భాగమే! కొన్ని కీలక సందర్భాలలో విమర్శ సూత్రాలు పాటమరిస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ, ఆయా సూత్రాల అనుస్యూతి, క్రమోన్మీలనం పాఠకుని హృదయానికి హత్తుకొనే విధంగా రచన సాగిన తావులు తక్కువ. సాహిత్య చరిత్ర - సాహిత్య విమర్శకు మౌలిక సూత్రాలను అందించినప్పుడే 'సమగ్రత్వం' సాధింపబడినట్లు.

2) మరొక ముఖ్యాంశం! తెలుగులో ముద్రిత సాహిత్యం కంటే, అముద్రిత సాహిత్యమే ఎక్కువ! దక్షిణ భారత దేశంలోని అనేక ప్రాచ్య పరిశోధన సంస్థలలో, ప్రైవేటు వ్యక్తుల గ్రంథాలయాల్లో ఉండే అముద్రిత అమూల్య సాహిత్య సంపదను కూడా సాహిత్య చరిత్రకారుడు. పరిగణనలోనికి తీసుకొని సందర్భోచితంగా చక్కని బేరీజు వేయవలసి ఉంటుంది. దీనివల్ల యువతరం పరిశోధనకులు ఆయా గ్రంథాలకు సంశోధిత ప్రతుల తయారు చేసి, సిద్ధాంత గ్రంథాలు వ్రాసి ఎం.ఫిల్., పిహెచ్.డి. పట్టాలు పొందువచ్చు. ఆరుద్ర - సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో ఈ దిశగా కొంత కృషి చేసిన మాట వాస్తవం. అయినా చెప్పవలసింది ఇంకా ఎంతో మిగిలే ఉంది.

3) ఇక రచనా శైలికి వస్తే, ''నవ్యాంధ్ర సాహిత్య వీథులు'' అనే గ్రంథ రచయితలు వాడిన శైలీ విధానం పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. తర్కాన్ని తగ్గించి, భాషా క్లిష్టత లేకుండా, వాడుక భాషలోనే సజీవ శైలిని సాధించవచ్చు. తర్కజటిలమైన భాష సాహిత్య చరిత్ర రచనకు పనికిరాదు. ఇది సాహిత్య చరిత్ర కథనం కనుక హితవుగా చెప్పేమాటయే హృదయాన్ని రంజింపజేస్తుంది. తర్క కర్కశమైన కృత్రిమ శైలితో కొందరు ఇటీవల సాహిత్య చరిత్రలు వ్రాస్తున్నారు. ఇది అధికార ధోరణితో కర్రపెత్తనం చెలాయించే విధంగా కనబడుతుంది. ఇలాంటి పుస్తకాలు పాఠకులు చదువరు. డొంక తిరుగుడు వాక్యాలు వాడరాదు. భావాన్ని స్పష్టంగా చిన్న చిన్న వాక్యాలుగా వ్రాయాలి. 'ఆరుద్ర' గారి శైలి చాలవరకు అనుసరణీయం. (కొన్ని చెణుకులు, అనవసరవ్యాఖ్యలు తప్పిస్తే) చక్కని వాడుక భాష వాడితే సాహిత్య చరిత్ర విసుగుపుట్టించ కుండా జనరంజకంగా చదివింపజేస్తుంది. బహుళ జనామోదం పొందుతుంది. ఒక్కమాటలో చెబితే, పాండిత్య ప్రకర్ష ప్రదర్శించకుండా ఉంటే, శైలి రాణిస్తుంది. దీనిచే 'కృత్రిమశైలి' పరిహరింపబడి, 'సజీవశైలి' స్థాపింపబడుతుంది.

4) అంతే కాదు, సాహిత్య చరిత్రకారుడు. 'నిష్పక్షపాత వైఖరి'ని అవలంబింపవలసి ఉంటుంది. నిరంకుశ త్వాన్ని ప్రదర్శిస్తూ కొందరు కవులపై కొరడా ఝళి పించడం పనికిరాదు, తనకు ఇష్టంలేని కవుల్ని సాహిత్య చరిత్ర నిర్మాణంలో తగిన చోటు లేకుండా బహిష్కరించడం అన్యాయం. ఇటువంటి విపరీత ధోరణిగల వారిని ఉద్దేశించే కవిసమ్రాట్ విశ్వ నాథుడు "వ్యక్తిగతమైన ఇష్టానిష్టాలతో సారస్వతం మీదికి దండెత్తరాదు" అని విస్పష్టంగా వ్రాశారు.

సాహిత్య చరిత్రకారుడు తన కిష్టమైన సిద్ధాంతాన్ని సాహిత్య చరిత్రలో చొప్పించడానికి ప్రయత్నించడం ఎంత తప్పో, విశేషించి వివరించి చెప్పవలసిన ఒక కవి గ్రంథాన్ని నిషేధించి, తొలగించడం కూడ అంతే తప్పు అవుతుంది. అందరు కవులకూ, అందరి రచనలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యక్తిగతంగా తన కిష్టం లేదని కొందరు కవుల్ని తీసివేస్తే ఆ సాహిత్య చరిత్ర అసమగ్రంగా తయారవుతుంది. విమర్శకులు నిర్ణయించిన కాల నిర్ణయం ప్రకారం, కాలక్రమాను సారంగా కవులందరికీ సముచిత స్థానం యిచ్చి తీరాలి. అభిప్రాయభేదాలుంటే, వాటిని ఏకరువుపెట్టి, చర్చించాలే తప్ప, కవుల జాబితా తోనే వారికి ఉనికి లేకుండా చేసే అధికారం చరిత్రకారుడికి లేదు.

ఉదాహరణకు - ఆచార్య కొర్లపాటి శ్రీరామ మూర్తి గారు "తెలుగు సాహిత్య చరిత్ర" అనే ఐదు సంపుటాల రచన నుండి, నన్నెచోడుని కుమారసంభవ ప్రబంధాన్ని తొలగించడం, ఒక బాధ్యతగల సాహిత్య చరిత్రకారుని సముచిత చర్యకాదు. ఈ విషయంలో డా॥ కొర్లపాటివారు, ఒక చరిత్రకారునిగా తమ విద్యుక్తధర్మాన్ని విస్మరించడమే కాదు, తమ నిర్దిష్ట పరిధిని దాటి ప్రవర్తించారనే చెప్ప వలసింది. వారి చర్యను సమకాలీన కవి పండితులెవ్వరూ హర్షించలేదు. సరికదా, వారి చర్య క్షంతవ్యం కాదన్నారు.

శ్రీ కందుకూరి వీరేశలింగంగారి "ఆంధ్రకవుల చరిత్రము" (1886) మొదలుకొని (పుటలు 120-143), 1965-1988 మధ్యకాలంలో 'సమగ్రత' దెబ్బ తినరాదని ఆరుద్రగారు నిర్మించిన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' (12 సంపుటాలు) తొలి సంపుటంలోనే నన్నెచోడుని ప్రబంధాన్ని గూర్చి (పుటలు 160-186) (తెలుగు అకాడెమీ, హైదరా బాద్, 2005) విరివిగ వ్రాసి ఉండగ, ఆచార్య కొర్లపాటి వారి సాహిత్య చరిత్రలో హఠాత్తుగా నన్నెచోడుడు లేక పోవడం పండిత లోకాన్ని ఆశ్చర్యాన్ని, ఆవేదనను కల్గిం చిన సంచలనాత్మక విషాద ఘట్టం.

ఇటువంటి విపరీత చర్యల్ని కవి పండిత లోకమూ, సాహిత్య చరిత్రజ్ఞులూ, విజ్ఞులూ, మేధావులూ తీవ్రంగా ఖండిచాలి! ఈ తప్పుకు పరిహారంగా, రాబోయే సాహిత్య చరిత్ర నిర్మాణంలో నన్నెచోడునికి సముచిత స్థానం కల్పించాలి.

5) ఏ కాలంనాటి సమాజానికీ, ఆ కాలం నాటి సాహిత్యం సన్నిహితమై ప్రేరకంగా ఉంటుంది. దేశకాల పరిస్థితుల ప్రభావం నుండి ఏ కవీ తప్పించుకోలేదు. కథావస్తు స్వీకరణం మొదలుకొని, రసనిర్ణయం వరకు దేశకాల పరిస్థితులే అందిస్తాయి. నిర్ణయిస్తాయి. సమాజ జీవితం నుండి పుట్టేదే సభ్యత, సంస్కారం, సంస్కృతి, ఆచార్య వ్యవహా రాలు, సంప్రదాయాలు అన్నీ, అది సాహిత్యంలో ప్రతిబింబించినప్పుడు పాఠకుడు తన స్వానుభవాన్ని అందులో చూసుకొని ఆనందిస్తాడు. ఇవే తరతరాల వారికి, సాహిత్యం ద్వారా అందివచ్చే సంప్రదాయ పరంపరానుభూతి. దీనికి సమాజ జీవితమే ఆధఆర భూమిక. ఆయా యుగాలలో మారుతున్న సాంస్కృ తిక, సామాజిక, విలువలు వాటి ఆచరణకు ఆర్థిక స్థితిగతులెలా ప్రభావితం చేస్తాయో, దాన్ని సాహిత్యం ఎలా స్వీకరించి వ్యాఖ్యానించిందీ అట్ట డుగు బడుగువర్గాలవారు, మధ్యతరగతి కుటుం బాల వరకూ ధనవంతులు జీవన విధానాలను తెలుసుకోవడానికి సాహిత్యమే ఆధారం.

చిన్న పిల్లల ఆటపాటలు మొదలుకొని విద్వాంసుల విద్వద్గోష్ఠుల వరకుగల స్వారస్యాలను ప్రబంధ రచనలే అద్దం పడుతున్నాయి. నీతినియమాలు, న్యాయవ్యవస్థ,

నేరము-శిక్షా, యివన్నీ సమాజ జీవితపు తీరుతెన్నుల్ని సాహిత్యం ద్వారానే మనం తెలుసుకుంటున్నాం. సమాజానికీ సాహిత్యానికి అవినాభావ సంబంధముంది.

6) చరిత్ర - సమాజం, ఇవి రెండూ అవిభాజ్యమైన సంపుటి. అంటే విడదీయడానికి వీలులేనిది. చారిత్రక కాలాల నుండి లభించిన శిలాశాసనాలు, తామ్రశాసనాలు, తాళపత్ర ప్రతులు ఆయా రాజుల కాలాల్లో వ్రాయించినవి, ఆనాటి కవుల ప్రబంధ అవతారికలలుగల అంశాలతో ఎంతవరకు సమన్వయిస్తున్నాయో పరిశీలించి, పరిశోధించి వినూత్నాంశాలను ఆవిష్కరించడం, చారిత్రక సత్యాలను నిగ్గుదేల్చడం చరిత్రపరిశోధనలో అంతర్భాగం.

7) రాజపోషణ లేకుంటే కవులకు బతుకు తెరువు కష్టమే! కవులు లేని సభలో రాజులు రాణించలేరు. ఇలా, రాజులు, కవులు పరస్పర పోషకులై, అన్యోన్యాశ్రులై ప్రజల మన్ననల్ని పొందారు. రాజుల ఆస్థానంలో జరిగిన విద్వద్గోష్ఠులు ప్రజలకు ఉత్తేజ కారకులు. రాజాస్థానాలను ఆశ్రయించక. స్వతంత్ర జీవనం గడిపిన కవులు దేవస్థానానికే తమ జీవితం అంకితం చేశారు. ఇటువంటి భక్తకవుల జీవితాలు, వారి రచనలు, పద్య సాహిత్యమే గాక పద సాహిత్యంలో కీర్తనలు, సంకీర్తనలు, శతకాలు, ప్రబంధాలు ఎన్నెన్నో ఉన్నాయి. ఇదొక ప్రత్యేక శాఖ.

8) యుగ విభజన సమస్యకు పరిష్కారం, రాజ వంశాల వారీగా సాహిత్య యుగ విభజన చేయ టమే సరైన పద్ధతి. తొలితరం సాహిత్య చరిత్రకారులు కందుకూరి వీరేశలింగం - ఆంధ్రకవుల చరిత్రమ్మనీ, చాగంటి శేషయ్యగారు ఆంధ్రకవితరంగిణి అనీ కవుల ప్రాధాన్యం మీద కవి జీవిత చరిత్రలు వ్రాశారు. చరిత్ర సాహిత్యానికి వెన్నెముక కాబట్టి వెన్నెముకను చెప్పి సాహిత్యాభ్యుదయాన్ని చెప్పడం సమయంజసం. అందుచేత ఆరుద్ర ప్రభృతులు వింగడించిన రాజవంశాల వారీగా యుగవిభజన చేస్తే రాజులు - వారి వ్యక్తిత్వాలు - రాజ్యపరిపాలన - ప్రజాజీవనం - దానధర్మాలు - గుడిగోపురాలు - శిలా తామ్రశాసనాలు - కవులు వారి జీవితాలు - వారి రచనలు - అంకితాల ఘట్టాలు - ఆస్థాన కవులు - ఆస్థానేతర కవులు - విశేషించి రాజకవుల రచనలు - సమకాలీన దేశకాల పరిస్థితులపై ప్రాచ్య పాశ్చాత్య చరిత్రకారుల మదింపు - వాటి పరిశీలనలు ఇవన్నీ సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాణానికి దోహదకారులౌతున్నాయి.

గత నూరు సంవత్సరాలుగా తెలుగు సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాణ ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. బహుముఖీనంగా జరుగుతున్న ఈ ప్రయత్నాల్లో మధ్య మధ్యలో ఉద్దండ పండితులైన వారు పలికించిన అపశ్రుతులు, విద్యుద్ఘాతాలు, వేసిన అభాండాలు, నీలాపనిందలు, చేసిన అవరోధాలు, అవాంతరాలు అంతరాయాలు ఎనెన్నో సహృదయుల హృదయాలను కలచివేశాయి. ఈ సమస్యలన్నీ కర్తృత్వ వివాదానికీ, కాలనిర్ణయానికీ సంబంధించినవి కావడం ముఖ్యంగా గమనింపదగినవి.

గ్రంథాంతర్గత విషయ వివేచన చేయకుండా ఇంకా ఈ 21వ శతాబ్దంలో కూడ కర్తృత్వ వివాదాలను లేవదీస్తున్న పండితవర్యుల్ని చూచి వారు తమ పాండిత్యాన్ని మంచి వ్యాఖ్యాన రచనలతో సార్థకం చేసికోక, తమ అమూల్యమైన కాలాన్ని ప్రతిభా పాటవాలను అనడ్డగా చెడ్డదారుల్ని తొక్కించి, తమ శక్తి సామర్థ్యాలను బూడిదలో పోసిన పన్నీరుగా వృథా చేయడం, కవి పండితుల వ్యక్తిత్వాలను వధ చేయడం వంటి నిష్కృతి లేని దుష్కృతులకు పాల్పడుతున్నారేనని తెలుగు సాహిత్య సరస్వతి దుఃఖిస్తూ వుంది. ''గాసట బీసటే చదివి గాథలు తవ్వు తెనుంగు వారికిన్'' అని చెప్పిన ఎఱ్ఱాప్రెగ్గడ కాలం నాటి పరిస్థితిలోనే మనం బతుకుతున్నాం అంటే అది విజ్ఞులైనవారు నిగ్రహశక్తి కోల్పోయి ప్రవర్తించడం వల్లనే ఏర్పడింది. నిగ్రహం లేని జాతి పతనమౌతుంది. అలా కాకుండా చూచుకోవలసిన బాధ్యత విచక్షణజ్ఞానం కల వారందరిమీద ఉంది.

పండితులైన వారు సాహిత్యంలో నిర్మాణాత్మకమైన కృతులు వ్రాసి, సాహిత్యచరిత్ర పునర్నిర్మాణానికి దోహదం చేసే దశను, దిశను నిర్దేశించే విధంగా మసలుకోవాల్సిన ముఖ్యంగ, ఈనాటి యువతరం గతకాలంలో, సమీప కాలంలో జరిగిన అవకతవకల్ని గుర్తులో పెట్టుకొని, తమ అమూల్యమైన కాలాన్ని వృథా కానివ్వకుండా, నిర్మాణాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించవలసి ఉందని అభ్యర్థిస్తున్నాను.

**ముగింపు వాక్యాలు :**

ఎన్ని అపనిందలు, అభాండాలూ, నీలాపనిందలు తటస్థించినా నిందింపబడిన ఆ మహాపండితుడు మానవల్లి ఈ రోజు లేడు కాబట్టి మనం ఆ సంగతి మరచి పోదాం! కాని, వ వ్యక్తి చేసిన సాహిత్య కృషి సాహిత్య చరిత్రలో తప్పనిసరిగా నమోదు కాబడాలి. ఆయనకివ్వవలసిన సముచిత స్థానాన్ని యిచ్చి తీరాలి. కాదనే హక్కు మనకు లేదు. ఈ విధంగా సర్వాంగణ సాహితీ వికాస దృష్టి కోణంతో, సర్వజనాంగీకారమైన ఒక విశిష్ట, విలక్షణ దృక్పథంతో, సమస్యారహితమైన సమన్వయ ధోరణితో, సమాచార లోపం లేని సామగ్రీ సౌష్టవంతో సాధికార, సప్రామాణిక సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాణం వైపుగా మనం దీక్షా దక్షతలతో నడవాలి. ఈ రెండు రోజుల చర్చాగోష్ఠి ఫలితంగా తెలుగు సాహిత్య సమగ్ర చరిత్ర నిర్మాణానికి తగిన మార్గదర్శక సూత్రాలను క్రోడీకరించడమే కాదు, వాటిని విశ్లేషించి ఒక వినూత్న సమన్వయాత్మక సక్రమ పద్ధతిలో సమాజంలోని అన్ని వర్గాల సాహిత్యాలకు సమాన ప్రాధాన్యం ఉండే విధంగా ఒక ప్రణాళిక రూపొందించు కోవాలి. కొన్ని కొన్ని గ్రంథాలను పునరుద్ధరించాలి. కొన్నిటికి పునర్మూ ల్యాంకనం జరగాలి!

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 భావవీణ UGC Approved Journal No. 42500

# గబ్బిలంలో జాషువా వర్ణించిన పంచముని దుస్థితి

– డా. కొత్తిరెడ్డి మల్లారెడ్డి , అసిస్టెంట్ ప్రొఫెసర్, యస్.ఆర్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కరీంనగర్, తెలంగాణ.

## పరిచయం :

తెలుగు సాహిత్యానికి కొత్త అందాలనద్దిన కవికోకిల గుర్రం జాషువ. విశ్వనరుడను నేనని సగర్వంగా చెప్పుకొన్న దేశభక్తుడాయన. సమకాలీన వ్యవస్థలోని అసమానతలను అద్భుతంగా కవిత్వీకరించాడు. బుద్ధి గమ్యమైన జాషువ కవితా శైలికి తెలుగు నుడికారాలు పలుకుబడులు పరిపుష్టిని కలిగించాయి. ఆయన చీత్కారాలున్నచోటే సత్కారాలనందుకున్నాడు. ఆలంకారికులు అంగీకరించినట్లుగా అధిక్షేపంతో కూడి వ్యంగ్య వైభవం గల గబ్బిలం కావ్యం ఉత్తమ కావ్యంగా ఆవిష్కృతమైంది. 'నాదు కన్నీటికథ సమన్వయం సేయ నార్ద్ర హృదయంబు కూడ కొంతవసరంబు ' అంటూ సహృదయంతో తన కావ్యాన్ని చూడాలని అభిలషించాడు. జాషువ తన సాహితీ ప్రతిభతో కవిశేఖరుడై, నవయుగ కవిచక్రవర్తై తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్థానం పొందాడు. జాషువ తనకు పేదరికం, కులమతభేదమనే గురువులిద్దరని పేర్కొన్నాడు. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండోది ఎదిరించే తత్వాన్ని నేర్పింది. విశ్వనాథ జాషువను శారదా దేవి అనుగ్రహం పొందిన మధురకవిగా పేర్కొన్నాడు. సుకవి జీవించు ప్రజల నాల్కలయందని జాషువ చెప్పిన సూక్తికి ఆయనే నిదర్శనం.

అరుంధతీ సుతుని దాస్య క్లేశాన్ని ,అస్పృశ్యుని గాధను ఆ అభాగ్యుని అశృసందేశాన్ని జాషువా తన గబ్బిలం కావ్యంలో ఆవిష్కరించారు. తను తన జీవితంలో పొందిన మానావమానాలే తన కవిత్వానికి స్ఫూరినిచ్చాయని చెప్పకున్నాడు. కవికి సమాజంపై గల సానుభూతే కాకుండా, కవి కథకు నిజజీవితంలోని జీవితానుభవాలు జోడించడం వల్ల ఈ కావ్యానికి మరింత సాంద్రత, సాధికారత చేకూరాయి. అంటరాని తనం అమానుషమని భావించిన జాషువ సమానత్వాన్ని సాధించేదిశగా సామాజిక చైతన్యానికి కవిత్వాన్ని ఆయుధంగా వాడుకున్నాడు. 'ఒక్కొక్క పద్దియమునకు నొక్కొక్క నెత్తురుబొట్టు మేనిలో తక్కువగా' రచించిన కవిశ్రేష్ఠుడాయన. వడగాడ్పు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వమంటూ మానవత్వమే తన మతంగా స్వీకరించి సర్వమానవ సౌభ్రాతృత్వం సాధించేందుకు విశ్వనరుడై విజృంభించారు. గబ్బిలం కావ్యం (1941) తాను చేసుకున్న పాపకారణమేమిటో తనకే తెలియని ఒక అభాగ్యుని అశ్రుగాథ. దానిలో అతని భాష్పసందేశం ప్రధానం, దేశారాధన గౌణం పరమ నికృష్టాంధకారం నుండి హిమదళ కైలాసోన్నతులలో నివసించే పరమశివుని వరకూ సాగిన గాథ ఇది. కవి కరుణార్ద్రహృదయం కుమ్మరించిన కథ ఇది. 'గబ్బిలం శాశ్వతంగా ఉంటుందని నా నమ్మకం' అని జాషువ అభిప్రాయపడ్డాడు.

జాషువా గబ్బిలం కావ్యాన్ని కాళిదాసు మేఘసందేశమును మనసులో ఊహించుకొని రాసాడు. అందలి కథానాయకుడు ప్రణయ సందేశం పంపిస్తే ఇతడు తుకతుక ఉడికే అశ్రు సందేశం పంపిస్తాడు. అతని శిక్షా కాలం ఒక సంవత్సరం కాగా, ఇతని శిక్షా కాలం ఆజన్మాంతం, తరతరాలు, దీనికవధి లేదు. అతడు మన్మధాగ్నితప్తుడైతే, ఇతడు క్షుధాగ్ని పీడితుడు. కలీనులగు రాజులకువలె హంసలు, చిలుకల్లాంటి ఉత్తమ పక్షిదూతలితనికి చిక్కుట అసంభవం. అందుకే తన జీర్ణ కుటీరంలో నిరంతరం సంచరించే గబ్బిలంను దూతగా ఎన్నుకున్నాడు. గబ్బిలం కైలాసంలోని పరమేశ్వరునికి తన సందేశాన్ని విన్నవించడం ద్వారా ఆ దేవదేవుని కరుణచే దేవాలయ ప్రవేశం, హరిజనోద్ధరణ జరగాలని జాషువా ఆశించాడు.

గబ్బిలం కథానాయకుడు దీనుడైన నిమ్నజాతికి చెందిన అస్పృశ్యుడు, అందుకే వాడి గాలిసోకగానే నాల్గు పడగల హైందవ నాగరాజు కసరిబుసకొట్టునని కవి వాపోతాడు. అతడు తనకు లభించిన బుక్కెడు బువ్వతో ఆకలి తీర్చుకొని, కష్టాలన్ని మర్చిపోయి తన వృత్తిని

దైవాజ్ఞగా స్వీకరిస్తాడు. ఆ అభాగ్యుని కులాన్ని సంపదను దొంగిలించి వాని దేహాన్ని పిప్పిచేసిన భారతవీరుల పాదాలు కందిపోకుండా వారికి చెప్పలు కుడుతూ జీవనం సాగిస్తాడు. వాడు చెమటోడ్చి ఈ ప్రపంచానికి భోజనం పెట్టినా వానికిమాత్రం భుక్తిలేదు. వాడి తలపై పడిన పంచముడనే మలినాన్ని ఆకాశగంగ కూడ కడగలేక పోయింది. వాని రెక్కల కష్టం లేని నాడు ఈ భువిపై పంటలు పండవు. వానిచే నైవేద్యం అంటువడిన నాడు ఆ త్రిమూర్తుల కూడా భుక్తి లేదు. పాముకు పాలు చీమలకు చెక్కర మేపుతున్న ఈ కర్మభూమిలో ధర్మదేవత కూడా వాన్ని చూస్తే ఉలిక్కిపడుతుంది. వాడు చేసుకున్న పాపమేమో వానికే ఎరుకలేదు. ఏ భగవంతుడు కూడా వానినుద్ధరించనప్పుడిక మనుషులెట్లా వాన్ని కరుణిస్తారని జాషువా ప్రశ్నిస్తాడు.

ఆ అభాగ్యుని రక్తం తాగి దరిద్ర దేవత వానింట్లో తాండవిస్తుంది. వాని గాలి సోకితేనే చతుర్వర్ణాల హైంద వులు కసరుకొంటారు. ఇక వాన్ని ఆదరించే వారెవరని కవి వాపోతాడు. ఈ అభాగ్యుడు తనకు ఏ ఆదరణ, కులం లేని కొడుకులను పుట్టించి ఈ ఆఖాతంలో తోయడమెందుకని భావిస్తాడు. ఈ పుట్టు బానిసకు భార్యయెందుకని ఆజన్మాంతంబ్రహ్మచర్యాన్ని కొనసాగి స్తాడు. తెల్లవారింది మొదలు సూర్యాస్తమయం వరకు రెక్కలు ముక్కలు చేసుకొని, కాయకష్టం చేసి దొరికిన గంజితాగి జీవనం సాగిస్తూ సాగిస్తూ ...... ఒకనాడు పక్క మీద మేను వాల్చాడు. ఏనుగుకి మదమావహించినట్లు భూమ్యాకాశాలు చీకట్లు కమ్ముకున్నాయి. సంధ్యాకేళి మాని మాహేనటుడు శివారావాన్ని ప్రారంభించాడు. రెక్కల గాడ్పుచే చిన్న దీపాన్నార్పుతూ చీకటిముద్దలాగున్న ఓ గబ్బిలం వాని ఇంట్లోకి ప్రవేశించింది. ఆ కటిక చీకటిలో దయ్యపు పిల్లలా కలయదిరుగుతున్న గబ్బిలాన్ని చూసి వాడి మనసులో కొత్త ఊహాలు మొలకెత్తాయి. ఈ మదో న్మత ప్రపంచంలో పేదలకు ఆప్తులు, చుట్టాలు ఎవరుం టారు. ఇలాంటి పక్షులూ, క్రిమికీటకాదులుగాక! అందుకే ఆ గబ్బిలాన్ని స్వాగతించి తన స్వీయ వృతాంతాన్ని విన్నవించుకోదలిచాడు.

ఓ గబ్బిలాల రాణి నీవు క్షేమమే కదా! నీవు గుళ్ళు గోపురాల్లో తలకిందులుగా తపస్సు చేయగలవు. అందుకే నాకు లేని దేవతల ప్రసాదాలు తినే పుణ్యం నీకు దక్కింది. తినడానికి తిండిలేని ఈ పేదవానింట్లో ఈ కాళరాత్రివేళ దేని కోసం వెతుకుతున్నావు. ఓ పుణ్యురాల అవనీవల యంచే బహిష్కరించబడి అంటరాని పేదవాడున్న గృహం ఇది. ఇక్కడ నీకు కించత్ మనోల్లాసం, బుక్కెడు బువ్వ కూడా దొరకదు. దేవతలు కూడా సిరిగలవారిండ్లలోనే నివాసముంటారు. ఈ హృదయంలేని లోకంలో సనాతన ధర్మప్రాపకం పేదలకు దొరకదు. బొమ్మల పెళ్ళి చేయుటకు వందలు వేలు ఖర్చు చేసే ఈ లోకంలో పేద పకీరుల ఆకలి తీర్చుటకొక్క మేతుకు విదిలించరు. ముప్పదిమూడు కోట్ల దేవతలెగబడ్డ ఈ పుణ్యభూమిలో అభాగ్యుల ఆకలితీరుతుందా? కొండల బండ హృద యాలు నన్నూరడించడానికి సెలయేళ్ళై పారుతున్నాయి కాని, నాసోదర ప్రజల నుండి ఒక్క కన్నీటిచుక్క కూడా రాలడం లేదు. పగలంతా మునిలా తపస్సు చేస్తూ నీ సంసారాన్ని చక్కదిద్దుకుంటూ ఈ నిషారాత్రివేళ నన్ను ఓదార్చడానికి వచ్చావు. నీ కన్నా ఆప్తులు నాకింకెవ రుంటారు.

మందు లేని అంటరానితనమనే జబ్బుతో బాధపడు తున్న నన్ను మరిచి ఈ కాళరాత్రి ప్రశాంతంగా నిద్ర పోతుంది. అందుకే నీకు నమస్కరిస్తున్నాను, నా మొరాల కించు. నన్ను దోపిడి చేస్తున్న స్వార్థపరుల దురాగతాలు విను. పూజారి లేని సమయంలో ఆలయంలో ప్రవేశించి నా జీవితగాధను ఆ పరమశివుడికి విన్నవించు. ఆలయంలో వేలాడేనీవు శివుని చెవికి దగ్గరగా ఉంటావు. కాబట్టి శివుడు నీ మాటలు ఆలకిస్తాడు అంటూ ఆ అరుంధతీ సుతుడు గబ్బిలాన్ని అభ్యర్థించాడు. కైలాసంలో కొలువై ఉన్న తన ఇష్టదేవతకు తనజాతికేతన చిహ్నామైన గబ్బిలంతో సందేశం పంపించాడు. నోరులేని ఆ పక్షి మారు పలక శక్తిచాలని ప్రాణి కన్నీరు కార్చి శివాలయానికి తరలిపోయింది.

**ముగింపు :**

సమాజంలోని అంటరాని తనం, దోపిడి లాంటి సామాజిక దురన్యాయాలు శివుడికి విన్నవించడం ఇందులోని సారాంశం. అస్పృశ్యుడికి తగినట్లుగా గబ్బిలంను ప్రతీకగా ఎన్నుకొని జాషువ ఔచిత్యాన్ని పాటించాడు. గబ్బలం లాగా పంచముడు నాటి నుండి నేటి వరకు చీకట్లోనే మగ్గుతున్నాడు. గబ్బిలం ఒక అపశకునపు పక్షి దానిక్కూడా పంచమునిలా ఈ సభ్యసమాజంలో స్థానంలేదు. అందుకే వర్ణవ్యవస్థపై ధ్వజమెత్తాడు జాషువా. సంఘ సంస్కరణాభిలాషతో గబ్బిలంతో సందేశం పంపడం ద్వారా అభ్యుదయ భావాలను అభివ్యక్తంచేసాడు. చివరికి ధర్మసత్రాలలో పురుగు పుట్రలకు తలదాచుకోడానికి స్థానముంది, కాని పుట్టు బానిసైన పంచమునికి ప్రవేశంలేదనే విషమతుల్య అసమానతలను చక్కగా అభివర్ణించాడు.

**ఆధార రచనలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర, డా. ద్వా. నా. శాస్త్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
2. ఆధునిక కవిత్వం (ఎం. ఏ. తెలుగు పాఠ్య పుస్తకం), డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.
3. జాషువా రచనలు, మొదటి సంపుటం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
4. నవయుగ కవిచక్రవర్తి, కవికోకిల - శ్రీ గుర్రం జాషువా, టీవీఎస్. శాస్త్రి.
5. జాషువా సాహిత్యం దృక్పథం - పరిణామం, ఆచార్య ఎండ్లూరి సుధాకర్.
6. నా కథ, గుర్రం జాషువా.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# భక్తి - సంఘ సంస్కరణవాదిగా శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్

- డా॥. అజ్మీరా సిల్మానాయక్, తెలుగు అధ్యాపకులు, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, తిలక్ రోడ్డు, హైద్రాబాద్, తెలంగాణ.

## ఉపోద్ఘాతం :

భూమి ఏర్పడిన కొన్ని కోటాను కోట్ల సంవత్సరాలకు ఈ భూగోళంపై జీవరాశి ఆవిర్భావం జరిగింది. ఆ పరంపరలో భూమిపై సకల చరాచరా జీవరాశి ఆవిర్భావం జరిగింది.అదే క్రమంలో మానవ జాతి ఆవిర్భవించింది. మొదట ఈ భూమిపై మానవులు కొండ గుహల్లోనూ, చెట్ల తొర్రల్లోనూ నివసించేవారు. ఆకలి వేసినప్పుడు తన చుట్టూ ఉండే దట్టమైన అడవుల నుండి ఆకులు అలమలు తినేవారు. కొంత జ్ఞానం వచ్చాక పచ్చిమాంసం తినడం ఆరంభించారు. జీవ క్రమపరిణామంలో వీరు ప్రకృతి నుండి పశుపక్ష్యాధుల నుండి ధ్వనులను అను కరిస్తూ భాషను నేర్చుకున్నారు. ప్రకృతి మీద ఆదిపత్యాన్ని సంపాధించుకున్నారు. ఈ విధంగా చూసినప్పుడు ఈ భూమి మీద మొట్టమొదటగా మానవ నాగరికత ఆది వాసుల నుండే పరిణతి చెందిందని చెప్పవచ్చు. తర్వాత గ్రామవాసులుగా, నగరవాసులుగా అభివృద్ధి చెందారు. మన సంస్కృతిలో ప్రధానంగా మూడు రకాలైనా దశలు కనిపిస్తాయి.

అవి 1) అరణ్య జీవన స్థితి 2) అనాగరిక స్థితి 3) నాగరిక స్థితి.

భారతీయ సంస్కృతి అతి ప్రాచీనకాలం నుండి అవిచ్ఛి నంగా కొనసాగుతూనే ఉన్నది. ఈ దేశంలో భౌగోళికంగా జాతిపరంగా, మతపరంగా, రాజకీయపరంగా భిన్నత్వం కనబడుతుంది. ఈ దేశంలో భిన్నత్వంలో ఏకత్వం కనిపిస్తుంది. దానికి కారణం రకరకాల కులాలు, మతాలు, ప్రాంతాల వారు భారత దేశంలో ఆదిమ జాతుల నుండి అత్యాధునిక ఆటవికులు, సంచార తెగల వారు. జాన పదులు, నాగరికులతో కూడిన దేశంగా భారతదేశం ప్రఖ్యాతి చెందింది.

## భక్తి ఉద్యమం :

భారతదేశంలో విభిన్నజాతులు, విభిన్నమతాలు, విభిన్న భాషలు, విభిన్న సంస్కృతి సంప్రదాయాలను కలిగిన వారున్నారు. మతపరంగా ఈ దేశంలో ప్రధానంగా ఎనిమిది మతాలున్నాయి. బౌద్ధం, జైనం, హిందూ మతంలో వైష్ణవం, శైవం, సిక్కు, మహ్మదీయ, క్రైస్తవం మొదలైనవి. 'మతం' అంటే యిష్టం అని అర్థం. జనహితం ఇది అన్ని మతాలకు వర్తించే నినాదం. మతం కరుణకు ప్రతిరూపం. ఆ కరుణే దైవత్వం. దీని ప్రధానోద్దేశ్యం దేవునిపై ధ్యాసను కల్గించేటట్లు చేయడం. మనిషి మేదస్సులో వెలతి, కల్తీ ఏర్పడిన ప్రతిసారి ప్రతియుగంలో ఈ భూమిపై రకరకాల అవతారాల్లో మహాపురుషులను పంపించాడు దేవుడు. దానితో ఈ భూమిపై భక్తి భావాన్ని కల్పించేందుకు వారు జగత్ గురువులుగా, ప్రవక్తలుగా దేవుని బిడ్డలుగా, అవధూతలుగా అవతరించి ప్రజల్లో భక్తి భావాలను కల్పించారు. 'మానవుడే మహనీయుడు' అనే సత్యాన్ని ఈ భూమిపై నివసించే జనంలోకి భక్తి భావాన్ని కల్పించారు.

నదులన్ని సాగరంలో కలిసినట్లుగానే ప్రపంచంలోని మనుషులందరూ భగవంతునిలో కలవాలనే ఆకాంక్షను మన పెద్దలు, ఋషులు, గురువులు మత గురువులు బోధిస్తూ వచ్చారు. మానవ జాతి నిరంతరం సన్మార్గంలో నడవాలంటే ధర్మం నిరంతరం రక్షింపబడాలంటే ధార్మిక ఆకాంక్షమైన భక్తి ఒక్కటే మార్గమని ఆది గురువులు, జ్ఞానులు తెలియజేశారు. భారత దేశంలో ఉత్తరాది నుండి దక్షిణాది వరకు భక్తి ఉద్యమం కొనసాగింది. భారత దేశంలో భక్తి ఉద్యమం అనగానే వివిధ మతాల వారు వివిధ రకాలుగా దేవుణ్ణి విభజించి ప్రచారం చేశారు. తమ

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

తమ మతాలే గొప్పవి. ఫలానా దేవుడు గొప్పవాడని ప్రజల్ని గందరగోళంలో పడేశారు. శైవ, వైష్ణవ మహ్మదీయ మతాల్లోనూ ప్రధానంగా ఈ సమస్య ఎక్కువైపోయింది.

భారతదేశంలో మతాల మధ్య కొట్లాటలు ప్రారంభ మైనాయి. ఆ కోవలో 12 వ, శతాబ్ధి నుండి మొదలుకొని 14 వ, శతాబ్ధి వరకు దాదాపు 200 సంవత్సర కాలంపాటు మతయుద్ధాలు చెలరేగాయి. అప్పుడు హిందూ మతంలో రెండు శాఖలుగా శైవం, వైష్ణం అనేవి భక్తిని ప్రబోధిం చాయి. ఈ గందరగోళ పరిస్థితిలో కొంత మంది సామాజిక అవగాహన ఉన్న నిమ్న జాతుల వారు, తెగల వారు "దేవుడు ఒక్కడే" అనే నినాదం కొంత మంది సామాజిక సంఘం సంస్కర్తలు ముందుకొచ్చారు. ఆ కోవలో మహమ్మ దీయ మతం నుండి కబీరు, హిందూ మతం నుండి దళితుడైనా సంత్ రామదాసు, నారాయణ దాసు సిక్కు మతం నుండి గురునానక్ మొదలైన వారు వచ్చారు. సమాజంలో దేవుని పట్ల వర్గీకరణ చేసి సామాన్య ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించారు. అలాంటి సందర్భంలో "దేవుడొక్కడే సబ్‌కా మాలిక్ ఏక్‌హై" అనే నినాదంతో దళితులు, బహుజనులు, గిరిజనులైన కొంత మంది సంఘాన్ని సంస్కరించడం కోసం ప్రజల్లో ఉన్న మూఢా చారాన్ని పారదోలి భగవంతుడు ఒక్కడే ఏవరైనా ఏప్పు డైనా భగవంతున్ని స్మరించుకోవచ్చు. పూజలు చేసు కోవచ్చు. గుడిలో ప్రవేశించవచ్చు. దేవుని దృష్టిలో అందరూ సమానమే అనే నినాదాన్ని తీసుకోచ్చారు. ఆ పరంపరలో కొంత మంది భక్త కవులు భక్తి అంటే సేవ చేయడం, గౌరవించడం, ఆరాధించడం, ప్రేమించడం అనే నినా దాన్ని ప్రచారం చేశారు.ఈ అంశాలన్నింటి సారాంశం "మానవ సేవయే మాధవ సేవా" అనే మహానీయా మానవతార్థాన్ని తీసుకొచ్చారు. ఈ కోణం నుండి ఆలో చించినప్పుడు 18 వ శతాబ్ధంలో శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహ రాజ్ గారు బంజారాలను ఉద్ధరించడానికి సంస్కరించ డానికి జన్మించి వారికి ఆరాధ్యదైవంగా పూజలందు కున్నాడు. ఉత్తర భారతదేశంలో కబీరు, గురునానక్ లు సామాజిక అసమానతలపై ఉద్యమించారు. దక్షిణ భారత దేశంలో, వేమన, రాఘవేంద్ర స్వామి, వీరబ్రహ్మేంద్ర స్వామి, సేవాలాల్ లు ప్రజల్లో పాతుకుపోయినా మూఢా చారాలను నిరసించి మార్పుకోసం పాటు పడ్డారు.

## సంఘ సంస్కరణ :

సంఘ సంస్కరణోద్యమం అనేది ఒక రకంగా సామా జిక ఉద్యమం. దీని ప్రదానోద్దేశ్యం సమాజంలో మార్పు తీసుకురావడం. సమాజంలో ఉన్న మూఢనమ్మకాలైన అంటరానితనం, సతీసహగమనం, బాల్యవివాహాలు, సామాజిక అసమానతలు మొదలైన వాటిని పారద్రోలడం ఈ ఉద్యమం యెక్క ప్రధాన లక్ష్యం. భారతదేధంలో సాంఘీక సంస్కరణలు మతపరమైన సంస్కరణల యెక్క అంతర్భాగంగా మారింది. సంఘ సంస్కరణ ఉద్యమం మన భారతదేశంలో 19వ, శతాబ్ధంలో ప్రారంభమైనది. భారతదేశంలో ఉన్న మూఢాచారాలను రూపుమాపడానికి హిందూ మతంలో బ్రహ్మ, ఆర్యసమాజాలు ఏర్పడినాయి. "భారత పునరుజ్జీవన పితామహుడిగా" రాజారామ్ మోహన రాయ్, స్వామి దయానంద సరస్వతి, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, మహాత్మ జ్యోతిభా పూలే మొదలైన వారు సంఘసంస్కరణోద్యమానికి అవిశ్రాంతంగా పని చేశారు. ఆ దిశలో చూచినప్పుడు క్రింది కులాల వారైనా లేద తెగల వారైన వారు కూడా సమాజనోద్ధరణకు పాటు పడ్డారు. ఆ కోవలో బంజారా తెగనుండి శ్రీశ్రీశ్రీ సంత్‌సేవా లాల్ మహారాజ్ గారిని చూడవచ్చు. వీరు ప్రధానంగా బంజారా సమాజానికి "అహింసా పరమోధర్మ" అంటూ భారతదేశం అంతట ప్రచారం చేస్తూ తన జాతి ప్రజల్ని సన్మార్గంలో నడిపించిన మహాజ్ఞాని సేవాలాల్ మహారాజ్. బంజారా తెగకు వీరంటే అత్యంత భక్తి, కొండంత విశ్వాసం. 18 వ, శతాబ్ధిలో భయంకరమైన కరవు ఏర్పడి నప్పుడు తన జాతి వారైన బంజారాలను సాతీభవానీలైన తోల్జా, మంత్రాళ్, హింగళా, ద్వాళంగర్, కంకాళి, దండి, సీత్లా అనే సప్త మాతృమూర్తులను పూజించి తమ జాతి వారిని కాపాడుకున్నారు. సేవాలాల్ పుట్టుకతోనే సంపూర్ణ జ్ఞాని, చిన్న నాటినుండి సకల విద్యలను ప్రదర్శించేవాడు. పశువుల కాపరిగా ఉదయాన్నే లేచి స్నానమాచరించి,

సూర్య నమస్కారం చేసి రోజువారి పనులు చేసుకుంటూ తమ జాతిని ఆపదల నుండి కాపాడుతుండేవాడు. తమ జాతిలో ఉన్న మూఢనమ్మకాలను పారద్రోలడానికి పాటుపడేవాడు. ప్రజలు అంధకారంలో ఉన్నప్పుడు ఆ ప్రజల్ని సరైనా మార్గంలో నడిపించడానికి కొంత మంది దైవాంశ సంభూతులుగా ఈ భూగోళం పై జన్మిస్తారు. వారి బోధనం ద్వారా మహిమల ద్వారా ప్రజలు పురోగ మిస్తారు. దైవానుగ్రహంతో జన్మించిన కారణజన్ముల బోధనలు ప్రజల్ని సన్మార్గంలో నడిపిస్తాయి. అట్లా చూసినప్పుడు ఒక్కోక్క జాతిలో ఒక్కోక్క మహానుభావులు జన్మించి ఆ జాతి చేత దైవాంస సంభూతులుగా చలామణి అవుతారు. ఆ కోవలో శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా జాతికి ఆరాధ్యదైవంగా వెలుగొందు తున్నారు. దుర్భర పరిస్థితి నుండి మంచి స్థితిని కల్గిం చేందుకు పాటుపడుతాడు. తన జాతి వారిని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగడానికి తోడ్పడుతాడు. బంజారా జాతిని చైతన్యపరిచి అభివృద్ధి బాటలో నడి పించిన మహానుభావుడు సేవాలాల్.

## బ్రహ్మచారి సేవాలాల్ మహారాజ్ :

బంజారాల గోత్రంలో రాఠోడ్ వంశం ఒకటి. ఆ రాఠోడ్ వారిని భుక్యా అని పిలుస్తారు. ఈ భూక్యా కులంలో రమావత్ అనే వారు ఉంటారు. ఈ రమావత్ రాంజీ నాయక్ గారికి భీమ, సోమ, ఖీమ అనే ముగ్గురు కుమా రులు జన్మించారు. వారు అనంతపూర్ జిల్లా గుత్తికోట అనే ప్రాంతంలో నివసిస్తుండేవారు. వీరు నివసిస్తున్న తండా పేరు 'చండీశ్వరి కొండ తాండా'. ఒక్కడే రమావత్ రాంజీ నాయక్ గారి పెద్ద కుమారుడైన భీమా, అతని భార్య ధర్మణీలు నివసిస్తుండేవారు. వీరికి 15-02-1741 లో "సేవాలాల్" జన్మించారు. ఇతని తర్వాత బద్దూహాప, బాణా (పురా) వరుసగా జన్మించారు.

సేవాలాల్ జన్మస్థలం విషయంలో భేదాభిప్రాయాలు ఉన్నాయి. కొంతమంది కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు సమీపంలోనున్న గుత్తిపల్లా అనే గ్రామం సేవాలాల్ జన్మ స్థలమని, అక్కడి వారు చెబుతున్నారని డా॥పి.కె.ఖండోబా గారంటున్నారు. అయితే వీరు బ్రతుకుతెరువు కోసం ఆంధ్రప్రదేశ్ నుండి కర్ణాటకకు వెళ్ళి అక్కడ కొన్ని రోజులున్నందుకు అదే ఇతని జన్మస్థలమని భావించి ఉండవచ్చు.

సేవాలాల్ పుట్టుకతోనే యుగపురుషుడు, దైవ భక్తుడు, ఇతను అక్కడున్న కొండమీదున్న దేవత చండీశ్వరీదేవితో ఆడుకున్నాడుట. సేవాలాల్ పశువులను కాసేపటప్పుడు తన చద్దిమూటను పశువులకు వేసి, తాను రేగడి మట్టితో రొట్టెలు చేసుకుని తినేవాడు. మోదుగాకులను తాళాలుగా చేసి ప్రతిరోజు ఆ చండీశ్వరిదేవికి భజనలు చేసేవాడు. అతని భక్తి తత్వాన్ని దేవి ఆశ్చర్యపడి ప్రత్యక్షమై తన లోకానికి తీసుకెళ్ళిందట. సేవాలాల్ నీవు ప్రతిరోజు నన్ను పూజించు. నేను నిన్ను ఆపదల నుండి రక్షించి, సకల ధనసంపదలతో తులతూగేటట్లు చేస్తానని చెప్పింది. ఇంకా భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో జరిగే సంఘటనలను ముందుగానే పసికట్టే గుణాన్ని ప్రసాదిస్తా నని చెప్పిందట. కష్టాల్లో ఆదుకొనే మార్గాన్ని చూపిస్తానని చెప్పిందట. అంతేకాకుండా ఢీల్లీ ఆగ్రాలలో నిన్ను కీర్తించేటట్లు చేస్తాను. కావున నీవు శరణు వేడుకోమని మేరామా (జగదాంబ) మాత పలికిందట.

సేవాలాల్ మేరమా మాతతో తల్లిదండ్రుల సేవయే నాకు ముఖ్యం. నేను ప్రతినిత్యం నిన్ను పూజిస్తే, నీ పూజల్లో అమాయక జీవులను బలికోరతావు. లోకాన్ని రక్షించే తల్లివి అయినా నీ బిడ్డలనే బలికోరుతావు. ఇది అమానుషం, హింసా మార్గం . అందువల్ల నిన్ను పూజించ నని సేవాలాల్ ఆమె కోరికను నిరాకరిస్తాడు.

అందుకు దేవి కోపించి, సేవాలాల్ వారి 3751 గోవు లను, 6400 ఎద్దులను, ఘరస్యా, సాండ్యా అనే కోడెను, గుజ్జాన్ని, సేవాలాల్ తమ్ముణ్ణీ, ఆస్తిపాస్తులన్నింటిని నాశనం చేసింది. అలా జరిగిన తర్వాత సేవాలాల్ గత్యం తరం లేక మోటాకోటా అనే ప్రాంతంలో మేరమా మాతకు జంతుబలి ఇచ్చి, మంసాన్ని అర్పించాడు. అతని భక్తిని మెచ్చి ఆ దేవత ప్రత్యక్షమైంది. ఏం కావాలో కోరు కోమ్మంది. సేవాలాల్ మేరమా దేవిని, హరించుకొని

పోయిన తన ఆస్తిపాస్తులన్ని ప్రసాదించమంటాడు. నా సంతతివారు 14 తరాల వరకు నీ భక్తులుగా ఉండేటట్లు అనుగ్రహించమంటాడు. తను చెప్పిన మాటలన్నీ సత్యవచనాలు కావాలని కోరుకుంటాడు. మా బంజారాలను నిరంతరం సహాయ సహకారాలను అందజేయమని వేడుకుంటాడు. వీటన్నిటికీ దేవత తథాస్తు అని అంటుంది. సేవాలాల్ సంతోషంతో తన వారందర్ని దేవి పూజలు చేయమని అజ్ఞాపించాడు.

అప్పటి నుండి బంజారాలు మేరమా మాతకు పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో మంగళవారం నాడు పూజిస్తారు. ఈ పూజలో నాలుగు కుంచాల బియ్యంతో దేవికి నైవేద్యం పెట్టి తమ భక్తి మహిమలతో వేలమందికి సేవాలాల్ భోజనాలు పెట్టిస్తాడు. భవాని మహిమల ద్వారా 80 సంవత్సరాల తన తల్లికి మళ్ళీ సంతానం కలుగుతుందని సేవాలాల్ చెప్పాడు. అప్పుడు తండ్రి భీమాకు కోపం వచ్చి సేవాలాల్‌ను కొట్టాడు. అప్పుడు సేవాలాల్ తండ్రితో నాన్నా మీకు నన్ను కొట్టే హక్కుంది. కానీ భవిష్యత్తులో జరిగే సంఘటనలను తెల్పినందుకు నన్ను అన్యాయంగా కొట్టావు. కాబట్టి రేపు నీవు ముఖం కడుక్కునే సమయంలో ఎడమ కన్ను గుడ్డిదై ఊడి నీ చేతిలో రాలుతుందని చెప్పాడు. తెల్లవారుజామున సేవాలాల్ చెప్పిన విధంగానే జరిగింది. సేవాలాల్ మహాత్యాలకు అందరు ఆశ్యర్యపోయారు.

సేవాలాల్ తల్లికి అమావాస్యనాడు ఒక మగబిడ్డ జన్మించాడు. అతనికి పూరా నాయక్ అని పేరు పెట్టారు. ఒకరోజు సేవాలాల్‌కు ఘరస్యా సాండ్యా (విత్తనపు అంబోతు), కొద్ది రోజుల్లో మన దేశానికి తెల్లటి మనుష్యులు (ఆంగ్లేయులు) వస్తారు. వారి వలన మన తెగ వారికి ఇబ్బందులు కలుగుతాయని చెబుతుంది.

సేవాలాల్ అంబోతు చెప్పిన భవిష్యత్తును విని, తన వారికి అనగా! బంజారాలందరికి విషయం చెప్పి బాధపడ్డాడు. ఈ విషయం తెలియచేసినందుకు సేవాలాల్, అంబోతుకు బతికున్న రోజులు, గడ్డి, నీటికి కొరత ఉండదని ఆశీర్వదిస్తాడు. ఒకసారి బంజారాలు ఒరిస్సా, కటక్ గుండా ప్రయాణం చేస్తుండగా వీరిలో 350 కుటుంబాలే కాక సేవాలాల్, ధర్మసాంద్ వడిత్యా, రామచంద్ర సాద్ రాథోడ్ అనే ముగ్గురు మహిమాన్వితులు దేవికి భక్తులుగా ఉంటారు. దారిలో వీరిపై దొంగల ముఠా దాడి చేస్తుంది. రామచంద్రసాద్ దొంగలను ఎదుర్కొని వారిని ఓడిస్తాడు. ధర్మసాద్ ఏడు రోజుల నుండి జ్వలిస్తున్న పర్వతాలను చల్లారుస్తాడు. ఆ సమయంలో కటక్ మహానది ఉధృతంగా ప్రవహిస్తుంది. బంజారా తండావారు ఆ నదిని దాటలేకపోతున్నారు. ప్రవాహ వేగాన్ని తగ్గించుకోమని నదిని అజ్ఞాపిస్తాడు. వెంటనే నది ప్రవాహం నిలిచిపోతుంది. అందరూ సురక్షితంగా 'బేసా' అనే ఒడ్డెర రాజు రాజ్యానికి చేరుకుంటారు. అక్కడున్న వారందరి గడ్డివాములన్నింటిని బంజారాల పశువులు మేశాయి. వారేమి చేయలేకపోయారు.

బంజారాలు అక్కడ నుండి నిజాం రాజ్యంలోకి ప్రవేశించారు. అక్కడ కూడా వీరి పశువులు, రైతులు పంట కుప్పలను మేసేస్తాయి. ఆ విషయం గురించి రైతులు తమ గోడును నిజాం నవాబు వద్దకు వెళ్ళి మొరపెట్టుకుంటారు. అప్పుడు రాజు వాటన్నింటిని తరమండి అని అజ్ఞాపిస్తాడు. అప్పటికే కొంతమంది బంజారాలు నిజాం సైన్యంలో చేరి ఉద్యోగాలు చేస్తుండేవారు. రాజుతో సేవాలాల్, ధర్మసాద్, రామచంద్రసాద్ వారి గురించి చెప్పారు. వీరు గొప్ప దైవ భక్తులని, మహిమలు గలవారు వారిని జయించడం చాలా కష్టమని తెలిపారు. అప్పుడు నిజాం రాజు మిఠాయిలో విషం కలిపి బంజారాలకు పంపిస్తాడు. మేరమాదేవి మహిళ వల్ల ఆ విషయం సేవాలాల్‌కు తెలుస్తుంది. ఆ మిఠాయిని మొదట నిజాం సైనికులకు తినిపిస్తాడు. వారు చనిపోయారు. తర్వాత తన ఎడమకాలి బొటన వ్రేలితో మిఠాయి గంపలకు తాకించి విషాన్ని విరుగుడు చేస్తాడు. ఆ మిఠాయిని తన వారు హాయిగా తింటారు.

సేవాలాల్ మహిమలకు ఆశ్చర్యపోయి నిజాం నవాబు అతన్ని తన దగ్గరకు రప్పించుకుని ఇంకా కొన్ని పరీక్షలు పెడతాడు. వాటిలో కనుక నెగ్గితే నిన్ను గౌరవిస్తామని

రాజు సేవాలాల్‌తో అన్నాడు. సేవాలాల్ అందుకు అంగీ కరిస్తాడు. సేవాలాల్‌ను ఒక తోతైన బావిలో దించి, ఒక నూలుపోగు (దారం) పడేసి ఆ దారాన్ని పట్టుకుని పైకి రావాలంటారు. సేవాలాల్ అదే విధంగా పైకి వస్తాడు. ఆ దృశ్యాన్ని చూసి అతని మహిమలకు నవాబు ప్రశం సించాడు. భక్తితో గౌరవించాడు.

సేవాలాల్‌కు నిజాం నవాబు ఒక ఏనుగును, ఖడ్గం, డాలు, బల్లాలను, కొంత ధనాన్ని ఇచ్చి హైదరాబాద్‌లో 'మహారాజ్‌గంజ్' ను కూడా ఇనాంగా ఇచ్చాడు. సేవాలాల్ బ్రహ్మచారి. ఆతను ఒకసారి బంజారా సభను ఏర్పాటు చేశాడు. ఆ సభకు మైసూరు రాజ్యం నుండి నానుసాద్, రామసాద్, దెబసాద్‌లు, తెలంగాణ నుండి హర్జీసాద్ హాజరైనారు. బంజారాల వ్యాపారాలు నానాటికీ క్షీణించ డానికి గత కారణాలు తెలుసుకుని తగు జాగ్రత్తలు ఇచ్చారు.

ఒకనాడు సేవాలాల్ తన అన్నదమ్ములతో 'నేను ఈ శరీరాన్ని వదిలి శివుని వద్దకు వెళ్ళివస్తాను, నా శరీరానికి హాని జరగకుండా వేపాకులు వేసి రక్షించండి ఎవ్వరు కూడా నా శరీరాన్ని తాకకూడదు. ఈ సంగతి అమ్మకు తెలియనీయకండి. నా శరీరాన్ని ఎవరు తాకిన మళ్ళీ నేను అందులో ప్రవేశించలేనని' శరీరాన్ని త్యజించాడు.

మేరమ భవాని సేవాలాల్ తల్లి దగ్గరకు వెళ్ళి, నీ కొడుకు 'రూయిఘడే' లో చనిపోయాడని తెలుపుతుంది. ఆమె దుఃఖిస్తూ ఎందరు చెప్పినా వినకుండా సేవాలాల్ శరీరాన్ని తాకింది. ఆమె స్పర్శతో సేవాలాల్ ఆత్మతన శరీరంలోకి ప్రవేశించలేకపోయింది. అప్పుడు శరీరాన్ని 'పొహర' అనే గ్రామంలోకి తీసుకొచ్చి 15.4.1806 నాడు దహనం చేశారు.

ఆ మంట నుండి మళ్ళీ సేవాలాల్ ప్రత్యక్షమై బంజారాలకు సమైక్యంగా తమ సంస్కృతి సంప్రదాయా లను రక్షించుకుంటూ ఉండాలని సందేశమిస్తాడు. అప్పటి నుండి వారందరు సేవాలాల్‌ను దైవంగా పూజిస్తారు. శాఖాహారం, తీపి వంటలు అతనికి నైవేద్యంగా సమర్పి స్తారు. అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తుంటారు.

ఈ కథ ప్రకారం సేవాలాల్ బంజారాలకు వచ్చే ఆపద లను తొలగిస్తాడు. అందుకే వారి పాలిట దైవం అయ్యాడు. అప్పటినుండి అతని చరిత్రను బంజారాలు కథలుగా, నాటకాలుగా, కథాగేయాల ఆధారంగా ప్రచారం చేస్తూ ఆరాధిస్తుంటారు. బంజారా సమాజానికి సేవాలాల్ ఒక భక్తి ఉద్యమా కారుడిగా, ఒక సంఘ సంస్కరణ వాదిగా, వారిపాలిట దైవంగా పూజలందుకుంటున్నాడు.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# వైజయంతీ విలాసం - తులసీవనం వసంత గ్రీష్మ ఋతు వర్ణనలు

– డి. నాగరత్నమ్మ , పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రబంధాలలో కథను నెపంగా చేసుకొని వర్ణనలు ఉంటాయి. అందులో వన వర్ణన, పర్వత వర్ణన, ఋతు వర్ణన, సూర్యోదయ వర్ణన, చంద్రోదయ వర్ణన, అంధకార వర్ణన, ప్రభాత వర్ణన, పశు పక్ష్యాదులు మొదలైన ప్రకృతి వర్ణనలు ఎన్నో ప్రబంధాలలో చోటు చేసుకుంటాయి. మానవులు జడులు కారు. అందుకే కేవలం తిండీ, తీర్థం, నిద్రలు మాత్రమే ముఖ్యం కాదు. వాటితో పాటు మానసికోల్లాసానికి సంబంధించిన అంశాలు మానవులకు కావాలి. ఎంతో అందమైన ప్రకృతిని తిలకించి మానవులు పులకించిపోతారు. జంతువులు, పక్షులు కూడా ప్రకృతిని చూసి స్పందించకుండా ఉండలేవు. అటువంటప్పుడు మనుషులు ఎలా స్పందించకుండా ఉంటారు. మూడు దశాబ్దాల క్రితమే సంగీతాన్ని విని పశువులు పాలు అధికంగా ఇస్తాయని, పొలాల్లో పంటలు అధికంగా పండుతాయని శాస్త్రవేత్తలు నిరూపించిన సంగతిని మనం పత్రికల్లో చదివాం. ఆధునిక మానవు లీనాడు కృత్రిమ విధానాలకు అలవాటుపడి, హృదయ స్పందనను బలవంతంగా అదిమిపట్టి ఇటువంటి ఆనందాన్ని పోగొట్టుకుంటున్నారు. అలా చేయవద్దంటున్నారు ప్రకృతి వేత్తలు.

అందుకే ప్రకృతి చికిత్స పేరుతో ఈనాడు మళ్ళీ తెరపైకి వచ్చింది. అందువల్ల ప్రకృతి వర్ణనలు ఆస్వాదయోగ్యంగా ఉంటాయి. హృదయం నిర్మలమవుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. మానవులు ఆరోగ్యానికి ఆరు సూత్రాలలో ఇది కూడా ఒకటి. ఇప్పుడు 'వైజయంతీ విలాసం' లో సారంగు తమ్మయ కవి ఆయా సందర్భాలలో చేసిన ప్రకృతి వర్ణనలను ఇప్పుడు అనుశీలిస్తూ ఆస్వాదిద్దాం.

## 1. విప్రనారాయణుడు పెంచిన తులసీవనం :

శ్రీరంగనాథస్వామికి పడమర వైపున ఉన్న కరవేజా తీరంలో భూమకుటమై విలసిల్లే మకుట ద్వీప మధ్య సీమలో దేవునికి అర్చన నిమిత్తం విప్రనారాయణుడు వేరొక తోట వేయదలచి అక్కడ ఉండే గృహస్థులచేత మంచి సారవంతమైన భూమిని తగిన ధనమిచ్చి కొన్నాడు.

తే॥ అది మఱియు మెత్తగా దున్ని, అచ్చు గట్టి
విత్తనా లల్కి, అలరు దీవియల అంట్లు
నాటి, కావేరి ర్మము సాంద్రముగ జల్లి
విసువ కేతాన నెత్తు కావేరి నీరు.

క॥ జాదులు చేమంతులు, విర
వాదులు, కురువేరు, కుంద, వాసంతికలున్,
గేదంగులు, కరవీరము
లాదిగ ప్రోదిగను జేసె నారామమునన్
(ప్రథమాశ్వాసం 45-46)

భూమిని మెత్తగా దున్ని, కెయ్యాలు గట్టి, విత్తనాలు చల్లి, పూలతీగల అంట్లు నాటి, కావేరి జలంలో కలిసిన పుప్పొడిని మొదలైన వాటిని ఎరువుగా చల్లి, కావేరీ నీటిని పొలంలోకి పెట్టి చెట్లను, తీగలను పెంచాడు విప్రనారాయణుడు. జాజి మల్లెల, చేమంతులు, విరజాజి పూలు, కురువేరు, కుంద, వాసంతికలు, మొగలి రేకులు, గన్నేరు పూల చెట్లను ఆ తోటలో విప్రనారాయణుడు చాలా ఆసక్తిగా పెంచాడు. ఆ తోట చూడటానికి ఎంతో ఆహ్లాదంగా ఉంది.

తే॥ చుట్టు పంచాది వెట్టించి, కటె నందు
చవుకముగ మూడు చేతుల చవికె యొకటి
నేమమున పెంచ తత్పురో భూమి పరమ
పావనంబైన ఒక తులసీ వనంబు
(ప్రథమాంకం-47)

ఆ పొలం చుట్టూ కంచె ఒకటి ఏర్పాటు చేసి చౌకంగా చెట్లను పెంచి, అక్కడక్కడ మందులకు పనికి వచ్చే చెట్లు కూడా విప్రనారాయణుడు పెంచాడు. ఆ నేల పైన పలు విధాల పూల చెట్లను, ఎన్నో రకాల తీగలను, తులసీ చెట్లను పరమ పవిత్రంగా ఎంతో ప్రీతితోనూ కళకళ లాడే

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

టట్లుగా పెంచడంతో ఆ తులసీవనం ఎంతో మనోహరంగా ఉంది.

ఆ తులసీవనంలో పూసిన పలు రకాల పుష్పాలతో మాలికలు కట్టి శ్రీ రంగనాథస్వామికి భక్తితో విప్రనారాయణుడు సమర్పించాడు.

కII శ్రీధర సేవారతుడగు
నా ధరణీసురుని తోట నలరించుటకై
సాధుగతి వచ్చెనో? యన
మాధవు డేతెంచె వన రమాధవు డంతన్. (1-51)

శ్రీమన్నారాయణ సేవారతుడైన ఆ విప్రనారాయణుని తోట అలరించడం కోసం సాధు ప్రవర్తనలో వచ్చాడేమో అన్నట్లుగా మాధవుడు- వసంతుడు అక్కడికి వచ్చాడు. అంటే వసంతఋతువు వచ్చిందనడానికి కవి ఈ తోటను అలరించడానికి మాధవుడే వసంతుడి రూపంలో వచ్చాడు అని తమ్మయ కవి చమత్కారంగా చెప్పాడు.

## 2. వసంత శోభ :

వసంతఋతువు ఎంతో శోభాయమానంగా ఉంటుంది. చెట్లు చిగురిస్తాయి. మొగ్గలు తొడుగుతాయి. వివిధ పుష్పాలు రంగు రంగులతో వికసిస్తాయి. దీన్ని సారంగు తమ్మయకవి ఈ 'వైజయంతీ విలాసం' కావ్యంలో అద్భుతంగానూ, చమత్కారంగానూ చిత్రించాడు. మన్మథుడు మానవులలో ఏయే వికారాలు కలిగిస్తాడో వసంత ఋతువుతో ముడిపెట్టి తిమ్మయ కవి చమత్కరించిన విధానం చూడండి.

సీII మదన ప్రతాపాగ్ని మంటలు వోలె లే
మావుల చివురు జొంపములు వొలిచె,
అసమాయుధుని కీర్తి యెసగు కైవడి మల్లి
కా కుంజములను మొగ్గలు దనర్చె,
స్మర గజ కర్ణ చామరములై పున్నాగ
ముల ప్రసూన గుళుచ్ఛములు ఘటిల్లె,
జలజాస్త్ర బల రేణువులు నాగ సంపెంగ
గమి మరుద్గత పరాగములు నెరసె
తేII కుసుమ బాణాసన ముహు రాఘుష్యమాణ
కాహళీ శంఖ పటహ ఢక్కల తెఱంగు
దాల్చె నామని యన, మహా ధ్వని నుదార
కీర కలకంఠ సమద భృంగీ కులంబు (1-52)

మన్మథ ప్రతాపాగ్ని మంటలు లాగా లేత మామిడి కొమ్మల రెమ్మలు చిగుర్చాయి. చిగురుటాకులు లేత ఎరుపుతో ఉంటాయి. అగ్ని జ్వాలలు కూడా ఎర్రగా ఉంటాయి. అందువల్ల ఆ లేత చిగుళ్ళను మన్మథ ప్రతాపాగ్ని జ్వాలలతో పోల్చాడు కవి. చక్కని భావన. దీన్ని బట్టి కవికి ఎంతటి భావనా పటిమ ఉందో పాఠకులు అర్థం చేసుకోగలరు. మామూలుగా కనబడే దృశ్యాలే కవి కంటికి గాని, కళాకారుడి కంటికి గాని మరో రకంగా కనబడతాయి. ప్రకృతిని, ప్రకృతి దృశ్యాలను ఎలా ఆస్వాదించాలో కవులు, కళాకారుల ద్వారా మనం తెలుసుకోవాలి. అప్పుడు హృదయం ఎంత ఆహ్లాదంగా ఉప్పొంగుతుందో, నిజమైన ఆనందమంటే ఏమిటో తెలుస్తుంది. 'అసమాయుధుడు' అంటే పదునులేని ఆయుధాలు కలిగిన వాడు - మన్మథుడు. ఆయన పుష్పబాణధరుడు; పుష్పాలకు పదును ఎక్కడ ఉంటుంది! ఇటువంటి పదునులేని పుష్పాలతో ప్రపంచాన్ని అనాయాసంగా జయిస్తాడని కవులు, ఆలంకారికులు చెబుతూ ఉంటారు. పదునైన ఆయుధాలతో జయించడమేమీ అంత గొప్పకాదు. అయితే పదునులేని పుష్పాలతో ప్రపంచాన్ని జయించడం నిజంగా గొప్పేకదా! అదీ ఇక్కడి చమత్కారం. అలాంటి మన్మథుని కీర్తి ప్రసరించే (వ్యాప్తిచెందే) మాదిరిగా మల్లెతీగలు మొగ్గలు తొడిగాయి. మల్లెమొగ్గలు మల్లెపూలు తెల్లగా ఉంటాయి. కీర్తిని తెలుపుతో పోల్చడం పరిపాటి. కీర్తి స్వచ్ఛమైనది కనుకనే తెలుపురంగుతో పోలుస్తారు. అసమాయుధుని (మన్మథుని) కీర్తి వ్యాప్తి చెందే మాదిరిగా ఈ మల్లె తీగలు మొగ్గలు తొడిగాయని కవి చమత్కారం. మన్మథుని ఏనుగు చెవులు చామరములై (విసనకర్రలై) పున్నాగపు చెట్లకు పుష్పగుత్తులు వెల్లివిరిశాయి. స్మరుడు అంటే మన్మథుడు. జలజాస్త్రుని (పుష్పబాణధరుడు - మన్మథుడు) బలమైన రేణువులేమో అన్నట్లుగా సంపెంగ పుష్పసమూహాలు గాలికి చెలరేగిన పరాగరేణువులై వ్యాపించాయి. కుసుమ బాణాసనుడైన

మన్మథుని వింటినుండి వెలువడిన ధ్వని కాహళీ, శంఖ, పటహ, ఢక్కల శబ్దం విధానంగా కోయిల దాల్చినదా అన్నట్లుగా మహాధ్వని చిలుకల శబ్దాలు, మదించిన తుమ్మెదల సమూహాల ధ్వనులు వ్యాపించాయి.

సీ॥ అంగజాఘూతాంతరంగ జాయాకాంత
ఘోర వాయవ్య కింశారుతములు
జర దురంగమ పరిస్ఫుర దుపహ్వార గిరి
స్వైర సంచార నిర్ఝరుతములు,
స్మర సమీక స్విన్న సరస కాంతోత్పన్న
భూరి ఘర్మాంభ శ్శరారుతములు,
పథిక మర్దన మహారథిక మన్మథ సహా
యోరు వీరవిహార చారుతములు,
తే॥ హరిగతి సంచరించె, కావేరికా ప్ర
తీర సారస కమల కల్హార కుముద
సార సౌరభ్య సంభార భార వహన
మార పరిచార మధుమాస మారుతములు.
(1-35)

మన్మథాంతరంగమైన భార్యామణి ఘోరవాయవ్య బాణపు ధ్వనులు; గిరి సమీపాన ఏకాంతంగా సంచరించే ముదిరిన పాముల ధ్వనులు; మన్మథయుద్ధంలో కాంతతో సరసాలాడే సమయంలో ఉత్పన్నమైన స్వేదజల ధ్వనులు; బాటసారులు మహారథిక మన్మథ సహాయ వీరవిహార ధ్వనులు పథికజన సమూహం మాదిరి సంచరించాయి. కావేరీ తీరాన సరస కమలాలు, తెల్ల కలువలు, లేత తెలుపు ఎరుపుతో కూడి సువాసనలతో కూడి ప్రసరించే వసంత ఋతువు గాలుల ధ్వనులు వ్యాపించాయి.

ఈ సీస పద్యంలో ప్రతి పాదాంతంలోనూ కింశారుతములు, నిర్ఝరుతములు, శరారుతములు, చారుతములు; తేటగీతి చివర మారుతములు అని అంత్యాను ప్రాసలుగా ఉన్నాయి. వీచిన గాలుల ధ్వనులు ఎలా వ్యాపించాయో ఈ అంత్య ప్రాసలు తెలియజేయడమే గాక మధుమాసపు (వసంతఋతువు) కళను కూడా తెలియజేస్తున్నాయి. తేటగీతి పద్యంలో రకారావృత్తి పలుమార్లు ఆవృత్తి కావడంతో వసంతఋతువు ఎలా తొణికిసలాడుతోందో పాఠకులకు ఆ శబ్దాలే తెలియజేస్తాయి.

వ॥ అప్పుడు వన్యాభిరామంబులు, వర్ధతయామంబులు, వాచాల శుకపికస్తోమంబులు, వలమాన భృంగములు, వాహ్యాళి విహరదనంగంబులు, వర్ధిష్ణు మలయ పవమానంబులు, వర్జిత జాతి ప్రసూనంబులు వాసిత శీత లాంభంబులు, వల్గ త్పరాగ ధూసరంబులు నైన యవ్వాసరంబులయందు (1-54).

మనోజ్ఞమైన వనాలు, వర్ధిల్లుతున్న జాములు, కలకల రావంతో అలరారుతున్న పక్షులు, నెమళ్ళ గుంపులు, రొదచేస్తున్న తుమ్మెదలు, విశాలమైన, నిర్మలమైన ఆకాశం, వృద్ధిచెందుతున్న మలయమారుతాలు (చందనంతో కూడిన గాలులు), చిత్ర విచిత్రమైన పుష్పాలు, శీతలమైన నీటి తుంపరలు, పరాగరేణువుల సమూహాలతో ఆ అరణ్యాలన్నీ వసంతఋతువుతో అలరారుతున్నాయి.

క॥ దినమును రేలును నధి కో
త్సవమున నా వైష్ణవావతంసము వి కస
న్నవమాలికాది సుమముల
నవమాలిక లింది రాధినాథున కొసగున్. (1-55)

రాత్రింబవళ్ళూ అత్యంత ఉత్సాహంతో విష్ణు భక్తి పరాయణుడైన విప్రనారాయణుడు వికసించిన కొత్త పుష్పమాలలను ఇందిరానాథుడైన రంగనాథునికి సమర్పిస్తున్నాడు.

తే॥ పాటలాది సుగంధ పుష్ప ప్రకరము
లానుని సృజించె శ్రీరంగధామునకును
హేమ పుష్పంబు లలరింతు నే నటంచు
వచ్చెనో? యన వేసవి వచ్చెనంత. (1-56)

కలిగొట్టుపూలు మొదలైన సుగంధపుష్పాలతో శ్రీరంగధామునికి సంపెంగ పూలతో అలరిస్తాను నేను అంటూ వచ్చెనో అన్నట్లుగా వేసవి వచ్చింది.

### 3. గ్రీష్మ ఋతు భీష్మత :

వేసవి కాలంలో చండభానుడు ఎలా చెలరేగిపోతాడో అందరికీ తెలిసిందే. సారంగు తమ్మయకవి గ్రీష్మ

ఋతువు తాపాన్ని పలు విధాలుగా చమత్కారంగా వర్ణించాడు.

సీ॥ చండ భానుడు కక్కసము చేసి మున్ను తా
మహి కిచ్చు నప్పులు మరల గొనియె,
వారి పూర్ణములైన వసుధార కలశముల్
శివలింగ మూర్తుల శిరము లెక్కె,
నృప మందిరముల పానీయ కుంభంబులు
వెస నుట్టి గట్టుక వ్రేల దొడగె,
భువి నెల్ల జనుల దప్పులు మాన్పు తక్రంబు
తా దప్పిగొని నీళ్లు త్రావజొచ్చె,

తే॥ హరుడు కైలాస కుధర నాథాగ్ర వసతి
విడిచి వట మూల తలమున విశ్రమించె,
సతత నిజ దీర్ఘతా తనూకృతి నిశా ప్ర
హరము లగునట్టి గ్రీష్మ వాసరము లందు.
(1-57)

ప్రచండ భానుడు ములాజా లేకుండా మున్ను తాను లోకానికి ఇచ్చిన అప్పులను బలవంతంగా మళ్ళీ వసూలు చేసుకున్నాడు. జలంతో నిండిన బంగారు కలశాలు శివ లింగమూర్తుల తలలపై నెక్కాయి. రాజమందిరాలలో నీటి కుండలు ఉట్టిపై వ్రేలాడదొడిగాయి. భూలోకంలోని ప్రజ లందరి దప్పికలు తీర్చే మజ్జిగ తానే దప్పికగొని నీళ్ళు త్రాగజొచ్చాయి. శివుడు కైలాస పర్వత శిఖరాన్ని వదలి వటవృక్షం కింద విశ్రమించాడు. మిగిలిన రోజులలో రాత్రులు దీర్ఘంగా ఉంటాయి. అంటే రాత్రి ఎక్కువ సమయం ఉంటుంది. కాని ఎండకాలంలో రాత్రి తక్కువ సమయం ఉంటుంది. పగలు ఎక్కువ సమయం ఉం టుంది. ఈ వేసవికాలపు దెబ్బకు శివుడంతటివాడు కైలాస పర్వతాన్ని వదలి మర్రి చెట్టు నీడకు రావలసి వచ్చిందని ఇక్కడ చమత్కరించాడు కవి.

మండే సూర్యుడు కక్కసం చేసి (బలవంతం చేసి) మునుపు లోకానికి తానిచ్చిన అప్పులు మళ్ళీ తీసుకున్నా డంటే ఏమిటంటే సూర్యుని వేడిమికి నీరు ఆవిరి కావడం సహజం. ఆ నీరు మేఘాలు త్రాగడం సహజం. వర్ష రూపంలో ఆ నీరు తిరిగి భూమి మీదికి చేరడం కూడా సహజమే. ఈ ప్రక్రియ అంతా జరగడానికి సూర్యుడే కారణం. ఈ విధంగా తానిచ్చిన అప్పును తానే మళ్ళీ తీసుకున్నాడని కవి చమత్కరించాడు. ఎండకాలంలో వేడిమికి తట్టుకోలేక చల్లని నీరు త్రాగడం ప్రజలకు అలవాటు. దీని కోసం పూర్వకాలంలో మట్టిబానులు, మట్టి కుండలు కొత్తవి తెచ్చుకొని వాటిలో నీళ్ళు పోస్తే అవి వాతావరణానికి చల్లబడేటివి. ఇప్పుడు కూడా చాలా మంది ఫ్రిజ్‌లో ఉండే నీళ్ళు ఆరోగ్యం కాదని మట్టికుండ లోని నీళ్ళే ఎండకాలంలో తాగుతారు. ఇంకా త్వరగా చల్లారడానికి ఎక్కువగా చల్లారడానికి నూలుగుడ్డను తడిపి మట్టి బానుకు లేదా మట్టి కుండకు లేదా మట్టి కూజాకు కప్పుతారు. మధ్యలో అప్పుడప్పుడు నీటితో తడుపుతూ ఉంటారు. అలా చల్లబడ్డ నీళ్ళు చాలా రుచి గానూ ఉంటాయి, చల్లగానూ ఉంటాయి. అదే ఫ్రిజ్‌లోని నీళ్ళు అయితే చల్లగా ఉంటాయి కాని రుచిగా ఉండవు. అదిగో ఆ విధంగా రాజమందిరాలలో నీటి కుండలు, నీటి మరవలు ఉట్టిమీద కట్టి వ్రేలాడదీస్తారు. అప్పుడు వాటికి గాలి బాగా తగిలి మిక్కిలి చల్లబడతాయి. అదే భావాన్ని కవి మూడవ పాదంలో చెప్పాడు. ఈ భూలోకంలో ఎల్ల జనుల దప్పికను తీర్చే మజ్జిగ తానే దప్పికగొని మరిన్ని నీళ్ళను తాగిందని కవి వర్ణించాడు. అంటే గట్టి మజ్జిగను ఎండకాలం ప్రజలు తాగితే దాహం అంతగా తీరదు. అదే నీళ్ళ మజ్జిగ అయితే దప్పిక తీరుతుంది. దాన్ని కవి అలా చమత్కరించాడన్నమాట. వటవృక్షమూలంలో శివుడు నివసిస్తాడని ప్రతీతి. దాన్ని కవి భంగ్యంతరంగా చెప్పాడు. కైలాస పర్వత శిఖరంపై ఉన్న ఎండ వేడిమికి తట్టుకోలేక మఱ్ఱి చెట్టు మొదలులో నీడకు శివుడు వచ్చి విశ్రమించాడు అని కవి వర్ణించడం అద్భుతంగా ఉంది. పగటి దెబ్బకు ఎండకాలం రాత్రిళ్ళు సమయం తగ్గి పోయిందని మరొక చమత్కారం. ఈ విధంగా గ్రీష్మ భీష్మతను కవి వక్రతతో వర్ణించాడు.

ఈ విధంగా సారంగు తమ్మయ కవి ప్రకృతిలో క్రమ క్రమంగా జరిగే మార్పులన్నీ వర్ణిస్తూ వసంతఋతువు,

గ్రీష్మఋతువు భీష్మతను కళ్ళకు కట్టినట్లుగా వర్ణించాడు. విప్రనారాయణుడు ఎంతో ఇష్టంగా పెంచిన తులసీ వనాన్ని కూడా కవి చక్కగా వర్ణించాడు. ''తులసీ మహీజంబు విలసిల్లు స్థలమున సిరియును వాణియు వరలుచుండ్రు; తులసి చెట్టునకొక కలశంబు జలమిడ పాపౌఘములు పటాపంచలగును; తులసి వృక్షమును పూజలచేత దన్పిన పుణ్యములెల్లను ప్రోదిగాంచు'' అని ముత్తరాజు సుబ్బారావు కవి 'శ్రీకృష్ణతులాభారం' నాటకంలో తులసీ మహత్తును గురించి అద్భుతంగా చెప్పాడు. అటువంటి మహత్తు గల తులసీ వృక్షాన్నే కాదు ఏకంగా తులసీ వనాన్నే విప్రనారాయణుడు పెంచి పోషించాడు. తమ్మయకవి అటువంటి తులసీవనాన్ని సుందరంగా వర్ణించి తాను ధన్యుడై పాఠకులను ధన్యులను చేశాడు.

## ఉపయుక్త రచనలు :

1. కులదీప్ నయ్యర్, కాశెపోగు : 'శశాంక విజయం - కావ్యానుశీలనం' (అముద్రిత పిహెచ్.డి. సిద్ధాంతవ్యాసం -2017), ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, గుంటూరు -522510.
2. లక్ష్మీకాంతం, పింగళి : 'సాహిత్య శిల్ప సమీక్ష' (1980), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, హైదరాబాదు-1.
3. వేంకటరామ నరసింహం, కాకర్ల : 'సాహిత్య దర్శనం' (1979), క్వాలిటీ పబ్లికేషన్స్, రామమందిరం వీధి, విజయవాడ-2.
4. హనుమంతప్ప, ఆదవాని : 'కుమార భారతీ దర్శనం' (1993), కార్తికేయ పబ్లికేషన్స్, భైరవ నగర్, అనంతపురం -2.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# గిరిజన కథాసాహిత్యం - ప్రకృతి వైపరీత్యాలు

- డా॥. సూనావత్ రాంబాబు, సీనియర్ ఫెలో, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు, సి.ఐ.ఐ.ఎల్., మైసూర్, కర్నాటక.

ప్రకృతి మానవుని మనుగకు ప్రధాన ఆధారం. అయితే ప్రకృతి వైపరీత్యాలు మానవుని మనుగడకు హాని చేకూరుస్తున్నాయి. భూకంపాలు, వరదలు, తుఫాన్లు వచ్చినప్పుడు గిరిజన జీవితం స్తంభించిపోతుంది. గిరి జనులు అడవిలో నాగరిక సమాజానికి దూరంగా నివ సించడంవల్ల పునరావాస కార్యక్రమాలు చేపట్టలేకపోతు న్నారు. అడవుల్లో వర్షపాతం ఎక్కువ. వర్షపునీరు పోవడానికి కాలువలు లేకపోవడం వల్ల గిరిజనులు నివసిస్తున్న గూడేల మీదుగా ప్రవహిస్తాయి. తినడానికి దాచుకున్న ధాన్యం, కుండా, తట్టా బుట్టా అన్నీ వరదల్లో కొట్టు పోతాయి. ఆస్థినష్టమేకాక ప్రాణ నష్టం కూడా జరుగు తుంటుంది. ప్రకృతి కన్నెర్ర చేస్తే గిరిజనుల జీవితాలు అల్లకల్లోలం అవుతాయి.

వరద ప్రాంతాల్లో గిరిజనులను రక్షించాలని వెళ్లే అధికారులు వరద ముప్పుకు గురైన ప్రాంతానికి చేరు కోవడానికిపడిన కష్టాలు, ప్రాణాలు కోల్పోతున్న వారిని రక్షించలేకపోవడం, నష్టపరిహారం చెల్లించలేకపోవడం వరద ముప్పుకు గురైన భద్రాచలం గోదావరి వరదలలో చిక్కుకున్న ప్రాంతవాసుల ప్రత్యక్ష కథనాలను వస్తు నేపథ్యంగా తీసుకుని గిరిజన కథలు రాశారు.

## ఇటూ కిన్నెరసాని - అటూ కిన్నెరసాని :

భద్రాచలంలో వరద తీవ్రత ఎక్కువగా ఉంది. గిరి జనులు ఇక్కడ నివసిస్తున్నారు. వీరిని రక్షించాలని ఐ.టి.డి.ఎ.అధికారి, జాయింట్ కలెక్టర్ శ్యాంబాబు, కలెక్టరు శ్రీకృష్ణారావు ప్రయత్నిస్తారు. పాలవంచ, నాగారం, భూర్గ పాడు, ఉప్పేరు మొదలైన గిరిజన ప్రాంతాల్లో నీటి ఉధృత పెరిగిపోయి ఉంది. నాగారం బ్రిడ్జి మీద నుండి బయలుదేరాలి. బ్రిడ్జిని దాటితే నీటి ప్రవాహం ఉంది. భద్రాచలంలోని గిరిజనులు ప్రమాదంలో ఉన్నారు. బ్రిడ్జి మీద వెళితే 28 కి.మీ.లో వెళ్ళవచ్చు. బ్రిడ్జిపై నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ప్రయాణం చేయడానికి అనుకూలంగా లేకపోవడం వల్ల ఎక్కువ దూరం అయినా వేరే రూటు మీద వెళతారు. అరగంట ప్రయాణం 18 గంటలు పడుతుంది. వరదలు వచ్చినప్పుడు గిరిజనుల పరిస్థితి ఎంతో భయాందోళనలతో కూడి ఉంటుంది. అడవుల్లో నదీ తీరంలో నివసించడంవల్ల గిరిజనులు ప్రకృతి వైపరీత్యాల వల్ల అడవుల్లో చిక్కుకుంటున్నారు. వారిని ఎవరు కాపాడలేని పరిస్థితి, వారికి ఎటుచూసిన నీటి ప్రవాహమే కనిపిస్తున్న తీరును రచయిత కథా వస్తువుగా గ్రహించి, గిరిజనుల దీనస్థితిని చిత్రించారు.

## రోడ్డుమీద లాంచీ! ఆకాశవాణి నందిగామ!! :

ఏటూరునాగారం గిరిజన ఐ.టి.డి.ఎ.ప్రాజెక్టు అధి కారిగా విద్యాసాగర్, ఏ.వో. సత్యనారాయణ, సీసీ హను మంతరావు, జీపు డ్రైవరు జగదీష్, హైదరాబాద్ నుండి వచ్చిన శ్రీనివాస్ అందరు కలిసి జీపులో బయలుదేరారు. 1986 వ సంవత్సరంలో గోదావరి వరద తీవ్రత చూసి ఖమ్మంజిల్లా కలెక్టరు కృష్ణారావు రాసిన పుస్తకాన్ని మార్గ దర్శకంగా తీసుకున్నారు. వర్షం పడుతూనే ఉంది. ప్రాజెక్టు అధికారి సహాయ చర్యలు చేపట్టాల్సింది కూనవరం. కూన వరం మరీ పల్లంగా ఉండటంవల్ల వరద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కూనవరం చేరుకోవాలంటే నందిగామ దాటి పోవాలి. గిరిజనులకు సేవలందించాలని వచ్చిన అధి కారులు సహాయ చర్యలు చేపట్టారు. రోడ్డుమీద లాంచిలో ఆకాశవాణి ఏర్పాటు చేశారు. ఆకాశవాణి ఏర్పాటు చేసిన తర్వాత నాగయ్య చనిపోయాడనే మొదటి వార్త వారికి బాధ కలిగిస్తుంది. సెట్‌లో నాగయ్య చనిపోయాడనే వార్తని భద్రాచలం పంపారు. నందిగామలోనే పరిస్థితి ఇలా ఉంటే మరీ పల్లంలో ఉన్న కూనవరం ఎంత ఘోరంగా ఉంటుందో.

గోదావరి నదిని ఆశ్రయించివున్న గిరిజన గిరిజనేతర ప్రాంతాలకు వరద ముప్పు ఏర్పడుతుంది. గిరిజనులను

రక్షించాలని బయలుదేరిన గిరిజన సంక్షేమాధికారులు గమ్యం చేరుకోలేక గిరిజనేతర ప్రాంతాల్లోనే వారి సేవలు ప్రారంభించడాన్ని కథావస్తువుగా స్వీకరించారు రచయిత. గోదావరికి కోపమొస్తే తన రౌద్రాన్ని ఊరుమీద చూపిస్తుందనీ, ఎంత దగ్గరగా వుంటుందో అది అంత దూరంగా ఉంటుంది.

## వరదలలో నాగారం :

ఏటూరు నాగారం గిరిజనాభివృద్ధి ఆఫీసరుగా ఫణి కుమార్ నియమితులయ్యారు. ఆదిలాబాదు జిల్లా కలెక్టరు శ్రీచావలి వెంకట శివరామకృష్ణ ఆహ్వానం మేరకు ఫణికుమార్ గోదావరి వరదలలో చిక్కుకున్న ప్రాంతాల ప్రజలను రక్షించాలని బయలుదేరతారు. నాగారం వెళ్లి వరద బారిన పడిన వారిని రక్షించాలి. వాగుదాటి నాగారంకు చేరుకున్న తర్వాత వెంబడే వున్న వారందరిని సినిమా టాకీసుకి తరలిస్తారు. అప్పటికే రామన్నగూడెం పూర్తిగా మునిగిపోయింది. ఇంటి కప్పులపైన, చెట్లపైన చేరివున్నారు. గిరిజనాభివృద్ధి అధికారి సురక్షిత ప్రాంతానికి రండని లాంచీలో ఎక్కండని పిలుస్తారు. గిరిజనులు ఎందుకు రావాలని అంటారు. ఆలస్యం చేస్తే ప్రాణానికే ప్రమాదమని ఇద్దరు పోలీసులకు విషయం చెప్పి లాంచీలోకి రాకపోతే పోలీసులు అరెస్టు చేస్తారని బెదిరిస్తారు. పోలీసులంటే భయం వల్ల అందరు గుడిసెలు దిగి లాంచీలో కూర్చుంటారు. అలా బెదిరించి వారిని రక్షించ గలిగారు.

ఏటూరు నాగారం గిరిజనాభివృద్ధి సంస్థ వరదలో చిక్కుకున్న నాగారంలో రామన్న గూడెం ప్రజల్ని రక్షించిన తీరు, రామన్న గూడెం ప్రజలకు జరిగిన నష్టాన్ని వస్తు నేపథ్యంగా రచయిత ఈ కథ చిత్రించారు.

## కన్నీటికథ - నీటికథ :

గోండుల నివాసం అటవీ ప్రాంతం. ప్రాథమిక అవసరమైన నీరు అందుబాటులో లేదు. నీటి వసతి కల్పించమని ఎన్నోసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఒక్క చేద బావిని తవ్వించలేక పోయింది. నీటి సమస్య అలాగే ఉండి పోయింది. చెలమల నీరే ఆధారం. అదీ గూడెంకి దూరంగా బండల సందుల్లో చిన్న చెలిమెల ఊట ఊరిన కొద్దీ నింపుకోవాలి. ఎండాకాలం వస్తే నీటి ఎద్దడి ఏర్పడుతుంది.

ఇంట్లో పని పూర్తి చేసుకుని నీళ్లకోసం వెళుతున్న తోటి స్త్రీలతో కలసి ఆత్రం సుక్కుబాయి వెళ్తుంది. నీళ్ళు తీసుకొని గట్టెక్కుతారు. సుక్కుబాయి నిండు చూలాలు. అలసటచేత కొద్దిసేపు బండమీద కూర్చుంటుంది. మిగిలిన వాళ్లందరూ వెళ్లిపోతారు. చీకటి పడిపోతుంది. ఆహారం కోసం అటుగా వచ్చిన ఎలుగుబంటు సుక్కుబాయి మీదపడి రక్కుతుంది. ఆ దెబ్బకు పొట్టపగిలి పసిగుడ్డు బయటపడిపోతుంది. సుక్కుబాయి తలమీద గట్టిదెబ్బ తగులుతుంది. దాంతో సుక్కుబాయి శ్వాస గాలిలో కలిసిపోతుంది. గూడెం జనాలు అరుపులు విని వచ్చినా ప్రయోజనం ఉండదు. నిండు చూలాలు నీటి కోసం వెళ్ళి నిలువునా అడవి జంతువు పాలయింది. ఇలాంటి సంఘటనల్లో కడతేరిన అడవి బిడ్డల జీవితాలెన్నో?

గోండులు నీటి వసతిలేక, ఆమడ దూరంలోవున్న నీటికోసం వెళ్లి స్త్రీలు జంతువుల దాడికి గురై తమ ప్రాణాలు కోల్పోతున్న దయనీయ స్థితిని కథా వస్తువుగా రచయిత సాహు చిత్రించారు.

## కొండఫలం :

గిరిజనులు నివాసముంటున్న ప్రాంతంలో భూమి గిరిజనులకే చెందాలని రాజ్యాంగం నిర్దేశిస్తుంది. సీతాలు గిరిజన స్త్రీ. ఈమెను గంగరాజు అనే గిరిజనేతరుడు అంటిపెటుకుంటాడు. సీతాలు ఎస్.టి సర్టిఫికెట్ని ఉపయోగించుకొని ఐదెకరాల మడిచెక్కను సంపాదించు కొంటాడు. సీతాలు, గంగరాజు మడి చెక్కను సాగులోకి తెచ్చి జీడి మామిడి తోట వేస్తారు. తోట కాపుకు రావడంతో గంగరాజు సీతాలును ఉపయాగించు కొంటాడు. ఈ ఐదెకరాల భూమి సీతాలు కంటే ముందు గిరిజనేతరుడైన కృష్ణమూర్తి సాగుచేసుకొనేవాడు. కృష్ణమూర్తికి ఐదెకరాలుందని, బతుకుదెరువు ఉండడం వల్ల సావిత్రినిచ్చి పెళ్లి చేస్తారు. గిరిజనుల భూమి గిరిజనులకే

చెందాలన్న నియమం వల్ల ఈ భూమిని సీతాలుకిస్తారు. సావిత్రి భూమి కోల్పోయినందుకు టీచర్ దగ్గరకొచ్చి బాధ పడుతుంది. సీతాలు సాగుచేసుకుంటున్న భూమి తనదని హరిజనుడైన ఫక్రీర్రావు కోర్టు నుండి స్టే తెస్తాడు.గంగరాజు సీతాలుకు పొలం లేదని ఆమెను హింసిస్తాడు. భూమి కోసమే తనని ఆశ్రయించాడని తెసులుకున్న సీతాలు టీచరమ్మను ఆశ్రయిస్తుంది. టీచరమ్మ సీతాలు భూమి విషయం తెలుసుకోవాలని ఎమ్మార్వో ఆఫీసుకి వెళు తుంది. ఫక్రీరావు ఎస్.టి సర్టిఫికెట్ సృష్టించాడని తెలుసు కుంటుంది. లాయరు దగ్గరకెళ్లి భూతగాదా విషయం తెలుసుకుంటుంది. లాయర్లు భూ వివాదానికి సంబంధిం చిన సీతాలు ఎస్.టి సర్టిఫికెట్ కోర్టులో దాఖలు చేయ లేదు. లాయరు ఇల్లుమీద ఇల్లు కట్టిస్తుంటాడు. ఫకీర్రావు తాగి రోడ్లమీద పడుకుంటాడు. ఈయన పిల్లలు హాస్టలు నుండి వచ్చేస్తారు. సీతాలు నాలుగిళ్లలో పాచిపని చేసుకొని జీవిస్తుంది. సీతాలు కష్టాన్ని జీడిమామిడి చెట్ల ఫల సాయాన్ని ఎవరికీ చెందనీయకుండా లాయర్లు స్వాహా చేయడానికి సిద్ధపడతారు.

గిరిజనలకు జీవనాధారమైన భూమిని చట్టాలు వచ్చి నప్పటికీ గిరిజనేతరులు మోసం చేసి లాక్కోవడాన్ని కథా వస్తువుగా రచయిత స్వీకరించారు.

గిరిజనేతరులు గిరిజనులను కులాంతర వివాహాల పేరుతో, బినామీల పేర్లతో, దొంగ కులధృవీకరణ పత్రా లతో మోసం చేయడం పోవాలంటే గిరిజనులకు విద్యా వకాశాలు లభించినప్పుడే అనే జీవిత సత్యాన్ని రచయిత అభిప్రాయం. ఈ సందర్భంలో మనకు 'విద్య నిగూఢ గుప్తమగు విత్తము రూపము పురుషాళికన్'.. అనే పద్యం గుర్తురాకుండా ఉండదు.

## చింతాసాలక్క :

కంతనపల్లి గ్రామంతో గిరిజనాభివృద్ధి అధికారికి ఎన లేని సంబంధం ఉంది. ప్రణాళిక సంఘం కమీషన్ ఉపాధ్యక్షులు డా.మన్మోహన్ సింగ్ పునరావాస గృహ సముదాయాన్ని ప్రారంభించడానికి వస్తారు. ఆ ప్రాంత గిరిజనాభివృద్ధి అధికారి గిరిజనుల సమస్యల గూర్చి ప్రతిరోజు చర్చిస్తుంటారు.

ఈ గ్రామానికి చెందిన చింతాసాలక్క భూమి సమస్య పరిష్కరించమని కోరుతుంది. చింతాసాలక్క భర్త గుంటూరుకు చెందినవారి దగ్గర తనఖా పెట్టి అప్పు తీసుకుంటాడు. గిరిజనుల భూమిని గిరిజనేతరులు కొనకూడదు. గిరిజనుల నివాస ప్రాంతంలో గిరిజనేతరు లకు భూమిపై హక్కు ఉండకూడదని చట్టం ఉంది. చింతాసాలక్క భర్త చట్ట వ్యతిరేకంగా రెండు ఎకరాల డెబ్బై రూపాయలకే అమ్ముతాడు. భూమిని కోల్పోయిన చింతాసాలక్క భర్త చెలపాక గ్రామానికి వలస పోతాడు.

చింతాసాలక్క తన భూమిని తిరిగి తనకిప్పించమని గిరిజనాభివృద్ధి అధికారికి పొలం కాగితాలు తెచ్చి చూపు తుంది. కాగితాలు చూసిన వెంటనే జరిగిన మోసాన్ని గమనించాడు అధికారి. కొనుగోలుదారు నుంచి భూమిపై హక్కుని చింతాసాలక్కకి చెందేలా తీర్పిస్తాడు. భూమి తమ చేతికి వచ్చినందుకు చాల సంతోషిస్తుంది. గుంటూరాయన గిరిజనుల భూమిని డెబ్బై ఎకరాలు కొని తన అంగబలంతో రక్షించుకుంటున్నాడు. నెలరోజుల తర్వాత చింతాసాలక్క భూమిని కోల్పోయి గిరిజనాభివృద్ధి ఆఫీసరు దగ్గరికి వెళుతుంది. గుంటూరాయన ఏవో కారణాలు చూపి హైకోర్టు నుండి స్టే తెచ్చుకొని చింతాసా లక్క భూమిని మళ్ళీ సాగు చేసుకుంటాడు. గిరిజనుల కోసం ఏర్పరచిన చట్టాలు గిరిజనులకు న్యాయం చేయడంలేదని అధికారి గ్రహిస్తాడు. చింతాసాలక్క భూమిని మాత్రం కోల్పోతుంది.

కౌలుకిచ్చిన భూమిని తిరిగి పొందలేని గిరిజనులు, వారికోసం ఏర్పాటుచేసిన చట్టాలు వారికి నిష్ప్రయోజన మైన తీరుని వస్తువైవిధ్యంగా చిత్రించారు.

## నువ్ మంచిగుండు మామా..... :

వరద బాధితులందరిని సురక్షిత శిబిరానికి తీసుకొచ్చి రక్షిస్తారు. ఈ శిబిరంలో కిట్టయ్య లక్ష్మీపురంకు చెందినవాడు. లక్ష్మీపురంలో వరదలో కిట్టయ్య భార్య, బిడ్డ నీళ్ళలో పడిపోతారు. వెంటనే కిట్టయ్య భార్య చేతిని

పట్టుకొని నీళ్ళలో నుండి బయటపడటానికి ఈత కొడుతుంటాడు. కిట్టయ్య అక్కడి నుండి కొంచెం కూడా ముందుకు కదలటం లేదు.కిట్టయ్య భార్య భర్తనైనా రక్షించాలని కిట్టయ్య చేతినుండి తప్పించుకుని గోదావరి నీటిలో కలిసిపోతుంది. గోదావరి నీటిలో కలిసిపోతూ 'నువ్ మంచి గుండు మామా' అని చెప్పి వెళ్లిపోతుంది. కిట్టయ్య బతికాడుకాని ప్రయోజనం లేదు. కిట్టయ్య భార్యను, బిడ్డను కోల్పోయిన బాధ నుండి తట్టుకోలేక మౌనం వహించాడు. నోటి మాట లేదు.

1986వ సంవత్సరంలో గోదావరి వరదల సమయంలో గిరిజనులను రక్షించే ప్రయత్నం చేసిన ఐ.టి.డి.ఎ. అధికారి తన అనుభవాన్ని ప్రజలకు తెలియజేయాలన్న నేపథ్యంలో ఈ కథ రాశారు.

**భూమికోసం :**

గిరిజనుల్ని అభివృద్ధి చేయడానికి ఐ.టి.డి.ఎ. అధికారులు ఉద్యాన వనాలు, పట్టు పరిశ్రమలు ఏర్పరిచారు. వీటి ద్వారా గిరిజనులకు శిక్షణ ఇస్తారు. దీన్ని హార్టికల్చర్ నర్సరీ కమ్ ట్రైనింగ్ సెంటర్ (H.N.T.C) అంటారు. ఆ సెంటర్లో చింతమల్లమ్మ వయస్సు అరవై సంవత్సరాలు పైనే. ఆమె భూమి రెండెకరాలు సెంటర్‌లో కలిపేస్తారు. నష్టపరిహారంగా ఏమి ఇవ్వలేదు. భూమిని కోల్పోయిన వారు పట్నానికి కట్టెలు తీసుకెళ్ళి అమ్మి జీవనం సాగించేవారు. మళ్ళీ అడవిని సాగుచేసి పంటవేయబోయే సమయంలో ఫారెస్టు అధికారులు జప్తు చేస్తారు.

చింత మల్లమ్మ కొడుకు బొగ్గు బావిలో పని చేస్తుంటాడు. వయస్సు అయిపోయి బొగ్గుబావిలో పని చేయలేని సమయం వచ్చేటప్పటికి భూమి ఉంటే సేద్యం చేసుకుంటాడని భూమికోసం రోజు H.N.T.Cలో పని చేస్తుంది. భూమిని తిరిగివ్వలేని ప్రభుత్వ వైఖరిని గమనించిన ఐ.టి.డి.ఎ. అధికారులు చింతమల్లమ్మకి ఒక బర్రెను తీసిస్తారు. ఎ.చీ.ఎ.జగా మార్చిన 72 ఎకరాలు పంచి ఇవ్వడానికైనా భూమికి సంబంధించిన వాళ్ళు లేరు. ఏదో ఒక విధంగా భూమిని కోల్పోతున్నారు. ఫారంలో, ఫారెస్టులో కలిసి పోయిన భూమికి నష్టపరిహారం లభించక ఎప్పటికైనా భూమి తిరిగిస్తారని ఆశించే గిరిజనుల బాధల్ని కథావస్తువుగా స్వీకరించారు.

**రాకితల్లి :**

ఒరిస్సా ప్రాంతం నుండి గోండు తెగవారు వలస వచ్చి కమలాపురంలోని రేయాన్స్ ఫ్యాక్టరీ దగ్గర నివాసం ఏర్పరచుకున్నారు. వీరు మాట్లాడే భాష గోండి, ఒరియా కలగలసిన మణిప్రవాళం. వరదలలో వీరికి సంబంధించిన గుడిసెలు, తిండిగింజలు కోల్పోతారు. వీరి భాష అర్థంకాకపోవడం వల్ల ప్రభుత్వం నుండి సహాయం కూడా అందదు. రేయాన్ ఫ్యాక్టరీ కూడ మూతపడడం వల్ల పనికి, తిండికి కొరత ఏర్పడుతుంది. వీరి సాధక బాధకాలను పరిశీలిస్తున్నారు ఫణికుమార్. ఈ ప్రాంతంలో బిడ్డకు పాలిస్తూ ఒక మాతృమూర్తి ఫణికుమార్ కెమెరాకి కనిపిస్తుంది. ఆమె పేరు రాకి. ఈ ఫోటోని 'మదర్అండ్ చైల్డ్' శీర్షికతో అఖిల భారత స్థాయి ఫోటో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తాడు. రెండు బహుమతులు లభిస్తాయి. ఆ ఫోటోకి వచ్చిన మెడల్స్‌ని ఆ ప్రాంతవాసులకి చూపించాడు. కెమెరాను ఫోటోని చూసి ఫోటోలు తీయమని అధికారిని అమాయకంగా అడుగుతారు.

వరదలలో వర్షపు నీటికి నష్టపోయిన వారికి ఇళ్లు కట్టించాలని సంకల్పిస్తారు. దీనివల్ల గోండులందరికి పని దొరుకుతుందని భావించి ఆ పథకాన్ని ప్రవేశపెడితే బాగుంటుందని వారి సూచనలను సలహాలని రాసుకొని గిరిజనాభివృద్ధి అధికారి నివాస ప్రాంతానికి తిరిగి చేరుకుంటాడు. ఏటూరు నాగారం గిరిజనాభివృద్ధి ఆఫీసులో ఫణికుమార్ ఉన్న సమయంలో కాకీని ఎలుగుబంటి ముఖంపై, వక్షస్థలంపై కొట్టి చిందర వందర చేసిందని గూడెం వాసులు ఏడుస్తూ విన్నవిస్తారు. కాకీని వరంగల్ ఆసుపత్రికి చేరుస్తారు. డాక్టర్లు అతికష్టం మీద ఆమె ప్రాణాలు కాపాడగలుగుతారు. కానీ ముఖంలో చాలా భాగం కోల్పోయి కురూపిగా తయారయింది రాకీ. గిరిజనులు అడవిలో నివసించడం వల్ల వీరికి జంతువుల వల్ల ప్రమాదం ఉంటుంది. ఎలుగుబంటి చేసిన దాడిలో

రూపాన్ని పోగొట్టుకున్న ఒక స్త్రీ దీనగాథను రచయిత చిత్రించారు.

భూమి, నీరు, గాలి, నిప్పు, ఆకాశం పంచభూతాలు. గిరిజనులకు వాటితో దగ్గర సంబంధం ఉంది. వర్షాలు పడకపోతే సంస్కృతిని పూజించి ఆరాధిస్తారు. గిరిజనులకు పోడు వ్యవసాయం జీవనాధారం. భూమిని నమ్ముకుని జీవించే గిరిజనులు కొంతమంది ఉన్నారు. ప్రకృతి వైప రీత్యాల వల్ల నదులు ఉప్పొంగి గిరిజన గూడేలు నీట మునిగితే వారి ఆస్తిపాస్తులు వరదల్లో కొట్టుకుపోయి, భార్యాభర్తలు చెట్టుకొకరు పుట్టకొకరై ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. పేదవాడి జీవనాధారం భూమి. భూమిపై ఆధారపడి గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గిరిజనాభివృద్ధికోసం ప్రభుత్వం గిరిజనుల భూమిని సేకరించి ప్లాంటేషన్స్‌గా చేస్తుంది. దీనివల్ల గిరిజనులు భూమిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. స్త్రీలు భర్తను కోల్పోయి వృద్ధాప్యంలో భూమి మీద ఆధారపడి జీవిస్తుంటారు. గిరిజనేతరులు బతుకు దెరువుకోసం గిరిజనుల గూడెం దగ్గర నివాసం ఏర్పరచుకొని గిరిజనుల భూమిని కాజేస్తున్నారు. ఆర్థిక స్థితిగతులు బాగాలేక భూమిని షావుకార్ల దగ్గర కుదవ పెట్టి అప్పు తీసుకుంటారు. డబ్బు తిరిగి ఇచ్చినా ఇవ్వకపోయినా భూమిని కాజేసే పన్నాగాలు పన్నుతారు. ప్రభుత్వం గిరిజన భూమి పరిరక్షణ కోసం చట్టాలు చేసినప్పటికీ ఆ చట్టాలు గిరిజనేతరులకు మేలు చేసేవిగా ఉన్నాయి. గిరిజనులు జంతువులు అడవిలో సహజీవనం చేస్తుండటం వల్ల క్రూర జంతువులు గిరి జనులపై దాడి చేస్తుంటాయి. ఈ విధంగా గిరిజనులు భూమి, నీరు, నిప్పు, గాలి వంటి పకృతి వైపరీత్యాలను అడవులలో ఉన్న కృరమృగాల నుండి అనేక విధాలుగా ఎదుర్కొంటూ జీవన పోరాటాన్ని కొనసాగిస్తూ, అత్యంత ప్రమాదకరమైన పకృతి వైపరీత్యాల్లో జీవనం కొనసాగిస్తు న్నారు.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. తిరుమలరావు,జయధీర్, జీవన్. ఇప్పపూలు (గిరిజన సంచారతెగల కథలు). ఖమ్మం: ప్రతిభా ప్రచురణలు,2009.
2. దక్షిణామూర్తి,పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు. హైదరాబాద్ : చైతన్యపురి, 1988.
3. ఫణికుమార్. గోదావరి గాథలు. గుంటూరు : శ్రీనాథపీఠము, 1989.
4. మల్లయ్య,కాలువ (సంపా). తెలంగాణ కథలు. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2005.
5. రాంబాబు,నూనావత్. తెలుగులో గిరిజన కథలు - వస్తు,శిల్ప వైవిధ్యం. హైదరాబాదు : గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ, గిరిజన సంక్షేమశాఖ, 2017.
6. రాజయ్య, అల్లం. కథా కెరటాలు. (విరసం కథలు). విజయవాడ : విరసం ప్రచురణ, 2001.
7. వెంకటసుబ్బయ్య,వల్లంపాటి. కథాశిల్పం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1995.
8. విద్యాసాగర్,ఎ. భద్రాచలం మన్నెం కతలు. హైదరాబాద్ : ప్రియదర్శిని ప్రచురణలు, 1993.
9. శైలమ్మ,జి. తెలుగు కథాసాహిత్యం - గిరిజన జీవితం. కుప్పం : ద్రావిడ విశ్వవిద్యాలయం, 2011.
10. సాహు, రాములు,బి.ఎస్. అడవిలో వెన్నల (గిరిజన పోరాటకథలు). కరీంనగర్ : కరీంనగర్ బుక్ ట్రస్ట్, 1985.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# కడప జిల్లా జానపద కథలు - సాంఘిక అంశాలు

- ఉమ్మడి రవీంద్రారెడ్డి
పరిశోధక విద్యార్థి, తెలగు విభాగం,
రాయలసీమ విశ్వ విద్యాలయం, కర్నూలు.

- జి. పార్వతి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,
యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.

జానపదకథల్లో జానపదుల సాంఘిక, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన ఎన్నో అంశాలు చోటు చేసుకోవడం సహజం.

సమాజంలోని వివిధవృత్తులు, వారి జీవనవిధానం, పరిపాలనావ్యవస్థ, న్యాయం. శిక్ష మొదలైన అంశాల్ని స్థాలీపులాక న్యాయంగా యీ వ్యాసంలో చర్చించడం జరిగింది.

సంఘం ఒక రకమైన సమూహం. సమాజనిర్మితిలో సంఘం ముఖ్యమైన విభాగం. చాలా రకాలకు చెందిన వ్యక్తులు కొంతమంది కలసి ఉమ్మడిగా పనిచేస్తూ రూపబద్ధమైన, నియమబద్ధమైన, క్రమబద్ధమైన వ్యవస్థాపనను శాశ్వతంగా నెలకొల్పుకుంటారు. కొంతమంది నాయకులను ఎన్నుకుని, ఒక మండలిని ఏర్పాటుచేసుకుని, కొన్నిసూత్రాలను, ప్రమాణాలను నెలకొల్పుకుంటారు. తద్వారా అందరికీ కావలసిన, ముందుగా నిర్ణయించుకొన్న అభిరుచులను, ప్రయోజనాలను నెరవేర్చుకొనే సమూహాన్ని సంఘం అంటారు.

దీన్నిబట్టి కొన్ని కుటుంబాల వారు కొన్ని కట్టుబాట్లకు లోబడి ఒకేరకమైనలక్ష్యంతో, ఒకే రకమైన విధానంతో జీవించడం కన్పిస్తుంది. ఆ వ్యవస్థనంతటినీ కలిపి సంఘం అంటే సరిపోతుంది. సంఘానికి సంబంధించిన వివిధ అంశాల్ని ఇక పరిశీలిద్దాం.

**ఆర్థికవ్యవస్థ :**

ఏ దేశానికైనా, ఏ సంఘానికైనా దాని ఆర్థికవ్యవస్థే ప్రాణప్రాయమైంది. సంఘంలోని వ్యక్తుల ఆర్థికకార్యకలాపాలు ముమ్మరంగా సాగినపుడు వారి ఆదాయం పెరుగుతుంది. వారి ఆర్థికస్థితి మెరుగవుతుంది. కొనుగోలుశక్తి కూడా పెరుగుతుంది. పర్యవసానంగా వారి జీవనస్థాయి కూడా గణనీయంగా పెరుగుతుంది. అందువల్లే సంఘానికి దాని ఆర్థికవ్యవస్థ వెన్నెముక వంటిది అనిగానీ, ప్రాణంవంటిదనిగానీ పేర్కొనవచ్చు.

**వృత్తులు :**

సంఘంలో రకరకాలుగా జీవనోపాధి గడించి జీవించే విభిన్నవర్గాల వారుంటారు. కొందరు చేసేపని వంశపారంపర్యంగా వచ్చేదైతే మరికొందరు చేసే పని ఐచ్ఛికం. వంశపారంపర్యంగా చేసే పనుల్ని వృత్తులు అంటారు. వృత్తి అనేమాటకు అనేక నిర్వచనాలు కన్పిస్తాయి. జీవనోపాధి కోసం కుటుంబసభ్యులంతా వంశపారంపర్యంగా చేసే పనిని 'వృత్తి' అని స్థూలంగా నిర్వచించుకోవచ్చు. "వ్యక్తి జీవనోపాధికోసం కొన్ని కట్టుబాట్లకు లోబడి వంశపారంపర్యంగా ఒకే పనిని చేస్తుండడమే వృత్తి".

యీ రెండు నిర్వచనాలను దృష్టిలో ఉంచుకుని ఆలోచిస్తే కుటుంబంలోని ఒక వ్యక్తిగానీ, పలువురు వ్యక్తులుగానీ కుటుంబజీవనోపాధికోసం వంశపారంపర్యంగా ఒక పనిని చేపడితే దాన్ని వృత్తి అని వ్యవహరించవచ్చు.

సమాజంలో ఒక వృత్తిని ఒకే కులంవారు చేపట్టేవీ ఉన్నాయి. ఉదాహరణకు పౌరోహిత్యానికి బ్రాహ్మణులు, క్షురకర్మను నాయిబ్రాహ్మణులు ఒకే వృత్తిని వేర్వేరు కులాలవాళ్లు చేపట్టే అవకాశం ఉంది. ఉదాహరణకు వ్యవసాయాన్ని తీసుకుంటే కాపు, కమ్మ, బలిజలు అందరూ చేస్తారు.అలాగే వైద్యం, పూటకూళ్ల ఇలాంటి వృత్తుల్ని కూడా వేర్వేరు కులాలవాళ్లు చేయడం జరుగుతుంది. సంఘంలో గౌరవప్రదంకాని భోగంవృత్తిని, భిక్షావృత్తిని కొన్ని కులాలవాళ్లు అందరూ లేదా కొందరువృత్తిగా చేపట్టి జీవనం సాగిస్తారు.

జానపదుల్లో వివిధ వృత్తులవారు ఉంటారు. వారందరూ సంఘీభావంతో మసలుకొంటారు. పరస్పరం

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


సహకరించుకుని జీవితాన్ని సుఖమయం చేసుకోవడానికి సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తారు.

**వేట :**

ఆదిమమానవుడికి ఆకలి పుట్టినప్పటి నుంచి నేటిదాక వేట కొనసాగుతూనే ఉంది. అందువల్ల మానవుని మొదటి వృత్తి వేట అని చెప్పుకోవచ్చు. వేట సప్తవ్యసనాల్లో ఒకటిగా పరిగణింపబడుతూ వుంది. వేటను జానపదులు ఇప్పటికీ కొనసాగిస్తూ మాంసభక్షణ చేస్తున్నారు. వేటాడి ఆహారాన్ని సంపాదించేదశకు ముందు మానవుడు కందమూలాలు, కాయకసుర్లు తినేవాడు. పూర్వం రాజులు వేటను సరదాగా, అలవాటుగా పెట్టుకుని జీవించేవారు. తెలుగు సాహిత్యంలో కూడా వేటకు ఎంతో ప్రాధాన్యం ఉంది. జానపదులకు వేటపట్ల అభిరుచి, ఆసక్తి ఎక్కువ. కాబట్టి తమకథల్లో చోటు కల్పించడం కూడా కన్పిస్తుంది.

'శంఖుబాలుని కథ' లో రాజుకు ఏడుమంది భార్యలు. రాజు పెద్దభార్యకు శంఖుపుడ్తుంది. మిగతా ఆరుమంది భార్యలకు ఒక్కొక్క కుమారుడు పుడ్తారు. పెద్దభార్యకు పుట్టిన 'శంఖు' బాలుడుగా మారుతాడు వాడే శంఖు బాలుడు. శంఖుబాలుడు రోజూ వేటాడి డబ్బు సంపా యిస్తాడు. ధనార్జనా వృత్తుల్లో వేట కూడా ఒకటి అని దీన్నిబట్టి స్పష్టమౌతుంది. రాజు కొడుకైన శంఖుబాలుడు వేటాడి డబ్బు గడించినట్లు జానపదులు చెప్పడాన్నిబట్టి వేటలాభసాటివృత్తి అనే విషయం తెలుస్తుంది.

**వ్యవసాయం :**

భారతదేశం వ్యావసాయిక దేశం. మనదేశపుప్రజల్లో అధికశాతం వ్యవసాయ వృత్తి మీద ఆధారపడే జీవిస్తు న్నారు. మనకు కావలసిన ఆహారం వ్యవసాయం వల్లనే లభిస్తుంది కాబట్టి వ్యవసాయం పట్ల జానపదులకేగాక నాగరకులకు కూడా పూజ్యభావం ఉంది. జానపదుల్తో విడదీయరానంతగా కలసిపోయిన వ్యవసాయమంటే జానపదులకు మక్కువెక్కువ. అందువల్ల కడప జిల్లా జానపద కథల్లో కూడా వ్యవసాయానికి సముచిత స్థానం లభించింది.

'ఆంధ్రామనిషి - కర్ణాటకమనిషి కథ'లో ఒకడు ఆంధ్రా నుంచి కర్ణాటకకు పోతుంటాడు. ఈ ఆంధ్రాలో నాతో పోటీ చేయగల మొగోడు లేడంటూ, కర్ణాటకలో ఏమైనా వుండాడేమో అనిపోతా వుంటాడు. అదేవిధంగాకర్ణాటక నుండి ఆంధ్రాకు ఒక మనిషి వస్తావుంటాడు. వాళ్లు ఇద్దరూ ఒక మానుకింద కలుసుకుని సద్దన్నం తింటా వుంటారు. కర్ణాటక అతను "ఏమయ్యా! నువ్వు ఎక్కడ పోతావుండావు. ఏ రాజ్యంమీది?" అని అడగతాడు. "ఏమీ లేదయ్యా కర్ణాటకలో నామీద తగిలేవాడు ఎవడైనా వుండాడేమో అని పోతా వుండాను" అంటాడు. ఆంధ్రా మనిషి కర్ణాటకమనిషిని అడగతాడు. వాడూ అదేవిధంగా చెప్తాడు. అయితే మనిద్దరం తగలల్ల అంటాడు. "అయితే మనమధ్య పెద్దమనిషి కావాలి కదా" అంటాడు. అప్పుడు ఒకాయమ్మ పదిపుట్ల బియ్యం ఫలావు అన్నం చేసుకుని, ఏడుపుట్ల చెనిగ్గింజలు చట్నీ నూరుకొని నెత్తిన పెట్టుకొని పోతూవుంటుంది. ఏవమ్మో మేమిద్దరం యుద్ధంచేసేది నువ్వు చూడల్ల, గంప దించు" అని అడగతారు. నాకు దించే అంత ఓపిక లేదు, నా అరచేతిలో యుద్ధం చెయ్యండి. చూస్తాను అని చెప్పి పోతావుంటుంది. ఆయమ్మ మొగుడైనోడు వెయ్యి ఎకరాల భూమిని, వెయ్యి ఏనుగుల్ని ఒకే మడకకు కట్టి ఏడుసాళ్లు దున్ను తాడు. ఒక మడకకు వెయ్యి ఏనుగుల్ని కట్టి దున్నడాన్ని చూస్తే ఒకప్పుడు ఏనుగులతో కూడా వ్యవసాయం చేసే వాళ్లని తెలుస్తుంది. పెద్దరైతుతలు ఎక్కువ పొలాన్ని కలిగి వుండేవారని, దున్నకంలో మడకల ఉపయోగం తప్పనిసరి అని దీన్నిబట్టి తెలుస్తుంది. ఇది బలప్రదర్శన కథ అయినప్పటికీ దీనిలోఅనుకోకుండా వ్యవసాయం చోటు చేసుకోవడం, జానపదులు వ్యవసాయానికిచ్చే ప్రాధాన్యత ఎలాంటిదో బోధపడుతుంది.

'చిట్టిగ్గువ్వ కథ'లో రైతు పొలంపని చేసేటప్పుడు భార్య సహకరిస్తుంది. మడకకు ఒకప్రక్క ఎద్దును, మరొక ప్రక్కభార్యనుకట్టిపొలాన్ని దున్నుతుంటారు. దీన్నిబట్టి భార్యాభర్తలు వ్యవసాయంలో సహకరించురించుకొనే విధానం విదితమౌతుంది.

**పశుపోషణ :**

పశువుల్ని ఒకప్పుడు యాదవులు మేపేవారు. ఈ పశువులు వ్యవసాయానికి చాలా ఉపయోగపడుతాయి. కాబట్టి నేడు అందరూ మేపుతున్నారు. పశువులపేడ పొలానికి మంచి సత్తువ. పశువులపాలు, పెరుగు, వెన్న, నెయ్యి రైతుకు మంచిపుష్టికరమైన ఆహారంగా ఉపయోగపడుతుంది. పాలను అమ్మి సొమ్ము చేసుకుని ఇబ్బందులు తొలగించుకుంటారు. పశువుల దూడలు మళ్లీ పశువులై శ్వేత విప్లవానికి సహకరిస్తే, పశువుల కోడె దూడలు పెరిగి కోడెలై రైతు సాగించే హరితవిప్లవానికి తోడ్పడతాయి. అందువల్లనే వ్యవసాయానికి పాడి పరిశ్రమ అనుబంధంగా రూపొందింది. రైతుకు పశు పోషణ ఆసక్తికరమైన పనిగా పరిణమించింది. భారత దేశంలో రైతులేగాక దైతుకూలీలు కూడా పశుపోషణ చేపట్టి గ్రామాల్లో పాడిపంటల్ని వృద్ధిచేస్తున్నారు. ఇంత ప్రాముఖ్యత వుంది కాబట్టే భారతీయులు పారంపర్యంగా పశువును ఆరాధ్యదైవంగా కూడా పూజిస్తున్నారు. ఇంతటి ప్రాముఖ్యతను పొందిన పశుపోషణ జానపదకథల్లో చోటుచేసుకోవడాన్ని గమనించవచ్చు.

'చిట్టిగ్గువ్వ కథ'లో పిల్లవాడు ఎద్దుల్ని మేపుతూ వుంటాడు. చిట్టిగువ్వ పిల్లవాని దగ్గర దోసకాయ ఇచ్చి, "దీన్ని చూసుకోనుండు బావిలోకి వెళ్లి నీళ్ల తాగేసి వస్తా" నంటుంది. పిల్లవాడు ఆకలితో దోసకాయను తినేస్తాడు. "నా దోసకాయను ఇస్తావా ? లేకపోతే ఎద్దునిస్తావా?" అని చిట్టిగువ్వ అడుగుతుంది. పిల్లవాడు దోసకాయ బదులు ఎద్దునిస్తాడు. దీన్నిబట్టి పశువుల్ని మేపడం సమాజంలో ప్రముఖంగా వున్నట్లు తెలుస్తుంది.

'నర్సిగాని కథ'లో ఇద్దరు అక్కాచెల్లెళ్ళు వుంటారు. వాళ్లకు ఒక తమ్ముడు వుంటాడు. వాడు ఒక రెడ్డోరింటి దగ్గర జీతానికి వుంటాడు. పెద్దక్క వయసుకొస్తుంది. రెడ్డోరింటి దగ్గర జీతం తీసుకోని వచ్చి పెండ్లి చేస్తాడు. చిన్న పాపకు కూడా అలానే పెండ్లిచేస్తాడు. ఆ అప్పు తీరేంత వరకు వాళ్లింటి దగ్గర ఆవులు మేపుతాడు. దీన్నిబట్టి పశువుల్ని జీతగాళ్లదగ్గర కూడా మేపిస్తారని తెలుస్తుంది.

ఆవులతోపాటు గేదెల్ని కూడా మేపడం రైతులకు ఆనవాయితీ, బర్రెలు కూడా పాడిపరిశ్రమకు ఎంతగానో తోడ్పడుతాయి. ఆవులతో సమానంగా వీటి ఉపయోగం కూడా వుండడం వశేషం. గేదెలు మేపడంలాంటి సంఘటనలు కడప జిల్లా జానపదకథల్లో కన్పిస్తాయి.

'రాయలుపటాని కథ'లో ఒక రాయలు పటాని వుంటుంది. ఆమెకు మొగుడు లేడు. అమ్మా, నాయన కూడా లేరు. కూడాపుట్నోళ్లూ ఎవరూ లేరు. ఆ రాయలు పటాని మనం ఎట్లబతికేదని పాలిచ్చే ఎనుముల్ని నాలుగు పట్టుకునింది. ఆ ఎనుముల్ని మేపడానికి మనిషిని పెట్టుంది. వాడు ఎనుముల్ని

గ్రామీణ పేదరైతులు వ్యవసాయం చేసి పంటను పండించడానికి ఎంత దారుణంగా, ఎంత దయనీయంగా కష్టపడుతారో తెలుస్తుంది.

'రెడ్డిసాని కథ'లో అత్తాకోడలు వుంటారు. అత్త కోడల్ని వంటింట్లోకి రానిచ్చేది కాదు. ఒకరోజు అత్త సంతకు పోతుంది. ఈరోజు మనం చిమ్మిలు కొట్టి తినల్లను కొంటుంది. చిమ్మిలుకొట్టి ముద్దపట్టేసరికి అత్త వస్తూ వుంటుంది. ఇంక మనం ఎట్ల తినేదని ఇంటి ముందుకు వచ్చిన దాసప్పకు వేస్తుంది. రెడ్డిసాని నామీద మోజూ పడింది అనుకుంటాడు ఆ దాసప్ప. ఆ మరునాడు రెడ్డిసాని నీళ్లకొస్తుంది. దాసప్పకు రెడ్డిసానిపై మోజూపడి "ఏం రెడ్డిసానీ ఈ పొద్దు నన్ను ఎక్కడికి రమ్మంటావు" అంటాడు. ఇంకేడికొస్తావు. ఊరుముందర చింతమాను కిందికి రా అంటుంది. వీడు ఆ రాత్రి ఊరుముందర చింతమానికిందికి పోయి కూసోనుంటాడు. రెడ్డిసానికి పదారుమంది సేద్యగాళ్లు వుంటారు. దీన్నిబట్టి రైతుకు పొలం పనుల్లో సహకరించేందుకు పనివాళ్లు వుండేవారని తెలుస్తుంది. నేద్యంపని చేయడంవల్ల వీరిని సేద్యగాళ్లని వ్యవహరిస్తారు.

'వరణమ్మ - శరణమ్మ కథ'లో రాజుకు ఆరుమంది కొడుకులు వుంటారు. వాళ్లు ఆరుమంది పొలంలో మడక కడ్తారు. రాణి కోడలిదగ్గర అన్నం ఇచ్చి మడికాడికి పంపడం జరుగుతుంది. దీన్నిబట్టి ఇంట్లోని మగపిల్లలు మడక

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

కట్టడం వంటి వ్యవసాయపుపనుల్ని చేసేందుకు పొలానికి వెళ్లేవారని, ఇంట్లోని స్త్రీలు వారికి అన్న తీసుకొని వెళ్లేవారని తెలుస్తుంది.

'పందిబావ - నక్కబావ కథ'లో పందిబావ, నక్కబావ రెడ్డింటి దగ్గర సేద్యం చేస్తుంటాయి. పందిబావ మడక దున్ని సేద్యంపనులు బాగా చేస్తుంటుంది. నక్కబావ ఏ పనులు చేయకుండా బురదలో పొర్లాడి ఇంటికి వస్తుంది. పందిబావ సేద్యంపనుల్ని చేసి శుభ్రంగా కడుక్కోని ఇంటికి వస్తుంది. బురదలో ఇంటికి వచ్చిన నక్కకు రెడ్డి భార్య పంచవన్నె పదార్థాలు పెడ్తుంది. పందిబావకు మాడు, మసి వేస్తుంది. ఈ అంశం ద్వారా జానపదులు జంతుపాత్రల్ని మానవీకరించి వ్యవసాయానికి వినియోగించడం, వారికి వ్యవసాయంపట్ల, వున్న ఆసక్తిని తెలియజేస్తుంది.చెరువులో తోలేసి మడిగట్టున పడుకొని నిద్రపోతాడు. ఎనుములు పైరు మేస్తాయి. సొంతదారు ఎనుముల్ని పట్టి కట్టేసుకుంటాడు. రైతులు పనిమనుషుల్ని నియమించుకుని వారిచేత బర్రెల్ని మేపించుకోవడం, పని మనుషులు కర్తవ్యాన్ని విస్మరించి నిద్రపోవడం, పైర్లోపడ్డ ఎనుముల్ని యజమాని కట్టివేసుకోవడం వంటి గ్రామీణ సంఘటనలు గ్రహించేందుకు ఈ కథ తోడ్పడుతుంది.

'ఎర్రోని కథ'లో ముసలమ్మకు ఒక కొడుకు వుంటాడు. వాడు ఎర్రోడు. ఈ ముసలమ్మ నాలుగు ఎనుముల్ని పట్టుకుని, పాలు అమ్ముకుని ఉదరపోషణ చేసుకుంటూ ఉంటుంది. "అమ్మా! ఈ ఎనుములజతకు ఇంక రెండు ఎనుములు పట్టుకుంటే బాగుంటుంది" అంటాడు ఎర్రోడు. దీన్నిబట్టి మంచి ఆదాయాన్ని తెచ్చిపెట్టే వృత్తిగా గేదెల పెంపకం కన్పిస్తుంది.

'గడిగ్గమ్మడి కాయకథ'లో రాజు, మంత్రి వుంటారు. మంత్రి ఎనుములు రాజు చేన్లో పడుతాయి. చేనులోపడ్డ ఎనుముల్ని కట్టివేయమని మంత్రి చిన్నకోడలికి తక్కిన కోడండ్లు చెప్పడం పరికిస్తే రాజైనా, మంత్రైనా పశుపోషణ తప్పనిసరి అని భావిస్తున్నట్టు తెలుస్తుంది.

ఇలా గ్రామీణుల సాంఘిక జీవితం ఎంతో వైవిధ్యంగా కడప జిల్లా జానపదకథల్లో కన్పిస్తుంది.

❀❀❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆంధ్ర మహాభాగవత అవతారిక - విశేషాంశాలు

- డా॥. ఎ. బాలకృష్ణ తెలుగు అధ్యాపకులు, జి.వి.యస్.యమ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉలవపాడు, ప్రకాశం జిల్లా.

భారతదేశంలోని హిందువులకు ప్రధానమైన గ్రంథాల్లో భారత, భాగవత, రామాయణాలు తొలుత పేర్కొన దగినవి. ఇవి మూడూ వాఙ్మయంలో వివిధ శాఖలకు చెందినవి. వీనిలో భాగవతం పురాణం పారలౌకిక సుఖ సాధనమే లక్ష్యంగా గల భాగవతం. భక్తి, జ్ఞాన, కర్మ యోగాలను వివరిస్తూ ముఖ్యంగా భక్తియోగాన్ని అనేక ఉదాహరణలతో విపులీకరిస్తుంది. సామాన్య జనులకు సులభంగా ముక్తి లభించే మార్గాన్ని ఉపదేశిస్తుంది.

కావ్యకర్త తన కృత్యాదిలో రాసే తదుత్పత్తి క్రమం అవతారిక. 'అవతార యతీతి అవతారిక' కథలోకి దిగుటకు ముందు చేయబడే స్తుతిపూర్వక పద్యరచన. అవతారిక సంప్రదాయం ప్రాచీనలైన సంస్కృత కావ్యాల్లో కనిపిం చదు. సంస్కృత కావ్యాల్లో కనిపించదు. సంస్కృత పద్య కావ్యాల్లో కన్పించకున్నా బాణుని 'హర్ష చరిత్ర' వంటి గద్య కావ్యాల్లో కన్పిస్తుంది. ఆంధ్రులు రచించిన కొన్ని సంస్కృత గ్రంథాల్లో కృత్యాదిని అవతారికలు ఉన్నాయి. బహుశా ఇది తెలుగు సంప్రదాయ ప్రభావ ఫలితమై ఉండొచ్చు.

అవతారికలో ప్రతి కవీ వాని పూర్వ కవులను, గురువు లను, స్వగుణాతిశయాన్ని, పాండిత్యోత్కర్షను, స్వీయ కవిత్వాశయాలను, కవిత దృక్పథాన్ని వ్యక్తం చేస్తాడు. గ్రంథం అనువాదమా, స్వతంత్రమా అనే విషయం అవతారిక ద్వారా తెలుస్తుంది. పురాణ, కావ్య, ప్రబంధాలలో ఆ గ్రంథం ఏ కోవకు చెందిందో తేటతెల్ల మౌతుంది. సాధారణంగా ప్రతి కావ్య అవతారిక ఇష్ట దేవతా స్తుతిలో ప్రారంభమౌతుంది.

కృతిపతుల మతాభిమానం ఎరుగునట్లు, బహుదేవతా స్తుతి చేసిన కావ్యవ తారికలు అనేకం కనబడుతున్నాయి. తన నామం, వంశనామం మొదలైన అంశాలు కవి అవ తారికలో తెలియజేస్తాడు. షష్ఠ్యంతాలందు కవి గ్రంథాన్ని ఎవరికి అంకితం చేస్తున్నదీ తెలియపరుస్తాడు. ఈ విధానం ఇప్పటి 'ముందుమాట', 'పరిచయం' మున్నగు శీర్షికలు వంటిది. కావ్యావతారిక కావ్యానికి 'పునాదిరాయి' కావ్యంలోని అనేక అంశాలకు అవతారికలోనే బీజం వేయబడుతుంది.

ఆంధ్ర భాగవత కృతికర్త పోతన అవతారికలో తన పూర్వ సంస్కృత కవులైన వాల్మీకిని నుతించి, వ్యాసునికి మొక్కి, బాణునికి ప్రణమిల్లి మయూరిని అభినందించి, కాళిదాసుని కొనియాడి, భారవిని పొగడి, మాఘువిను తించి, తెలుగు కవులైన నన్నయను కైవారం చేసి, తిక్క మనీషిని భూషించి, ఇతర కవులను సంభావించి వర్తమాన కవులకు ప్రియంబు పలికి, భావి కవులను బహూ కరించాడు. గురువుల్ని గూర్చి ప్రత్యేకంగా చెప్పకపోయినా, 'గురువృద్ధ బుధబంధు జనానుజ్ఞాతుండనై' అని తెల్పటం ద్వారా ఈ విషయాన్ని ప్రస్తావించాడు. అందువల్ల పోతన 'సహజ పండిత' బిరుదాంకితుడైనా గురువులు కలరనే విషయం స్పష్టం. 'మదీయ పూర్వజన్మ సహస్ర సంచిత తపః ఫలంబున శ్రీమన్నారాయణ కథా ప్రపంచ విరచనా కుతూహలుండనై' అని స్వగుణాతిశయాన్ని వ్యక్తీకరిం చాడు. తన పాండిత్య ప్రతిభను, ఆత్మ విశ్వాసాన్ని

'కొందఱకు దెనుగు గుణమగు
గొందఱకు సంస్కృతంబు గుణమగు రెండుం
గొందఱకు గుణములగునే
నందఱ మెప్పింతు గృతుల నయ్యెయెడలన్' అని

'భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు
శూలికైన దమ్మి చూలికైన
విబుధ జనుల వలన విన్నంత కన్నంత
తెలియవచ్చినంత దేట పఱుతు

అని తన వినయశీలతనూ వ్యక్తం చేశాడు. 'శ్రీ కైవల్య పదంబు జేయుటకునై చింతించెదన్', 'నేనందల

మెప్పింతు గృతుల నమ్మెయెడలన్', 'దీని భాగవతము దెనింగించి నా జ్ఞానసంబున్ సఫలంబు జీపెద బున ర్జన్మంబు లేకుండగన్' అంటూ స్వీయ కవిత్వశయాలను పేర్కొన్నాడు.

'పలికెడిది భాగవతమట
పలికించు విభుండు రామభక్తుండటనే
బలికిన భావ హరమగునట
పలికెద వేతొండుగాథ పలుకనేల

విభుధ జనుల వలన విన్నంత కన్నంత
దెలియవచ్చినంత దేట పఱతు

అని కవితా దృక్పథాన్ని ప్రకాశింపచేశాడు.

'ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయర్వింబురావావళుల
తెనుగుం జేయుచు మత్పురావృత శుభాధిక్యంబు దౌనెట్టిదో
తెనుగుం జేయరు మున్ను భాగవతమున్'

'నేనాంధ్రంమున రచియింపంబూనిన శ్రీమహాభాగవత పురాణంబునకుం గథా ప్రారంభంబెట్టిదనిన' అని పేర్కొని భాగవతం పురాణాల కోవకు చెందిందని తెలియజేస్తాడు. భాగవత అవతారిక ఇష్టదేవతా స్తుతితోనే ప్రారంభింపబడినా, బహుదేవతాస్తుతి చేయబడింది. దీన్ని బట్టి పోతన మతాభిమానం తిక్కన 'హరిహకాద్వైతం' వంటిది. కారణం శివకేశకులను స్తుతించటమే. 'కౌండిన్య గోత్ర సంకలితు డాపస్తంబ సూత్రుండు', 'పోతన నామ వ్యక్తుండ సాధనయయుక్తుండన్' అని కవి వంశనామాలు తెలియజేశాడు. షష్ఠ్యంతాల్లో పోతన అని కవి వంశ నామాలు తెలియజేశాడు. షష్ఠ్యంతాల్లో పోతన భాగవతాన్ని 'హరికి నంద గోకుల విహరికి' అంకితమిచ్చాడు.

ఇక అవతారికలోని విశేషాంశాలలో మొదటిది. 'శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్' అని తను భాగవతం రాయడంలో గల పరమార్థాన్ని తెలియజేస్తాడు. సాహిత్య చరిత్రలో పునర్జన్మ లేకుండుటకై, శ్రీకైవల్య పదంబు చేరుటకై గ్రంథాలు తెనిగించిన కవులు అరుదు. అట్టి విశేషమైన కోరికతో పోతన భాగవతం తెనిగించాడు. దేవలందరకు వందనమాచరించి 'క్షిణితలంబున నుదురు సోకగ మ్రొక్కి నుతింతు'నని సరస్వతిని స్తుతించటం భారతిపై పోతనకు గల ప్రత్యేక గౌరవాన్ని సూచిస్తుంది. తెల్లని రంగు దర్శన జ్ఞానానికి చిహ్నం. కాగా భాగవతంలో అనేక సందర్భాల్లో అవకాశం కల్పించుకుని పోతన శ్వేతవర్ణ వర్ణనలు చేశాడు. ఇది తెలుగు రంగుపై పోతనకు గల ప్రత్యేక అభిమానాన్ని వ్యక్తం చేస్తుంది.

**ఉదాహరణకు...**

'శారదనిరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా
హౌర తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుందమం
దార సుధా పంచాధి సిత తామర సామర వాహినీశుభా
కారతనొప్పు నిన్ను మదిగానగ నెన్నడుగల్గు భారతీ.

ఇలా పోతన కవిత స్వచ్ఛమై సితకాంతివంతమై భాగవతమందంతటా వ్యాపిస్తుంది.

అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలబె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి వుచ్చినయమ్మ దన్నులో
నమ్మిక వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గమా
యమ్మ కృపాబ్ధియిచ్చుత మహత్య కవిత్వ పటుత్వ సంపదత్

ఈ పద్యంలో బీజాక్షరాలు నిక్షిప్తమై ఉన్నాయి. అవతారిక పద్యంలో బీజాక్షరాలు నిక్షిప్తపరచటం విశేషమైన విషయం.

కవి స్తుతిలో పోతన తన పూర్వకవులైన సంస్కృత, తెలుగు కవులను స్తుతించి, వర్తమాన కవులకు 'ప్రియంబు' పలకడమేకాక భావి కవులను బహూకరించాడు. పోతన వరకు గల కవులెవ్వరూ ఇలా భావికవులను బహూకరించటం కన్పించదు. ఇది పోతన వ్యక్తిత్వానికి గీటురాయి.

భాగవత అవతారికలో ప్రత్యేకంగా పలువురి దృష్టిని ఆకర్షించే నేపథ్యం..

ఇమ్మను జేశ్వరాధములకిచ్చి పురంబుల వాహనంబులన్
సొమ్ములుగొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసికాలుచే
సమ్మెట వ్రేటులంబడక సమ్మతితో హరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్

'యుభయ కావ్యాకరణ దక్షుండనై' అనే వాక్యం పూర్తి కాకుండానే నడుమ ఈ పద్యం ఉండటం అనుమానాస్పదమైన విషయం. ఈ పద్యాన్ని ఎవరో రచించి ఇక్కడ

ఇరికించి ఉంటారని పలువురి అభిప్రాయం. దానికిగల కారణం సహేతుకంగా ఉంది. వచనం ఉత్తమ పురుష అసమాపక క్రియలో ఉండి పద్యం ప్రథమ పురుష సమాపక క్రియలో ఉండటం. ఇది కుదరని సమ న్వయం. అంతేకాక వచనంలో తనకు తెలియని భావి కవులను బహూకరించిన పోతన వెంటనే 'ఇమ్మను జేశ్వరాధముల' అని తిట్టుటకు ఉపక్రమించుట సమయ సందర్భంలేని విషయం. ఇది పరిశీలింపదగిన విశేషంగా భాగవతావతారికలో చోటు చేసుకుంది.

'పలికెడిది భాగవతమట' అంటే భాగవతమే పోతన ద్వారా స్వయంగా పలుకును గాని పోతన పలుకుట కాదు. 'పలికెంచెడి వాడు రామ భద్రుండట'. రాముడే భాగవత మందలి అంతర్యామి. ఎన్ని అవతారాలు వర్ణింపబడినా, ఎందరు భక్తుల కథలు చెప్పబడినా ఒకే వెలుగు భాగవతం నుండి ప్రసరించి వలికిస్తుంది. 'నేను పలికిన సంసారబంధం తొలగునట' భాగవతం స్వయం గానే వ్యక్తమౌతుండ ఎవ్వడు నిమిత్తమాత్రుడగునో వానికి ముక్తి కలుగుతుంది. అంటే కావ్యం 'పలుకువాని' కొరకే కాని తన కొరకు కాదని కూడా అర్థం. రచించువాడు, అనువాదం చేయువాడు, చదువుకొని ఉపానించేవాడు అనే భేదం నశించి ఆనందం నిలబడునని భావం.

పోతన, నాటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భాషా విషయకంగా చెప్పిన, చేసిన ప్రతిజ్ఞ 'నేనంతఱ మెప్పింతు గృతుల నయ్యెయెడలన్'. పోతన ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని ఇది స్పష్టం చేస్తుంది. రసానుగుణంగా తెలుగును, సంస్కృతాన్ని సరిసమానంగా సార్థకంగా భాగ వతంలో ప్రయోగించి 'మాట తిరుగలేని మానధనుడు'గా పోతన కీర్తిని పొందాడు. 'ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విం' అనే పద్యంలో పునర్జన్మ లేకుండుట తనకే కాదు తాను రచించిన భాగవతాంధ్రీకరణకు కూడా వేరొక కవి ఎవరూ భాగవతానువాదం పోతన కన్నా రసవత్తరంగా వెలయిలేనుట జరగలేదు' లలిత సంబంధము కృష్ణ మూలము' పద్యం ధ్వనిప్రాయంగా భాగవతా ప్రాశస్త్యాన్ని ప్రకాశవంతం చేస్తుంది.

'నభ్రంకష శుభ్రసముత్తుంగ భంగయగు గంశకుంజని క్రుంకులిడి వెడలి మహనీయ మంజుల పురినంత లంబున మహేశ్వర ధ్యానంబు' చేసిన పోతనకు రామ భద్రుడు కనబడి 'మన్నామా గా శ్రీ మహాభాగవతంబు దెనుంగుసేయుమని' కోరుట భాగవత అవతారికలో మరో విశేషం. దీని వలన పోతనకు శివకేశకుల భేదం లేదను విషయమే కాక, రామభద్రుడు తనకు అంకితమిమ్మన్న భాగవతాన్ని 'గోపనితంబినీ మనోహరి నందగోకుల విహారి' అయిన కృష్ణునికి అంకిత మివ్వడం అపూర్వం.

భాగవతాన్ని ఆబాలగోపాలానికి అర్థమయ్యే రీతిలో రచించి 'చేతులారంగ శివును పూజించి', నోరునొత్వంగ హరికీర్తి నుడివిన కీర్తికాయుడు పోతన'. 'దయము సత్యంబు లోనుగా దలచి' తల్లిదండ్రులకడుపు పంటగా పుట్టి, తన యశస్సును, వారి యశస్సును దశదిశల వ్యాపింపజేసిన మహనీయుడు. అటువంటి మహాను భావుని ద్వారా భాగవతం ఆంధ్రీకరింపబడటం తెలుగు వారి అదృష్టం.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన - నిడదవోలు వేంకటరావు
2. శ్రీమదాంధ్ర భాగవతము - బమ్మెర పోతన
3. తెలుగు కావ్యావతారికలు - జి. నాగయ్య
4. శ్రీమద్భాగవత ప్రకాశము - ఎక్కిరాల కృష్ణమాచార్య.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# స్త్రీల రామాయణపు పాటల్లో మంధర

**- డా॥ జి. నళిని,** శాఖాధిపతి, తెలుగు విభాగం, మీనాక్షి మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి), చెన్నై, తమిళనాడు.

## పరిచయము :

జానపద సాహిత్యము అనగా జానపదులు (పాడల కొనెడి) సృష్టించిన సాహిత్యమని పెద్దలందరి చేత అంగీకరింపబడినది. ప్రజావాఙ్మయమని, పదవాఙ్మయమని, అనాదృత వాఙ్మయమని, మధుర కవితలని, దేశి సారస్వతమని పండితులచే పిలువబడి చివరకు జానపద సాహిత్య పౌరాణిక గేయముగ పాడలకొనెడివారు.

## రామాయణ ప్రాశస్త్యము :

భారతీయ సంస్కృతి ఆకారములనదగిన వానిలో రామయణము గొప్పపేరు పొందినది. రామాయణము వ్యక్తిని సంస్కార వంతునిగా తీర్చిదిద్దుననెడి నమ్మకము. రామాయణము అందరికి ప్రతీపాత్రమైన కావ్యము సీతా రాములు తెలుగువారి ఆరాధ్య దైవములు. తెలుగు వాడలలో రామాలయము లేని పల్లెపట్టులుండుట అరుదు.

అట్లే "శ్రీరామ"తో వ్రాతను ఆరంభించుట తెలుగు వారి అలవాటు, ఆచరాము, అంతియేగాక తెలుగువారు భక్తిప్రవత్తులకు తార్కారణముగా పిల్లలకు సీతారాముల పేర్లనే పెట్టుకొని తృప్తి చెందుచుందురు.

తెలుగువారి హృదయముల నిలతగా రామాయణము ఆకట్టుకొనుటకు కారణములు ప్రధానముగా రెండు కలవు. అవి ఆ కావ్యమందు మనోజ్ఞముగా వర్ణింపబడిన కుటుంబ జీవితములోని పరస్పర ప్రేమానురాగములు, మానవ ప్రకృతికి సహజములైన వేదనా సంవేదనములు. ఈ విధముగా సీతారాములు అందరికి ఆదర్శ దంపతులుగా నుండిరి.

## రామాయణములోని ముఖ్యమైన స్త్రీ పాత్రలు :

రామాయణములో అనేకములైన స్త్రీ పాత్రలు గలవు. వానిలో దశరధుని భార్యలైన కౌసల్య, సుమిత్ర, కైకేయిలు. రామ పత్నియైన సీత, రాముని సోదరి యైనటువంటి శాంత, రావణుని భార్యయైన మండోదరి, రావణుని సోదరియైన శూర్పణఖ, కైకేయి దాసియైన మంధర, రాముని భక్తురాళ్ళుయైనటువంటి శబరి, అహల్య, రావణుని లంకలోని రాక్షస స్త్రీలైన త్రిజట, తాటకి, మరియు లక్ష్మణుని భార్యయైన ఊర్మిళ, భరత, శత్రుఘ్నుల భార్యలైన మాళవిక, శ్రుతకీర్తి మరియు ఇతర అప్రధాన పాత్రలైనటువంటి అరుంధతి, భూదేవి, రంబ, ఊర్వశి, మేనకలు, అయోధ్యపుర స్త్రీలు, మునికన్యలు మొదలైన వారు కలరు.

## మంధర :

అయోధ్య రాజయినటువంటి దశరధుని చిన్న భార్య యైన కైకేయి దాసి మంధర. ఈమెను కైకేయి వివాహ సమయములో అరణముగా కైకతో పాటు పంపించారు. మంధర కైకేయి మంచిచెడ్డలన్నీ తానే చూసుకుంటూ కైకతో పాటు ఉంటుంది.

ఇది ఇట్లుండగా దశరథుడు రాముని వివాహనంతరము రామునికి పట్టాభిషేకము చేయడానికి నిర్ణయించుకొంటాడు. ఆ సంతోష సమయములో అయోధ్య వాసులంతా ఎంతో సంతోషముతో ఆడుచు పాడుచు నుండగా ఇది అంతయు జూచి మందర కడుపు మండిపోయింది.

వెంటనే కైకేయి అంతఃపురమునకు వెళ్ళి మంధర ఈ విధంగా చెప్పెను.

చూచితివ కౌసల్యదేవి భాగ్యములు!
నీ సుతుని గయికొనక నీవెరుగకుండ!
కాకుత్సుడు పట్నంబు కట్టుచున్నారు!

స్త్రీ.రా.పా పుట - 3.

అని కైకేయి దగ్గర చెప్పగా ఆమె ఇందులో ఏముంది కౌసల్య పెద్ద భార్య, రాముడు పెద్ద కొడుకు కాబట్టి రామునికి రాజ్యాన్నివ్వడం న్యాయమే. రాముడే రాజ్యాన్ని పాలించాలి అంటుంది.

అప్పుడు మంథర రాణి అని కూడా పట్టించుకోకుండా ఇలా అంటుంది.

కౌసల్య గద్దెక్క నీవెక్కరాదు
కొద్దివారిలోన గూడి యుందువు
నీ సవతి కుంచాన కొలిచి యివ్వంగా
కడువంగా పాటయ్యె విధి నీకుర్వాసై

- స్త్రీ.రా.పా. పుట - 3

నీకేమి ఆ కర్మ రామున్ని రాజు చేసి తల్లి, కొడుకుల దగ్గర చేయి చాచెదవా అని సూటి, పోటీ మాటలతో ఆమెను రెచ్చగొట్టి, ఆమె మనస్సు మార్చుతుంది. దాంతో కైకేయి దశరథుని వద్ద తనకిచ్చిన రెండు వరములు అడిగెను. ఒకటి రామున్ని అడవులకు పంపుట, మరొకటి భరతునికి రాజ్యాన్ని కట్టుట కాని ఇందులో ఒకటి మాత్రం జరుగుతుంది. రాముడు అడవులకు వెళ్ళడం, అంతేగాని భరతుడు రాజ్యాన్ని పరిపాలించడు. భరతుడు రామునిపై భక్తి, ప్రేమలతో రాముని పాదుకలను పెట్టి రాజ్యాన్ని ఏలుతారు.

ఇచ్చట మంథర యంత ప్రయత్నించినను తాను అనుకున్నది సగమే సాధించగలిగెను. రామున్ని వన వాసము పంపగలిగెను. అందుకు కారణము మంథరకు రాముడంటే అప్రియము. రాముడు చిన్నతనమున చెండాడు చుండగ మంథర ఆ చెండును తట్టి వేసెను. అందుకు రాముడు కోపించి మంథరను కాలితో నేలబడతన్నెను. ఆ క్రోధమును మనస్సులో వుంచుకొని రామునికి రాజ్యము కట్టనేయకుండా చేసెను.

కాని తను దాదిగా ఉండి భరతున్ని పెంచి పెద్ద చేసి నందుకు భరతున్ని రాజుని చేయలేకపోయింది. పుట్టుక చేత గూను కలది, వికార రూపము కలది. అయిన ఆమె తన ప్రవర్తన చేత కూడా గూనిది, కురూపియైనది.

వాల్మీకి రామాయణములో ఆమెకు ఒక ముగింపు లేదు. కాని జానపద రామాయణమున కుశలవ కుచ్చల కథలో ఆమె అంతమును చెప్పియున్నారు.

అశ్వమేధ యాగము జరుగునప్పుడు తన అశ్వాన్ని కట్టివేసినందుకు శత్రుఘ్నుడ అవున్ని అయోధ్యకు తీసుకొని వస్తాడు. అప్పుడు కుశుడు అతన్ని వెదకి కొనుచు అయోధ్యకు వచ్చి రాముని అంతఃపురము ఎక్కడని వెదుకుచుండగా అచ్చటి వారు...

అల్లదుగో జూడు మీ బాలుండు
యభిషేకపు జలములు నిలిపేరు
యదుగొ మంథర బిందెలు ముంచెను
వేగంబుగనూ వెళ్ళర తండ్రి!

- స్త్రీ.రా.పా. పుట - 307.

ఆమెతో వెళ్ళిన నీవు అంతఃపురము చేరగలవని అంటారు. అప్పుడు కుశుడు ఆమె దగ్గరకి వెళ్ళి బిందె ఎత్తినట్లు ఎత్తి బిందెలో వుంగరము వేస్తాడు. దాంతో ఆ బిందెను తీసుకెళ్ళి బలి కాబోయే లవునిపై ఆ నీళ్ళు పోయెగా ఆ వుంగరము లవుని మీద పడగా కళ్ళు తెరచి నాలుగు దిక్కులు కలియ చూడగా ఎదరుగా మంథర వుండెను.

ఆమె గురించి విన్నవాడే కాని ఎన్నడు చూడలదు. ఆమె మంథర అని తెలియక పోవడంతో ఆమె లవుని కళ్ళకు రాక్షసిలా కనిపించింది. దాంతో ఆమెను చంపివేస్తాడు.

**ముగింపు :**

తండ్రియైన రాముడు బాల్యమున మంథరను పడతన్నినాడు. కొడుకైన లవుడు బాల్యమున మంథరని చావతన్నినాడు. తండ్రి తావు నుండి బ్రతికి బయటపడి ఆమె రామాయణ కథనంతను తన తల మీదుగా నడిపి నది. కొడుకు వల్ల ఆమె కథావశేషురాయినది.

**ఆధార గ్రంథాలు :**



| గ్రంథములు | గ్రంథ రచయితలు |
|---|---|
| 1. జానపద విజ్ఞానాధ్యాయనం | డా॥ జి.యస్. మోహన్. |
| 2. జానపద సాహిత్యము - వీరగాథలు | డా॥ తంగిరాల వెంకటసుబ్బారావు |
| 3. జానపద సాహిత్యము | డా॥ ఆర్వీయస్ సుందరం |
| 4. స్త్రీల రామాయణపు పాటలు | కృష్ణశ్రీ |

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# అమెరికా తెలుగు కథలు - కుటుంబ సంబంధాలు

- డా. పలివెల చిరంజీవిరావు, సహాయాచార్యులు, తెలుగు శాఖ, ఐఐఐటి, ఆర్.జి.యు.కె.టి, శ్రీకాకుళం.

కుటుంబం మానవ జీవితంలో అతి ముఖ్యమైనది. మానవుడు కుటుంబ వ్యవస్థనుండే సంఘంలోకి అడుగు పెట్టాడు. ఆటవిక దశనుండి, ఆహారవేటనుండి, సంచార జీవితం నుండి, స్థిరనివాసం ఏర్పరచుకున్న విధానంలో కుటుంబ వ్యవస్థ ప్రారంభమైంది. కుటుంబంతోనే మొట్ట మొదటి అనుబంధం మానవునికి ఏర్పడింది. తల్లి దండ్రుల సంబంధాలు, అక్కచెల్లెలా సంబంధాలు, అన్న దమ్ముల సంబంధాలు, వివాహ సంబంధాలు మొదలైన వన్నీ కుటుంబంతోనే ప్రారంభమైయ్యాయి. అందువల్ల కుటుంబ సభ్యులతో, బంధు మిత్రులతో సంబంధం ఏర్పడి వ్యక్తి జీవితం సమిష్టిగా మారి, సువిశాల మవు తుంది.

పరస్పర ప్రేమానుబంధాలకు కుటుంబ సంబంధాలు ముఖ్యమైనవిగా ఉన్నాయి. ఈ సంబంధాలు ప్రయోజ నాల దృష్ట్యా ఏర్పడ్డవి కావు. వ్యక్తుల ఇష్టాఇష్టాలతో కాకుండా అమ్మ, నాన్న, కొడుకు, కూతురు మొదలైన సంబంధాలతో ఏర్పడ్డాయి. అంతేకాక సామాజిక సంబం ధాలు, కుటుంబ సంబంధాలను ప్రభావితం చేస్తున్నాయి.

కుటుంబ సంబంధాల పరిధిలో వ్యక్తుల రాగ ద్వేషాలు, ఆనందాలు, ఆవేదనలు, శాంతి, అశాంతి మొదలైనవి చాలా వరకు ఉన్నాయి. వ్యక్తుల సంస్కారాన్ని నిర్దేశించడంలో కుటుంబానికి ఉండే పాత్ర ప్రధానమైంది. తల్లిదండ్రులు, తోబుట్టువులు మొదలైన వారి మధ్య ఉండే ప్రేమ, అనురాగాలు, అప్యాయతలు, అను బంధాలు కొనసాగటానికి మూలకారణం వారి మధ్య ఉండే సంబంధాలన్ని కుటుంబ సంబంధాలే. కాని ఈ సంబంధాలు కొన్నిసార్లు అవగాహనలోపం వల్లగాని, ఆర్థిక లోపంవల్ల గాని, అహంకారంవల్లగాని కొంత అలజడులకు గురౌతున్నాయి. బాధ్యతాయుతమైన రచయితలు కుటుంబంలోని వ్యక్తుల మధ్య ఉండే ప్రేమలు, సంఘర్షణలు చిత్రిస్తున్నారు. కుటుంబ వ్యవస్థను కాపాడే క్రమంలో ఎంతటి త్యాగానికైనా పురిగొల్పే కథలుఅమెరికా తెలుగు కథలు. ఇందులో కొన్ని కథలను నేను పరిశీలించి వివరణాత్మంగా తెలుతున్నాను.

### 1. ఉష్ణంఉష్ణేణశీతలం :

కన్న ప్రేమ కూడా కమర్షియల్ అయిపోయిందనే నేపథ్యంతో రాయబడింది "ఉష్ణం ఉష్ణేణ శీతలం". ఈ కథను కొమరవోలు సరోజ 1995 సంవత్సరంలో రాసారు.

"ఉష్ణం ఉష్ణేణ శీతలం" కథలో వస్తువు. అత్తమామల నుంచి కనీసం గుర్తింపు, గౌరవంలేని ఓ కోడల్ని గురించి తెలుపుతుంది. ఆమె మేనరికపు పెళ్ళి చేసుకుంటుంది. ఆమె, ఆమె భర్త ఇద్దరూ అమెరికాలో ఉద్యోగాలు చేసి సంపాదిస్తారు. కానీ ఆ సంపాదించిన ధనమంతా, ఆమె భర్త తల్లిదండ్రులకు పంపుతూ ఉంటాడు. అత్త ఆమెను రాచి రంపాలు పెట్టినా జోక్యం చేసుకోవడానికి భర్త ఒప్పు కోడు. చివరికి చాకచక్యంతో ఉత్తరం రాసి దాని ద్వారా ఆమె అత్తమామల బారినుంచి ఆమెనీ, తన కుటుంబాన్ని రక్షించుకుంటుంది.

ఇందులో అత్తాకోడళ్ళ వైరుధ్యాలు అనాదిగా వస్తున్న వైనాన్ని, అమెరికా వచ్చిన తర్వాత కూడా యదావిధిగా కొన సాగుతున్న ఆ వైరుధ్యాలను విభాజిత కుటుంబపు తర్కంతో పరిష్కరించారు. తెలుగుదేశంలో మనం దాదాపు యాభై ఏళ్ళుగా చూస్తున్న మార్పే ఇది. విదేశాల్లో ఉం టున్న తమ కుటుంబాన్ని కల్పవృక్షంగా భావించి పీల్చుకు తింటున్న అత్తింటివారికి సరియైన రీతిలో సమాధాన మిచ్చిన కోడలి కథ "ఉష్ణం ఉష్ణేణ శీతలం".

### 2. పుట్టినరోజుకానుక :

కష్టం తెలియని జీవి భోగలాలసత్వం పెంచుకుంటే, మరో వ్యక్తి కష్టం విలువ తెలుసుకొని జీవిస్తూ ఉంటే, తన కొడుకు డబ్బువిలువ తెలుసుకొని, తండ్రి కష్టం

విలువ తెలుసుకొని సంపాదించిన డబ్బు తండ్రికి పుట్టిన రోజు కానుకగా ఇవ్వడం జరిగింది. కూలిపని చేసుకొని బ్రతికేవారి జీవితాలు ఎలావుంటాయో తెలుపుతూ 1995 సంవత్సరంలో మరువాడ రాజేశ్వరరావుగారు "పుట్టినరోజు కానుక" కథని రాశారు.

పోతురాజు సబ్బుపెట్టి ముఖం కడుక్కోవాలనే కోరికతో ఉంటాడు. కాని డబ్బులేదు. అమ్మనడుగుతాడు, కసురు తుంది. తండ్రి కూడా మందలిస్తాడు. ఎలాగైన సబ్బు కొనుక్కోవాలని పనికిపోతాడు. ఆ పనిలో, నీడలో నుంచుని బూతులుతిట్టే పెద్దమనుషుల రాక్షసత్వాన్ని నిశబ్దంగా భరిస్తాడు. ఆ కష్టానికి ఏడణాలు సంపాదిస్తాడు. ఆ రోజు తను పడ్డశ్రమకు ఫలితంగా ఒక సబ్బు మాత్రమే వస్తుందనుకొని, ఆ రోజు రాత్రి పుట్టినరోజు కానుకగా ఏడణాలు తండ్రికి ఇస్తాడు. సబ్బుకోసం ఎంత కష్టపడ్డాడో పాపం అని తండ్రి జాలిపడతాడు. సబ్బుకొనియ్యనా అని వాళ్ళ నాన్న అడిగితే వాట్ని నువ్వుదాచుకో నాన్నామరి అవిపెట్టి నువ్వేదైనా కొనుక్కో నువ్వు రోజూ చాలా కష్టపడతావు, నువ్వెంతో మంచోడివి అంటూ ప్రేమగా తండ్రిని హత్తుకుంటాడు పోతురాజు, తండ్రి మనసంతా వాత్సల్యంతో నిండుతుంది.

పోతురాజు తెచ్చిఇచ్చిన డబ్బుతో తండ్రి ఆనంద పడటం, అంతేకాక తండ్రికి పోతురాజు పుట్టినరోజు కానుకగా ఏడణాలు ఇవ్వడం, తనతండ్రి కష్టం విలువ తెలుసుకొని బాధపడి తండ్రిని మనస్ఫూర్తిగా అర్థం చేసుకొని హత్తుకోవడం ఈ కథలో రచయిత తెలిపారు. ఇందులో కష్టపడే తండ్రివిలువ తెలుసుకుంటే కొడుకులు కూడా ప్రయోజకులవుతారు పైగా తండ్రులు మెచ్చు కుంటారు. ప్రేమగా చూస్తారని రచయిత వివరించారు. పిల్లలు ఈనాటి సమాజంలో తమ తల్లిదండ్రులను చాలా చులకన భావంతో ఎందుకు పనికిరానివారిగా చూస్తు న్నారు, మానవత్వపు విలువలను మరచి క్రూరంగా ప్రవర్తి స్తున్నారు. అలాంటి వారికి ఈ కథ గుణపాఠం లాంటిది.

**3. ఆట :**

వ్యక్తులు ఒకరికొకరు దూరంగా ఉన్నప్పుడు వారి మధ్య ప్రేమానుబంధాలు ఎక్కువగా ఉంటాయని, ఆ వ్యక్తులే దగ్గరయ్యేకొద్దీ ప్రేమానురాగాలు పలచబడిపోతా యనే సత్యాన్ని వెల్లడించిన కథే ఆట. అమెరికాలో ఉంటూ, అప్పుడప్పుడు భారతదేశానికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యులు చూపే తాత్కాలిక ప్రేమానుబంధా లను నిజమేననుకొని భారతదేశంలో స్థిరపడిపోవాలని పట్టుబట్టిన భార్యకు, ఒకే చోటు కొచ్చేటప్పటికి ఆ బంధాలు ఎలా మాయమౌతాయో భార్యకు తెలియ చెప్పడానికి భర్త చేసిన ప్రయత్నం ఈ కథలో కనిపిస్తుంది. అమెరికాలో ఉండే సారథి, లీల దంపతులు అప్పుడప్పుడు ఇండియాకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులు చూపే ప్రేమానుబంధాలు, ఆపాయ్యతలు లీలను కట్టిపడేసేవి. కొంతకాలం అమెరికాలో గడిపిన తర్వాత భారతదేశానికి వెళ్ళి, తమ సొంత మనుష్యుల మధ్య నివసిస్తూ, వారి ఆప్యాయతానురాగాలను ఆస్వాదిస్తూ, శాశ్వతంగా అక్కడే ఉండిపోదామని లీల పట్టుబడుతుంది. దూరంగా ఉన్నప్పుడు ఉండే ప్రేమానురాగాలు దగ్గరైతే ఉండవని తాను ఎన్ని రకాలుగా చెప్పినా లీల వినిపించుకోక పోవడంతో వాస్తవాలను ఆమెకు చూపాలనుకుంటాడు సారథి.

భారతదేశానికి తిరిగొచ్చిన తరువాత సారథి తను ఇండియాలోనే ఉండిపోవాలని నిశ్చయించుకున్నట్లు తన కుటుంబ సభ్యులకు తెలియజేస్తాడు. సారథి తీసుకున్న ఆ నిర్ణయం ఆ కుటుంబంలోని వారెవ్వరికీ నచ్చదు. ఆ మరసటి రోజు నుండి ఆ కుటుంబసభ్యుల వైఖరిలో మార్పు వస్తుంది. ప్రేమను వర్ణించే వారి మాటల స్థానంలో వ్యంగ్యం, సూటిపోటితనం చోటు చేసుకున్నాయి. సారథి అన్న వదినలైన మురళి-జానకిలు, సారథి అక్క తమ్ముళ్ళైన వైదేహి-వేణుల ప్రవర్తనలో కనిపిస్తున్న స్పష్టమైన మార్పును కనుగొనడానికి లీలకు ఎంతో కాలం పట్టలేదు. అను బంధం, ఆప్యాయతలు శూన్యమైన ఇలాంటి కుటుం బంలో ఉండేకంటే దూరమైన అమెరికాలో ఉండటమే మేలని భావించిన లీల అమెరికాలోనే ఉందామని భర్తను కోరడంతో ఈ కథ ముగుస్తుంది. అలాగే ఇండియాలోనే

ఉండిపోదామనే తన నిర్ణయంలో వాస్తవం లేదని సారథి తన కుటుంబసభ్యుల మధ్య వెల్లడించడంతో వారంతా తమ ప్రవర్తనకు సిగ్గుతో తల వంచుకుంటారు.

మన సొంతదేశం, మనసొంత కుటుంబంలోనే మనం పరాయి వాళ్ళలాగా అయిపోతాం ప్రేమలు, గౌరవాలు ఒకేచోట దగ్గరగా వుంటే వుండవని మాటలకు, ఊహలకీ, చేతలకీ చాలా తేడాలుంటాయని, స్వార్థపూరితంగా కుటుంబసభ్యులు వ్యవహారిస్తారని రచయిత ఈ కథ ద్వారా తెలిపారు. అంతేకాక ఇన్నేళ్ళు ఇక్కడ ఈ పద్ధతులకి అలవాటు పడిన తర్వాత ఎంత మనం పుట్టిపెరిగిన దేశ మైన అక్కడి విధానాలకి అలవాటు అవడం ఎంత కష్టమో పైగా మన మాతృదేశంలోనే మనం “out of place” లాగా ఎలా ఫీల్ అవుతామో కూడా రచయిత తెలిపారు.

అమెరికాలోని భారతీయ కుటుంబాల వారు పిల్లలకు తమ సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను తెలియజెప్పి తదనుగుణంగా వారిని తీర్చిదిద్దుకోవాలే తప్ప. అక్కడి పరిస్థితులకు భయపడి, భారతదేశానికి వచ్చినంత మాత్రాన వచ్చే సమస్యలు రాక మానవని కూడా ఈ కథ తెలుపుతుంది.

## 4. బొచ్చుకుక్క :

అమెరికాకు వెళ్ళిన తెలుగువారు, ఆంధ్ర తెలుగు వారిని తక్కువగా చూసే మనస్తత్వం గలవారుగా భావించి మాచిరాజు సావిత్రి రాసిన కథ ఇది. వీరిగాడు వాళ్ళ అమ్మ ఊరులో పేడ తీసుకుంటుంటే, వాళ్ళు ఆ పేడతో చేసిన పిడకలు అమ్ముకుంటుంటే, వాళ్ళ అమ్మకు వీరి గాడు సహాయం చేసేవాడు. అది చూసి ప్రకాశం అమ్మ బాగా చదువుకుంటే నీకు ఆ పరిస్థితి రాదని చెప్పేది. ప్రకాశం వీరిగాడిని, పేడను చూసి అసహ్యించుకునేవాడు. ప్రకాశం అమెరికాలో ఒక రోజు కుక్కని పార్కుకు తీసుకెళ తాడు. ఆ కుక్క ఆనందంతో గంతులేసి పార్కాంత కలియ తిరిగి దాని మలాన్ని చెట్టుపక్కన వేస్తుంది. ఆ పార్కులో ఉన్న ఒకవ్యక్తి వచ్చి ప్రకాశంతో ఆ బొచ్చుకుక్క మలాన్ని తీయిస్తాడు.ఇండియాలో ఉన్న వీరిగాడు పేడ తీస్తున్నా డని అసహ్యించుకొన్న ప్రకాశం అతనిని చూసి చిరాకు పడతాడు. బాగా చదివి అమెరికా వెళ్ళిన ప్రకాశం ఒకరోజు బొచ్చుకుక్క మలాన్ని తీయవలసి వస్తుంది.

అహంకారికి అవమానం తప్పదు అనే నీతిని బోధించే కథ బొచ్చుకుక్క. ఈ కథలో ప్రకాశం అమెరికాకి వెళ్ళి అంచెలంచెలుగా ఎదుగుతాడు. ఇలా అంతస్థు పెరిగిన ప్రతిసారి ప్రకాశం తన స్థాయిని స్వదేశంలోని తన మిత్రుడు వీరయ్యతో పోల్చుకొని మురిసిపోతుంటాడు. అలాంటి అహంకారి ప్రకాశానికి అమెరికాలో తన కుక్క చేసినపని వల్ల ఎంతటి ఘోర అవమానం జరిగిందో ఈ కథ తెలియజేస్తుంది. అమెరికాలో పార్కులు ఎంత చక్కగా, శుభ్రంగా ఉంటాయో ఈ కథ తెలుపుతుంది. చిన్నతనంలో పెద్దలు చెప్పే మాటలు పిల్లల మనస్సులపై ఎంతటి ప్రభావాన్ని చూపుతాయో ఈ కథ వల్ల తెలు స్తుంది.

## 5. లోకరీతి :

మితిమీరినస్వేచ్ఛఅమ్మాయిలకుఇస్తేదానివల్ల చెడి పోవడం తప్ప వేరే ఏమి ఉండదు. భయభక్తులతో పెరిగినవారికి, ఇష్టారాజ్యంగా పెంచినవారికి తేడా ఉం టుందని విలువ పతనం తప్పక జరుగుతుందని వివరిస్తూ అపర్ణ మునుకుట్ల రాసిన కథ ఇది.

మాలిని అమెరికాలో చదువుకోసం వెళ్ళి అక్కడే దగ్గరలో ఉన్న మామయ్యగారి ఇంటికి క్రిస్‌మస్ సెలవు లకు వెలుతుంది. తన మామయ్యకి తన ఈడు కొడుకు మిత్ర తనకంటే చిన్నదైన స్నేహ ఉన్నారు. మాలిని ఆ ఇంటిలో పరిస్థితులకు అనుగుణంగా మసలుకోవాలను కుంటుంది. స్నేహ మాత్రం కొంచెం చులకనగా మాలినిని చూస్తుంది. మాలినిని, స్నేహ పట్టించుకోకుండా, తన స్నేహితుడితో మాటలు సాగిస్తుంది, అది కాస్త ముద్దుల వరకు రావడం గమనించి అత్తకు చెప్పాలనుకుంటుంది. అది తెలిసిన అత్త మాలినితో వాళ్ళిద్దరు స్నేహితులు తను “Boy Friend” జెక్ అని చెబుతుంది. ఇలా కొంత కాలానికి అతన్ని వదిలేసి మరొకరితో స్నేహం చేస్తుంది. మాలిని యం.ఎస్ చేసి ఉద్యోగం చేయడంతో, మాలిని అత్త ఈర్ష్యపడి సూటిపోటి మాటలు మాట్లాడుతుంది.

అత్తను స్నేహ గురించి అడిగితే ఇప్పుడు స్టీవ్ అనే కుర్రాడితో స్నేహం చేస్తుందని చెప్తుంది. పైగా అత్త ఇక్కడ తీరు అంతే అంటూ సమాధానం చెప్తుంది. ఆ తర్వాత మాలినికి మధ్యలో తన తండ్రి స్నేహితుడు కలుస్తాడు. వాళ్ళ ఇంటికి తీసుకువెళ్ళి తన భార్యసుందరిని పరిచయం చేస్తాడు. వాళ్ళఅందరిలోనే మాలిని పెళ్లి ప్రస్తావన కూడా అక్కడ వస్తుంది. కాని ఆమె ఏమి పట్టించుకోకుండా వచ్చేస్తుంది. మాలిని అత్త స్నేహాకి "Engagement" అంటూ చెబితే స్టీవ్ తోనేనా అని అడిగితే కాదు మార్టిన్ యం. ఎస్ చేసి ఉద్యోగం చేస్తున్నాడు. తనను ఇష్టపడ్డాడట ఎగిరిగంతేసి వొప్పేసుకొంది కాదనలేకపోయాను అంటుంది. మాలినికి విస్తుపోవడం తనవంతౌతుంది.

మాలిని జీవితం సుభాష్‌తో ముడిపడి నాన్న స్నేహితుడు చూసిన సంబంధం చేసుకొని సుఖంగా జీవిస్తుంది. స్నేహమాత్రం, మార్టిన్‌తో విడిపోయి తను విడిగా బతుకుతుంది. కూతురుచేసిన పనికి సిగ్గుపడి మాలిని అత్త, మాలినికి ఫోన్ చేసి తన బాధను చెప్పుకుంటూ విచారిస్తుంది.

అమెరికా నాగరికతకు, భారతీయ నాగరికతకు మధ్య వ్యత్యాసం ఈ కథలో బాగా తెలియజేసారు రచయిత.

## 6. ఎక్కడనుంచి....? :

చిన్ననాటి స్నేహితుడైన విస్సుని చాలా ఏళ్ళ తర్వాత చికాగోలోని ఆరోరాలో నిర్మించిన బాలాజి గుడిలో తన మిత్రుడ్ని కలుసుకున్నాడు. తన టీనేజి కొడుకు చంటి నాస్తికవాదం గురించి చెప్పుకుని బాధపడ్డ విస్సుకి తమ టీనేజి గురించి గుర్తుచేస్తాడు. కానీ విస్సుకది రుచించలేదు. తర్వాత ఆయన తన కొలిగ్ లిండాకు మిత్రుడైన సిండిని కలుసుకొని వైద్యానికి లొంగని జబ్బుతో చివరి దశలో ఉన్న రోగులకు మానవతా దృక్పథంతో మనోల్లాసం కలిగించే సేవా సంస్థ హాస్పస్ గురించి తెలుసుకున్నాడు. ఆ సంస్థ వాలంటీర్లలో "ఆడి" అనే టీనేజర్ పేషెంట్లపట్ల చూపుతున్న అంకితభావం గురించి విని చూడబోతే అతడు విస్సు కొడుకు చంటి, ఇప్పుడు తాను చూస్తున్న ఆదిత్య ఒక్కరేనని తెలుసుకున్న రచయిత ఆశ్చర్యపోవడంతో కథ ముగుస్తుంది. ఈ కథలో మానవ సేవయే మాధవసేవన్న ప్రబోధాన్ని అంతర్లీనం చేసిన విధానం అభినందనీయం. దేనికి పనికిరాడనుకున్న వ్యక్తి అభివృద్ధి చెందడంతో ఆశ్చర్యపోయిన తన స్నేహితుని కుమారుని కథ ఇది.

అంతేకాక అమెరికాలోని హిందు దేవాలయాల వాతావరణాన్ని గూర్చి ఈ కథ సందర్భానుసారంగా వివరించింది. భారతదేశంలోని తల్లిదండ్రులు తమ వృద్ధాప్యంలో అమెరికాలో నున్న పిల్లలు ఇండియాకు రావాలని, వారితో గడపాలని కోరుకోవడం ఎంతవరకు సమంజసం అనే దాని మీద ఈ కథలో చక్కని చర్చ జరిగింది.

## ముగింపు :

అమెరికా తెలుగు కథలు ఎక్కువగా కుటుంబ వ్యవహారాలను, స్వదేశంలోని బంధు ప్రేమలను, వారు ఎదుర్కొనే సాధారణ సమస్యలను వివరిస్తున్నాయి. అమెరికా నాగరికతకు, భారతీయ నాగరికతకు మధ్య గల వ్యత్యాసాలను తెలిపాయి. పిల్లలను భయభక్తులతో పెంచిన తల్లిదండ్రులకు, ఇష్టారాజ్యంగా పెంచిన తల్లిదండ్రులకు తేడా ఉంటుందని,అందువల్ల విలువ పతనం తప్పక జరుగుతుందని వివరిస్తూరాశారు. అత్తాకోడళ్ళ వైరుధ్యాలు అనాదిగా వస్తున్న వైనాన్ని, అమెరికా వచ్చిన తర్వాత కూడా యదావిధిగా కొనసాగుతున్న ఆ వైరుధ్యాలను విభాజిత కుటుంబపు తర్కంతో పరిష్కరించారు. చిన్నతనంలో పెద్దలు చెప్పే మాటలు పిల్లల మనస్సులపై ఎంతటి ప్రభావాన్ని చూపుతాయో అమెరికా తెలుగు కథ రచయితలు తెలిపారు. మన సొంత దేశంలోనే, మనసొంత కుటుంబంలోనే మనం పరాయి వాళ్ళలాగా అయిపోతున్నాం, ప్రేమలు, గౌరవాలు ఒకే చోట దగ్గరగా వుంటే వుండటంలేదు. మాటలకు, ఊహలకీ, చేతలకీ చాలా తేడాలుంటున్నాయి. అంతేకాక స్వార్థ పూరితంగా కుటుంబసభ్యులు వ్యవహరిస్తారని ఈ కథల్లో తెలియజేస్తున్నాయి. కష్టపడుతున్న తండ్రివిలువ తెలుసుకుంటే, వారి కొడుకులు కూడా ప్రయోజకులవుతారని

తెలుపుతూనే అలా పెరిగిన పిల్లలనుతల్లితండ్రులు మెచ్చు కుంటారని అమెరికా తెలుగు రచయితల కథల ద్వారా తెలియజేశారు. అమెరికా తెలుగు కథలు రాస్తూ ముందుకు సాగుతున్న అమెరికా తెలుగు రచయితలు చాలా మంది ఉన్నారు. ఆ మహానుభావులు సహృదయతతో కథలు మరింత బాగా ఆవిష్కరించగలిగితే, మరి కొంత ప్రవాసాంధ్రులకు స్ఫూర్తినిచ్చిన వారవుతారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. అమెరికా తెలుగు కథలు - మొదటి సంకలనం
2. అమెరికా తెలుగు కథలు - రెండవ సంకలనం
3. అమెరికాతెలుగుకథలు - మూడవ సంకలనం
4. అమెరికా తెలుగు కథలు - నాల్గవ సంకలనం
5. అమెరికా తెలుగు కథలు - ఐదవ సంకలనం
6. అమెరికా తెలుగు కథలు - పదవ సంకలనం
7. అమెరికా తెలుగు కథలు - పదకొండవ సంకలనం
8. అమెరికా తెలుగు కథా సాహిత్యం - ఒక సమగ్ర పరిశీలన
9. అమెరికా తెలుగు కథలు - సామాజిక విశ్లేషణ

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగు సాహిత్యం - గిరిజన స్త్రీ

**-డా.జరుపుల రమేష్,** తెలుగు శాఖాధిపతి, ఎస్.ఆర్. & బి.జి.యన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), ఖమ్మం.

అస్తిత్వ ఉద్యమ సాహిత్యంలో భాగంగా గిరిజన సాహిత్యం కూడా ముందుకు వచ్చింది. ఈ సాహిత్యాన్ని రెండు రకాలుగా అర్థంచేసుకోవాలి. గిరిజనేతరులు, గిరిజనులు రాసిన సాహిత్యంగా దీన్ని అర్థం చేసుకోవాలి. నిజానికి నిజమైన అస్తిత్వం ఆ జాతి రచయితలే జీవితలోతుని విశ్లేషిస్తూ వివిధ ప్రక్రియలు వెలువరించాలి. కాని తెలుగులో ఆ పరిస్థితి కనపడుట లేదు. గిరిజనుల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటం వల్ల గిరిజనులే తమ సాహిత్యాన్ని రాసుకోలేక పోతున్నారు. ఈ స్థితిలో చదువుకుంటున్న తొలితరం గిరిజనులు తమ పరిశోధనలు తమ జాతికి చెందిన సాహిత్యాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలనే వాధనను ఈ పత్రంలో వివరించే ప్రయత్నం చేశాను. గిరిజనేతరులు రాసిన లిఖిత సాహిత్యాన్ని కూడా గమనిస్తునే అది గిరిజనుల సంస్కృతిక చైతన్యానికి సహకరిస్తుందో ఆటకమవుతుందో గుర్తిస్తూ దాన్నిఆవాగహన చేసుకోవాలనే విశ్లేషణ ఈ పత్రంలో కనిపిస్తుంది.దీనిలో భాగంగా ఇప్పటి వరకు వచ్చిన గిరిజన నవల సాహిత్యాన్ని వివరిస్తూ, అందులో స్త్రీ జీవితాన్ని సమీక్షించడం దీనిలో ప్రధానంగా కనిపిస్తుంది.

## పరిచయం :

ప్రపంచమంతా ఒకప్పుడు నీటితో నిండిన మహా సముద్రం. చుట్టునీరుండి మధ్యలో భూమి ఉండేదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. దీనినే పెంజీయా అని అంటారు. ఇప్పుడున్న ఖండాలన్నీ ఒకప్పుడు ఒకేదగ్గరుండి కొన్ని రోజుల తర్వాత చలించడం ప్రారంభించాయి. అలా చలిస్తూనే ఉన్నాయనేది సైన్స్ సిద్ధాంతం. ఆ క్రమంలో తొట్టతొలిగా మానవుడు ఆవిర్భావించలేదు. ప్లాజిలెట్టా అనే జీవి ఆవిర్భావించింది. అలా క్రమ క్రమంగా ఒక్కొక్క జీవి, ఆ తర్వాత సినోజోయిక్ కాలంలో మానవుడు ఆవిర్భావించాడని వివిధ శాస్త్రజ్ఞులు పరిశోధనలు తెలుపుతున్నాయి. ప్రకృతిలో ప్రతి జీవిరాశి తోడును కోరుకుంటుంది. తోడు లేకపోతే ఆ జీవి బతకడం చాలా కష్టం. అందుకే కాబోలు సృష్టిధర్మంగా ఆడమగ అనే రెండు వర్గాలు సృష్టించబడ్డాయి.''కానీ పుట్టుకతో వచ్చిన ఈ ఆకారాలకి మనలో ఏర్పడిన అర్థాలు సమాజం ఇస్తుందని, ఆ అర్థాలవల్లే ఆడతనం,మగతనం ఏర్పడతాయని మనం గుర్తించవలసిన అవసరంఉంద''ని (జయప్రభ. భావ కవిత్వంలో స్త్రీ.1988. పుట : 01) జయప్రభ అన్నారు.

సాహిత్యమంటేనే ధర్మాన్ని చూపించడం, దౌష్ట్యన్ని వ్యతిరేకించడం. అందుకే సాహిత్యం సమాజంలో ఉండే మంచి చెడులకు విలువకడుతు, వాటికి పరిష్కార మార్గాలను చూపిస్తుంది. నేటికి ప్రపంచమంతా సాహిత్యంపై, సాహిత్య సిద్ధాంతాల పై సమీక్షించుకుంటూ ముందుకు నడుస్తుంది. అదే ఏ రూపంలోనైనా కావచ్చు. అందుకే సామాజంలో భాగంగా ఉన్న వ్యవస్థచేసే పనుల వల్ల వివిధ ఉద్యమాలు తలేత్తుకురావడమనేది సహజం. సాహిత్యంలో కూడా అలాంటి ధోరణిలతో అనేక ఉద్యమాలు రావడం జరిగింది.

తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ఉద్యమం ఇరవై శతాబ్దంలో వచ్చింది. అప్పటి నుండి స్త్రీవాదానికి బీజాలు పడ్డాయి? అంటే అంతకుముందు నుండే ఉందని చెప్పవచ్చు. తెలుగులో ఈ వాదం ప్రశ్చాత్య ప్రభావంతో వచ్చిందన్నది నిర్వివాదం.తెలుగులో నన్నయ నుండి మొదలుపెడితే నేటి వరకు స్త్రీల చిత్రణ ఏదో ఒక రకంగా చిత్రింపబడుతునే ఉంది. సాహిత్యం కంటే ముందు ఉన్న పురాణాలు,వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు మొదలైన అన్ని ప్రక్రియల్లో స్త్రీకి సముచితమైన స్థానాన్ని ఇచ్చాయి. కొన్ని సందర్భాల్లో స్త్రీ విస్మయానికి గురైంది. కాలక్రమంలో స్త్రీకి స్థానం తగ్గుతూ వచ్చింది.

సాహిత్యంలో గిరిజన స్త్రీల ప్రస్తవన ప్రాచీనకాలం నుండి చూస్తే, భారతంలో 'హిడింబి' పాత్ర, రామాయణంలో 'శబరి' మొదలైన గిరిజన స్త్రీల పాత్రలు కనిపిస్తుంటాయి. అంతేకాకుండా ఇంకా చిత్రింపబడిన పాత్రలేన్నో ఉన్నాయి. మధ్యయుగ దేశంలో గిరిజన స్త్రీలు రాజ్యాన్ని నడిపిన దాకాలు ఉన్నాయి. అలాంటి గిరిజన స్త్రీలు ఆధునిక కాలంలో వచ్చేసరికి ఎటువంటి చట్రంలో మునిగిపోయారని పరిశీలిస్తే కొన్ని వాస్తవాలు తెలిసి వస్తున్నాయి.

ఆధునిక కాలంలో భాగమైనా నవల సాహిత్యంలో స్త్రీ చిత్రణకు బలమైనా పునాది ఉంది. పాశ్చాత్య ప్రభావంతో వచ్చిన నవల సాహిత్యంలో గిరిజన నవలలు చాలా తక్కువ. అందులో గిరిజనులు రాసినా నవలలు ఇప్పటి వరకు రాలేదు అన్నది స్పష్టం. రాసినా రచయితులందరు గిరిజనేతరులు. అలాంటి క్రమంలో వచ్చిన కొన్ని నవలలు గిరిజన స్త్రీల జీవిన విధానాన్ని చిత్రిస్తూ వెలువడ్డాయి. అందులో 'సాధన' రాసిన 'రాగో' నవలను పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశం.

## గిరిజన సాహిత్యం - నవల :

తెలుగు సాహిత్యంలో నవల ప్రక్రియ అనేది 1872 సంవత్సరం నుండి ప్రారంభమైంది. మొట్టమొదటి నవలగా భావించుకుంటున్న నరహరి గోపాలకృష్ణమ్మ సెట్టి రాసిన 'శ్రీరంగరాజు చరిత్ర' నవలతోనే గిరిజన స్త్రీ చిత్రణ ప్రారంభమైంది. ఈ నవలలో సోనాబాయి లంబాడీ కన్యాని, అంతఅందమైనా స్త్రీ ఈ కులంలో పుట్టడమంటే నమ్మశక్యంగా లేదని, లంబాడీల ఆచారాలు, వేషదారాలు సోనాబాయి పాత్ర ద్వారా చిత్రించారు. కానీ నవల చివరికి వచ్చేసరికి ఆమె రాజకన్యని తెలుస్తోంది. ఆ తరువాత వచ్చిన 'కొమురం భీము' అడవి' ఊరు 'సరిహద్దు' మొదలైన నవలల్లో స్త్రీ గురించినా, స్త్రీ జీవితం ప్రస్తవన దొరకదు. పులుగు శ్రీనివాస్ 'అడవి తల్లి' అరుణ 'ఎల్లి' సాధన 'రాగో' అట్టాడ అప్పల్నాయుడు 'పునరావాసం' నవలల్లో గిరిజన స్త్రీ గురించినా చిత్రణ కనిపిస్తుంది. ఇందులో అరుణ రాసిన ఎల్లి నవల ఎరుకుల కులంలో పాటించబడుతున్న బాల్యవివాహాలను, ఆ వ్యవస్థలో ఉండే దుర్భర కోణాన్ని ఈ నవల ద్వారా అందిచింది. అట్టాడ అప్పల్నాయుడు పునరావాసంలో గిరిజనులు వెనకబడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానంగా ఆర్థిక విధానం మొదటిదైతే, నిరక్షరాస్యత రెండవది అని చెప్పవచ్చు. అలాంటి పరిస్థితులో గిరిజన స్త్రీ చదువుకుంటే చివరికి ఎదురైయే పరిస్థితిని, గిరిజన స్త్రీలను మానసికంగా అధికారులు పెట్టే బాధలను ఈ నవల కూలంకషంగా తెలిపింది. పులుగు శ్రీనివాస్ రాసిన అడవి తల్లి నవలలో గిరిజన స్త్రీ యొక్క ఆకలికేకల ఆర్థ్రత కనిపిస్తుంది.నైజాం నవాబులతో పోరాడిన కొమురం భీము సతిమణి మరణానికి కారణం ఏమిటి? అక్కడ గిరిజన జీవితాలు ఏ విధంగా ఉన్నయో చూడాలనే లక్ష్యంతో రచయితే ప్రధాన పాత్రగా ఈ నవలలో కనిపిస్తాడు. ఇలా ఇప్పటివరకు వచ్చినా గిరిజన నవలల్లో స్త్రీని చిత్రించినా నవలలు కొన్ని మాత్రమే. సాధన రాసిన 'రాగో' నవలలు పరిశీలిస్తే గోండు స్త్రీ వాస్తవిక జీవితం ఏమిటన్నది అర్థమవుతుంది. అందువల్ల ఈ నవలను ప్రత్యేకంగా పరిశీలించడం జరిగింది.

## రాగో నవల - ఇతివృత్తం :

నవల రచయిత సాధన. గోండుల సంస్కృతి సంప్రదాయలలో గిరిజన స్త్రీపడే అవస్థలు,ఉద్యమ పోరాటంలో గిరిజనుల బతుకు చిత్రణ చిత్రించిది ఈ నవల. రాగో యుక్త వయస్కురాలైన (మాడియా) గోండు యువతి. రాగో తల్లిదండ్రులు తన మేనమామ కొడుకు 'సంఘె'తో పెళ్ళికి ఒప్పుకుంటారు. కాని రాగోకి ఆ పెండ్లి అంటే ఇష్టం లేదు. అదే ఊరిలో 'నాన్సు' అనే వ్యక్తిని ప్రేమిస్తుంటుంది. నాన్సుకి అప్పటికే పెండ్లి అవుతుంది. కాని పిల్లలు పుట్టరు. అందువల్ల రాగోను మరో పెండ్లి చేసుకోవాలనుకుంటాడు. తన మేనమామ కొడుకుతో నిర్ణయించిన పెండ్లి ముహూర్తం రోజు వస్తుంది. అదే రోజు రాగో నాన్సు ఇల్లు చేరుతుంది. దానితో రాగోను చుట్టు ప్రక్కల, పొలం కాడా మొదలైన ప్రాంతాల్లో వెతుకుతుంటారు. అయినా ఎక్కడ కనిపించదు. చివరికి రాగో తండ్రి దల్సు 'గూడెంలో చూద్దాం లేవండి' అంటాడు. దానితో గుడెం పెద్దలు

అందరు సరేనని ఇండ్లు వెతకడం ప్రారంభిస్తారు. నాన్సు ఇల్లును చూడకుండా తప్పించాలని రాగో వాళ్ల బాబాయి ప్రయత్నిస్తాడు. ఎందుకంటే రాగో నాన్సును ప్రేమిస్తున్నది, ఇప్పుడు నాన్సు ఇంట్లో ఉన్న విషయం అతడికి మాత్రమే తెలుసు. తనది కూడా ప్రేమ వివాహమే. చివరికి నాన్సు ఇంట్లో దొరుకుతుంది. తండ్రి రాగోను కూతురు అనే భావన మరిచిపోయి విపరితంగా కొడతాడు. మళ్ళీ పెండ్లి ఏర్పాటులో ఉంటారు. మళ్ళీ ఎలా తప్పించుకోవాలని రాగో ఆలోచిస్తుంటుంది. అమ్మకు ఏదో చెప్పి పారి పోతుంది.

బయటికి వెళ్ళిన కూతురు మళ్ళీ వస్తుందనుకున్న తల్లి ఎంతకు రాకపోయేసరికి తల్లడిల్లపోతుంది. మళ్ళీ వెతుకుతారు. కాని రాగో ఈ సారి గూడెం వదలి పారి పోతుంది. రోడ్డు మీదనుంచి లారీలు, మోటర్ సైకిళ్ళు మొదలైనవి పోతుంటాయి. అవి ఎక్కుదామంటే తన చిన్నప్పుడు జరిగిన సంఘటనలు గుర్తుకువస్తాయి. దసరా పండుగ నాడు గోండులు ఊరు ఊరంతా మహారాజ్ గడికి వెళ్ళి రెండు మూడు రోజులు ఉండివస్తుంటారు. పండుగ ఉత్సావాల్లో పాల్గొంటారు. ఆ ఉత్సావాల్లో పట్వారీలు, జగిర్దార్లు తాగినమైకంలో అందమైన గోండు స్త్రీలను పాడుచేయడం జరుగుతుంటుంది. అవి అన్ని రాగో చూస్తుంది. అందువల్ల లారీ డ్రైవర్లను, క్లీనర్లను కూడా ఇటువంటి ఆలోచనలు కల్గినవారేనని అనుకుం టుంది.

అలా వెళ్ళుతుంటే చిన్ననాటి స్నేహితురాలు 'మైని' గుర్తుకు వస్తుంది. దారిలోనే మైని వాళ్ళ ఇల్లుంటుంది. కలిసిపోదామని అనుకుని వెళ్ళుతుంది. కాని రకరకాలైన ప్రశ్నలు, అనుమాలతో మైని వాళ్ళింట్లో అడుగు పెడుతుంది. రాగోని చూడగానే మైని అమాంతంగా మీద పడుతుంది. ఇద్దరు కొంతసేపు పూర్వ జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటారు. అలా కొన్ని రోజులు రాగో మైని దగ్గర ఉంటుంది. రోజులు గడిచిపోతుంటాయి. రాగో మనసు ఓ పట్టాన నిలవడం లేదు. ఎక్కడికి వెళ్ళిన ఒకపూట, అరపూట వుండాల్సి వస్తుంది. అక్కడి వారంత విషయం తెలుసుకొని 'కేర్ధి' (భర్తను వదలి మరో సంబంధం వెతుక్కునే ఆడది) అంటూ అదోరకంగా చూస్తుంటారు. కేర్ధే ముద్ర క్రమంగా పెరిగిపోతుంటే రాగో భరించలేక అక్కడ నుండి అడవుల్లోకి వెళ్ళిపోతుంది. అలా అడవుల్లో తిరుగుతున్నప్పుడు ఒకరోజు బాగా ఆకలై ఎదురుగా కనబడ్డ పోలంలోకి వెళ్తోంది. బోర్లేసి ఉన్న వెదరు గంప గంజులో నుండి నాలుగు ముద్దలు నోట్లో వేసుకుం టుంది. ఇంతలో బయట నుండి ఎవరో వస్తున్న శబ్దం వినబడుతోంది. నిమిషంలో అక్కడి నుండి బయటపడి అడవిల్లోకి పారిపోతుంది. ఆ వచ్చినవారిని రాగో చూడ లేదు. కాని వచ్చిన వారు రాగో మేనమామ కొడుకు. పెండ్లి కొడుకు రాగోని చూస్తాడు. వెంటనే ఇంటికి కబురు పంపిస్తాడు. రెండు గ్రూపులుగా విడవబడి వెతకు తుంటారు. రాగోకి వాగుని చూడగానే స్నానం గుర్తుకు వస్తుంది. అప్పటికే నెలసరి అయి నాలుగు రోజులవు తుంటుంది. రాగో స్నానం చేస్తుంటే 'సంఘె' వచ్చి పట్టు కుంటాడు. ఈ సారి పెండ్లి మేనమామ ఇంటి దగ్గర జరపలనుకుంటారు. కాని రాగో మాత్రం ఈ పెండ్లి నాకు ఇష్టం లేదని అంటుంది. పెండ్లి కొడుకు మాత్రం రాగో నా భార్య కాబోతుందని సంతోషంగా ఉంటాడు. రాగో మాత్రం అవేమి పట్టనంటు ఉంటుంది. తెలివిగా రాగో అక్కడ నుండి తప్పించుకొని మళ్ళీ అడవుల్లోకి పారి పోతుంది.

అడవిలో నడిచే ఓపికలేక ఓ చెట్టు కింద రాగో నిద్రపోతుంటుంది. హఠాత్తుగా ఓ పెద్ద బడ్డరాయి మీద పడ్డట్టు శబ్దం వినిపించే సరికి మెళుకువ వస్తుంది. చూస్తే కొంతమంది తన ముందు నుండి పరుగెత్తుకుంటూ పోతుంటారు. రాగో కూడా తనకు తెలియకుండానే వాళ్ళ వెంటపోతుంది. వెనుక మాత్రం పోలీసుల అరుపులు వినబడుతునే ఉంటాయి. తెల్లరేసరికీ ఒకరి ముఖం ఒకరు చూసుకుంటారు. కొత్త ముఖం కనబడగానే వెనకవచ్చే స్త్రీలు గతుక్కుమంటారు. రాగో కూడా వారిని భయంగానే చూస్తోంది. అంత కొత్తే అయినా మాడియా అక్కలే గదా అనే ధైర్యం మనసులో ఉంటుంది. దాదా

(పెద్ద) రాగోను ఎవరు నువ్వని అడుగుతాడు. రాగో ఏమి మట్లాడదు. ఆ గుంపులో నుండే 'కేర్దే బహ' అంటారెవరో. అందరు నవ్వుకుంటారు. పరిస్థితి అర్థం చేసుకున్న దాదా నడవండని చెప్పగానే అందరు ముందుకు నడుస్తారు. రాగో కూడా వాళ్ళతో వెళ్తోంది. ఆ నడకలో ఒక స్త్రీ రాగో దగ్గరికి వచ్చి అడుగుతుంది. రాగో జరిగిన విషయానంతా చెప్పేస్తుంది.అక్కడున్న వారందరి చేతిలో ఏదో రకమైన ఆయుదం ఉంటుంది. రాగోకి ఏమి అర్థమవదు. తెలుసు కోవాలనే ఆశతో ప్రక్కనున్న 'రూపి'ని అడిగి తెలుసు కుంటుంది. పోలీసుల నిర్భందం ఎక్కువైతుందని, జైల్లో పడ్డ దాదాలను విడిపించుకోవాలని, అందరు కలిసి జిల్లా బంద్ చేయాలని అనుకుంటారు.

కొంతసేపటికి ఎవరిదారినే వారు వెళ్ళిపోతారు. రూపి మాత్రం రాగోను తోడుగా తమ ఇంటికి తీసుకెళ్తుంది. రాగో కొన్ని రోజుల పాటు రూపి ఇంట్లో ఉంటుంది. రూపితో ఉండడం వల్ల రాగోకి జీవితం పై బతకాలనే ఆశ కల్గుతోంది. అప్పుడప్పుడు ఊళ్ళో సిర్కాల్ దాదాలు వస్తుంటారు. రాగో రూపి సహయంతో వాళ్ళను కలుసు కుంటుంది. వారం రోజుల పాటు రాగో వాళ్ళతోనే ఉం టుంది. ఊరురు తిరిగి పాటలు పాడుకుంటూ, పోస్టర్లు వేస్తారు. దానితో రాగోలో చైతన్యం వస్తోంది.

రాగో రూపి ఇంటికి వచ్చి రెండునెలలవుతోంది. ఆ గూడెంలో ఎవరి నోట విన్న 'అన్నలు' 'దాదాలు' అనే పేర్లు వినబడుతుంటాయి. అందువల్ల రాగో వాళ్ళను చూడాలనుకుంటుంది. ఒకరోజు గూడెంలోకి దళం వస్తుంది. రూపి సహయంతో రాగోకి దళం పరిచయం అవుతోంది. అలా కొన్ని రోజుల తరువాత రాగో కూడా దళంతో పాటు వెళ్ళడానికి సిద్దమవుతుంది. రాగోకి ఎవరు లేకపోవడం వల్ల దళంలోకి తీసుకుంటారు. నాలుగు రోజుల తర్వాత దళకమాండర్ 'రుషి' ఎలా వుంది అయిదు రోజుల అనుభవం అని అడుగుతాడు. దళంలో ఉం డగలవానని అడుగుతాడు. మరో డిప్యూటీ దళకమాండర్ 'గిరిజ' కూడా అడుగుతుంది. రాగో పర్వలేదని చెప్తోంది. కొన్ని రోజుల తర్వాత రాగోకి డ్రేస్, తుపాకి ఇస్తారు. రాగో పేరును 'జైని'గా మారుస్తారు.

జైని దళంలోని అన్ని విషయాలు తొందర్లోనే నేర్చు కుంటుంది. మంచి పేరు సంపాదించుకుంటుంది. గోండు గూడాలకు వెళ్ళి సమస్యల తెలుసుకొని వాటిని ఎలా పరిష్కారించుకొవాలని చెప్తూంటారు. జైని మాత్రం తాను పడ్డ జీవితంలో నుండి సమస్యలను అర్థం చేసు కుంటుంది. ఒకరోజు సెంట్రీ డ్యూటీ చేస్తుండగా చక చక్యంగా శత్రువులను ఎదిరించి విజయం సాధిస్తుంది. ఆ సంఘటనతో మరింత పేరు వస్తుంది.

ఊర్లలో పోలీసుల మోహరింపు ఎక్కువ అవుతుం టుంది. గిరిజన గూడెంలో వివిధ సంఘాలను పెట్టాలను కుంటారు. ముఖ్యంగా మహిళా సంఘాలు. సంఘాలు పెట్టాడానికి మాడియా స్త్రీలు కూడా ఒప్పుకుంటారు. వివిధ సమస్యల గురించి 'జైని' కళ్ళకు కట్టినట్లు చెప్తోంది. అలా చెప్తూంటే అందరు బాల్యం నుండి ఇప్పటి వరకు పడ్డ బాధలు అన్ని గుర్తుకువస్తాయి. వెంటనే 'గిరిజ' లేచి జైని చెప్తోంది నిజమా! కాదా! అని అడుగుతోంది. అక్కడ గిరిజన మహిళలందరు ఇంగో అంటారు. 'ఇంగో'అంటే అవునని అర్థం. అలా కొన్ని రోజుల్లో మాడియా స్త్రీలు సమస్యలు నుండి భయటపడ్తారు.

ఒక రోజు గూడెంకు పాండు అనే వ్యక్తి వచ్చి మన మందరం ఏకం కావాలి. మన సొమ్ములతో షావుకార్లు ఎంతో బాగుపడ్డారని చెప్పి అందరం కలిసి షావుకార్ల పై దాడి చేయాలని చెప్తాడు. అలాగే దాడి చేస్తారు. కావలిసిన వస్తువులు, ధాన్యం తెచ్చుకుంటారు. అందరు కలిసి సమానంగా పంచుకుంటారు. ఆ సందర్భంలో పాండు దల్సుతో రాగో గురించి చెప్తాడు. ఇంకా ఏమైనా చెప్తాడేమో నని రాగో తండ్రి, బాబాయి ఎంతో ఆశతో పాండుకెళ్ళి చూస్తారు. కాని ఏమి చెప్పడు.

దళం కూడా రెండు జట్లుగా విడిపోయి కొన్ని రోజుల తర్వాత కలుసుకోవాలని నిర్ణయించుకుంటుంది. ఒకటి మహిళా దళంగా, మరొకటి పురుషుల దళంగా విడి పోతారు. మహిళా దళంకు 'గిరిజ' కమాండర్గా ఉం టుంది. గ్రామాల్లోకి వెళ్ళి ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ప్రయత్నిస్తారు. ఆ సందర్భంలో 'జైని' సొంత

గ్రామానికి వెళ్తుంది. అందరు సంతోషిస్తారు. సంప్రదాయల ముసుగులో విపరీతంగా నష్టపోతున్నారని, మూఢనమ్మకాలు వదిలివేయాలని ఊరురా చెప్పి మళ్ళీ దళం ఒకచోట కలుసుకుంటుంది.

రెండు జట్లు కలిసిన తర్వాత భవిష్యత్ ప్రణాళికను నిర్ణయిస్తారు. దళంలో వినోద్‌తో పాటు మరో ఇద్దరు పై దళం నుండి వస్తారు. వివిధ అంశాలు మాట్లాకుంటారు. ఆయుదాల కోసం శత్రువుల పై దాడి చేస్తారు. దొరికిన ఆయుదాలు తీసుకొని నినాదాలు ఇస్తూ అడవుల్లోకి వెళ్తారు. రుషి అందర్ని సమావేశ పరిచి మన నాయకుడు మీతో మాట్లాడతాడని చెప్పి రుషి తప్పుకుంటాడు. వినోద్ అందరికి 'లాల్‌సలాం' చెప్పి ప్రారంభిస్తాడు. 'రుషి'కి పై దళానికి కమాండర్‌గా నిర్ణయించడం జరిగింది. కాబట్టి మీలో ఒకర్ని దళ కమాండర్‌గా ఎన్నుకోవాలి. మీరే ఆ పేరు చెప్పండని చెప్తాడు. అందరు 'గాండో' మా దళ కమాండర్ అని చెప్తారు. డిప్యూటీ 'గిరిజక్కా' అని అంటారు. పై దళానికి వినోద్ కమాండర్‌గా, జైని డిప్యూటీగా దళ సభ్యత్వాన్ని ఆమోదించడంతో నవల ముగుస్తుంది.

## రాగో నవల - స్త్రీ :

సమాజంలోనూ, కుటుంబంలోనూ స్త్రీల అణిచివేతను ఖండిస్తూ, స్త్రీలు తమ సెక్స్‌వల్ల తక్కువగా చూడబడటాన్ని నిరసిస్తూ, స్త్రీవిముక్తి కోసం అములు పరచబడుతున్న విధానాన్ని రూపమాపడానికి స్త్రీ, పురుషులు చేసే వినూత్న కార్యక్రమమే స్త్రీవాద. స్త్రీవాదంలో మూడు ప్రధానమైన ధోరణులు కనిపిస్తాయి. అవి లిబరల్ ఫెమినిజమ్, రాడికల్ ఫెమినిజమ్, సోషలిస్టు ఫెమినిజం. ఈ మూడు ప్రధాన దోరణుల్లో స్త్రీవాద సాహిత్యం పరిశీలించబడుతుంది.

రాగో నవలలో ప్రధాన పాత్ర రాగో. రాగో గోండు స్త్రీ. రచయిత ఈ నవలలో రాగో అనే టైటిల్ పేరుతోనే నవల రాయడానికిని, ఇతివృత్తానికి సంబంధం లేకపోలేదు. పరిశోధనాత్మకంగా ఆలోచిస్తే గోండు భాషలో రాగో అంటే రామచిలుక. పంజరంలో చిలుక అని కూడా చెప్పవచ్చు. పంజరంలో ఉన్న రామచిలు స్వేచ్ఛ కోసం ఎప్పుడూ ఎదురుచూస్తూంటుంది. అలాగే ఈ నవలలో రాగో అనే మాడియా స్త్రీ కూడా స్వేచ్ఛకోసం చూసీచూసి చివరికి తానే ధైర్యం తెచ్చుకొని జనజీవన స్రవంతిలోకి వెళ్ళిపోతుంది. అందుకే రచయిత రాగో పాత్రకు రామచిలుకనే అర్థంలో వాడడం ఉన్న విశేషమది.

గిరిజన సమాజంలో స్త్రీకి స్వేచ్ఛ కరువుతుంది. ఎందుకంటే గిరిజనులు ఎక్కువగా మూఢనమ్మకాలకు ఆధారణ ఇవ్వడం వల్ల ఇటువంటి పరిస్థితులకు గురౌతుంటరని చెప్పడంలో ఎటువంటి సందేహంలేదు.అదే విధంగా గిరిజన సమాజంలో స్త్రీకి ఎదురవుతున్న పరిస్థితులను ఒకసారిగా అవలోకనం చేస్తే మొదట ఎదురైయే సంఘటన విద్యలేకపోవడం. గిరిజనులు అడవుల్లోనే జీవించడం వల్ల విద్యకు అంతగా ఆసక్తి చూపరు. చదువుకోవాలనే ఆసకి చూపినా కేవలం పురుషులకు మాత్రమే విద్య అందుబాటులో ఉంటుంది. గిరిజనుల్లో స్త్రీ విద్యను నిరాకరించడంలో కొన్ని కారణాలు కనిపిస్తుంటాయి. వాటిని పరిశీలిస్తే చదువుకుంటే కూలీకి వెళ్ళదేవరని, పైగా స్త్రీలు చేతికింద వుంటే అనేక పనుల్లో సహాయపడ్తారని కుటుంబం భావించుకుంటుంది. మరొక కారణాన్ని పరిశీలిస్తే స్త్రీలు చదువుకుంటే చదువుకున్న వ్యక్తికిచ్చి పెళ్ళి చేయాల్సింటుంది. అంత వరకట్న ఇవ్వలేమని ఉద్దేశంతో స్త్రీలకి మధ్యలోనే చదువునిలిపేస్తారు. అందుకే గిరిజన సమాజంలో వరకట్నానికి ఆశపడో లేదా, ఓలికి ఆశపడో గిరిజన స్త్రీలు బాల్యవివాహానికి గురువుతున్నారు. అందుకే రాగో నవలలో రాగోకి ఇష్టంలేని పెళ్ళి చేయదలిచినదల్సు (రాగో తండ్రి)కి రాగో తగిన బుద్ధి చెప్తోంది.

గిరిజనుల్లో స్త్రీల అభిప్రాయాలకు అంతగా ఆధరణ లభించదని ఈ నవలలో రాగో పాత్ర ద్వారా తెలుస్తోంది. రాగో నవలలో రాగో ఎదుర్కొన్న ఇబ్బందులను ఒక్కొక్కటిగా పరిశీలించినట్లయితే. రాగో నవలకు మూల కారణం మాడియా కులంలో ఆచరిస్తున్న లామడే (ఇల్లరికం). రాగో తండ్రి దల్సు రాగో కోసం సంఘెని లామడేగా పెట్టుకుంటాడు. కానీ అతడంటే రాగోకు

ఇష్టముండదు.ఇంతకు ముందు చెప్పుకున్నట్లు గిరిజన స్త్రీల మాటకు చెల్లుబాటు ఉండదని. పితృసామ్య వ్యవస్థలో స్త్రీ పడే బాధల గురించి ఎన్నో పరిశోధనలు జరిగాయి. గిరిజనుల్లో కూడా పితృసామ్య వ్యవస్థలో స్త్రీలు పడే బాధలకు నిదర్శనంగా రాగో కనిపిస్తుంది.

## స్త్రీ హృదయం :

ఈ నవలల్లో రాగో వేసుకున్న ప్రశ్నలు గిరిజన స్త్రీకే కాకుండా, సమస్త లోక స్త్రీలకందరికి సంబంధించిన సమస్యలుగా పరిగణించాల్సిన అవసరం ఉంది.నాగరికత సమాజంలో ఉండే స్త్రీలకి, గిరిజన సమాజంలో ఉండే స్త్రీలకి మధ్య వారధిగా రాగో చిత్రింపబడింది. అందుకే స్త్రీకి కూడా హృదయం ఉంటుందని గమనించాలనేది రాగో బాధ. నవల ప్రారంభంలో రాగో తనకు ఇష్టంలేని పెళ్ళి ఏలా చేసుకోవాలనే ధోరణిని వ్యక్తం చేస్తుంది. కానీ దానిని గిరిజన సమాజం పట్టించుకోదు. స్త్రీలకు తమ శరీరాల మీద, జీవితాల మీద అధికారం లేకుండా చేసి, ఆ అధికారాన్ని చెలాయించే సంస్థలుగా కుటుంబాన్ని, మతాన్ని, రాజ్యాన్ని రూపొందించిన పితృస్వామిక సామాజిక వ్యవస్థ ఈ నవలలో ఒక దశలో కనిపిస్తుంది. అందుకే రాగోకు ఇష్టలేకున్న చేయాలనుకున్న రాగో తండ్రి పితృసామ్యక అధిపత్యాన్ని ప్రదర్శించాడు. బహుశా గుడిపాటి వెంకటచలం స్త్రీ మనస్సుతో సంబంధం లేకుండా మానవ సమాజం పనులు చేసుకుంటూపోతుందని ఉద్దేశంతో "స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడువుంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభం ఇవ్వాల"ని అంటాడు. ఏ కోణాంలోనైనా ఈది పాటించబడటంలేదు. ఒకవేళ అలా పాటించబడినట్లయితే రాగో పరిస్థితి మరోలాగా ఉండేది. కాబట్టి ఈ సమాజంలో నైనా స్త్రీకి ఒక హృదయం ఉంటుందని ఎప్పుడో చెప్పబడింది. ఈ నవలల్లో ఉన్న రాగోకూడా ఒక హృదయం ఉంటుందని, కేవలం గిరిజన స్త్రీ అయినంతా మాత్రనా ఎటువంటి పరిజ్ఞానం లేకుండా పోదని అంశాన్ని గిరిజన సమాజం కూడా ఆలోచించాలి. తమ పిల్లలే కాదా తామ గుప్పింట్లోనే పెట్టుకునే పాత వ్యవస్థపోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సైమన్ ది బోవియర్ "One is not born, but rather becomes a woman" (simone Beauvoir, second Sex. 1955.page:301) పుట్టుకతోనే ఎవరూ ఆడ వాళ్ళుకారు, పుట్టిన తరువాత ఆడవాళ్ళుగా తయారవుతారని వివరించింది. మాడియా మహిళ తరతరాలుగా అనుభవిస్తున్న ఈ చిత్రహింసలు తెల్లారేదెపుడు అనేది ఆనాటికి రాగోకు అర్థం కాని, పరిష్కారం లేని ప్రశ్నగానే మిగిలిపోయింది. రాగోకు హితోపదేశాలు, ఉచిత సలహాలు ఇచ్చేవారికి ఏం తక్కువ లేదు. ఏ వయసుకు ఆ ముచ్చట ఉండాలని కొందరు మొగం పైనే అంటుంటే, ఎక్కడో దగ్గర జోడైతే సరిపోతుందని మరి కొందరు ఊరికే ఊదరగొడుతున్నారు. పుట్టింటి మర్యాదలు, తల్లి తరుపు సంబంధాలు నిలబెట్టడానికి పుటుల్ వారికే పోతే మంచిదని అంటారు కొందరు సాంప్రదాయక పెద్దలు. వీరెవరికి రాగో మనసు తెలియదు. రాగోకు ఒక మనసుంటుందని సంగతి వారు పట్టించుకోరు.కాబట్టి అటువంటి అంశాలను రచయిత స్త్రీ పాత్ర చేత చెప్పించడం వల్ల వాస్తవ అంశాలు తెలిసివచ్చాయి.

## గిరిజన ఆచారం - స్త్రీ :

గిరిజన ప్రాంతాల్లో ఆచారాల ప్రకారం స్త్రీలకు కొన్ని సమస్యలు వచ్చి చేరుతుంటాయి. వాటి వల్ల కూడా గిరిజన స్త్రీ ఎంతో వేదనను పొందల్సిన అవసరం ఉంటుంది. పండుగల అప్పుడు పాటించే ఆచారాలు వేరు. మాములుగా పాటించే ఆచారాలు వేరు. ఈ నవలలో "పొద్దస్తమానం పనిచేసిన ఆడది నడుం లాగుతుంటే, మంచంపై నడుంవాలుద్దామంటే కూడ పోలో (పనికి రాదు) అంటారు. రివాజులు అమలుచేసే పెద్దలు పెళ్ళయిందంటే అక్కడ నేలమీద దొర్లాల్సిందే తప్ప మంచం మీద కూచోనైనా కూచోకూడదు." (రాగో.పుట:69) అదే విధంగా "అవుతలున్న (బహిష్టు) ఆడదానికి ఐదు రోజులు ముట్టడు. అది తప్పిపోయి కూడ మగాళ్ళకంట్ల

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

పడొద్దు. దాంట్లో పూజారి కంట్లబడితే దండుగ తప్పదు. ఏం చేసినా, ఏం తప్పినా 'దండుగ' అని బెదిరిస్తరు ఈ పెద్దలు"(రాగో.పుట:70) గోండుకులంలో స్త్రీలకు బహిష్టు సమస్య పెద్దగుదిబడ్డలాగా మారింది. ఎందుకంటే ఐదు రోజులు ఎవరికి కనబడకుండా, ఎవరిని ముట్టు కోకుండా అంటరాని వ్యవస్థను గిరిజనుల్లో తామలో తామే ఆహ్వానించుకుంటున్నారనిపిస్తుంది. దీని మీద గోపి భాగ్యలక్ష్మి రాసిన 'జంగుబాయి' కథ అద్భుతంగా చిత్రించింది. వర్షలుపడినా, విపరీతమైనా ఎండలు కొట్టినా ఆ స్త్రీకి గూడెంకు దూరంగా, తన కుటుంబానికి దూరంగా ఐదు రోజులు ఉండల్సిన పరిస్థితి ఈ గోండు సంప్రదాయంలో ఉంది.కానీ నేడు ఈ స్థితి అంతగా లేదు.ఎక్కడో మారు మూల ప్రాంతాల్లో తప్ప మాములుగా ఎక్కడ కనిపించదు. అంటే ఈ విధానం ద్వారా గోండు స్త్రీ పడుతున్న బాధల ఏవరకి అవగతం కాదు. అందుకే ప్రముఖ బ్రిటన్ రచయిత 'మంచి జీవితం జీవించడం ఎంత కష్టమో, మంచి జీవిత చరిత్ర రాయడం కూడా అంతే కష్టం' మన్న మాటలు గుర్తుకురాక మానదు. తన బాధను తాను వ్యక్త చేస్తే అందులో వాస్తవికత దాగి ఉంది. తన బాధను ప్రక్కనున్నవాడు వ్యక్తం చేసే దానిలో సానుభూతి ఉంది. గిరిజన స్త్రీల విషయంలో గిరిజన సమాజం, గిరిజనేతర సమాజం ఆచరిస్తున్న విధానం ఈ విధంగా ఉంది. దాన్ని ఈ నవల రచయిత వెలకితెచ్చాడ

## గిరిజన స్త్రీ- ముడిసరుకా? :

ప్రాచీన కాలం కంటే ఆధునిక కాలంలో స్త్రీలకు అనేక సమస్యలు వస్తున్నాయి. దానికి మీడియే సాక్ష్యం. ప్రతి రోజు న్యూస్‌లో ఏదో ఒక రకంగా గిరిజనేతరుల చేతిలోనో లేదా, అమాయక గిరిజనులో చేతిలోనే గిరిజన స్త్రీ మోస పోతున్న సంఘటనలు కనిపిస్తాయి. సామూహిక దాడులు, కక్ష్యదాడుల రూపంలో గిరిజన స్త్రీ బలవ్వల్సిదే. ఈ నవలలో "లామడే పెట్టుకోవడం రివాజేగదా. భయపడో, ఇష్టపడో పోరి 'ఇంగో' అన్నాకనే లామడే పెట్టుకున్నాను అంటాడు బూదుర్ తప్పె. చేతికెదిగిన కొడుకు ల్లేక లామడే పెట్టుకోక నేనేం గావాలంటడు? జీవపారె ఇచ్చి ముత్తి(భార్య)ని తెచ్చుకోలేక కదా లామడే ఉన్నాను. ముద్దుకు నిండేదాక గొడ్డుచాకిరి చేసినాక ఆ పిల్ల రానంటే నా గతేం కావాలంటడు లామడే. తండ్రేమో పనికెళ్ళ దీసుకుంటాడు. లామడే తన సుఖం తాను చూసు కుంటాడు. నేను మాత్రం బతికినన్నాళ్ళు ఇష్టం లేనివాడితో కాపురం చేయాలి. ఇదేం న్యాయం. నేను చచ్చినా చేయ నంటుంది బూది. తన్ని, గుద్ది కాపురం చేయించే అధికారం మీకుంది కాబట్టి నేను కాకపోతే నా చెల్లితో బల వంతగా కాపురం చేయిస్తానంటరు. మేమేం గొడ్లమా అన్నదే బూది బాధ."(రాగో.పుట:130)

కాబట్టి ఏ విషయంలోనైనా గిరిజన స్త్రీ ఒక్కంతా చిన్నచూపుగా చూడబడుతుందని ఈ నవల నిరూపిస్తుంది. అందుకే ఆకాశంలో సగం అన్నారు మన పెద్దలు. ఈ విధానం గిరిజన సమాజంలో ఇంకా బలంగా పుంజుకొలేదు. గిరిజనులు కూడా మారాలని, తమ ఆచారాల్లో మార్పులు తెచ్చుకోవాలని, లేకపోతే ఆ ఆచారాలను విడవల్సిన అవసరం ఉంది. స్త్రీని కేవలం అంగడి వస్తువుగానో, లేక ముడిసరుకుగానో చూడాల్సాన అవసరం లేదు. స్త్రీ కూడా మనలాంటి మనిషేనన్న భావన కల్గాలి.

## గిరిజన స్త్రీ - జనజీవన స్రవంతి :

ఈ నవలలో రోగో తనకు ఇష్టలేని పెండ్లిళ్లు చేయడానికి తన తల్లిదండ్రులు ప్రయత్నించినప్పుడు వెంటనే పారిపోయి, తన ఇష్టానికి స్వేచ్ఛ లేనప్పుడు గిరిజన ప్రాంతాల్లో ఉండడం వ్యర్థమని భావించి జనజీవన స్రవంతిలోకి కలిసిపోవడాన్ని రచయిత రాగోచేత "మా మాడియాల్లో ఇష్టంలేని పెళ్ళి కట్టబెట్టి, మేం వెళ్ళం అంటే తన్నులు గుద్దులు చేసి బాధలు పెడుతున్నారు. దూరంగా పారి పోయి కూలిజేసుక బతుకుతుంటే 'కేర్దే కేర్దే' అంటూ ప్రతి వూర్లో వెంటబడతారు. అలా మొండిగ బ్రతికేకంటే అన్నల్లో చేరి మంచిగా పనిచేస్తే బాగుంటుందని వచ్చిన" (రాగో.పుట:45) చెప్పించాడు. నిజానికి ఒక వ్యవస్థల్లో తిరుగుబాటు అనేది నిరంతరంగా రాదు. సమస్య అనేది బలంగా ఉంటేనే వస్తుంది. ఇక్కడ రాగో విషయంలో కూడా అదే జరింగిది. ఇంటి నుండి బతుకుదెరువు కోసం

ఎక్కడైనా బతుకుదామంటే గోండు ఆచారంలో 'కేర్దే కేర్దే' అనే మాట వినిపిస్తుంది. దీనర్థం ఏమంటే భర్తను వదిలేసి మరో వాణ్ని వెతుకుతున్న స్త్రీ అని అర్థం. ఆ స్త్రీకి వివాహ అయినా, అవ్వకపోయినా ఇటువంటి ఇబ్బందుల గోండు స్త్రీలకు ఎదురౌతుంటాయని రచయిత రాగో ద్వారా చిత్రిస్తున్నాడు. రాగో ఇంటి నుండి పారిపోయి వచ్చిన తరువాత ప్రతి అడుగడుగ ఇలాంటి పరిస్థితి ఎదురైంది. అందుకే ఆ బాధను భరించలేకే అన్నల్లో కలిసి పోయింది.రాగో జనజీవన స్రవంతిల్లోకి వచ్చిన తరువాత 'జైని'గా పేరు మార్చుకొని గోండు కులంలో ఆచారించ బడుతున్న ఆనాదికాల సంప్రదాయాలను నిర్మూలించ డానికి ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలోనే గోండు స్త్రీలకు అనేక విద్యలు నేర్పింది. మహిళా సంఘలను పెట్టించింది. రాగో ద్వారా గోండు స్త్రీలలో కొంతమేరకైనా చైతన్యం వచ్చిందని చెప్పవచ్చు. స్త్రీ కేవలం వంటింటికే పరిమితమై పోదని నిరూపించింది. ఎక్కడైన స్త్రీకి అవకాశం ఇస్తే పురుషులతో సమానంగా ముందుకు నడవగలదని చెప్పడంలో రాగో జైనిగా మారి డిప్యూటీ కమాండర్‌గా తక్కువ కాలంలో ఎదగడమే దానికి నిదర్శనం.

**ముగింపు :**

గిరిజన సమాజంలో రాగో నవల ద్వారా పాటింపబడు తున్నా విధానాలను రచయిత చక్కగా విపులీకరించారు. అటువంటి విధానం కొనసాగడానికి కారణాలు లేక పోలేదు. గిరిజనుల్లో ప్రధానంగా నిరక్షరాస్యత వల్ల వాస్తవ అంశాలను తెలుసుకోలేకపోతున్నారు. గుడ్డిగా నమ్మడం అనేది గిరిజనుల్లో పాటించబడుతున్న ఒక విధానం. కొంత చదువుకున్నా వాడైనా ఆ సమాజంలో ఉండే ఆచారాలను తప్పనిసరిగా పాటింస్తుంటాడు. ఆచారం పాటించడం మంచిది. అది తనకు, తన సమాజానికి, ఇతురులకు ఎటువంటి ఆటకం లేకుండా పాటించబడితే ప్రతివాడు దాన్ని ప్రోత్సాహిస్తాడు. మొదటికే సమస్యగా తయారైతే ఎవరు దానిని ఆదరించలేరు. ఈ సమస్య గిరిజనుల్లో ప్రబలంగా రూఢీ అయ్యింది. దీన్ని నుండి బయటపడాల్సి ఉంది. గిరిజన స్త్రీల్లో కూడా మార్పు రావాల్సిన అవసరం ఉంది. చదువుకోడానికి ఆసక్తి చూపాలి. అన్ని విషయంలో ముందుకు నడవాలి. అప్పుడే కాదా గాంధీజీ కలలు గన్నా అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చినట్టు! లేకపోతే ప్రారంభంల్లోనే ఉన్నట్టుగా చూడాలి. రాగో నవలల్లో గోండు ఆచారాలతో రచయిత ఈ నవలను రాయడం జరిగింది. ఈ పత్రంలో గిరిజన స్త్రీ అని పేర్కొనడం జరిగింది. అంటే గోండు స్త్రీ అని భావించుకోవాలి. రామచిలుక అడవిలో ఎంత ప్రశంతగా ఉంటుందో స్వయంగా మనం చూడలేక పోయినా, రాగో పాత్ర తన కష్టల కడలినుండి బయట పడ్డక రామచిలుక కంటే ఎక్కువ ఆనందంలో జీవించిదన డానికే రచయిత రాగోగా చిత్రించాడు. స్వేచ్ఛలేని జీవితం వ్యర్థమని నిరూపించింది ఈ నవల. దానికి తోడు రాగో తండ్రి కూడా రాగో చేసిన పనులను సమర్థించి, చివరికి పార్టీ సభ్యత్వంను అంగీకరించాడంటే ఇది దీనితోనే ముగిసిపోలేదు, చక్రంలాగా ఒకరి నుండి మరొకరికి అందుతుందనే భావనలో రాగోను, రాగో పార్టీ సభ్యత్వాన్ని ఆమోదింపడంలో ఒక భవిష్యత్ ప్రణాళిక దాగి ఉందని అర్థమవుతుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# సుగాత్రీ శాలినుల కథ - పాత్రల స్వభావం

**- మెరుపుటాల సతీష్ కుమార్,** తెలుగు పండితులు, జిల్లా పరిషత్ పాఠశాల, జకనపూర్, కన్నెపల్లి మండలం, మంచేరియాల జిల్లా.

ఎనిమిదాశ్వాసాల కళా పూర్ణోదయం నిబిడమైన కథతో నిండారిన ప్రబంధం. కాలక్రమ పద్ధతిననుసరిస్తే సరస్వతీ చతుర్ముఖుల ప్రణయకేళి వృత్తాంతం ముందు చెప్పి, ఆ మీద కలభషిణి కథ, ఆ తరువత కళాపూర్ణుని కథ చెప్పాలి, కాని, కార్యకారణ పద్ధతిననుసరించి కథను నిర్మించారు. తెలుగులో ఈ విధంగా కథ చెప్పటానికి ఈయనే మొదటివాడు. ఇతని కథాకథనాన్ని అనుసరించి క్రమంగా కలభాషిణి కథ నారదగా మాత్సర్యం, మణికంధరుని కథ, తబ్బిబ్బుల ప్రవాసనం (మాయారంభా మాయానల కూబరుల ఘట్టం), సుగాత్రీ శాలీనుల కథ, సరస్సరీ చతుర్ముఖుల ప్రణయకేళి, కళాపూర్ణోదయం, స్వభావుని కథ, అభినవ కౌముదీ వృత్తాంతం, మదాశయుని కథం, మధురలాలసా కళాపూర్ణుల వృత్తాంతం, అలఘువృతుని కథ, సత్వదత్మని కథ, లక్ష్మీనారాయణల సంవాదం - అనే కథలు చెప్పబడ్డాయి. ఈ కథలన్నీ కాలక్రమంలో చెప్పబడక ప్లాష్‌బాక్ పద్ధతిననుసరించి కార్యజారభ సంబంధాన్ని అనుసరించి నడుపబడ్డాయి. ఒక కథను ఒకరే చెప్పాలిగాని, ఒకచోటనే చెప్పాలని గాని ఒకే పద్ధతిననుసరించి చెప్పాలిగాని వాటినన్నింటిని ఉపయోగించి ప్రయోజనాత్మకమై, వైవిధ్యాన్ని పింగళిసూరన సాధించాడు. పఠితల ఉత్కంఠను పోషించటమే పింగలీ సూరన అపూర్వకథా సంవిదాన రహస్యం.

కళాపూర్ణోదయ ప్రబంధం అర్యపూర్వకథ సంవిధాన వైచిత్రీ మహనీయంగానూ, శృంగార రసప్రాయంగానూ, పుణ్యవస్తు వర్ణనా కర్ణనీయంగానూ రూపొందాలని పింగళీ సూరన సంకల్పించి చిత్రించాడు. ఈ లక్షణాలు కళాపూర్ణోదయ ప్రబంధ కథకంతా ఎంతగా వర్తిస్తాయో, ఆ కథలో భాగమైన ఏ ఉపాఖ్యానానికైనా, అంతర్గాథకైనా వర్తిస్తాయి. ఇది అతని కథా కళాపూర్ణత్వానికి ఒక చక్కని నిదర్శనము. అందువలన సుగాత్రీ శాలినుల కథకు కూడా ఆ లక్షణాలు అన్వయించటం సహజం.

**సుగాత్రీ శాలీనుల కథ అత్యపూర్వకథా సంవిధాన వైచిత్రీ మహనీయం :**

ప్రబంధ కవులు వక్రోక్తి జీవిత ప్రస్థానానికి సంబంధించినవారు. పింగళిసూరన ఆ సిద్ధాంతానికి కళాపూర్ణోదయ మనదగిన ప్రబంధాన్ని చిత్రించారు. కథా కథనంలో ప్రసిద్ధ ప్రస్థాన వ్యతిరేఖ వైచిత్రి సూరనలో గోచరిస్తుంది. తెలుగు సాహిత్యంలో సుగాత్రీ శాలీనుల కథ వంటి కథ మరొకటి లేదు. అదే అందుకు తార్కాణం. ఈ కథ ఒకచోట కాల క్రమంలో చెప్పబడదు. మూడు భాగాలుగా చెప్పబడుతుంది. అందులోనూ రెండవ భాగంలో మొదటి భాగం ఫ్లాష్‌బ్యాక్ పద్ధతి వంటి పద్ధతిలో చెప్పబడింది. మాయారంభా మాయానలకూబతుల కథ ముగిసిన తరువాత సుముఖాసత్తి మణిస్తంభుల యెదుట సరస్వతీదేవి స్వయంగా చెప్పి కథగా పరమ పవిత్రమైనదిగా భావింపబడే కథగా సుగాత్రీ శాలీనుక కథ చెప్పబడింది. ఈ సుముఖాసత్తి, మణిస్థంభులని పఠితలకు తెలిసి ఆశ్చర్యపోతారు. ఈ దంపతులే తరువాతి కథలో రూపాలు తారుమారయి సుముణాసత్తి భర్తగా, మణిస్తంభుడు భార్యగా వ్యవహరించినప్పుడు వారికి భావి కథానాయకుడైన కళాపూర్ణుడు పుడుతాడు. అంటే కథానాయకుని తల్లిదండ్రుల తబ్బిబ్బు ప్రవాసనంలో మొదటిభాగం. మూడోభాగం వింత దబ్బిబ్బుల చరిత్ర. రెండవ భాగమైన ప్రస్తు కథలో కూడ తిబ్బిబ్బులను చిత్రించాడు పింగళిసూరన. అయితే అది మానవ మనః ప్రవృత్తులకు, అందులోనూ శృంగార కామ ప్రవృత్తులకు సంబంధించినవి కావటం విశేషం. ఎన్ని రకాల చూచినా ఈ కథ అపూర్వ కథా సంవిధాన వైచిత్రీ మహనీయం.

పుణ్యవస్తు వర్ణనాకర్ణనీయం - వింటే పుణ్యం కలుగుతుంది అని పఠతలు భావించేటట్లుగా కథను వర్ణించి వినటానికి ఆసక్తిని కల్పించే శిల్పం ఈ కథకు ప్రాణం.

సుగాత్రీ శాలీనుల్దిరూ సరస్వతీ ఉపాసకులు. ఇద్దరికి ఆ తల్లి ప్రసన్నురాలై కోరిన వరాలిచ్చింది. వారిద్దరి కథలో ప్రథమ భాగాన్ని సరస్వతీయే స్వయంగా వ్రాసి, పుణ్య కథగా ప్రకటించింది. ఆ కథ చదివినవారికి శుభాలు కలుగుతాయని చెప్పింది. సుగాత్రీ శాలీనులు సరస్వతీ వరప్రసాదులు కావటంతో వారు వానకు తడవరు. గాలికి చలించరు. గాలివానలో తోటలో కలిసి పనిచేసిన ఆ దంప తులు వర్ష బాధితులు కాలేదు. అంతటి మహిమ కల వారు. పతిమెచ్చిన చర్యయే కామంలో పతివ్రత పవిత్రంగా భావించాలన్న ఒక దివ్య సందేశం సుగాత్రి కథ నుండి సరస్వతి ఉపదేశంగా అందించింది. సుగాత్రీ మహిమాన్వి రుతాంధ్రైన మహాపతివ్రతలలో ఒకతెగా కళాపూర్ణో దయంలో చిత్రింపబడింది. కాబట్టి ఈ కథ పుణ్యకథ అని పఠితకు తప్పక స్ఫురిస్తుంది.

శృంగార రసప్రాయం - శృంగారాన్ని రసదృష్టితో, రసరాజదృష్టితో, రసాభాస దృష్టితో కామసాస్త్ర దృష్టితో, మానసికశాస్త్ర లేదా మానసిక విశ్లేషణ శాస్త్ర దృష్టితో వివేచించే పద్ధతులు లోకంలో ప్రచారంలో ఉన్నాయి, కళాపూర్ణోదయంలోని కథలన్నీ శృంగార రససంబంధాలే అయితే ఒక్కొక్క కథ అరస చిత్రణంలో ఒక్కొక్క కోణాన్ని ప్రదర్శింపగల విచిత్ర సృష్టి కళాపూర్ణోదయంలో మణి కంధరుని ప్రేమించి, అతణ్ణి కామిస్తే నారదశాపం కలుగు తుందన్న భయంతో అతని పోలికులున్న నలకూబరుణ్ణి వలచి అతనికోసం మాయారంభ రూపం తాల్చి నానా యాతనలు పడి, చివరకు మాయానలకూబర వేషంలో ఉన్న మణికంధరుణ్ణి పొందిన కలభాషిణి వృత్తాంతం విన్న తరువాత, మణిసంభుడు స్త్రీలలోనే కాదు పురుష లలో కూడా అటువంటి చిత్త వృత్తులు కలవారుంటారని చెప్పాడు. దానికి ఉదాహరణగా శాలీనుని సౌందర్యంలో ఉన్నప్పుడు మాత్రమే ఆమెను రమిస్తాడు. నగలతో అలంకరించుకొని ఉంటే కామిరలేడు. అలంకరించుకున్న భార్య ఎదుట ఉంటే ఆమె సహజ శ్రామిక సౌందర్యాన్ని భావించుకొని అందులో తన్మయత్వం పొందగలడు. నగలతో ఉన్న భార్య ఎన్ని శృంగారపు చేష్టలు చేసినా అతని మనస్సు చలించేది కాదు. అతనిలో కామోద్రేకం కలిగేది కాదు. ఇటువంటి వాళ్ళను సామాన్యంగా ఎక్కడా వినం, కనం, అని అనిపించుకొన్న ప్రవృత్తి. ఇది అపూర్వ శృంగార మనఃప్రవృత్తి.

శాలినుడు సరస్వతీదేవి ఉపాసకుడు. తన భార్య యౌవనం శిథిలం కాకుండా ఉండాలనీ, ఆమె మేని బిగువు తగ్గకుండా ఉంటానికి సంతానం కలగకుండా ఉండాలనీ కోరుకున్న విచిత్ర శృంగార రసికుడు శాలీ నుడు. ఆ తరువాత భార్య ఆమె వలన తనకు పుత్రుడు జనించాలని సరస్వతీదేవి వరాన్ని పొందినట్లు తెలిసి తన కోర్కెకది విరుద్ధంగా భావించి, ఆవేశంతో వేయితాళ్ళ లోతుగల నీటి మడుగులో దూకి ఆత్మహత్య ప్రయత్నం చేసుకొన్నాడు. ఆ తరువాత సిద్ధుడై సర్వసిద్ధుల కోసం కాళికాలయంలో ప్రయత్నం చేశాడు. ఆ తరువాత స్త్రీగా మారి, తన భార్యను పురుషునిగా మార్చుకుని, సుఖించి కళాపూర్ణుని కన్నాడు. అందువలన పురుషునిలో కామబీజం సాత్త్విక, రాజసిక, తామసిక ప్రవృత్తులలో ఎలా వ్యక్త మౌతుందో వర్ణించటానికి ఒక జంటను ఎన్నుకొని చిత్రిం చిన శృంగార గాథ ఇది. వాత్స్యానాదుల కామశాస్త్ర గ్రంథాల్లో రతిక్రీడలో స్త్రీ పురుషులు పొందే సుఖాన్ని గురించి, ఆ సుఖాన్ని పొందటంలో వారి వారి ప్రవృత్తులు నిర్వహించే పాత్రలను గురించి, వాటి వలన నాయికా నాయకులు అనుసరించే కామక్రీడా ప్రవృత్తుల భేదాలను గురించి, వాటి వలన నాయికా నాయకులు అనుసరించే కామ క్రీడా ప్రవృత్తుల భేదాలను గురించి స్త్రీ, పురుష సుఖాలలోని శ్రేష్ఠత్వాన్ని గురించి విశేష చర్చలు జరిగి ఉండటం ప్రసిద్ధం. ఆ ప్రయోగ విజ్ఞానానికి కళా ప్రపూర్ణత్వం కలిగించిన కథలలో ఈ ప్రబంధంలోనే కాక ఆంధ్ర ప్రబంధ సాహిత్యంలోనే సుగాత్రీ శాలినుల కథ అత్యుత్తమమైనది, అపూర్వమైనది.

**అపూర్వ పాత్రలు :**

అపూర్వ పాత్రలు చిత్రించటంలో ఆంధ్ర ప్రబంధాలు ప్రసిద్ధాలు. అందులోనూ కళాపూర్ణోదయం ముందు చెప్పుకోతగింది. కళా పూర్ణోదయంలోని అపూర్వ కల్పిత

పాత్రలలో సుగాత్రీ శాలీనులు విశిష్టులు కళాపూర్ణో దయంలోని శృంగార రస పోషణాన్ని గురించి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు 'తెలుగు విజ్ఞాన సర్వస్వం'లో ఇలా అన్నారు.

"ఈ కావ్యమున వెల్లివిరియు శృంగార రసప్రవాహము సత్యలోకము నందుద్భవించి గంధర్వలోకము గుండ మర్త్యలోకమున కవతరించుచున్నది. భూస్వభావమును బట్టి భూమిపై ప్రవహించు జలముల గుణములు మారునట్లే ఆ శృంగారము మూడు లోకములలో మూడు రూపాములు తాల్చెను, అందు ప్రథమ రంగమైన సత్య లోకమున దాని స్వరూపము కామ వాసన లేని దివ్వలీల సరస్వతీ చతుర్ముఖుల విలాస లీలయే ఈ విశ్వసృష్టికీ ప్రభావ కారణము. సత్యలోకము నుండి ప్రవహించు ఆ రస ప్రవాహము మధ్యే మార్గమున రెండవ రంగస్థలమైన గంధర్వ లోకమున తాల్చు రూపమునకు గాంధర్వ లోకము నుండి మర్త్యలోకమునకు అవతరించునప్పటి ఈ రసవాహిని సహధర్మ చర్యలు అనెడి రూపము తాల్చును. ఇదియే కావ్యములోని సుగాత్రీ శాలీనుల దాంపత్య శృంగారము. ఆ యెడ 'ప్రజాయైగృహ మేతినః' అన్న సూక్తి తప్ప మరేమియు ప్రవర్తింపదు, గార్హస్థ్య నిర్వహణమునకూ దాంపత్య సిద్ధికి, పాతివ్రత్యము ఆధారము, మూర్తిమంతమైన పతివ్రత్యమే ఈ కథలోని సుగాత్రి.

"ఈ ప్రవాహము అంతటితోనాగక మానవ లోకము నుండి అధో లోకమునకు గూడ ప్రవహించి కామము అను పేరు దాల్చును. దానిని కామమనుట కంటె తుచ్ఛ కామము అనుట మరియు మంచిది. అననురక్తయైన యువతిని బలాత్కరింపనెంచి వెంటబడిన శల్యాసురుని వృత్తాంతము ఇందుకు నిదర్శనము. ఈ నాల్గు శృంగా రములకు క్రమముగా దివ్యము, గాంధర్వము మానవము, రాక్షసము అని నాల్గు పేర్లు పెట్టవచ్చును.

మానవలోక శృంగార రస వర్ణనలకు, మానవీయ శృంగార చిత్తవృత్తుల అపూర్వ చిత్రణకు సుగాత్రీ శాలినుల కథ, అందలి పాత్రలు అపూర్వోదాహరణలు.

ఈ కథ నిత్యం ప్రాతఃకాలంలో చదువుకొనదగిందని సరస్వతీ దేవి ఆదేశం. అంతటి పుణ్యకథ ఈ దంపతుల కథ.

## శాలీనుని అపూర్వ వ్యక్తిత్వ చిత్రణం :

(సూచన : ఈ క్రింది అంశాలను ఆధారంగా ముందు చెప్పిన కథాశంలో నుండి ఉదాహరనలు ఎన్నుకొని అన్వ యించుకొని సమాధానం రూపొందించుకోవాలి)

శాలీనుడు శారదదేవి ఉపాసకుడు. ఆమెను తపస్సుతో మెప్పించి తన భార్య యౌవనం మొక్కవోకుండా ఉండేటట్లు సంతానం సలగకుండా ఉండేటట్లు వరం పొందిన విచిరత ప్రవృత్తి కలవాడు.

సుగాత్రి పరమ పతివ్రత, సరసర్వతీ వరం పొందిన సాత్త్వికురాలు అని తెలిసి ఇల్లరికానికి ఒప్పుకొన్న సహృద యుడు. సాత్త్వికుడు సహనశీలి అత్తగారు తోటపనిలో నియోగించినా ప్రతిఘటించకుండా సమ్మతించాడు. తోటకు సరస్వతిని పూజించే పూలకోసం పెంచి పోషించిన భక్తుడు, చేట్టిపన వృత్తిని (అది తోటమాలి అయినా సరే) శ్రద్ధాభక్తులతో చేసే ప్రవృత్తి కల ఉత్తముడు. తన కాయకర్మను భగవదంకితంగా భావించిన భక్తుడు. తనను గురించి ఇతరులేమను కుంటారు? అనుకుంటు న్నారు? అని ఎన్నడూ ఆలోచించని నిర్లిప్తుడు.

శాలీనుడు వశీకృతచిత్తుడు అతడే సిగ్గరి, అయినా స్థిర నిశ్చయం కల ధీరుడు. అతనిని ముగ్ధయైన శ్రామిక జానపద స్త్రీ శృంగారం మీద మక్కువ ఎక్కువ. సాలంకార నాగరిక స్త్రీ విలాసమంటే అతనికి రోత. తనకిష్టంలేని సాలంకార శృంగార విలాసాన్ని తన భార్య ప్రదర్శిచినా స్పందించకుండా నిశ్చలుడై శిలవలె ఉండగలిగే మనో ధార్ఢ్యం అతనికి ఉంది. అతని మనోధైర్యాన్ని చూచి అత్త గారు, చెలికత్తెలు, చివరకు సుగాత్రి కూడా పరిపరి విధాల తలపోశాడు. అతడవన్నీ పట్టించుకోలేదు. అతడు కోపిం చడు. అట్లని తన మనసులో మాట ముందుగా అందరికీ చెప్పడు. తనను తెలుసుకోవాలి అనుకుంటాడు. ఇంగిత జ్ఞానం అతని రహస్యం. శాలినుని చిత్తవృత్తికీ తగినట్లు సుగాత్రి గాలివానలో తోటపని చేస్తున్న భర్తవద్ద మెసలింది.

సొమ్ములు తీసింది. భర్తకు శ్రమలో సహాయపడింది. పని చేస్తున్న సుగాత్రి మేని హోయలు అతనిలో నిద్రపోతున్న కామభావనను మేల్కొల్పింది. ఆర్ద్రుడైనాడు. భార్యను దగ్గరికీ తీశాడు. వలపుతో లాలించాడు పూలతల పొదలల్లో చిగురాకు పాన్పులపై సుఖాల తేలించాడు. ఆమెను కౌగిలిలో బంధించి వదలనన్నాడు. బలవంతాన భార్యను ఇంటికి పంపాడు తగిన రూపంలో ప్రియురాలిని పొందటంలో అతడు చూపిన ఆసక్తి అతని రసికత్వాన్ని తెలుపుతుంది.

నిరలంకార రూపంలో ఉండే ప్రియురాలిని ప్రేమించ గలగటం అనేది ఒక మానసికమైన గుణం, అది కామ సంబంధం కావటంచేత శృంగార పురుషులలో అపూర్వ మైన చిత్తవృత్తి దీన్ని కాంప్లెక్స్ అనవచ్చు. తోటలో తొలి సమాగమం జరిగిన రాత్రి భార్య సాలంకృతయై మరల అతని వద్దకు వచ్చింది సాహసించి పాదాలు ఒత్తింది. శరీర స్పర్శనందించింది. వలపు చేష్టలు చేసింది. ఎన్ని చేసినా వింతగా స్పందించకుండా ఉండగా - ఆమె పలక రించింది. ఉపచార వాక్యాలు పలికింది. అప్పుడు శాలీ నుడు - "ఏ కోరికతో నా వద్దకు వచ్చావు?" అని ఎబ్బెట్టుగా ఒక ప్రశ్న వేశాడు. ఎంత మొదలు ప్రశ్న అది. "భార్యలు భర్తల దగ్గరికి లోకంలో ఎందుకు వస్తారు?" అని సుగాత్రి ఎత్తిపొడిచింది. మరి మాట పలుకలేదు. మనసులో తోటలో తాను చూసిన సుగాత్రి సహజ శ్రామిక సౌంద ర్యాన్ని స్మరించుకుంటూ నిశ్శబ్దంగా నిశ్చలంగా ఉండి పోయాడు. "రాయైనా కొంత మేలు నారాయణా!" అని సుగాత్రి విసరుపడేంత విడ్డూరంగా ఊరుకున్నాడు. 'ఆడవారు ప్రక్కన చేరితే అంతసేపు ఎవరైనా ఊరు కుంటారా?' అని ఆశ్చర్యపడేటట్లు కదలకున్నాడు. ఈ వలచినప్పుడు శాలీనుడు జలపాతం మిన్నకుంటే అతడే ఒక గండ శిల.

పింగళి సూరన ప్రబంధ యుగంలో నివసించినవాడు. ప్రబంధాలకు అలంకృతోక్తి ఆయువుపట్టు. శ్లేష చమత్కా రాలతో కవిత్వం నాగరికంగా, చరురవచోవిన్యాసంతో పాండిత్య ప్రౌఢిమను ప్రదర్శించింది. అయితే పండితైక వేద్యమైన ప్రబంధ కవిత్వానికి ప్రతిగా నిరలంకారంగా స్వభావోక్తులతో రచించే మరొక సంప్రదాయం సాహిత్య లోకంలో ఉంది, అంటే అలంకార నిరలంకార రచనా పద్ధతుల నడుమ ఆ కాలంలో సహజంగా స్పర్థ ఉండేది. దాని ప్రతీకాత్మకంగా సుగాత్రీ శాలీనుల కథలో చిత్రిం చాడు పింగళి సూరన, సుగాత్రి కవితకు ప్రతీక. శాలీనుడు సహృదయానికి ప్రతీక. కవిత్వం అలంకరించుకొని నాలుగు గోడల మధ్య రాజదర్బారుల్లో నివసించి సామాన్య సహృ దయుణ్ణి ఆకర్షించలేదు. సహృదయుడు ప్రకృతి సౌందరో పాసకుడు, శ్రమజీవి, తపస్వి, నిరాడంబరుడు. అతనికి కావలసింది సహజ శ్రామిక సౌందర్యం. దానిని అతడు రవిస్తాడు. అందువలను ప్రబంధాలలోని అలంకారిక రచన కంటే స్వభవోక్తి ప్రధానమైన రచన రసానుభవానికి దగ్గరగా ఉంటుందనీ, అటువంటి రచనే సరస్వతీ దేవి కోరుకుటున్నదనీ వ్యంగ్యంగా పింగళి సూరన ఈ కథ ద్వారా ధ్వనింపచేశాడు. అలంకారిక రచనా యుగంలో అలంకారం మీద వ్యంగ్యంగా విమర్శ సాగిమచిన సాహసికుడు పింగళి సూరన, అతని మనసులోని ఆగూడ వాంఛకు ప్రతీకాత్మక కథాకల్పన సుగాత్రీ శాలినుల కథ. ప్రత్యేకించి శాలీనుని పాత్ర.

## సుగాత్రి పాత్ర చిత్రణ :

సుగాత్రి అపూర్వ పాత్ర, పాతివ్రత్యానికి ఒక క్రొత్త నిర్వచనం వంటింది. కాశ్మీరంలో శారధాక్షేత్రంలో పూజారి కూతురు సుగుణవతి. పూజించిన శారదను ప్రసన్నుతా లను చేసుకొన్న భక్తురాలు. తన వలన భర్తకు సంతానం కలగాలని కోరుకున్న ముద్దరాలు. సుగాత్రి తల్లిచాటు బిడ్డ. తల్లి పెంపకంలో ఆమె అదుపు ఆజ్ఞలలో పెరిగిన పిల్ల అందువలన తన మనసులోని భావాలను బిడియం లేకుండా పైకి చెప్పుకునే స్వభావం ఆమెకు లేదు. పైపెచ్చు ముగ్ధ, అంటే వచ్చిన వయసుకంటే ఎక్కువ సిగ్గుగల అమాయకురాలు.

సుగాత్రి అనే పేరు సార్థకమైనది. అందమైన శరీరం కలది అని అర్థం. పేరుకు తగ్గట్టు ఆమె స్ఫురద్రూపి, యౌవనానికి తగిన అంగిక వైభవం ఆమెకు అమరింది.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


అలంకరిస్తే ఆమె బంగారు బొమ్మలాగా చూడటానికి జగన్మోహనంగా ఉండేది. తల్లికూతురుకు ఎన్నో సొమ్ములు చేయించింది. ఆమె ధరించమంటే సుగాత్రి కిమ్మనకుండా ధరించేది. అయితే ఆమె నగలమీద మోజు లేదు. వాటి మీద వెగటూ లేదు. ఆమె అచ్ఛమైన సాత్త్వికగుణం లాంటిది. ఇష్టాయిష్టాలు, కోపతాపాలు, ఆచార వ్యవహారాలలో ఆమెకంతగా లేవు.

తల్లి ఆమెకు తగిన వరుణ్ణి చూచి వివాహం చేసింది, ఒక్కటే ఒక్కతె కూతురు కాబట్టి ఆమెను వారసుడిగా ఒక మనుమడిని పొందాలని కోరిక గాఢంగా ఉండేది. అందువలన ఇల్లరికపు అల్లుణ్ణి తెచ్చిపెట్టుకున్నది. శాలీనుడు వినయ విద్యాగుణ సంపన్నుడు. సుగాత్రి శాలీనులు ఈడూజోడు గల దంపతులు. తల్లి చేసిన పెండ్లిని సుగాత్రి గౌరవించింది. సుగాత్రి మనసుకు నచ్చిన స్నేహితురాండ్రున్న అదృష్ట వంతురాలు. సమాన వయస్కులు నెచ్చెలులు ఆమెతోపాటు యౌవన భావాలను పంచుగోలరు, సరసాలాడగలరు, కొత్త పెళ్ళి కూతురు తొలినాళ్ళలో మగనితో ఎలా సరసాలాడి తన యౌవనాన్ని సఫలం చేసుకోవాలో చెప్పగలరు. సరసాలు తెలియని అమాయకపు జంటల వర్తనాన్ని గురించి నవ్వగలరు. తగిన వలపు సలహాలివ్వగలరు, కష్టసుఖాలు పంచుకోగలరు, స్నేహితురాలి మేలుకోరగలరు. వయసులో పెద్దదైన తల్లి నీతులు చెపుతుంది. సమ వయస్కులైన చెలులు సలహాలు చెప్పగలరు. వీరిద్దరిని కలిగి ఉన్న సుగాత్రి రెండు రకాలుగానూ అదృష్టవంతురాలు. సుగాత్రి తొలిరేయి చెలులంపగా గదిలోకి వెళ్ళింది. శాలీనుడు ఆమె ధరించిన ఆభరణాల మీద ఆసక్తిలేక నిర్లప్తుడై ఉండిపోయాడు. ఆమెను పిలువలేదు. దరికి చేర్చలేదు. సుగాత్రి కూడా చనువు తీసుకోలేదు. రాత్రల్లా వేచి ఉండి ఊరకే తిరిగి వచ్చింది. తొలిరేయి ఎలా మెలగాలో తెలియని ముగ్ధరాలు సుగాత్రి తనను భర్త స్వీకరిస్తేనే దరికి చేరాలని, అతని అనుకూల్యమే తన అనుకూల్యమనీ అదృష్టమనీ భావించే సాధ్వి.

భర్త తోటలో పనిచేస్తూ దివారాత్రులు అక్కడే గడిపేవాడు. ఆయన శ్రమపడుతున్నందుకు ఇంట్లో సుగాత్రి విలవిలాడిపోయేది. అప్పుడప్పుడూ ఒంటిగా, రహస్యంగా తోటకు వెళ్ళి భర్తను చూచి సిగ్గువలన అతనితో మాట్లాడటానికి పూనుకోక ఇంటికి తిరిగి వచ్చేది. ఆ విధంగా ఆమె పతిమీది అనురక్తిని ప్రదర్శించింది.

గాలివాన నాడు ఆమె పతిని చూడలేకుండా ఇంటిలో ఉండలేకపోయింది. అతణ్ణి రక్షించుమని సరస్వతిని ప్రార్థించింది. ఒంటరిగా తోటకు బయలుదేరింది. సరస్వతీ వరమహాత్మ్యంలో వలన సుగాత్రి వానలో తడియ లేదు. శాలీనుడు కూడా వానలో తడవకుండా తోటలో పనిచేయడాన్ని గమనించి ఆశ్చర్యపోయింది. మొదటిసారి సొమ్ములు తీసి గుట్టుగా దాచిపెట్టి సహజమైన అందం వ్యక్తమయ్యే సాధారణ వస్త్రాలతో తోట పనికి దిగింది. ఆమె గడ్డపారతో త్రవ్వుతున్నప్పుడు తోరపు చనుదోయి తుళ్లింతలిడింది. అటూ ఇటూ వేగంగా నడచినప్పుడు పిరుదుల విలాసంగా చలించాయి. చెక్కిళ్ళమీద చెమట బిందువులు అద్దం మీది ముత్యాల్లా నిలిచాయి. ఇలా సహజమైన ఆమె శ్రామిక సౌందర్యం శాలీనుణ్ణి ఆకర్షించింది. అతని పొందును పొందగలిగింది. అతని లాలనను అందుకోగలిగింది. వారిరువురికి కాలం తెలియలేదు. అరడు కౌగిలి వదిలేటట్లు లేదు. అయినా సమయ స్ఫూర్తితో "ఇవ్వేళ మీ చేష్టలు క్రొత్తక్రొత్తగా ఉన్నాయి. అయినా ఇంటికి పోవాలి కదా!" అని సుగాత్రి జ్ఞాపకం చేసి, తన్యయత్వంతో ఇంటికి చేరింది. తొలి అనుభవాన్ని పొందిన ఆమె సౌందర్యం అద్భుతం.

పతి పొందు పొందింది గాని, పతి హృదయం ఆమెకింకా అర్థం కాలేదు. ఆ రోజు రాత్రి అలంకరించుకొని గదిలో పతి దగ్గరికి సమీపించింది. అతడు తోటలోని ఆమె ముగ్ధ మోహన సహజ శృంగార లీలలను మనసులో స్మరించుకుంటూ కిమ్మనకుండా ఉండిపోయాడు. ఆమె హృదయంలో అగ్ని పర్వతాలు బ్రద్ధలయ్యాయి. కాని నిబ్బరంగా నిండుగా పతితో వ్యవహరించింది. "శ్రమ వలన నిద్దురపట్టినట్లుంది. నేను వెళ్ళేదా? నిదురపోతురా?" అని

సహజ మనోజ్ఞంగా పతిని పలకరించి తన మనసు బయటపెట్టింది. "నీవు ఏ కోర్కెతో వచ్చావు?" అని శాలీనుడు పరాకుగా అడిగాడు. "లోకంలో భార్యలు భర్తల దగ్గరికి ఎందుకు వస్తారు?" అని ధ్వనిమయంగా సంస్కారయుతంగా పలికింది. కాని, అలా చెప్పవలసి వచ్చినందుకు నిట్టూర్చింది కూడా. మొదటి ప్రయత్నం అంతటితో ఆగిపోయింది. భర్తనుండి మరల మారు పల్కు లేదు.

భర్తముందు లోపాన్ని ఎత్తి చూపకుండా ఆయన పలకరించటమే అదృష్టంగా భావిస్తున్నట్లు మాట్లాడింది. "ఈమాత్రం నా మనసులో కోరిక తెలుసుకొనే ప్రశ్న వేశారు. అదే పదివేలు" అని పొగిడింది. తెల్లవారుతున్నదనీ, దగ్గరకు రమ్మని పిలిచి ఆదరించటమే కానరాదనీ, భర్త కోరకుండా తనంతట తాను పతిని చేరటం సాధ్వి లక్షణం కాదనీ, తోటలో చూసిన వలపులన్నీ ఎక్కడిని పోయాయనీ నోరు విచ్చి అడిగింది. కొంతసేపు వేచి చూచింది. అతడు ఉలకలేదు, పలకలేదు. "నారాయణ! మీ మనసుకంటే రాయే కొంత మేలు. ఎవరైనా ఒట్టి భార్య తన దగ్గర ఉన్నప్పుడు ఇంతసేపు ఊరుకుంటారా!" అని సిగ్గుకొంత పక్కనపెట్టి ఉపాలంభించింది. పాదాలు ఒత్తింది, మేనిని మేనితో తాకించింది. బుగ్గలతో బుగ్గలు కలిపి అద్దుకున్నది. కన్నుల్లో కన్నులు కలిపి చూచింది. అన్ని విలాసాలూ బూడిదలో పోసిన పన్నీరైపోయాయి.

భర్త విముఖుడు కావటానికి అతడు అన్యకాంతను వరించి ఉండటం కారణం కావచ్చునని ఊహించింది. బెరుకు లేకుండా ఆ సంగతీ అడిగింది. ఆ వలపుకత్తెను ఇంటికి తెచ్చుకోమన్నది. వారిద్దరికీ సేవలు చేస్తానన్నది. ఆమె కొరకు ప్రాణాలు ఇస్తానన్నది. భర్త మనస్సులోని కొరత తీరితే అదే తనకు చాలని" బ్రతిమిలాడింది. కాని అతడు నిశ్చలంగా ఉండిపోయాడు. ఆమె నిరాశతో తిరిగి వెళ్ళింది.

మరునాడు తోటలో పతితో పనిలో పాల్గొన్నది. అనురాగాన్ని పొందగలిగింది. అతని హృదయం నగలు లేని అందాన్ని రమిస్తుందన్న సత్యాన్ని తెలుసుకున్నది. రోజూ తోటలోనే పతితో కూడటం మొదలుపెట్టింది. పతి అనురాగమే తన గతి అనుకున్నది. తల్లి అకాల సంగమం వలన తెలివి తక్కువ సంతానం కలుగుతుందని ఒక కామశాస్త్ర సూత్రాన్ని చెప్పింది. శాస్త్ర విరుద్ధమైన పనిని చేయవద్దని చెప్పింది. అల్లుణ్ణి తోట పనిలో నుండి మాన్పిస్తానన్నది. పతివ్రతా ధర్మాలను ఎన్నింటినో బోధించింది. ఆ బోధలన్నీ విని, "పతికి నచ్చిన వర్తనమే శాస్త్రీయం", దానిని నిషేధించినా, నాకది నిషేధం కాదని ప్రకటించింది. దానిని సరస్వతి కూడా మెచ్చుకొన్నది. పవిత్రతా తిలకంగా సుగాత్రిని వాణిదేవి ప్రకటించింది.

భర్తకు నచ్చిన తన వర్తనంతో బ్రతుకును పండించుకున్న పతివ్రత సుగాత్రి. నగలు భర్తకు ఆయువును కలిగించవచ్చు. కాని అతని అభిరుచి ఆమె వలపుకు ఆయువును కలిగిస్తుంది. పతి యొక్క అంతరంగాన్ని అర్థం చేసుకున్న అబలయే పతివ్రత అని చాటిచెప్పే మేటి పాత్ర.

❀❀❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# ‘నగ్నముని’ రచయిత రాయని నాటకం - కవితానుశీలన

**- డాక్టర్ కె. లక్ష్మణ,** అతిథి ఉపన్యాసకులు, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, తమిళనాడు.

## ప్రస్తావన :

ఆధునిక తెలుగు కవుల్లో దిగంబర కవులు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్నారు. ఆధునిక తెలుగు కవిత్వాన్ని నడిపించిన వారిలో నగ్నముని గారు ఒకరు. ఈయన అసలు పేరు మానేపల్లి హృషికేశవరావు. 1940వ సంవత్సరం మే15వ తారీఖున తెనాలిలో జన్మించారు. కృష్ణాజిల్లా బందరులో నగ్నముని గారు విద్యాభ్యాసం చేశారు. తెలుగు కవిత్వంపై తిరుగుబాటు చేసిన దిగంబర కవులు ఆరుగురు- 1.నగ్నముని (మానేపల్లి హృషికేశవ రావు), 2.నిఖిలేశ్వర్ (యాదవరెడ్డి) 3.జ్వాలాముఖి (వీర రాఘవాచార్యులు), 4.చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి), 5.మహాస్వప్న (కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు), 6.భైరవయ్య (మన్‌మోహన్‌సహాయ్). దిగంబర కవులు వాళ్ళు తెలియ జేయాల్సిన విషయాలను ప్రత్యక్షంగా తెలియజేయడమే వీళ్ళ రచనా ఉద్దేశం.

దిగంబర కవులు వెలువరించినటువంటి మొదటి కవితా సంపుటాన్ని 1965వ సంవత్సరం మే 6 తారీఖున హైదరాబాద్‌లో అర్ధరాత్రి నాంపల్లి పాండు అనే రిక్షా కార్మి కుడు చేత ఆవిష్కరించారు. రెండవ సంపుటాన్ని 1966వ సంవత్సరం డిసెంబరు 8వ తారీఖున విజయవాడలో జంగాల చిట్టి అనే హోటల్ కార్మికుడు చేతుల మీదగా ఆవిష్కరించారు. మూడవ సంపుటాన్ని 1968వ సంవత్స రంలో జూన్‌లో విశాఖపట్నంలో ఎడమనూరి యశోద అనే బిచ్చగత్తె చేతుల మీదగా ఆవిష్కరించారు.

వీళ్ళు రచించిన కవితా సంపుటి వల్ల కూడా విమర్శకు లోనుకావలిసి వచ్చింది. దిగంబర కవులందర్నీ తనలో కలుపుకోనిపోవడం వల్లకూడా, దిగంబర కవిత్వోద్యమం చల్లారిన తరువాత కూడా కవిత్వం వెలువరించడంలో నగ్నముని గారు ముందు వరసలో ఉన్నారంటే అతిశ యోక్తి కాదు. నగ్నముని గారు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అనువాద కులు పనిచేసి పదవీ బాధ్యతలను నిర్వర్తించి, పదవీ విరమణ కూడా పొందారు. దివిసీమలో వచ్చినటు వంటి తుపానుకి రచయిత స్పందించి 1977వ సంవత్స రంలో వెలువరించిన దీర్ఘ కవిత ‘కొయ్యగుర్రం’. ఈ కవితా సంపుటి ఆధునిక కవిత్వంలో మంచి పేరు ప్రతిష్టలను సంపాదించి పెట్టింది. అది మంచి కవితా సంపుటిగా వెలువడడమే కాకుండా కొన్ని, విమర్శలకు, వాదోపవాదాలకు దారి తీసింది. ‘కొయ్యగుర్రం’ అనే దీర్ఘకవితా సంపుటిని కన్నడ, హిందీ భాషల్లోకి అనువాదం చేశారు. నగ్నముని కలం నుండి ‘విలోమ కథలు’, ‘తూర్పుగాలి’ కవితా సంపుటి వెలువడ్డాయి. ఈయన కవిత్వం ఆవేశంగా ఉన్నగానీ, ఆలోచనాన్ని కలిగించే విధంగా ఉంటుందంటే సందేహంలేదు. ఆధునిక కవుల్లో విమర్శకుడిగా, వ్యాసరచయితగా పేరుప్రఖ్యాతలను సంపాదించిన నగ్నముని గారి కవిత్వం నాటి తరం నుండి నేటి తరం వరకే కాకుండా రాబోయే తరానికి మార్గ దర్శకంగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## రచయిత రాయని నాటకం :

ఈ ‘రచయిత రాయని నాటకం’ కవితా శీర్షికలో నగ్న ముని గారు నాటకాన్ని గురించిన ప్రస్తావన చేశాడనుకో కండి. ఎందుకంటే ఈ కవితా పాదాల్ని కూడా చీకటిలో ఉన్న ప్రజల్ని వెలుగులోకి తీసుకోరావలనే దృక్పథంతోనే కవిత్వీకరించారు. అందువల్లే నగ్నముని గారు కవిత్వాన్ని వెలువరించడంలో ఒక వైవిధ్యమైనటువంటి దృక్పథాన్ని అలవరచుకొన్నారు. కవిత ప్రారంభంలోనే-

“ఒక మహానాటకం నడుస్తోంది
నాటకవేదిక భగభగమండే భారతదేశం
బహుశా బ్రహ్మగానీ బ్రహ్మంగారు గానీ
వ్యాసుడు గానీ వాల్మీకి గానీ

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

ఈ నాటకాన్ని రాసిన దాఖలాలు లేవు
ఇంత రాక్షసంగా ఏ రచయితా రాయడు
ఇంత హీనవిలువలు
ఏ రచయితా వూహించలేడు"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

దిగంబర కవుల్లో ఒకరైన నగ్నముని గారు 'రచయిత రాయని నాటకం'లో ఆనాటి నాయకులు చేస్తున్న అన్యాయాలను గురించి కవిత్వీకరించారు. ఎందుకంటే అప్పుడు జరుగుతున్న విషయాలన్నిటిని గురించి మహా నాటకం అన్నారు. అంటే భారతదేశంలో ఇలాంటి నాటకాలను బ్రహ్మ, బ్రహ్మం, వ్యాసుడు, వాల్మీకి వీళ్ళందరూ కూడా రాయలేదన్నారు. ఇలాంటి హీనంగా ఏ రచయిత ఆలోచించడు, ఊహించడని వ్యక్తపరిచారు. ఆనాటి కాలంలోని సామాజిక స్థితిగతులను గురించి తెలియజేశారు. రాజకీయ నాయకులు ప్రజల్ని ఏ విధంగా ఇబ్బంది పెడుతున్నారనే విషయాన్ని వెలిబుచ్చారు.

## రాజకీయ వ్యాపారం :

"దీన్ని నాటక మందామా
లేక రాజకీయమందామా
లేక వ్యాపార మందామా
ఇక్కడ రాజకీయమే
సరయిన వ్యాపారం"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

రచయిత రాయని నాటకం శీర్షికలో రచయిత నాటకాన్ని రాజకీయ నాయకులతో పోల్చి కవిత్వీకరించారు. ఇవన్నీ కూడా నాటకంగా చెబుతామా? రాజకీయం అనుకొంటామా? లేక వ్యాపారమని దిశా నిర్దేశం చేస్తామనే విషయాన్ని పసిగట్టలేం. ఎందుకంటే ఇక్కడ రచయిత వీటన్నిటికన్నా రాజకీయమే సరయిన వ్యాపారమని తెలియజేశారు. అందువల్లే ఆధునిక సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలు వెలువడినా గానీ రాజకీయ నాయకులను గురించి, వారి పరిపాలన గురించి, కవిత్వాన్ని కవిత్వీకరించడమంటే కత్తి మీద సామే. అలాంటి రాజకీయ నాయకుల గురించి కవిత్వీకరించిన నగ్నముని రచనా విధానం ఎటువంటిదో ద్యోతకమవుతుంది.

"ఆర్భాటం తప్ప
ఆశయంలేని నటులు
రంగులూ హంగులూ తప్ప
వాక్శుద్ధిలేని నటులు"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

రాజకీయ నాయకులు నాయకత్వం వహించక ముందు ఒక మాట, నాయకత్వం పొందిన తరువాత మరొ మాట మాట్లాడడం వారికి వెన్నతో పెట్టిన విద్య. ప్రజలు ఎన్నికలు వచ్చినప్పుడు వారి వారి రాజకీయ నాయకులకు ఇష్టానుసారంగా ఓట్లు వేయడం సబబు. కానీ ఆ నాయకులు తెలియజేసిన వాగ్దానాలను దృష్టిలో పెట్టుకొని జీవిస్తుంటారు. అంటే ఆ నాయకులు గెలిచిన తరువాత తమకు కావలసిన సౌకర్యాలను చేస్తారనే మూఢనమ్మకంతో జీవిస్తుంటారు. అందువల్లే రచయిత ఆర్భాటం తప్ప ఆశయంలేని నటులన్నారు. రంగులు, హంగులతో జీవిస్తారు. కానీ అదే నాయకులకు వాక్శుద్ధి లేదని వాపోయారు.

## సేవా దృక్పథం :

"ఆర్భాటం తప్ప
ఆత్మలు లేని నటులు
తెరముందొక మాట
తెరవెనుకో మాట
ప్రజాసేవ పేరుపెట్టి
ఆడుతున్నారో మహానాటకం
ఇది రచయిత రాయని నాటకం"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

పై కవితా పాదాలన్నీ కూడా ప్రజలను ఉద్దేశించి చిత్రీకరించారు. అంటే ఆర్భాటంతో జీవిస్తున్న ప్రజలు ఏ విధంగా ఆత్మహత్యలు చేస్తుకుంటున్నారో అని తెలియజేశారు. అలాగే రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు పలికిన పలుకుల్ని తెరముందొక మాట, తెరవెనుకో మాట అని పేరుపెట్టి ప్రజాసేవను చేస్తున్నారు.

అంటే ఇదంతా కూడా మహానాటకంగా భావించారు. అందువల్లే దీనిని ఎలాంటి రచయిత రాయని నాటకంగా వ్యక్తపరిచారు.

"ప్రతి పార్టీ నాయకులూ
ఇందులో పాత్రధారులు
ఆరంభం అంతం సమయం సందర్భం
ఫలితం ప్రయోజనం వీళ్ళకనవసరం"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

రాజకీయ నాయకులందరూ ఒకరి మీద మరొకరు ఆధారపడి జీవిస్తుంటారు. అంటే అందరూ కూడా ఈ నాటకంలో పాత్రధారులే అని తెలియజేశారు. ప్రజలకు చేయాల్సిన సేవా దృక్పథం మాత్రం వీళ్ళకు అవసరం లేదని వెలిబుచ్చారు. అంటే ఆరంభం గానీ, అంతంగానీ, సమయం గురించి గానీ, సందర్భం గానీ, దీని వల్లే కలిగే ఫలితం గానీ, ప్రయోజనం గురించి రాజకీయ నాయకులకు పనిలేదన్నారు. ఆ రోజు వాళ్ళ పార్టీ గెలిస్తే అది చాలనే దృక్పథం మాత్రమే వాళ్ళలో ఉంటుంది తప్ప మరే ఉద్దేశం వాళ్ళ మనస్సుకు తాకదనే విషయాన్ని వ్యక్తపరిచారు.

### రాద్ధాంతమే సిద్ధాంతం :

"నిన్నటి నాయకుడు
నేటి ప్రతినాయకుడు
నిన్నటి ప్రతి నాయకుడు
రేపు మరింత పెట్టుబడి పెట్టే
బడా నాయకుడు
ఎప్పుడో గాని రంగం మారదు
ఎప్పుడో గాని ప్రవేశించిన పాత్ర
నిష్క్రమించదు
ఈ రాజకీయంలో
రాద్ధాంతమే సిద్ధాంతం"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

నిన్న, నేడు, రేపు ఈ మూడు రోజులను గురించి నగ్నముని కవిత్వీకరించారు. ఎలాగంటే నిన్న గెలిచినటువంటి నాయకుడే నేడు ప్రతినాయకుడు కావచ్చు. అలాగే నిన్న ప్రతినాయకుడు ఉన్నటువంటి వ్యక్తే రేపు మరింతగా పెట్టుబడి పెట్టే నాయకుడుగా ఎదగవచ్చనే విషయాన్ని గురించి ప్రస్తావించారు. అంటే ఈ సమాజం ఎప్పుడో గాని మారదని వెలిబుస్తూనే ఈ రాజకీయంలో రాద్ధాంతమే సిద్ధాంతమనే విషయాన్ని మరోసారి గుర్తుచేశారు. అందువల్లే నిన్నటి నాయకుణ్ని, రేపటి నాయకుణ్ని, రాబోయే మరో నాయకుణ్ని ఎవర్నిగానీ నమ్మకూడదనే హితబోధచేశారు. ఎందుకంటే రాజకీయ నాయకులంతా కూడా స్వార్థపరులుగా, అవినీతిపరులుగా, అవకాశ వాదులుగానే ఉంటారే తప్ప ఆలోచన పరులుగా, సమాజానికి మంచి చేయాలనే దృక్పథం మాత్రం వారిలో కొస మెరుపుగా కూడా ఉండదనే ఆవేదనను వ్యక్తం చేశారు. నాయకులు ప్రజల్ని ఏ విధంగా మభ్యపెడుతున్నారనే విషయాన్ని గురించి-

"మృత్యువు కబళిస్తే తప్ప నిష్క్రమించరు కానీ
మృత్యువును కూడా భయపెట్టే నాయకులు
ప్రజలే యీ పాత్రధారులను
బలవంతంగా యీడ్చేస్తే తప్ప
రంగస్థలం విడిచిపెట్టరు"

(నగ్నముగని, రచయిత రాయని నాటకం)

నాయకులు చనిపోయిన వ్యక్తులను కూడా భయపెడుతారన్నారు. అంటే ప్రజలు ఇలాంటి పాత్రధారులందర్నీ బలవంతంగా తొలగించుకోవాలని వెలిబుచ్చారు. నాటక రంగస్థలంలో ఉన్నటువంటి పాత్రధారులు ఎలా ఉంటారో అలాగే రాజకీయ నాయకులు కూడా రంగస్థలంలో నాటుకొని ఉంటారనే ఆశాభావాన్ని తెలియజేశారు. నాటకంలో పాత్రలు వారి వారి పాత్రలను ప్రదర్శించిన తరువాత ఎలా విరమించుకొంటారో అలాగే ఈ రాజకీయ నాయకుల్ని కూడా రంగస్థలం నుండి తొలగించాలని వెలిబుచ్చారు.

### భీభత్స రసం :

"ఈ నాటకం రసం
వీరం కాదు ఉత్తి విషాదం కాదు
హాస్యం కాదు ఉత్తి అపహాస్యం కాదు

శృంగారం కాదు ఉత్తి శృంగభంగం కాదు
నాయకులు
ప్రజల పచ్చినెత్తురు పట్ట పగలు
తేనెలాగ జుర్రుకు తాగే భీభత్సం"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

నగ్నముని గారు నవ రసాల్ని వీరి కవిత్వంలో కవిత్వీ కరించారు. అంటే వీటిలో వీరం కాదు, విషాదం కాదు, హాస్యం కాదు, అపహాస్యం కాదు, శృంగారం కాదు, శృంగ భంగం కాదు. ఇవన్నీ కాదనే తెలియజేశారు. అంటే నాయ కులు ప్రజల పచ్చినెత్తుర్ని కూడా వదలి పెట్టకుండా తాగేస్తున్నారనే ఆవేదనను తెలియజేశారు. అలాంటి నాయ కుల్ని ఎన్నుకొనేటప్పుడు జాగ్రత్త వహించాలని రచయిత మరోసారి హితబోధచేశారు.

**అబద్ధం-నిజం :**

"ఎన్నికలప్పుడు తెరలేస్తుంది
మైకులు మైకంలో
వాగ్దానాలు గుప్పిస్తారు
అబద్ధాన్ని నిజమని నమ్మింపజేసే
నిజాన్ని అబద్ధంగా భ్రమింప జేసే
ఈ నాటకాన్ని ఏ రచయితా రాయలేడు
ఏ రచయితా యింత కర్కోట నాటకం రాయడు"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

నాయకులు ఎన్నికలప్పుడు చేసే వాగ్దానాలన్నీ కూడా ఎన్నికలు అయిన తరువాత మరచిపోతారు. ఎందుకంటే వాళ్ళు ఎన్నికల్లో గెలుపు కోసమే మైకులు మైకంలో వాగ్దా నాలు చేస్తుంటారు. అంటే ఆ సమయంలో అబద్ధాన్ని కూడా నిజమని నమ్మింపచేస్తారు. నిజాన్ని కూడా అబద్ధంగా భ్రమింప జేస్తారన్నారు. అందువల్లే నాయకుల్ని ఎవర్నీ కూడా నమ్మకూడదనే తెలియజేశారు. ఇలాంటి నాటకాన్ని ఏ రచయిత రాయలేడన్నారు. అంతేకాకుండా ఏ రచయిత కూడా ఇంత కర్కోటమయిన నాటకాన్ని రాయడని ఆవేదన చెందారు.

**రాజకీయ ప్రయోజనం :**

"ఈ రాజకీయ వ్యాపారంలో
పేదల బాధలకి కన్నీళ్ళు కారుస్తూ
మధ్య మధ్య తమ రంగులు
వెలసి పోతున్నయేమోనని వులిక్కిపడి
తాము సాగిస్తున్న
రాజకీయ ప్రయోజనం
ప్రజలకు - బీద ప్రజలకు
సమాజ న్యాయం చేకూర్చడమేనని"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

రాజకీయ ప్రయోజనం ప్రజలకు - బీద ప్రజలకు అంటున్నారనే గానీ, ఎటువంటి సహాయ సహకారాలు ప్రజలకు అందలేదు. ఇటువంటి రాజకీయ నాయకులను నమ్మడమంటే మూఢనమ్మకంతో జీవించడమే విషయాన్ని వ్యక్తపరిచారు. అందువల్లే నాయకుడు ప్రజల కష్టాల్ని కళ్లార చూస్తేగానీ వాళ్ళ బాధలన్నీ అర్థం కావనే విషయాన్ని గురించి మరో సారి నగ్నముని గారు పై కవితా పాదాల్లో వెలిబుచ్చారు.

"భూమీ ఆకాశం బద్దలయ్యేట్లు
నినాదాలు యిస్తారు
అహింస మన ధర్మమని
లాఠీలతో చెబుతారు"

రాజకీయ నాయకులు నినాదాలు తప్ప మరేమీ చేసే లేదని విషయాన్ని ఏనాడో పసిగట్టారు నగ్నమునిగారు. అందువల్లే రాజకీయ నాయకుల్ని ఇంత తీవ్రంగా ఖండిం చారు. భూమీ ఆకాశం పగిలేటట్లు నినాదాలు చేసిన గానీ ప్రయోజనం మాత్రం సూన్యమన్నారు. అలాగే అహింస మన ధర్మమనే విషయాన్ని గురించి ప్రస్తావించారు.

"ఇక్కడ రాద్ధాంతమే సిద్ధాంతం
ఆర్భాటం తప్ప ఆశయం లేని నటులు"

(నగ్నముని, రచయిత రాయని నాటకం)

రాజకీయ నాయకులు వ్యక్తపరిచిన రాద్ధాంతమే సిద్ధాం తంగా భావించాలి. ప్రజల్లో ఆర్భాటం ఉన్నా గానీ ప్రయో జనం లేదు. నటుల్లో ఆశయం కూడా లేకుండా పోయిం దనే విషయాన్ని ప్రస్తావించారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

**రాజకీయ వ్యాపారం :**

"ఇక్కడి రాజకీయం
వ్యాపారాలన్నిటికీ సామ్రాట్టు
సమాజమే పెట్టుబడిగా సాగే మహా వ్యాపారం
రంజయిన వ్యాపారం
ఇంక చాలు
ఈ క్షణం
ప్రజలు ప్రేక్షకులుగా వుండడమో
నిర్మాణవేత్తలుగా మారడమో
నిర్ణయించుకోవలసిన సమయం"
(నగ్నముని, రచయిత రాయని నాటకం)

ప్రజలు ప్రేక్షకులుగా ఉండి ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకొంటారో, లేకపోతే నిర్మాణవేత్తలుగా మారుతారో అనేటువంటి విషయాన్ని ప్రజలకే వదిలిపెట్టారు నగ్నముని గారు. ఎందుకంటే ఇక్కడ రాజకీయమే వ్యాపారాలన్నిటికీ సామ్రాట్టుగా నిలుస్తుంది. అలాంటిది సమాజానికి ఏ మాత్రం సేవ చేస్తారనే విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఇది మామూలు వ్యాపారం కాదు సుమా! రంజయిన వ్యాపారంమంటున్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఏ ధోరణిలో ముందుకు సాగాలో నిర్ణయించుకోవలసిన సమయం వచ్చిందని వాపోయారు.

"ఇంక చాలు
ఇది ప్రజలు తెరదించవలసిన నాటకం
ఇది ప్రజలే తీర్చి దిద్దుకోవలసిన సమాజం"
(నగ్నముని, రచయిత రాయని నాటకం)

అంటే ఇక చాలు. ఇలాంటి నాటకాలంతా ఇక మీదట సాగవు. ప్రజలు ముందుకు వెళ్ళి, ఇలాంటి నాటకాలన్నీ అంతా తెరదించేయాలని వెలిబుచ్చారు. దాంతో ప్రజలే సమాజాన్ని తీర్చు దిద్దుకోవలసిన బాధ్యత కూడా ఉందనే విషయాన్ని తెలియజేశారు.

**ముగింపు :**

నగ్నముని గారు 'రచయిత రాయని నాటకం'లో ప్రజల కష్ట నష్టాలను తెలియజేశారు. వాళ్ళకి జరగాల్సిన పనులు ఏవీ జరగడం లేదని వాపోయారు. అంటే ఆనాటి సామాజిక స్థితిగతులు ఎలా ఉన్నాయో, ఆనాటి రాజకీయ నాయకులు ప్రజలకు ఎంత వరకు న్యాయం చేస్తున్నారో అనేటువంటి విషయాన్ని కూడా ప్రస్తావించారు. అందువల్లే రామాయణ, భారత, భాగవతాల దగ్గర నుండి నేటి వరకు ఇలాంటి రచనలను చేయలేదని ఆవేదనను వ్యక్తపరిచారు. ఇలాంటి కవితలు చదవడం ద్వారా చీకట్లో ఉన్నటువంటి ప్రజలు కూడా వెలుగులోకి రావడానికి ఆస్కారం ఉంటుందనే ఆశాభావాన్ని నగ్నముని గారు కవిత్వీకరించారు. నగ్నముని కవిత్వం సామాన్య ప్రజల జీవన గాథను తెలియజేస్తుందనడంలో సందేహంలేదు. దీనిని బట్టి చూస్తే నగ్నముని గారు కలం ప్రజల మనస్సులోకి చొచ్చుకొనిపోయి కవిత్వాన్ని కవిత్వీకరించాడనే విషయం ద్యోతకమవుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. జివిఎస్ఆర్ కృష్ణమూర్తి (సంపాదకులు), తెలుగు పాఠ్యగ్రంథం, కవితావిభాగం (సంప్రదాయ, ఆధునిక కవిత్వాలు), మద్రాసు విశ్వవిద్యాలయం, చేపాక్-600 005, చెన్నై, 2002
2. ద్వా.నా.శాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర, ప్రగతి పబ్లిషర్స్, 3-11-275/1, శ్రీశంకర్ కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500 074,పరివర్ధిత చతుర్థ ముద్రణ: జూన్, 2008.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# సి.నారాయణరెడ్డి సాహిత్యం - సామాజిక దృక్పథం

- డా॥. జి.కిషన్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

1931 జులై 29న నాటి కరీంనగర్‌జిల్లా హనుమాజీ పేటలో పుట్టిన సి.నా.రె తన కన్నతల్లి బుచ్చమ్మ గారి గురించి "బ్రతికినంత కాలం బంగరు మమతల పొందించిన పాలవెల్లి" అని కీర్తించారు. తండ్రిగారు మల్లారెడ్డి గురించి "ఐదుగురు పాలేర్లున్నా నల్లని రేగళ్ళు దున్ని బ్రతుకున రవ్వల పండించిన కర్షకమణి" అని పొగడి కొడుకుగా ఋణం తీర్చుకున్నారు సినారె. ఆయన తొలి పేరు సత్యనారాయణరెడ్డి. కాని తండ్రి స్కూలు రిజిష్టర్‌లో సి.నారాయణరెడ్డి అని రాయించారు.

హనుమాజీ పేటలో ఒక ఉపాధ్యాయుడు నడిపిన వీధి బడిలో నారాయణరెడ్డి చదువుకు శ్రీకారం చుట్టి ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆ తరువాత సిరిసిల్లలో ఉర్దూ మాధ్యమంలో తెలుగును ఒక ఐచ్ఛిక విషయంగా తీసుకొని మాధ్యమిక విద్యను, కరీంనగర్‌లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో 1948లో ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు.

ఆరవతరగతి నుండే కవిత్వం రాయటం ప్రారంభించిన నారాయణరెడ్డి ఏడవతరగతిలో

"ఒకనాడు ఒక నక్క ఒక అడవిలోపల
పొట్టకోసర మెటో పోవుచుండె" అనే పంక్తితో

ప్రారంభించి పద్యం వ్రాయగా-అది సీసపద్యమని తెలిపి ఛందస్సుకు సంబంధించిన కొన్ని మెలకువలను శ్రీ దూపాటి వెంకటరమణాచార్యులు తెలిపారు.

హైదరాబాద్ చాదర్‌ఘాట్ కళాశాలలో ఉర్దూ మాధ్యమంలో ఇంటర్‌మీడియట్ (1948-49) చదివారు. ఆ సమయంలోనే శ్రీ జువ్వాడి గౌతమరావు సంపాదకత్వంలో వెలువడే "జనశక్తి" పత్రికలో నారాయణరెడ్డి గారి కవిత తొలిసారిగా ప్రచురణ అయింది. ఉర్దూ మాధ్యమంగా ఉస్మానియా యూనివర్సిటీలో బి.ఏ. చదివి ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సాహితీ సంచిక "శోభ"కు సంపాదకుడిగా వ్యవహరించారు. అదే యూనివర్సిటీలో ఎం.ఏ. చదివారు. తెలంగాణ రచయితల సంఘానికి కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు. ఆ దశలోనే మహాకవి దాశరథి సాహచర్యం లభించింది. వారిద్దరూ "తెలంగాణా నయన యుగళం"గా పేరొందినారు ఆచార్యులు కె. గోపాల కృష్ణారావు, పల్లాదుర్గయ్య, దివాకర్ల వెంకటావధాని గారలు నారాయణరెడ్డి గారి గురువులు ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం గారి పర్యవేక్షణలో "ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు, అనే అంశంపై పరిశోధన చేసి 1962లో డాక్టరేట్ సాధించారు. 1953లో "నవ్వనిపువ్వు"తో ప్రారంభమైన రచనా వ్యాసంగంలో 18 ప్రక్రియలున్నాయి

మహాకవులు ఎక్కడినుంచో, ఆకాశం నుంచో ఊడి పడరు. నగర యాంత్రిక జీవితంలోనూ ఉద్భవించరు. ఒక మహాకవికి తనవ్రేళ్ళు తానుపుట్టిన నేలలో బలంగా ఉండాలి. తానుపుట్టిన నేలలో ప్రజల జీవన స్థితిగతులతో, కడగళ్ళతో, తల్లి, తండ్రీ అన్నాతమ్ములు, కుటుంబం, ఇరుగు పొరుగువారు, తమవీధి గ్రామంతో ఆ కవికి బలమైన సంబంధాలు ఉండాలి. సి.నా.రె అలా తనుపుట్టిన నేలలో వ్రేళ్ళూనికొని ఉన్నారు కాబట్టే ఆయన మహాకవి అయ్యాడు. ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలకు హాజరై రాజకీయాలను ఆసక్తిగా గమనిస్తున్నా ఆయన మనసంతా తెలుగునేలపైనే ఉండేది.

సి.నా.రె.ది బహుముఖీన జీవితం. అధ్యాపకుడుగా వైస్‌ఛాన్స్‌లర్‌గా, పరిపాలకుడుగా ఆయన రాణించడం ఒక ఎత్తు, అయితే కవిగా, సాహితీవేత్తగా. సినిగేయ రచయితగా వక్తగా ఆయన సాగించిన జీవితం మరో ఎత్తు. 1954 నుంచి 1981వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఉపన్యాసకులుగా ఆ తరువాత అధికార భాషా సంఘాధ్యక్షులుగా సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్‌గా, కె.యు ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్స్‌లర్‌గా, భాషా సాంస్కృతిక సలహా

దారుగా, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి అధ్యక్షుడుగా, చివరకు రాజ్యసభ సభ్యుడుగా అయన ఎన్ని పదవులు సమర్థంగా నిర్వహించినప్పటికీ ఆయనది మచ్చలేని జీవితం. ఏ పదవి నిర్వహించినా ఆయన ఆ పదవికే వన్నె తెచ్చారు. ప్రామాణికత కలిపించారు. ఆయన సాహితీ పాండిత్యం, మేరునగ వ్యక్తిత్వం అందుకు దోహదం చేసింది. ఏ పదవి నిర్వహించినా ఆయన తన కవితా వ్యాసంగం వీడలేదు. పదవుల్లో తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించూకుంటూనే పుఃఖానుపుఃఖాలుగా కవితలు పాటలు రాశారు. తెలుగు సాహితీ లోకంలో ఉన్నత శిఖరాలు అధిరోహించారు. తెలుగు సినిమాకు పాటలు రాసి సినీరంగానికి ఒక ప్రామాణికత, వన్నె తెచ్చి పెట్టారు. భక్తి గీతాలు రాసినా, దేశ భక్తిగీతాలు రాసినా, ప్రణయ గీతాలు రాసినా సామాజిక చైతన్యం తెప్పించే (కలిగించే) గీతాలు రాసినా ఏ పాటలోనూ ఆయన సాహితీ విలువలను త్యాగం చేయలేదు)

సామాజిక చైతన్య సాహిత్యమనగానే శ్రీశ్రీ, గురజాడ, దాశరథిలను ఎక్కువమంది ఉదహరిస్తుంటారు. సి.నా.రె అనగానే ప్రయణగీతాలు, జానపదబాణీలు, గేయ కావ్యాలు, అద్భుతంగా రాస్తాడంటారు. అయితే ఈ కవులకు సమవుజ్జీగా సి.నా.రె సామాజిక చైతన్య గీతాలు రాశాడు. ఆ సామాజిక చైతన్యగీతాలలో కొన్ని గీతాల పరిశీలనే నా వ్యాస ఉద్దేశ్యం. ఆయన రాసిన గీతాలు, కవితలకు ఈ వ్యాసాన్ని పరిమితం చేసుకున్నాను. ఈ వ్యాసంలో ఆయన రచనలలోని నాలుగు అంశాలను ప్రస్థావిస్తాను.

1. సి.నా.రె రచనలలో సంస్కృతీ వారసత్వాలను ప్రతిబింబించిన పాటలు
2. రైతు ప్రాధాన్యత కవిత్వం
3. మానవతావాదం
4. పరిపాలనా రాజకీయ వ్యవస్థలను ఆవిష్కరించిన తీరు

**సంస్కృతీ వారసత్వాల ప్రతిబింబించిన పాటలు:**

పద్మశ్రీ, కళాప్రపూర్ణ మధురకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి "మంచు పొగలుండేవి మరికొన్ని నిమిషాలే, ఆ పిదప నిండేవి ఆదిత్య కిరణాలే అన్నారు.

"మహాభారతం వెలసింది రాణ్మహేంద్ర వరంలో
భాగవతం వెలసింది ఏకశిలా నగరంలో
ఈ రెంటిలోన ఏది కాదన్న
ఇన్నాళ్ళ సంస్కృతి నిండుసున్న
"తెలుగు జాతిమనది, రెండుగ వెలుగు జాతి మనది"

అనడం ద్వారా తెలుగు భాషా సంస్కృతులకు హద్దులు లేవని, ఐక్యంగా సాగాలని సూచించారు.

మనవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ"
అని పాడినా,
"స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం"

అని నుడివినా "జాతిని నడిపిన నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు" అని ఉద్బోధ గీతాలు రాసినా ఆయనకాయనే సాటి.అన్ని తత్వాలకంటే మానవత్వం గొప్పదన్నాడు.

సినారె సాహిత్యంలో సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. సినారె "విశ్వం నా ఊరు, శాంతి నా పేరు" అంటారు. కులమతాల ముసుగులో మనుషులమన్న అసలు సంగతి మరచిపోవడాన్ని ఖండించిన సినారె "ఒకే తోట వికసించిన రకరకాల పువులురా! ఒకే వాణి గుడిలో వెలుగొందిన మణిదివ్వెలురా అన్నాడు. వీరి అక్షర గవాక్షాలు పాఠకుల బుద్ధి ద్వారాలు తెరిపిస్తాయి.

అమ్మానాన్నల ప్రేమను గురించి ఆగిపోని కాలాన్ని గురించి,జీవన సంఘర్షణల గురించి, ప్రకృతి గురించి, పల్లెల గురించి రాసిన సినారె ఎందరో కవులకు మార్గదర్శులు, అన్యాయాలను, అసూయలను, అమానుషాలను నిరసించడం, మాట్లాడాల్సిన సందర్భంలో మౌనం వహించడాన్ని ఖండించడం, బహురూపాలైన కోరికలు మనిషిని కుదిపేస్తుంటే అదుపులో పెట్టుకోగలిగే మనోస్థైర్యం అండగా ఉంచుకోవాలనడం, జ్వలన శీలతను, సృజన శీలతను ఆహ్వానించాలనడం లాంటి వెన్నో సినారె కవితల్లో గమనిస్తాం.

"జానానికి కులం లేదు
కలిసి పోవడం
గుండె ఒలికి పోవడం
అంతే తెలుసు ఆ పిచ్చి తల్లికి

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

- - - - - - - - - - -

- - - - - - - - - - -

అది ముక్కుమూసుకున్న తపస్సుకాదు

దిక్కులను విశ్వీకరించుకున్న తేజస్సు

- - - - - - - - - - - - - -

పగిలిపోయింది పడమటి దర్బారు

ఎగిసి పోయింది స్వచ్ఛంద దృక్కు. . . . . అన్నాడు సినారె

భారతీయ ఆత్మ పట్టణాలల్లో కాదు పల్లెటూళ్ళలో ఉంది. పల్లె, పల్లెకూ వెళ్ళండి. సకల మానవాళికీ విశ్వ మంతటికీ సహాయం చేయండి. "ఇతరుల ముక్తికై నర కాన్నైనా స్వీకరించండి అనే ఆధునిక ఋషి వివేకనందుడి వాణి పడమటి దుర్బారును పగులగొట్టిన వైనం సినారె కవితలో రూపుదాల్చింది.

నాదేశం భగవద్గీత/ నా దేశం అగ్నిపునీత సీత

నాదేశం కరుణాంతరంగ/ నాదేశం సంస్కారగంగ అని

ప్రస్తుతించి, వర్తమాన నైతిక పతన కారణాల్ని అధిక్షేపిస్తూ. . . . .

ఎక్కడి కెళుతుంది దేశం ఏమైపోతుంది

మేరు శైలి శిఖరం పైకా -పాతాళ కుహరం లోకా"

అంటూ సమాజాన్ని నిలదీస్తాడు.

వందేమాతర గీతంలోని ప్రధాన పదాలను (సుజలాం, సుఫలాం మలయజ శీతలాం, సస్యశ్యామలాం) వర్తమానానికి వర్తింపజేస్తూ వాటి ఉనికిని అధిక్షేపించిన తీరు అధ్భుతం.

వందేమాతర గీతం వరస మారుతన్నది

తరం మారుతున్నది ఆస్వరం మారుతున్నది

## రైతు జీవన చిత్రణ లేదా రైతు ప్రాధాన్యత కవిత్వం :

తన తండ్రిని గురించి సినారె 'కర్షకమణి" అన్నారొక చోట. ఆయన దృష్టిలో కర్షకులు మణిమాణిక్యాలకన్నా విలువైనవారు. రైతుల వ్యక్తిత్వ చిత్రణమే కాకుండా వారి వెతలను ప్రధానంగా కవితారూపంలో ఆవిష్కరించారు. అన్నదాత రైతన్న జీవితావిష్కరణ చేయడం కంటే సాహిత్యం సాధించే సామాజిక చైతన్యమేమున్నది.

లోకానికే అన్నం పెడుతున్న రైతుల ప్రాముఖ్యతను ఈ విధంగా తెలిపాడు.

రైతేరా లోకానికి ఆధారం! ఆ

చేతిదే మనం తినే ఆహారం!

రైతు లేనిదే ఏ రాజ్యం లేదు! అన్న

దాత లేనిదే సౌభాగ్యం లేదు!

మనం తింటున్న ఆహారమంతా అన్నదాత రైతు శ్రమ వల్లనే సాధ్యమైంది అని స్పష్టం చేస్తూ అటువంటి రైతుకే అన్నం కరువై బతుకే బరువై చివరికి ఆత్మహత్యలను చేసుకునే వారి జీవిత ధైన్యాన్ని అక్షరీకరించి నేతలను ప్రశ్నించాడు.

వానరాక పసిమొక్కలు వాడి వత్తలవుతున్నా

సిరులొలికే పంటతల్లి వరదల పాలవుతున్నా

ముక్కోపం నిగ్రహించి ముక్కారు ఒళ్ళువంచి

చెమటోడ్చే రైతును కాదంటే ఏ

జాతికైన మనుగడ లేదంతే!

రైతుశ్రమకు విలువనీయని వ్యవసాయరంగ గతిని అధోగతి పాల్జేసే ఏ జాతికైనా ప్రభుత్వాలకైనా పతనం తప్పదని హెచ్చరిక చేశారు. సమాజాన్ని సంక్షోభానికి గురి చేస్తున్న సమస్య రైతుల మరణాలు మట్టినుంచి మనిషిని విడదీయలేం. మట్టి, మనిషి, ఆకాశం వీటి చుట్టే అల్లుకుంది సృష్టి కథా సూత్రం అని మట్టిని స్థలానికి సంకేతంగా రూపొందించిన కవి. "మనిషి మూలం చూడ గోరితే మట్టి బిడ్డను కలుసుకోమని మనసు అంచును తాకగలిగితే మట్టి సైతం కాంచనం" అని అన్నారు. మట్టిని నమ్ముకున్న జీవిత నేపథ్యం నుంచి వచ్చిన సినారె

"మట్టిని దైవంగా నమ్ముకొని దాన్ని చెమటతో తడిపి

పండించిన పంటలు

చేతికందని వాళ్ళున్నారు

వాళ్ళ ఇంటి కొచ్చి చూస్తే ఎదురయ్యేవి

బోసిపోయిన వంటగిన్నెలే. . . . .

అంటూ జాతికి అన్నంపెట్టే కర్షక జీవుల క్షుదాగ్నిని ఈ విధంగా కవితగా మలిచారు.

**మానవతా వాదం :**

పరుల బాధ తన బాధగ
పరిచుకున్న వాడే కవి
పరుల సుఖంలో శిరస్సు
పైకెత్తిన నాడే కవిత.

ఆవేదనా తరంగాల నుండే చిక్కనైన కవిత్వం జాలు వారుతుంది. వాల్మీకి శోకం, శ్లోకం అయినట్లు నారాయణ రెడ్డి బాధ కవితగా అవిర్భవించింది. నేటి సంఘాన్ని లోకాన్ని ఈ లోకంలోని పోకడలను చూసిన ఈ కవి వేదనా భరిత హృదయంతో స్పందనాత్మక కవిత్వం సృజించాడు.

శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతున్నాం. ప్రపంచం మారుతుంది. సాంకేతిక పరిజ్ఞానంతో మనిషి సృష్టికి ప్రతి సృష్టి చేయగలుగుతున్నాడు. కాని అభివృద్ధితో పాటు మనిషి తన పతనాన్ని కూడా సృష్టించుకున్నట్లుంది. అణుబాంబులు ఆటంబాంబులు, ఇవన్నీ భస్మీపటలం చేయగల సామర్థ్యం కల్గినవి కనుక. . . .. . . . .

"శాస్త్రజ్ఞులారా
పరమాణువులు రగిలి
చరిత్రను పొగచూర నీయకండి. . . . . అని

సినారె తన బాధను వ్యక్తపరుస్తూ లోకంలోని ఈ అణువును మేలుకోసం వాడండి. ఈర్ష్యా ద్వేషాలతో మనిషిని మనిషి, దేశాలకు దేశాలు నాశనం చేసుకుంటే ఎట్లా అని ఆవేదన వ్యక్తం చేశాడు. అందుకే ప్రపంచ సౌభాగ్యానికై మన మేధస్సును ఉపయోగించాలని ఉద్బోధచేస్తూ

రేపటి హృదయం నాలో
లోపల గుసగుస లాడెను
మనిషీ నీ భవిష్యత్తు
మహోజ్వలంగా ఉంది". . . . అని భరోసానిచ్చాడు.

గతం కన్నా వర్తమానం మెరుగైందని దానిని సవ్యంగా సరిచేసుకొంటూ భవిష్యత్తును బంగరుమయంగా దిద్ది తీర్చుకోవాలన్న సామాజిక సందేశమిందులో ఉంది". ఓ మనిషీ నీలోని అనైక్యతను తొలగించి, నేను అనేదాన్ని వదిలి మనం అనేది హృదయంతో నాటుకొమ్మని సూచించాడు.

తన మాట పాటై మోగాలని, పాటమాటై నిలిచి పోవాలని ఆరాటపడిన సాహితీ యశస్వీ.

'మాటకు దండం పెడుతా" పాటకు దండం పెడతా
మాటను పాటను నమ్మిన మనిషికి దండం పెడతా"

అని తన షష్టిపూర్తి సభలో తెలిపారు.

పులిని చూస్తే పులి ఎన్నడు బెదరదు
మెక వస్తే మేక ఎన్నడు అరవదు
మాయరోగమదేమో గానీ
మనిషి మనిషికి కుదరదు అన్నాడొక చోట. . .

మనిషి సాటిమనిషిని సమాదరించాలన్న సందేశం ఉంది.

"గోరంత దీపం"లో కథానాయిక కష్టాల్లో వున్నపుడు ఆమెకు ధైర్యాన్నిచ్చే స్ఫూర్తిగీతం మహిళా లోకాన్ని చైతన్య పరిచే గేయం

"మతి తప్పిన కాకుల రొదలో
మౌనమే వెలుగు
దహియించే బాధల మధ్య
సహనమే వెలుగు
కడలి నడుమ పడవ మునిగితే
కడదాకా యీదాలి
నీళ్ళులేని ఎడారిలో
కన్నీళ్లయిన త్రాగి బతకాలి

'మానవుడు-దానవుడు" సినిమాలో

అణువూ అణువున వెలసిన దేవా
కనువెలుగై మము నడిపించ రాదా
మనిషిని మనిషే కరిచేవేళ
- - - - - -- - - - -
అమరజీవులై వెలిగిన మూర్తుల
అమృత గుణం మాకందించరావా! అనే పాట బహుళ జనాదరణ పొందింది.

మనిషిలో మానవతా విలువలను పెంపొందించడానికి దేవుణ్ణి వేడుకుంటు రాసిన ఈ పాటలో మనిషిలో

మానవతా విలువలు పెంపొందాలన్న ఆకాంక్ష వ్యక్త మైంది.

తెలుగు సాహిత్య ప్రపంచంలో ఓ అపూర్వప్రయోగంగా సినారె "ప్రపంచపదులు" ప్రక్రియను సృజన చేశారు. పంచపదుల్లో ప్రపంచం పేరుతో డా.ఎన్ గోపి 'ప్రపంచ పదులు'కు రాసిన ముందుమాటలోని ఈ వాక్యాలు సినారె మానవతా వాదసూత్రాన్ని స్పష్టంగా ఆవిష్కరిం చాయి.

మనిషి పట్ల గాఢమైన ప్రేమతో ప్రవచించిన కవితా త్మక పంక్తులు ఈ "ప్రపంచపదులు" మనిషి మనుగడా, అతని వ్యష్టి సామూహిక జీవన ప్రయత్నాలకు క్షణక్షణం స్పందించి అందించిన కవితలవి. నిరాశా నిస్పృహల పాలుకాకుండా మనిషిని రక్షించుకోవాలనే తపనతో కృత నిశ్చయంతో చేస్తున్న "వెనుచరుపులు" ఆవేదన, సాను భూతి, బుజ్జగింపు, మేలుకొలుపు పట్టుదలా, అన్నింటిని మించి కార్యోన్ముఖ కంఠంతో కదను దొక్కిస్తున్న వేడివేడి వాడి పంక్తులు మనిషి ప్రగతికోసం కవి అన్వేషిస్తున్న పాజి టివ్ పరిష్కారాలు.

మనిషిని తన పల్లవిగా, పతాకంగా అవధిగా అకాసంగా ఉచ్ఛ్వాసంగా, నిశ్వాసంగా భావన చేశారు సినారె.

"పంచేంద్రియాల్నే కాదు
ప్రపంచాన్నే
రాయిలా నిలిపేవాడు
ఋషి
రాయిలా పడివున్న
ప్రపంచాన్ని
అహల్యగా మలిచే వాడు
మనిషి." . . . . . . .

అని మనిషిలోని మానవతకు శిఖరస్థాయిని కలిపిం చారు. అందుకే డా. లింగంపల్లి రామచంద్రగారు మానవ చైతన్యాన్ని, ప్రగతిని అకాంక్షించి రచన చేస్తున్న మహాకవి సినారె గారు. తన ఆశయం సఫలం కావడానికి భిన్న పార్శ్వాల నుంచి మనిషిని, అతని అంతరంగ ప్రవృత్తిని, ఔన్నత్యాన్ని చిత్రించారు. అన్ని విధాల మనిషి పురోగమిస్తే విశాల విశ్వం కూడా నవనవంగా ప్రవర్ధిల్లుతుందని భావిం చారు. (నిత్యహరిత సాహితీ చైతన్య శిఖరం సినారె-ముందుమాట నుండి నిత్య చైతన్య శీలి సినారె) సినారె సాహిత్యంలో సమాజాన్ని మార్చాలనే తపన కనిపిస్తుంది. అందుకే ఆయన కవిత్వం నిండా "మానవతా పరిమళా లుంటాయి.

మధ్యతరగతి మందహాసాన్ని మంటలలో మనుగడ సాగిస్తున్న మానవుణ్ణి సినారె మధురంగా చిత్రించి చూపారు. వారు చూపిన మనిషి చిత్రాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. "నారాయణరెడ్డి కవితలో నూటికి తొంభై పాళ్ళు మానవతా ప్రబోధం కనిపిస్తుంది అన్న అభిప్రాయం గమనించదగింది. (డా॥ తిరుమలశ్రీనివాసాచార్య, నారా యణరెడ్డి సాహితీమూర్తి పు.60)

"మనిషి నశించినా
నశించదు మానవత్వం
అదే ఈ లోకానికి మణిసోపానం
అనంతం వైపు దాని ప్రస్థానం . . . . . . అన్నారు.

"మానవుడు" అనే కవితలో "మంటలూ-మానవుడూ" సినారెకి సాహిత్య అకాడమీ బహుమతిని సాధించి పెట్టింది.

సినారె మానవతా పతాకాన్ని రెపరెపలాడిస్తూ వచన కవితా ప్రక్రియలో అందించిన కావ్యం "విశ్వంభర" ఈ కావ్యానికి మానవుడే నాయకుడు. మనిషి కథే ఇతివృత్తం. మనిషి జీవితాన్ని సమగ్రంగా దర్శించి కావ్యరూపంగా మలిచారు సినారె.

వెన్నెల తాజ్‌మహల్ పైనా, పూరిగుడిసెపైనా ఒకేలా ప్రసరిస్తుందని, మల్లియ బృందావనంలోనేకాదు పేదల ఇంటి ముంగిటా విరుస్తుందని చెపుతూ మంచితనాన్ని అందరికి అందించడంలో తరతమ బేధాలు ఉండవని స్పష్టం చేశారు సినారె. ఇదే భావాన్ని ఈ సినీ గీతంలో వ్యక్తం చేశారు.

మనసులోని బురద కడుగుకొని
మనుషుల్లా బ్రతికే వారు
సమధర్మం చాటేవారు
వారిదే ఈనాటి తరం
వారిదే రానున్న యుగం" అన్న వారి అశాభావం స్వీక రించతగింది.

తప్పు చేయని వారు అంటూ ఎవరూ ఉండరు. అయితే ఆ తప్పుని సరిదిద్దే ప్రయత్నం చేయాలని చేయూతనిచ్చి నిలపాలన్నారు సినారె.

పాడవోయి భారతీయుడా, చదువూ సంపద అందరిదీ / పాడీపంట అందరిదీ లాంటి సినీ గీతాలెన్నింటిలోనో సినారె సామాజిక చైతన్యాన్ని రంగరించారు.

అలాగే మనషులు దైవత్వ గుణాన్ని అలవరచుకొంటే సమాజమే సమతాదేవాలయమవుతుందనే అర్థం వచ్చే

"ఇందరు మనసులు దైవతలైతే ఎందుకు వేరే కోయిలలు?

ఇన్ని మనుషులూ గీతికలైతే ఎందుకు వేరే కోయిలలు" అంటూ గజళ్ళ గానాలాపన చేశారు.

**పరిపాలనా, రాజకీయ వ్యవస్థలను ఆవిష్కరించిన తీరు :**

మతాలను వాడుకునే రాజకీయాలు ప్రజలను వంచిస్తూ పబ్బం గడుపుకునే పదవీ వ్యామోహాలు, ధనం - ఇవి నేటి సామాజిక వ్యవస్థను శాసిస్తున్నాయి. సమానతను సాధించలేని వాటి అస్థిత్వాన్ని సినారె.

"మంచిని వెలగించని ఆమతం మతం కాదంటాను
మనిషిని బతికించని ఆ ధనం ధనం కాదంటాను
- - - - - - - - - - - - - -
మెదడును నడిపించని ఆ చదువు చదువు కాదంటాను'

అని నిష్కర్షగా చెప్పారు. ఎవరిమతంవారిది. ఒకరి మతాన్ని మరొకరు గౌరవించాలి. అయితే సామాజిక విద్రోహులు, రాజకీయ స్వార్థపరులు కలహాలు సృష్టిస్తూ తమ పీఠాలను శాస్వతం చేసుకొంటున్నారు. అన్ని మతాలు సహజీవనం చేసిననాడే సామ్యవాదం సాధ్యమవుతుందన్నది సినారె కవిత్వ సారాంశం.

"అధికారం పూనుకుంటే అందలాల కేమి కొరత, అని పదవి మనిషిని ఎన్ని విధాల ఆటలాడిస్తుందో అధిక్షేపించారు. పదవిలో వున్నవాడు పరమాత్మతో సమానుడై ప్రజలందరిని సమాదరించాలన్నాడు. ప్రజలసేవ చేయని పదవి పదవే కాదన్నారు.

"ఈ గద్దెకోసమేనా ఇన్ని వేషాలు వేసేది
ఈ గడ్డి కోసమేనా ఇన్ని మోసాలు చేసేది
ఇన్నాళ్ళు మనిషంటే ఏమేమో అంచనా వేశారు
ఈ ప్రాణి కోసమేనా ఇన్ని ప్రాణాలు తీసేది
ఈ పేరు కోసమేనా ఇన్ని పాపాలు మోసేది"

అని సినారె ఈ ఎద్దేవా రాజకీయనాయకుల నీచ కృత్యాలు, రాక్షసచర్యలను తెలుపుతున్నది. పదవికోసం అనేక జిమ్మిక్కులు చేయడం సాటిమనుషుల ప్రాణాలను గడ్డిపోచగా, భావించి తీయడం రాజకీయ రాక్షస కేళీ విలాసంగా విమర్శించారు సినారె. "కుక్కలు మాంసం ముక్కల కోసం కొట్లాడితే ఛీ అంటాము! పదవుల కోసం మనుషులు కుస్తీ పడుతుంటే ఏమంటాము. అనటం ద్వారా పదవులపై నాయకులు పడే ఆరాటంలోని నికృష్టవైఖరిని బయల్పరిచారు.

"ఓట్లకోసం సీట్లకోసం
కోట్ల పచ్చ కాగితాలతో నిన్ను
అహరహం అభిషేకిస్తున్న వాళ్ళ పరువును
ఆ మాత్రమైనా నిలబెట్టక పోతే
నీ పరువు నిలుస్తుందా స్వామీ!

బియ్యంతో వియ్యమందే పలుగురాళ్ళు! పాలతో తాదాత్మ్యం చెందే పంపునీళ్ళు/ పాలకవర్గాలలో పరిమళిస్తున్న కుళ్ళు/అన్నీ నీ లీలలేనా దేవా! అవినీతిపై ప్రయోగాలు చేస్తున్నావా" అన్న అధిక్షేపంలో సమాజంలో అవినీతి, అ క్రమాలు, పాలకవర్గాల స్వార్థపరత్వాన్ని ప్రస్ఫుటం చేశాడు.

కవిత నాశ్వాస, సమత నాభాష అన్న సినారె మనిషి కున్న వివేకం విచ్చుకుంటే కనిపించని గాలిని సైతం కోస్తుందనడంలో విజ్ఞతను అలవరుచుకొని, పెంపొందింప చేసుకోవాలని ప్రబోధంచేశాడు. భ్రాంతికున్న అకర్షణ వాస్తవానికి లేదు. నైలాన్‌కున్న నగిషీలు ఖద్దరుకు ఉంటాయా అంటు తన సహజధోరణిలో ప్రశ్నించాడు. యదార్థాన్ని తెలుసుకునేందుకు ఎదురునిలవాలి అంటూ "తల బద్దలైనా సరే అల ఢీ కొడుతుంది" కడుపు చిట్లిపోతున్నా విత్తనం పచ్చని మొలకను ప్రసవిస్తుంది. అంటూ

పిడికిలిని బిగించమన్నాడు. మానవుడు సాధించిన నాగరికత మళ్ళీ గుహలోకి మరలడానికి కాదు. మనం చూడవలసినది ఆటవిక భయానక దృశ్యాలు కావు. మనలో మనతో తిరిగే “భూమి పుత్రుల దళిత గాత్రాలు” అని తరతరాలుగా వర్ణవ్యవస్థ వలన పీడితులైన దళితుల చరిత్రను తెలిపారు. ‘భూమి పుత్రులు గా సంబోధించి వారి కఠినశ్రమ జీవితాన్ని ప్రతిబింబించారు. దళితులను ఇక్కడ పుట్టిన “తొలి చూలు బిడ్డలు” అని పేర్కొని ఒక్కటిగా పుట్టిన మనుష్యజాతి తమకు తాముగా కల్పించుకున్న విభేదాలను గురించి నాగరికతను నేర్చిన మనిషి పెంచుకున్న సంకుచిత భావాలను గూర్చి తెలిపి బాధ పడ్డాడు.

“మట్టి బెడ్డలని విసిరికొడితే
ఉరిమే గొంతుకలై విచ్చు కుంటాయ”ని
ప్రభంజనంలా లేచిన మానవ సంచనలం

దౌష్ట్యం పై విరుచుకు పడుతుంది అన్న హెచ్చరికతో సామాజిక చేతన ఉంది.

ప్రకృతి కాలుష్యానికి కూడా మనమే కారణం. మనమే ప్రభావితులం అవుతామన్నాడు సినారె. “కాలుష్యం” కవితలో గాలి కలుషితమైందనే అంశాన్ని మొదలు పెట్టి ఆ కాలుష్యానికి కారణం రాజకీయ కాలుష్యం అని కారణం చెప్పడం ద్వారా ఒకే ఒరలో రెండు కత్తులను పొదివినట్లు చేశాడు.

ఒకటి ప్రకృతి కాలుష్యం. రెండవది మానవరాజకీయ కాలుష్యం. ఇక్కడ గాలి కలుషితమై మానవులను ప్రభావితం చేయడానికి బదులు మానవులు కలుషితులై స్వచ్ఛమైన ప్రాణవాయువును కలుషితం చేసినట్లు చిత్రించడంలో అద్భుతమైన కవిత్వీకరణ, భావగాఢత, సాంద్రత కలిసిపోయాయి.చారిత్రక కావ్యాలు రాస్తూ కూడా వారు గుర్తించిన పరిపాలనాపరమైన సామాజిక సందేశాన్ని మనం స్వీకరించవచ్చు.

“కర్పూర వసంతరాయలు” కావ్యంలో కవి రాణిని కేవలం అర్థాంగిగానే కాకుండా దేశానికి ప్రతీకగా చిత్రించినాడు. రాజుకు దేశం గవ్వతోనైనా సమానం కాకుండా పోయిందే అని రాణి పరితపిస్తుంది. ఈ కావ్యంలో దేశం గురించి రాణి చేసిన విచారణ అమెకు దేశంపట్ల ఉన్న దృష్టి ఎంత ఉన్నతమైందో తెలుపుతుంది.

రాణి క్షేమమే దేశక్షేమమన్న విషయం, రాణి దేశం ఒక్కటే అని స్పష్టం చేస్తుంది. లకుమ చెప్పిన మాటకు జవాబుగా రాజు తన అభిప్రాయాన్ని తెలియజేయటంలో రాణియే దేశమన్న విషయం మరింత స్పష్టం చేయబడింది.

రాణియనగ భూదేవికి
ప్రతినిధి, ఆమెపైనాకు
అనురాగమ్మనను, కాని
అదరమ్ము గలదెంతో . . . . . అంటాడు రాజు అలా

కవి దేశ ప్రజల సుఖ సంతోషాలే రాజుకు పరమార్థం కావాలన్న సందేశాన్నిచ్చాడు.

తెలుగు సాహిత్యానికి రెండోసారి జ్ఞానపీఠాన్ని అందించిన సినారె స్మారక కేంద్రం ప్రతిష్ఠాత్మకమైన సంస్థకు సినారె పేరు పెట్టడం వంటి నిర్ణయాలతో పాటు ఆయన విగ్రహాలను ట్యాంక్‌బండ్‌తో సహా సిరిసిల్ల , కరీంనగర్, హనుమాజీపేట మొదలైన చోట్ల ఏర్పాటు చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించడం మనకెంతో గర్వకారణం.

సినారె ది మానవీయ దృక్పథం. ఆయన సాహిత్యం సామాజిక చేతనకే అంకితం. క్రమశిక్షణ కవితో పాసన, సభానిర్వహణ వాక్చాతుర్యం వంటి ఉన్నత లక్షణాలను ఈతరం వారసత్వంగా తీసుకొని వారి ఆశయాల వెలుగులో పయనించాలి.

పరిమళాల నెవడాపును/ పైరగాలి నెవడాపును
ఎవడాపును మానవతా/ రవి రుక్కును కవివాక్కును
ఏదైనా రాయనిదే/ ఈ క్షణాన్ని పోనీయను
కలాన్ని పిండేయందే కాలాన్ని/కదలినీయను అని

ఆయన రాశారు. సినారె ఈనాడు మన మధ్యలేరు. ఆయన సృజించిన సాహిత్యం నిత్యం సజీవంగా ఉంటుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమంలో చైతన్యోద్యమాలు

- జి. ఎన్. సుదర్శన్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు, తెలంగాణ.

భారతదేశంలోకి బ్రిటిషు వారు మొదట వర్తకం చేసుకోవటానికి వచ్చారు. వర్తకం చేసుకుంటూనే క్రమంగా వారి స్థావరాన్ని స్థిరం చేసుకున్నారు. ఇలా స్థిరపరుచుకున్న స్థావరాలను దేశమంతటా విస్తరించటానికి స్థానిక రాజుల దగ్గర అనుమతి పొందటం ద్వారా స్థానాన్ని పదిల పరుచుకున్నారు. దేశంలో స్థానికంగా స్థిరపడినాక అధికారం కొరకు మార్గాన్ని అన్వేషించసాగారు. ఈ అన్వేషణలో ప్రాంతీయ రాజులతో యుద్ధాలు చేయడం, ఈ యుద్ధాలలో కొన్నిటిలో అజేయులై ఆ ప్రాంతంపై అధికారాన్ని సాధించటం జరిగింది.

బ్రిటిషు వారి అధికారాన్ని స్థానిక ప్రజలు, రాజులు అంగీకరించలేకపోయారు. పరాయి వారి పెత్తనాన్ని భరించలేని ప్రజలలో అసంతృప్తి రేగింది. ఈ అసంతృప్తి రగిలి రగిలి మహా ఉద్యమాలకు దారి తీసింది. ఈ ఉద్యమాల ద్వారా ప్రజలలో స్వాతంత్ర్య కాంక్ష ఏర్పడింది. ఈ స్వాతంత్ర్య అభిలాష కోసం సాగించిన ఉద్యమాలు, దేశవ్యాప్తంగా చిన్న చిన్న ఉద్యమాలతో మొదలై అవి తీవ్రమైన తిరుగుబాటులకు దారి తీసాయి. ఇలా దేశవ్యాప్తంగా సాగిన ఉద్యమాలు హైదరాబాదులో కూడా జరిగాయి.

హైదరాబాదులో జరిగిన ఉద్యమాలను స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా సాగిన చైతన్యోద్యమాలుగా వ్యవహరిస్తారు. ఈ ఉద్యమాలు ప్రధానంగా హైదరాబాద్ రాష్ట్ర ప్రజలను ఉద్యమంలో భాగస్వాములని చేయటానికి, వారిని ప్రేరేపించటానికి కొన్ని సంస్థల ఏర్పాటు వలన జరిగాయి. ఆ సంస్థల ద్వారా నిద్రాణమై ఉన్న హైదరాబాద్ సంస్థాన ప్రజలలో ఉద్యమ భావజాలాలు, ప్రజా సమస్యల తీరు, అణచివేయబడుతున్న ప్రజా సమస్యల ఉద్యమాలు వీటన్నిటినీ ఎదుర్కోవటానికి నాయకుల స్ఫూర్తి, వారు ప్రారంభించిన ఉద్యమాలు, సంఘాలు ఎంతగానో తోడ్పడ్డాయి.

హైదరాబాదులో జరిగిన ఉద్యమాలు చిన్న నీటి కాలువలు అయితే, ప్రధాన కాలువ జాతీయోద్యమం. ఈ ఉద్యమాలు ప్రాంతీయంగా జరిగినప్పటికీ, వీటికి జాతీయ భావజాలం, అఖిల భారత కాంగ్రెసు నాయకుల స్ఫూర్తి, రాజకీయ చైతన్య స్ఫూర్తి కలిగి ఉండటంతో జాతీయోద్యమంలో భాగంగా జరపబడ్డాయి. "ఈ స్థానిక ఉద్యమాల లక్ష్యం స్వాతంత్ర్యం అయితే దానికి సాధనం జాతీయోద్యమం" (హైదరాబాదులో జాతీయోద్యమాలు). దేశంలో నివసిస్తున్న ప్రజలకు నామమాత్రపు హక్కులైనా ఉండేవి. కాని హైదరాబాదు రాష్ట్రంలో నివసిస్తున్న వారికి హక్కులు అంటే ఏమిటో తెలియని విధంగా నిజాం పరిపాలిస్తూ ప్రజల్ని గాఢాంధకారంలో ఉండేటట్లు చేసేవాడు. వాక్స్వాతంత్ర్యం, సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ఉత్సవాలు అన్నిటిని నిషేధించేవాడు. వీటి నిషేధాల వలన అసంతృప్తులుగా ఉన్న నిజాం రాష్ట్ర ప్రజలు నిజాంను, నిజాం యజమాని అయిన బ్రిటిషు (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమం) వారిని ఎదిరించటం ప్రారంభించారు.

ప్రధానంగా హైదరాబాదు సంస్థానంలో ఏడవ నిజాం అధికారం చేపట్టే వారికి దశాబ్దం ముందు నుంచి జరిగిన ఉద్యమాలు అన్నీ శాంతియుత ఉద్యమాలే, ఒక సాయుధ పోరాటం తప్ప. ఈ సాయుధ పోరాట సమయంలో రైతు ప్రజానీకానికి జరిగిన ఉద్యమానికి ప్రతీకార ఆవేశంతో హింస చేయడానికి కూడా వెనకాడలేదు.

హైదరాబాదు ప్రజలని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపించటానికి సాగించిన ఉద్యమం ఆంధ్రోద్యమం. "ఇది తెలంగాణ ఆంధ్రోద్యమం. హైదరాబాదులోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం కేంద్రంగా కొంత కాలం కొనసాగింది. దీనికి 1921లో బీజావాపనం జరిగింది" (హైదరాబాదులో జాతీయోద్యమం).

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

ఈ ఆంధ్రోద్యమం మహారాష్ట్రుల భాషాభివృద్ధికి నిరసన గానే వచ్చింది. తెలుగు భాషని, తెలుగు వారిని మరాఠీలు చేసిన అవహేళనని, భరించలేని తెలుగువారు భాషా వికాసానికి, చైతన్యం నింపి, ఈ ఉద్యమాన్ని భాషా సాంస్కృతిక ఉద్యమంగా ముందుకు సాగించారు.

"గ్రంథాలయోద్యమానికి బీజాలు 1901 సెప్టెంబర్ 01న స్థాపించిన శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం (తెలంగాణ ఆంధ్రోద్యమం) స్థాపనతో పడినాయి". నిజాం పాలనలో ఉన్న తెలుగువారి దుస్థితి భాష సంస్కృతుల స్థితి అగమ్యగోచరంగా ఉండేది. భాషా వికాసానికి వీధి బడులు పఠనాలయాలు ఏవి ప్రారంభించినా వాటిని నిజాం నిషేధించేవాడు. ప్రజల్ని జాగృతం చేసి ఉద్యమంలో పాల్గొనేలా చేసేందుకు నాయకులు ఎన్ని విధాలుగా యత్నించినా వాటన్నింటినీ అణచివేసేవాడు. అయినా ప్రజలు రహస్యంగా గ్రంథాలయాలకు వెళ్ళి పుస్తకాలు చదివేవారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ప్రజలందరినీ మేల్కొలిపి నిజాంకు వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతి జిల్లా, తాలూకాలలో ఒక ఖుతుబ్ ఖానా (గ్రంథాలయం)ను ఏర్పాటు చేసే దిశలో ఇది ఒక మహోద్యమమై సాగింది.

ఆంధ్రోద్యమంలో భాగమైన ఈ గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్రజనసంఘం, ఆంధ్ర మహాసభల ప్రధాన ఉద్దేశ్యం, హైదరాబాదులో తెలుగువారిని జాగృతం చేసి ప్రగతిరథం వైపు నడిపించడం, తద్వారా నిజాం నిషేధించిన హక్కుల్ని తిరిగి పొందటం, స్వతంత్రులుగా జీవించటం, నిజాంను సంస్థానాన్ని యూనియన్ చేరవలసిందిగా ఒత్తిడి తీసుకురావడంలో భాగంగానే ఈ ఉద్యమాలు జరిగాయి. ఆంధ్రజనసంఘం స్థాపన జరిగిన నాడే నిజాం రాష్ట్రంలో రాజకీయోద్యమానికి నాంది పడిందని వెల్దుర్తి మాణిక్యరావు తన హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర అనే గ్రంథంలో తెలిపారు.

భారతదేశంలో 1905లో స్వదేశీ ఉద్యమం జరిగింది. ఇలాంటి ఉద్యమం నిజాం రాష్ట్రంలో కూడా జరిగింది. "20వ శతాబ్దం మూడవ దశకంలో రెండో రౌండు టేబుల్ సమావేశంలో దేశీయ సంస్థానాల ప్రజలకు ప్రాథమిక హక్కులు ఇవ్వాలని అంగీకరించారు. ఈ హక్కులకు అనుగుణంగా హైదరాబాదులో కుమారి పద్మజానాయుడు గారి అధ్యక్షతన స్వదేశీ ఉద్యమం జరిగింది." (హై.స్వా.చ, 318) దేశవ్యాప్తంగా స్వదేశీ ఉద్యమంలో జరిపిన విధానాలే ఇక్కడ కూడా అవలంబించారు. స్వదేశీ ఖద్దరును ప్రోత్సహించడం, విదేశీ వస్తు బహిష్కరణ లాంటి ఉద్యమాల ద్వారా యావత్ ప్రజానీకం చైతన్యులయ్యారు.

1921లో ఏర్పడిన నిజామాంధ్ర జన సంఘం, 1930లో ఏర్పడిన ఆంధ్రమహాసభగా అవతరించి క్రమంగా 1946 వరకూ 13 మహాసభలు నిర్వహించి "తెలుగువారి భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసినై. అటు బ్రిటిషు వారికి, ఇటు నిజాం ప్రభుత్వానికి కొద్దిపాటి గుబులు పుట్టించినై. కొల్లాపూరులో జరపాలనుకున్న సభను ప్రభుత్వం ఈ భయంతోనే నిషేధించింది." (హైదరాబాదులో జాతీయోద్యమాలు). ఈ విధంగా నిజాం, సభల నిర్వహణకు ఆటంకం కలిగించేవాడు. ఎంత ఆటంకం కలిగించినా నాయకులు ఏదో విధంగా సభలు నిర్వహించి విజయవంతం చేసేవారు. "ఈ ఆంధ్ర మహాసభల నిర్వహణ జాతీయోద్యమంలో అంతర్భాగమే అన్నది చరిత్ర చెబుతున్న సత్యమని" కసిరెడ్డి వెంకటరెడ్డి తన హైదరాబాదులో జాతీయోద్యమాలు అన్న గ్రంథంలో తెలిపారు.

ఆంధ్రజనసంఘం ద్వారా ప్రజలను, నాయకులు వారి ఉపన్యాసాల ద్వారా మేల్కొలిపినారు. ఈ సమయంలో, హైదరాబాద్ ప్రజలు అనుభవిస్తున్న పీడన జీవనాన్ని భరించలేక, నాయకులు చేస్తున్న ఉద్యమాలకు ప్రకృతి కూడా సహకరించింది. "1923లో అఖిల భారత జాతీయ కాంగ్రెసు సభను నిర్వహించడానికి కాకినాడ వెళ్తున్నారు జాతీయ నాయకులు. విధివశాత్తు వర్షం పడి రైలు మార్గం దెబ్బతినడంతో వారి ప్రయాణానికి ఆటంకం కలిగింది. దీంతో ప్రయాణం ఆపిన జాతీయ నాయకులను హైదరాబాదీ నాయకులు కలుసుకొని వారితో సమావేశమై ఇక్కడి ప్రజలలో స్ఫూర్తి నింపేలా చేశారు." (హైదరాబాదు

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


స్వాతంత్ర్యోద్యమ చరిత్ర). ఈ స్ఫూర్తితో హైదరాబాద్ మొదటి రాజకీయ మహాసభ నిర్వహణకు నాంది పడింది. ఇలా జాతీయ కాంగ్రెసు నాయకుల ప్రభావంతో నిజాం రాష్ట్ర ప్రజలు చురుకుగా ఉద్యమంలో పాల్గొన్నారు.

ముల్కీ అనే పదానికి స్థానికుడు అనే అర్థం ఉండేది. "నైజాం రాష్ట్రంలో 1935 ముల్కీ ఉద్యమం జరిగింది." (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, పుట.165) ముల్కీ ఉద్యమానికి, స్వాతంత్ర్యోద్యమానికి కొంత పోలిక ఉంది. బ్రిటిషు వారు ఇండియాకి వచ్చి కంపెనీలు పెట్టి భారతీయులకు ఉపాధి లేకుండా చేయడం, వారి మను గడకు ఇబ్బంది కలిగించేలా చేసారు. అదే రీతిలో ఉత్తర భారత ముస్లిములు కూడా హైదరాబాదుకు వచ్చి ఉద్యోగాలలో చేరటం వల్ల స్థానిక విద్యావంతులకు ఉపాధి కరువైంది. దీంతో హైదరాబాదులో నిరుద్యోగిత మితిమీరింది. ఎంత చదివినా హిందువులకు ఉద్యోగాలు ఇవ్వకూడదన్న ఉద్దేశ్యంతో నిజాం మత పక్షపాతిగా ఉండేవాడు. దీంతో ముల్కీలు, నాన్‌ముల్కీలకు వ్యతి రేకంగా ఉద్యమించడంతో స్థానిక హిందువులలో కొత్త చైతన్యం తెరలేచింది.

వందేమాతర ఉద్యమం 1938లో ఉస్మానియా విద్యా లయంలో (ఉ.వి) జరిగింది. ఈ ఉద్యమం ప్రధానంగా రెండు మతాల మధ్య జరిగినప్పటికీ జాతీయ భావజాలం ఉన్నది. అసలీ ఉద్యమం జరగటానికి కారణం నిజాం అనుసరించిన మత మౌఢ్యమే. ఉ.వి వసతి గృహాలలో హిందువులు వందేమాతరం ఆలపించేవారు. ఇది విన్న ముస్లిం విద్యార్థులు వార్డెనుకు చెప్పటంతో "1938 నవం బర్ 28 నుంచి ఈ వందేమాతర గీతాన్ని ఆలపించవద్దని ఉత్తర్వులు జారీ చేసారు అధికారులు." (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, పుట.225) విద్యార్థులు ఈ ఉత్తర్వులను గమనించి హైదరాబాదులో నిజాంకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. "ఈ వందేమాతర ఉద్యమం ఔరంగాబాదులో ఉధృతరూపం దాల్చింది. క్రమంగా దీనిపై భారత నాయకుల దృష్టి పడగా వారంతా దీనిని సమర్థించారు. సుభాష్‌చంద్రబోసు మీరు లొంగి పోవలసిన పనిలేదు, మీ ఉద్యమం న్యాయమైన దని లేఖ రాశాడు." (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, పుట.228).

గాంధీ నుంచి వారసత్వంగా వచ్చిన సత్యాగ్రహ పదా నికి రాష్ట్రంలో విశిష్ట స్థానముంది. ప్రత్యేకంగా 1938లో హైదరాబాద్ సత్యాగ్రహాలకు నిలయంగా మారింది. స్టేట్ కాంగ్రెసు, హిందూ సివిల్ లిబర్టిస్ యూనియన్, ఆర్య సమాజ సత్యాగ్రహాల ద్వారా జాతీయ దృక్పథాన్ని, పౌర హక్కుల స్థాపనకు బీజాలు వేసి ప్రజలందరినీ ముఖ్యంగా హిందువులు ఈ సత్యాగ్రహాలలో కార్యోన్ముఖులు కావా లని నాయకులు కోరేవారు. "1892లో ఆర్యసమాజం హైదరాబాదులో స్థాపింబడటానికి స్వామి నిత్యానంద సరస్వతుల వారి కృషి ఉపదేశ ప్రభావమే కారణం" (హై.స్వా.చ., పుట.368). ఆర్యసమాజ స్థాపన ద్వారా అనేక మంది ఇందులో చేరి రాజకీయంగా చైతన్యవంతు లయ్యారు.

భారతజాతి యొక్క స్వాతంత్ర్య సమరంలో తుది పోరాటం క్విట్ ఇండియా. ఈ ఉద్యమం ప్రారంభమైన స్వల్ప వ్యవధిలోనే గాంధీ, నెహ్రూ, పటేలు వంటి అగ్ర నాయకులందరూ అరెస్టు కాబడ్డారు. ఈ అరెస్టుకు నిర సనగా దేశవ్యాప్తంగా అల్లర్లు రేగాయి. ఆ సమయంలో హైదరాబాదులో కూడా జిల్లాలలో నాయకులు నిరసనలు తెలిపారు. "ఈ నిరసనలు ఖమ్మం, వరంగల్లు, హైదరా బాద్ ప్రాంతాలలో ఎక్కువగా వెల్లువెత్తాయి. సుల్తాన్ బజారులో మాణిక్యప్ప, చందప్ప అనే కాంగ్రెసు వాదులు క్విట్ ఇండియా అని నినదించగా పోలీసులు అరెస్టు చేశారు." (హై.స్వా.చ. పుట.420). ఈ ఉద్యమం యొక్క ప్రభావం స్థానిక నాయకులపై పడి అరెస్టుకు దారితీసింది. ఈ విధంగా దేశంలో ఏ ఉద్యమం జరిగినా దాని ప్రభావం హైదరాబాదులో పడుతుందనేది ఈ ఉద్య మాల ద్వారా ఇక్కడి వారు మరింత ఉత్సాహవంతులై జాతి స్వాతంత్ర్యానికై పాటుపడేవారు. "హైదరాబాదులో క్విట్ ఇండియా నినాదం చేస్తుండగా 400 మందిని అరెస్టు చేశారు" (హై.స్వా.చ. పుట.422). ఇటువంటి సమయంలో

జాతీయ భావజాలాల పరంపర స్ఫూర్తితో తెలుగువారిని ప్రగతి రథంవైపు నడిపించిన ఆంధ్రోద్యమం క్రమంగా ఆంధ్ర మహాసభగా మారింది. దీని ప్రభావంతో మరాఠీలు, కన్నడిగులు వారి ప్రాంతంలో పరిషత్తులు ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా ఏకమై స్వాతంత్ర్య హక్కులకై పోరాడారు. "అయితే విశాల ప్రాతిపదిక మీద మొత్తం రాష్ట్రానికి ఒకే సంస్థ ఉండాలనే దృష్టితో 1938లో హైదరాబాదు స్టేట్ కాంగ్రెసు పేర సంస్థ స్థాపించినామని ప్రకటించటంతోనే ఉద్యమం ప్రారంభమైంది." సంస్థలన్నీ ఏకమై నిజాం రాష్ట్రంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిందిగా ఉద్యమించాయి.

తీవ్రమైన నియంతృత్వ విధానంతో పరిపాలిస్తున్న నిజాంకు ప్రతిఘటనగా చాలా ఉద్యమాలు జరిగాయి. అయినా తన నియంతృత్వ ధోరణిని ఏమాత్రం మార్చు కోలేక మరింత తీవ్రంగా చెలరేగాడు. ఈ నియంత ధోరణిని గమనించిన సోషలిస్టు పార్టీ, హైదరాబాదు ప్రజలకు పోరాటంలో వెన్నెముకగా నిలబడింది. ఈ సోషలిస్టు పార్టీ నాయకురాలు తమ ప్రసంగాలతో పీడింపబడుతున్న వారిని మేల్కొలిపినది. ఈ నాయకులలో జయప్రకాష్ నారాయణలాంటి అగ్రజులు ప్రధానులు. కొన్ని సందర్భములలో "జయప్రకాష్ నారాయణ హైదరాబాద్ స్వాతంత్ర్య సమరమంటే భారత స్వాతంత్ర్య తుది సమర మని నమ్మేవారు" (హై.స్వా.చ. పుట.531).

భారత స్వాతంత్ర్య సాధనకు దేశంలో జరిగిన పోరాటాలకు అనుగుణంగా, వాటి ప్రభావంతో నిజాం రాష్ట్రంలో కూడా పోరాటాలు జరిగాయి. స్టేట్ కాంగ్రెసు హైదరాబాద్ భారత యూనియన్‌లో చేరాలని కోరగా, కమ్యూనిస్టు పార్టీ మాత్రం పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఉండి, హైదరాబాద్ రాష్ట్ర ప్రజల ధ్యేయానికి విరుద్ధంగా కమ్యూనిస్టులు నిజాంకు అనుకూల ధోరణిలో వ్యవహరించారు. అయినా వారి సిద్ధాంతం నైజాం ప్రజల ముందు తన స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయింది. చివరికి మిలటరీ నిజాం సంస్థానం 1948 సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో కలవటంతో హైదరాబాదు ప్రజలు సంపూర్ణ స్వతంత్రులైనారు.

జాతీయ స్థాయిలో స్వరాజ్యం కొరకు జరిపిన ప్రతి సమరంలోను, హైదరాబాద్ ప్రజలు నిజాం సంస్థానాలలో జరిగిన ఉద్యమాలలోనూ ప్రజలు భాగస్వామ్యులైనారు. ప్రాంతీయ స్పృహతో, రాజకీయంగా ఉద్యమాల ప్రభావంతో చైతన్యులై ప్రత్యక్షంగా పీడిస్తున్న నిజాంకు, స్థానిక భూస్వాములకు, నిజాం యజమాని అయిన బ్రిటిషు వారికి వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేసారు. ఈ ఉద్యమాలు స్వాతంత్ర్యపోరాటం, ప్రాంతీయ పోరాటం, వర్గపోరాటం, భూస్వామ్య వ్యతిరేక పోరాటం, వ్యక్తి స్వేచ్ఛ కొరకు పోరాటం ఇలా ఎన్నో రూపాలుగా జరిగి భారత జాతీయోద్యమ చరిత్రలోనే లిఖింపదగిన ఘనమైన ప్రత్యేకతను చాటుకుంది.

**ఆధార గ్రంథాలు :**

1. హైదరాబాదులో జాతీయోద్యమాలు
2. హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర
3. తెలంగాణలో ఆంధ్రోద్యమం
4. తెలంగాణలో జాతీయోద్యమాలు

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ‘చిత్తూరు కథ’ - సామాజిక స్పృహ

- ప్యాండ్ల వేంకటేశ్వరరావు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

## పరిచయం :

“స్థానికత” కోల్పోయిన సమాజానికి పురోగతి ఉండదు. ప్రపంచీకరణ నేపథ్యంలో “స్థానికతకు” విస్తృతమైన నిర్వ చనాన్ని ఇచ్చుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నిర్వచనం కూడా పండిత భాషలో నేలవిడిచి సాము చేయకూడదు. ప్రజల భాషలో వుంటూ మట్టివాసన చేయాలి” (చిత్తూరు కథ, పుట.4) చిత్తూరు కథకు మంచి రోజులొచ్చాయి. గత కొంత కాలంగా సాగుతున్న చిత్తూరు ప్రాంత స్థానికత పునరుజ్జీవన పరిరక్షణ భాగంగా చిత్తూరు కథకులు తమ ప్రాంతంపై దృష్టి పెట్టారు. ఇతర ప్రాంతాల ప్రభావాలను వదిలి వస్తువుకు, శైలికి కథా రచయితలు పట్టం కడు తున్నారు. అలాగే ఈ కథలకు గౌరవం కల్పించాలనే ఆలో చనతో కృషి మరోవైపు జరుగుతున్నది. అందులో భాగంగా వచ్చినదే ఈ చిత్తూరు కథ సంకలనం. ఇందులో స్థాని కతకు ప్రధాన పీఠం వేస్తూ వచ్చిన కథలను పరిశీలించి నాలుగు కథలను ఎన్నుకొని ఈ కథా సంకలనంలో అచ్చు వేయడం జరిగింది. కథలలో ప్రధానంశం స్థానికతే.

## సంపాదకుని మాటల్లో :

సంపాదకుడు పేరూరు బాలసుబ్రమణ్యం గారు ఉత్తమ కథల ఎంపిక విధానాన్ని తన మాటల్లో ఈ విధంగా తెలియజేశారు.

“చిత్తూరు కథ సంకలనానికి దిశ, దశ ఏమిటనేది నా ముందు నిలిచిన ప్రశ్న. కథకు స్థానికత ఏమిటనే దానికి సూత్రీకరణ పెద్దల నుండి రాబట్టాను. ముందుగా కథ సంకలనం ప్రచురిస్తున్నాం మీ కథలను పంపించాలని పత్రికల ద్వారా రచయితలకు విన్నపం తెలిపాం. దానితో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పలువురు రచయితలు తమ రచనలను పంపారు. చిత్తూరు కథల సేకరణలో ఎందరో సాహితీవేత్తలు తమ సహకారాన్ని అందించారు. రచ యితలు తమ రచనలను తపాల ద్వారా, కొందరు స్వయంగా, మరికొందరు ఈమెయిల్ ద్వారా అందించారు. మొదటగా వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. పేరు ప్రఖ్యాతలు కలిగిన దివంగత రచయితల కథలను గ్రంథా లయాల నుండి సేకరించటం జరిగింది. “ఈ సంకలనం చిత్తూరు జిల్లా సాహితీ సంపదకు నమూనా మాత్రమే కాని పరిపూర్ణం అనే భ్రమలు నాకు లేవు”(చిత్తూరు కథ పుట సంఖ్య:7) అంటూ చివరగా ఈ సంకలనానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయపడినవారికి పేరు పేరున కృతజ్ఞతలు అని వివరించారు.

## కథాంశాలు :

ఈ సంకలనంలోని నలభై నాలుగు మంది రచ యితలు నలభై నాలుగు కథలు తడిమిన కథావస్తువులు సాగునీటి సమస్య, అంతరించిపోతున్న కులవృత్తులు, అడుగంటుతున్న మానవీయ విలువలు, రైతుజీవనంలోని కష్టాలు, కడగండ్లు, ఆనందాలు, జ్ఞాపకాలు యాత్రికలతో పదనిసలు, అతి స్వేచ్ఛ అనర్తాలు, వృద్ధ తల్లిదండ్రుల మృత్యుతుల్యమైన చరమగీతపు క్షోభ, పతనమవుతున్న నైతిక విలువలు, విచ్చలవిడి లంచగొండితనం, అరా చకత్వంలో పెరుగుతున్న యువతరం, మోసాలకు బలైపోతున్న నిరుపేదలు మొదలైనవి ప్రధాన కథాం శాలుగా ఈ సంకలనంలోని కథల్లో కనిపిస్తాయి.

## కథా సంకలనంపై విమర్శ :

వస్తువు ఏదైనా కానీ, సంవిధానం ఏదైనా కానీ, కథనం ఏదైనా కానీ, చదవడం పూర్తికాగానే కథ పాఠకుడిని వెంటాడాలి. ఉన్నచోట ఉండనీయకుండా మనిషిని ఉక్కిరి బిక్కిరి చేయాలి. అప్పుడు అది మంచికథగా నాలుగు కాలాల పాటు చరిత్రలో మిగిలిపోతుంది. ఈ కోణంలో చూసినప్పుడు నూరు సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన చిత్తూరు కథలు ఇప్పుడు తడబడే అడుగుల నుండి వడివడి అడుగులతో కలుపుకొని నడిచే స్థితికి

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

సగర్వంగా చేరింది. అందుకు సాక్ష్యం శ్రీపేరూరి బాల సుబ్రమణ్యం మరియు సాకం నాగరాజు గార్ల ఆధ్వర్యంలో వెలువడిన ఈ చిత్తూరు కథ సంకలన గ్రంథమే.

సాహిత్యంలో ప్రాంతీయస్పృహ స్పష్టంగా వ్యక్తమవు తున్న ఈ సమయంలో చిత్తూరు నుండి వెలువడిన ఈ కథల్లో ప్రాంతపు ప్రత్యేక సమస్యల చిత్రణ ప్రముఖంగా కనిపించింది. చిత్తూరు ప్రాంతపు సామాన్య జీవులు ఎదు ర్కొంటున్న సమస్యలు ఇక్కడి కథకుల్ని గాఢంగా ప్రభా వితం చేసినట్లు ఈ సంకలనంలోని కథలను పరిశీలిస్తే అర్థమవుతుంది. పత్ర నిడివి దృష్ట్యా కొన్ని కథలను మాత్రమే వాటిలోని సంఘర్షణలు తెలియజేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలపడానికి కొంత చింతిస్తున్నాను. కాని అన్నీ కథల ప్రస్థావన తెచ్చినట్లయితే పత్రం యొక్క విస్తృతి ఎక్కువవుతుంది. ఇందులోని ప్రతి ఒక్క కథ దేనికి అది ప్రత్యేకస్థానాన్ని కలిగి ఉంది. కాని నేటి సమాజాన్ని ప్రభా వితం చేస్తున్న అంశాలను ప్రధానంగా చర్చించడమే ప్రధా నాంశం కాబట్టి ఎక్కువ సంఘర్షణలు కలిగిన హృదయ విదారక కథలను తెలియజేస్తున్నాను. అంతేకాని ఒకదాని కొకటి తీసిపోకుండా ప్రత్యేక స్థానాన్ని ప్రతి ఒక్కకథ ఆక్రమించిందని గమనించగలరు.

చిత్తూరు కథ అనే ఈ కథా సంకలనంలోని మొదటి కథ బిడ్డలు. బిడ్డలు అనే ఈ కథలో ముఖ్యంగా పాఠకు లకు రెండు పార్శ్వాలు కనిపిస్తాయి. వ్యసనాలకు అల వాటు పడి క్రమశిక్షణను బానిసత్వంగా భావించి కన్న తండ్రిని పట్టించుకోని పుత్రరత్నాలు ఒక పార్శ్వమైతే తనకు విద్యను బోధించి, తన ఉన్నత స్థితికి కారణమైన గురువును ఎన్నడూ మరవకుండా వినయవిధేయతలతో గురువుగారు తనువు చాలించే వరకు చేదోడు వాదోడుగా ఉన్న కొడుకు గాని కొడుకైన గిరిజన కుర్రాడు ప్రవీణ్ మరొక పార్శ్వం.

కార్పోరేట్ కళాశాలలో చేర్పించి మంచి ఉన్నత స్థితిలో తన కొడుకులను చూడలనుకున్న విద్యాసాగర్‌కి అసంతృప్తే మిగులుతుంది. ముగ్గురు కొడుకులు కూడా పండిత పుత్ర పరమ సుంటలుగా తయారై తండ్రి ఆశయా లపై గండికొడతారు. కానీ ఆ బాధను దిగమింగుకొని తనను నమ్మిన ప్రియశిష్యులను మంచి విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థితికి చేరుస్తాడు. అలా ఉన్నత స్థితిలో కలెక్టర్ ఉద్యోగం పొందిన తర్వాత గురువును మర్చి పోకుండా కృతజ్ఞత భావంతో మెలుగుతాడు. ఆ కృతజ్ఞత భావమే విద్యాసాగర్ గారికి ఆత్మకు శాంతి చేకూరుస్తుంది. క్రమశిక్షణ రహితంగా చెడు వ్యసనాలతో నేర్చిన విద్య ఎన్నటికీ పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టవని అలాంటి చదువులు బూడిదలో పోసిన పన్నీరే అని, సమాజంలో గౌరవంగా బ్రతకాలంటే, తాను ఉన్నత స్థితికి చేరు కోవాలంటే కష్టపడే మనస్తత్వం, గురువుల ప్రోత్సాహం, సాధించాలనే తపన, వుండాలని రచయిత వేంపల్లి అబ్దుల్ ఖాదర్ ఈ కథ ద్వారా తెలియజేశాడు. అంతేకాకుండా వృద్ధ తల్లిదండ్రులను క్షోభ పెట్టకుండా వారిపట్ల కొంత కనికరాన్ని చూపించాలంటూ సమాజానికి హితువు పలికాడు.

“రక్తం పంచుకొని పుట్టినవాళ్ళు నిజమైన బిడ్డలా? లేక ఆత్మీయబంధం అల్లుకున్న వాళ్ళు నిజమైన బిడ్డలా?” (చిత్తూరు కథ, పుట.19) అంటూ పాఠకులను ఆత్మీయ బంధం వైపు పరుగులు తీసేలా రచయిత ఈ కథను చిత్రించాడు. వస్తువు పాతదే అయినా కొత్తగా, ఎంతో దయానీయంగా చిత్రించారు. మంచి లక్షణాలతో జీవించే వ్యక్తి ఎప్పటికి ఒంటరిగా మిగిలిపోడని నలుగురికి ఆదర్శంగా ఉంటూ అందరి మదిలో అమరుడిగా నిలిచి పోతారని విద్యాసాగర్ పాత్రద్వారా రచయిత తెలియ జేశాడు. ఈ కథ ఉత్తమ పురుష దృష్టికోణంలో సాగింది.

**అంటరానితనం :**

మన సమాజానికి అంటరానితనం. దీన్ని రూపుమాప డానికి చాలా మంది చాలా ప్రయత్నాలు చేసినా ఇంకా గ్రామీణ ప్రాంతంలో ఈ అరాచకం కొనసాగుతూనే ఉంది. దళితులను అంటరానివారిగా భావిస్తూ వారిని దూరం పెడుతూ చులకనగా చూడటం నేటికి చాలా గ్రామాల్లో కనిపిస్తుంది. కనీసం వారికి ఏదైనా సహాయం చేసిన వారిని కూడా ఊరినుండి వెలివేయడం లాంటివి

చేయడం నేటికి చూస్తూనే ఉన్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎన్ని పథకాలు తెచ్చినా, ఎన్ని చట్టాలు వచ్చినా అంటరానితనాన్ని పూర్తిగా తుడిచిపెట్టడంలో విఫలమవు తూనే ఉన్నారు. అన్ని రంగాలలో దళితులను అణిచి వేయడం నేటికీ కనిపిస్తూనే ఉంది.

గూళూరు బాలకృష్ణమూర్తి గారు రాసిన 'పనసపండు' అనే కథలో "ఒక తక్కువ కులస్థునికి క్షవరం చేశాడనే ఒక్క కారణం చేత మిగతా కులంలోని ప్రజలందరూ ఒక్కటై ఊరినుండి పంపిస్తారు".(చిత్తూరు కథ, పుట సంఖ్య:146). ఈ ఒక్క సంఘటనను చూస్తే అర్థం చేసుకోవచ్చు దళితుల పట్ల ఎంత చులకన భావం ఉందో తెలుస్తుంది. ఇది చాలా తప్పని ప్రజలందరూ ఒక్కటనేనని భావించాలి. అలా జరిగితేనే దేశాభివృద్ధిగాని సమాజాభివృద్ధి గాని జరుగుతుంది. మనిషిని మనిషిగా చూడలేనంత అవివేకులుగా ప్రజలు ఉండకూడదని నా అభిప్రాయం. అంటరాని వారి జీవన స్థితిగతికి ఈ కథ అద్దం పడుతుంది.

## బ్రతుకుపోరాటం :

ఈ చిత్తూరు కథా సంకలనంలోని 'తపన' అనే కథను పరిశీలించినట్లయితే మనకు చాలా సమస్యలు కని పిస్తాయి. ఒక బలవంతునికి బలహీనునికి మధ్య పోరాటం, మూఢనమ్మకాలు, ప్రభుత్వ అధికారులు రైతుల పట్ల ప్రవర్తించే తీరు, కరువులో కాలిపోతున్నా పట్టింపులు చర్యలు లేని ప్రభుత్వపాలకుల అసమర్థత, తినడానికి లేకున్నా సాంప్రదాయం పేరిట డబ్బును వృథా చేస్తున్న సంఘటనలు, మొదలైన అంశాలు ఈ కథలో కనిపిస్తాయి.

జాషువా గారు గబ్బిలం అనే కవితా సంకలనంలో చెప్పినట్లు ప్రపంచమునకు భోజనము పెట్టువానికి భుక్తి లేదు. ఇది ఊరికే చెప్పిన విషయము కాదని ఈ కథను పరిశీలించిన వారికి స్పష్టంగా తెలుస్తుంది. నేలనే నమ్ము కున్న రైతు చెమటోడ్చి ప్రపంచానికి ఆకలి బాధను లేకుండా చేసి తాను ఎంతవరకు సుఖంగా బ్రతుకు తున్నాడో? సుఖాన్ని వదిలి కనీసం భూమి మీద బ్రతక డానికి ఎన్ని అవస్థలు పడుతున్నాడో ఈ కథలో రచయిత పాలమనేరు బాలాజీగారు కళ్ళకు కట్టినట్లుగా చూపిం చారు.

అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకొని రైతులు రోజుకు సగటు 9-10 అని ఈ మధ్య జరిపిన సర్వేలో తేలింది. ఈ చొప్పున రైతుల పతనం చాలా వేగవంతమే నని తెలుస్తుంది. కథలో చాలా సమస్యలు కనిపిస్తున్న ప్రధానంగా కనబడే సమస్య కరువే. ఈ కరువు నుండి రైతులను, ప్రజలను కాపాడడానికి ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి. అంతేకాకుండా రైతులపట్ల చిన్నచూపు చేసే ప్రభుత్వ అధికారుల పట్ల తగు చర్యలు చేపట్టాలి. రైతుకు సహకరించని ఏ అధికారినైనా శిక్షించాలి. తగిన సహాయాన్ని ప్రభుత్వం రైతుకు అందజేయాలి. అయితే రైతు కష్టాలు కొంతవరకైనా తీరుతాయి. అప్పుడే రైతు దేశాన్ని సశ్యశ్యామలం చేసి ప్రజలకు ఆకలిరోధనలు లేకుండా చేస్తాడు. కాబట్టి దేశ భవిష్యత్తు రైతు చేతులోనే ఉందని గ్రహించాలి. కాబట్టి ప్రతి ఒక్కరు రైతు కష్టాన్ని గుర్తించి తనకు ఇవ్వవలసిన గౌరవం, చేయవలసిన సహాయం చేయాలి. ఎందుకంటే 'రైతేరాజు' రైతు బాగుం టేనే దేశం బాగుంటుంది. అలాగే ఈ సంకలనంలో డాక్టర్ లంకిపల్లె కన్నయ్యనాయుడు రాసిన 'జీవనం', గోపిని కరుణాకర్ రాసిన 'దేవరెద్దు', ఎండపల్లి భారతి రాసిన 'సావు బియ్యమ్ము' మొదలైన కథలలో కూడా రైతు సమ స్యలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి.

## ఆడపిల్లలూ....ఆలోచించండి :

ఈ సృష్టిలో అపురూపమైన జన్మ ఆడజన్మ అని అంటారు కొందరు. స్త్రీ లేకపోతే సృష్టేలేదంటారు మరి కొందరు. ఇంకా స్త్రీ గురించి చెప్పమంటే ఎన్నో గౌరవ ప్రధానమైన వాక్యాలు వస్తూనే ఉంటాయి. కాని నిజానికి ఆడవారికి సమాజంలో అంత గౌరవం ఉందా? అను మానమే అన్నీ మారుతున్నాయి. మహిళలపట్ల మన ఆలో చన ధోరణి తప్పు. అవును "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవత" అని ఆరోక్తి. దీనికి అర్థం ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలవై

ఉంటారు. కాని దేవతగా కొలవాల్సిన స్త్రీ మూర్తిపై అత్యాచార సంస్కృతి నేటి పరిస్థితుల్లో ఆందోళన కలిగి స్తుంది.

ఎక్కడ చూసిన మానభంగాలు, వేధింపులు, అరాచ కాలు, లొంగదీసుకోవడానికి ప్రయత్నాలు జరుగు తున్నాయి. సరైన భద్రత లేదు. ప్రభుత్వం ఎన్ని శిక్షలు మంజూరు చేసిన అవి ఏ మేరకు పనిచేస్తున్నాయో తెలి యడం లేదు. ఎన్ని చట్టాలు వచ్చిన స్త్రీ పై అరాచకాలు తగ్గడం లేదు. ఒక రకంగా ఆడపిల్లలు జాగ్రత్త పడక పోవడం కూడా కొంత అనర్థాలకు దారి తీస్తుందని నా అభిప్రాయం. దానికి ఈ కథ చక్కటి ఉదాహరణగా సరి పోతుంది. ఆ కథే ''జింకపిల్ల'' దీనికి కారణం బాల సుబ్రణ్యంపిళ్ళై గారు రాశారు.

ఆడపిల్లలు కూడా తాము వయసుకురాగానే ఆమెకు అన్నీ తెలుసులే అంటూ వెనకాముందు ఆలోచించకుండా ఎదుటవ్యక్తి మాటలకు పరవశించిపోయి, బహుమానా లకు లొంగిపోయి, జల్సాలకు అలవాటుపడి తల్లిదండ్రు లను లెక్కచేయకుండా మోసపూర్తి ప్రేమలకు తమ మనస్సును, తమ సర్వస్వాన్నీ అందిస్తున్నారు. కాని అలాంటి జిత్తులమారి నక్కలకు బలికాకుండా ఉండ డానికి తనని నిజంగా ప్రేమిస్తున్నాడా? లేక అవసరం కోసమా? అనే ఆలోచనలు లేకుండా ఆవేశపూరిత నిర్ణయాలకు ఆకర్షితులై చివరికి బలైపోయి జీవితాంతం బాధపడుతున్నారు. ఎందుకంటే అవసరం కోసం ప్రేమిం చినట్లు నటించిన ప్రేమ అవసరం తీరాక కనిపించదు. కాబట్టి 'చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం' కాబట్టి అమ్మాయిలు జాగ్రత్తగా ఉంటూ, ఆలోచనలతో కూడిన మంచి నిర్ణయాలు తీసుకుంటే కామాంధుల చేతిలో బలికాకుండా ఉంటారు. ఎందుకంటే ఆడ పిల్ల లపై అరాచకాలు అంతలా ఉండడమే నేను ఈ మాట అనడానికి కారణం.

కంటికి రెప్పలా కాపాడుతూ, కూతురు ఆనందం కోసం తన సుఖాన్ని వదిలి నిరంతరం కష్టపడే తండ్రికి కథానాయిక ఇచ్చిన బహుమానం ఏంటి? అల్లారు ముద్దుగా పెంచిన కూతురు ఆవేశనిర్ణయానికి అల్లరిపాలు కావడమేనా? కాబట్టి ఆడపిల్లలు గమనించండి.... మీ చుట్టూ మిమ్మల్ని వేటాడడానికి వేల కళ్ళు ఎదురు చూస్తూనే ఉన్నాయి. మీ ఆలోచనలతో మీ మంచి నడ వడికతో, మీ సమయస్ఫూర్తిలతో ఆ చూపులను ఖండిం చండి. అంతేకాని మాయమాటలు నమ్మి మోసపోయి మీ జీవితాన్ని నాశనం చేసుకొని మీ తల్లిదండ్రులకు కడుపు శోకాన్ని మిగల్చకండి. ఇలా స్త్రీలను మోసం చేసే కథలు, స్త్రీలను తక్కువ చేసి చూసే కథలూ ఈ సంక లనంలో ఎండపల్లి భారతి 'రాసిన సావుబియ్యము', కలువకొలను సదానంద రాసిన 'గేటు 'కథలో కూడ కని పిస్తాయి.

## తల్లిదండ్రులు :

తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకొని పిల్లలను పెద్దచేయడం, పెద్ద వాళ్ళయిన పిల్లలు తల్లిదండ్రులను సుఖ పెట్టాల్సిందిపోయి ఆస్తులు సరిగ్గా పంచలేరనో, వాళ్ళ వల్ల ఎలాంటి ఉపయోగం లేదనో, ఏవేవో కారణాల చేత తల్లిదండ్రులను క్షోభ పెడుతున్నారు. సమయానికి తిండి పెట్టక ఎప్పుడు చస్తారా? ఎప్పుడు ఈ పీడ విరగ డౌతుందా? అని ఎదురుచూస్తారు అంతేకాకుండా ఇష్ట మొచ్చినట్లు కొట్టడాలు, తన్నడాలు, ఎత్తయిన భవనాలపై నుండి తోసేయడాలు, రోడ్లమీద వదలిలేయడాలు, వృద్ధాశ్రమాలలో చేర్పించడాల్లాంటి చేస్తూ ఎలాగో ఒకలా వదిలించుకుంటున్నారు. ఒక క్షణం ఆగి చిన్నప్పటినుండి వారు చేసిన సేవను గుర్తుచేసుకొన్నట్లయితే ఇలాంటి పొరపాట్లు చేయలేరు. ఎందుకంటే ఎంతో కష్టపడి తాము తినక కూడబెట్టిన తల్లిదండ్రుల ఆస్తులు దర్జాగా అనుభవిస్తూ వారి నడ్డిమీద ఎలా తన్నగలం అనే ఆలో చన బుద్ధి ఉన్న ప్రతి ఒక్కరికి కలుగుతుంది. కాబట్టి వృద్ధ తల్లిదండ్రులను క్షోభ పెట్టకుండా కన్నబిడ్డల్లా చూసు కోవాల్సిన బాధ్యత వారి సంతానానిదే. ఒకవేళ అలా చూసుకొని యెడల ప్రభుత్వం అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటూ తల్లిదండ్రుల ద్వారా వచ్చిన ఆస్తిని

తిరిగి వారి తల్లిదండ్రులకు అప్పజెప్పాలి లేదా ప్రభుత్వమే జప్తు చేసుకోవాలి అప్పుడే పిల్లలకు బుద్ధివచ్చి కనీసం డబ్బుకోసమైన వృద్ధ తల్లిదండ్రులను రక్షిస్తారని పేరూరు బాలసుబ్రమణ్యం గారు 'శిశిర స్వప్నం' అలే కథ ద్వారా పాఠకులకు తెలియజేశారు. పాఠకులను కంటతడి పెట్టించేలా కథను చిత్రించాడు రచయిత. అలాగే అంతరించి పోతున్న కుల వృత్తులను కాపాడాలంటూ కుల వృత్తులపై ఆధారపడే వారికి ప్రభుత్వం తోడుగా ఉండాలంటూ సంకోజి దేవేంద్రచారి గారు 'అన్నం గుడ్డ' కథ ద్వారా తెలియజేశారు. ఇలా నలభై నాలుగు కథలు ఏదో ఒక సంఘర్షణతో చిత్తూరు మాండలికాన్ని కలుపుకొని స్థానికత ఉట్టిపడేలా కథలను రాశారు.

## ముగింపు :

చిత్తూరు స్థానికతకు ఒక చారిత్రక ప్రత్యేకత ఉన్నట్టే. ఒక ప్రత్యేక సాంస్కృత జీవనం ఉన్నది. ఈ సంపుటిలోని నలభై నాలుగు కథల్లో ఆ ప్రత్యేకత ఉట్టిపడుతున్నది. ప్రజల జీవితం, అనుభవాలు, ఆకాంక్షలు, కష్టసుఖాలు, కలగలిపిన స్థానిక వాస్తవికత ఈ కథల్లో ప్రతిఫలించింది. శిల్ప దృష్టితో కంటే వాస్తవికత దృష్టితో పోల్చిచూస్తే వాటి ప్రాధాన్యత అవగతమవుతుంది. అవినీతి, నీటిగోస, కరువు, వెనుకబాటుతనం, వలసలు, అవమానాలు, గతస్మృతులు, పరాయికరణ ఇతివృత్తాలుగా మలిచిన ఈ కథలు భావి కథా రచయితలకు మార్గదర్శకంగా ఉంటుందంటే అతిశయోక్తి కాదు.

## ఉపయుక్త గ్రంథాలు :

1. చంద్రశేఖర్‌రెడ్డి, రాచపాళెం- కథాంశ: ( తెలుగు కథానిక సాహిత్య విమర్శ) అనంతపురం, లక్ష్మీగ్రాఫిక్స్, 2006.
2. తిరుపతి. బి - కథా-ప్రాంతీయవాదం (సిద్ధాంత వ్యాసం) హైదరాబాద్, కేంద్రీయ విశ్వవిద్యాలయం, 2006.
3. బాలసుబ్రమణ్యం, పేరూరు (సంపాదకుడు) - చిత్తూరు కథ (కథా సంకలనం), తెలుగు భాషోద్యమ సమితి, తిరుపతి, మొదటి ముద్రణ: 31 మార్చి, 2014.
4. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి - కథాశిల్పం, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2008.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

# భవభూతి మాలతీ మాధవం - నాటక కళ

- డా॥ దోనేపూడి రామాంజనేయ శర్మ, రీజనల్ డైరెక్టర్, ఇగ్నో రీజనల్ సెంటర్, విజయవాడ.

## సంక్షిప్త పరిచయం :

మహాకవి భవభూతి రచించిన మూడు నాటకాలలో మాలతీ మాధవం మొదటిదని విమర్శకులు చెబుతు న్నారు. ఉత్తర రామచరిత్రతో గాని మాహావీర చరితంతో గాని పోల్చినపుడు నాటక కళా పరిపక్వతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయానికి వచ్చామని వారు చెబుతున్నారు. ఈ నాటకం మొదటిదా లేక చివరిదా అన్న చర్చను కాసేపు పక్కకు పెడితే శృంగార రస ప్రధానమైన ఈ నాటకాన్ని భవభూతి ఎంత మనోహరంగా తీర్చిదిద్దాడో పరిశీలించ టమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

**కీలక పదాలు** : వర్ణనా వైచిత్రి, శృంగార రసపోషణ, ఉద్వేగాలవర్ణన, ప్రకృతి చిత్రణ

## 1. మాలతీ మాధవం -కథా సంగ్రహం :

మాలతీ మాధవం నాటకంలో పది అంకాలున్నాయి. కథ కవి కల్పితమే. అయినా దీనిమీద కొంత వరకు శాకుంతల, విక్రమోర్వశీయ నాటకాల ప్రభావం ఉంది. సర్వజనాదరణ పొందే శృంగార రసంతో కూడిన అద్భుత సంఘటనలతో నిండిన 'ప్రకరణం' ఇది. ఈ ప్రకరణ కథాసారాన్ని గమనిద్దాం.

మాలతి పద్మావతీపురానికి మంత్రి అయిన భూరి వసువు కుమార్తె. ఆమె విదర్భ దేశపు మంత్రి దేవరాతుని పుత్రుడైన మాధవుని వసంతోత్సవంలో కలుస్తుంది. పర స్పరం ప్రేమించుకొంటారు. కామందకి అనే బౌద్ధసన్యాసిని వారిద్దరికీ వివాహం చేయటానికి ప్రయత్నిస్తుంది. అయితే భూరివసువు మాత్రం తన కుమార్తె మాలతిని నందుడికి ఇచ్చి వివాహం చేయాలనుకొంటాడు. కానీ ఈలోపునే కామందకి శివమందిర సమీపంలోని అశోకవనంలో మాలతీ మాధవులు కలుసుకొనే ఏర్పాటుచేస్తుంది. మాధ వుడు ముందే వచ్చి గుప్తంగా ఉంటాడు. మాలతి తన సఖితో అక్కడికి చేరుకొంటుంది.

మాలతీ మాధవులు కలుసుకొనేలోపు బోను నుండి తప్పించుకొన్న సింహం అక్కడికి వస్తుంది. దానితో అందరు భయంతో పరుగులుతీస్తారు. అప్పుడు మక రందుడు అక్కడికి వచ్చి సింహాన్ని చంపి గాయాల వల్ల మూర్ఛపోతాడు. మూర్ఛనుండి తేరుకొని మాలతితో వచ్చిన ఆమె సఖి - మదయంతికను చూసి మనసుపడ తాడు. ఇంతలో అఘోరఘంటుడనే కాపాలికుడు కరాళ దేవికి బలిగా మాలతిని ఎత్తుకోపోతాడు. మాలతి భయంతో అరుస్తుంది. అక్కడే శ్మశానంలో ఉన్న మాధ వుడు వచ్చి, అఘోరఘంటుని సంహరించి మాలతిని రక్షి స్తాడు. అఘోరఘంటుని శిష్యురాలు కపాల కుండల గురువు మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటుంది.

కామందకి మకరందునికి మాలతి వేషం వేయించి భూరివసువు ఇంటిలోనే నందనుడితో వివాహం జరిగేలా చూస్తుంది. అశోకవనంలో మాలతీ మాధవులు శివమంది రంలో వివాహం చేసుకొంటారు. మాలతి వేషంలో మక రందుడు నందనుడిని బాగా హింసిస్తాడు. దానితో ఉక్రోషంతో నందనుడు వెళ్ళిపోతాడు. అప్పుడు వదినెకు నచ్చ చెప్పాలని మకరందిక వస్తుంది. మాలతి వేషంలో ఉన్నది మకరందుడని తెలిసి సంతోషిస్తుంది. తరువాత మదయంతికను అపహరించాడనే అభియోగం పై రాజ భటులు మకరందుని బంధిస్తారు.

తన మిత్రుని రక్షించేందుకు మాధవుడు మాలతిని ఉద్యానవనంలో ఒంటరిగా వదిలిపోతాడు. తగిన సమ యం కోసం వేచి ఉన్న కపాలకుండల వచ్చి మాలతిని అపహరించి శ్రీపర్వతానికి తీసుకుపోతుంది. మాధవ మక రందులు రాజభటులతో పోరాడుతారు. రాజు వారిద్దరి సాహస పరాక్రమాలు మెచ్చి వారిని విడిచిపెడతాడు. తరు వాత కామందకి తన బుద్ధినైపుణ్యంతో మాలతిని రక్షి స్తుంది. మాలాతీ మాధవులు, మదయంతిక మకరందుల

వివాహంతో నాటకం సుఖాంతం అవుతుంది. ఇదీ కథా సారాంశం.

**కాళిదాసు ప్రభావం :**

తొమ్మిదవ అంకంలో మాధవుడు మాలతిని కోల్పోయి నిరాశకులోనై సమీపంలో ఉన్న శ్రీపర్వతం పై తిరగడం, అక్కడ కామందకి శిష్యురాలయిన సౌదామిని సహాయం తో మాలతిని తిరిగి పొందటం కథాంశం. ఇక్కడ కాళిదాసు నాటకమైన విక్రమోర్వశీయ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. విక్రమోర్వశీయంలో విక్రముడు ఊర్వశిని కోల్పోయి ఒంటరిగా అడవులలో తిరిగాడు. అలాగే ఇక్కడ మాధవుడు. కాకపోతే విక్రముడు ఒంటరిగానే తిరిగి ఒంటరిగానే ఊర్వశిని పొందగా మాధవుడు మకరందుడితో కలసి తిరిగి సౌదామిని సహాయంతో మాలతిని పొందుతాడు. అయితే స్ఫూర్తిని పూర్వ కవులనుండి పొందటం తప్పు కాదు. తన కథకు నప్పేట్లు దానిని కల్పించుకోవటం ముఖ్యం. భవభూతి విషయంలో ఉద్వేగాల వర్ణనలో అతనిని మించిన వారు లేరేమో?

**ఉద్వేగాల వర్ణన :**

మాధవుని విరహోద్వేగాన్ని భవభూతి ఎంత చక్కగా వర్ణించాడో చూడండి.

దళతి హృదయం గాఢోద్వేగం ద్విధాతు న భిద్యతే
వహతి వికలః కాయో మోహం న ముంచతి చేతనామ్
జ్వలయతి తనుమంతర్దాహః కరోతి న భస్మసాత్
ప్రహరతి విధిర్మర్మచ్ఛేదీ న కృన్తతి జీవితం (9-12)

ఈ శ్లోకం చదవగానే సహృదయులకు ఉత్తర రామ చరిత్రలో రాముని దుఃఖాన్ని వర్ణించిన ఘట్టంలోనూ ఇదే శ్లోకం ఉండటం గుర్తుకు రాక మానదు. దీనితో పాటు మరో మర్మస్పర్శి అయిన శ్లోకమూ అక్కడఉంది. దానిని ఉత్తర రామచరిత్రలో చెప్పుకొందాం. పై శ్లోకంలో ప్రియా వియోగ దుఃఖితుడైన మాధవుని జాలిగొలిపే స్థితిని, వియోగ వ్యథను చక్కగా వర్ణించాడు భవభూతి.

ఇక చివరిదైన పదవ అంకంలో బౌద్ధసన్యాసిని అయినప్పటికీ కామందకి మాలతినీ తలచుకొని దుఃఖ పడుతుంది. కారణం -మాలతిని బాల్యం నుండి గమనిస్తూ వచ్చింది. ఆ విషయం ఆమె మాటలలోనే విందాం. ఈ సందర్భంలో ఆమె జాలిగా కన్నీటితో ఇలా అంటుంది.

హా వత్సే! మాలతి!
మదంకాలంకారిణి! క్వాసి? దేహి మే ప్రతివచనం.
ఆజన్మనః ప్రతిముహూర్త విశేష రమ్యాణి
ఆచేష్టితాని తవ సంప్రతి తాని తాని
చాటూని చారు మధురాణి చ సంస్మృతాని
దేహం దహంతి హృదయంచ విదారయంతి (10-1)

అపిచ పుత్ర !
అనియత రుచిస్మితం విరాజిత్ - కతిపయ కోమల దంత కుత్మలాగ్రమ్
వదన కమలం శిశోస్మరామి - సలదసమంజస ముగ్ధ జలితం మే (10-2)

ఒక సన్యాసినికి కూడా సాంగత్యం వల్ల ఎంతటి అనుబంధం పెనవేసుకుపోయిందో చూడండి. పుట్టినప్పటి నుండి మాలతి చేసిన ప్రతి పనీ ప్రతిక్షణ విశేష రమ్యమట. అంటే పసి పిల్లలు ఏం చేసినా, ఏం మాట్లాడినా పెద్దలకు ముద్దుగానే ఉంటుందని గదా అర్థం. భవభూతి లోకాన్ని ఎంత చక్కగా పరిశీలించాడు. అనుభవ సారాన్ని అమృతోపమానంగా అందించాడు ఈ పంక్తిలో. ఆమె పలికిన ప్రతి పలుకూ గుర్తుకొస్తున్నాయట. అందువల్ల ఆమెకు మాలతి ఇక లేదన్న భావనవల్ల శరీరం దహించుకుపోతూన్నదట. గుండె ముక్కలయి పోతున్నదట.

ఇక రెండవ శ్లోకం లో నవ్వినపుడు వచ్చీరాని తెల్లని పలువరుసతో విరాజిల్లే మాలతీ ముఖారవిందాన్ని కామందకి గురుతు చేసుకున్నది. ఈ శ్లోకం సీత బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ జనకుడు అన్నట్లుగా ఉత్తర రామచరిత్రలోను కనిపిస్తుంది. ఇలా ఆయా రస భావాలు సందర్భోచితంగా పండించగల కవితా కృషీవలుడు భవభూతి.

**భవభూతి భాష :**

1. నాటకం లో రసానికి, ప్రకరణానికి వక్తకు తగినట్లు పదగుమ్ఫనపు రీతి, వృత్తము మారుతూ ఉండాలి. భవభూతి మహా విద్వాంసుడు. అతని మాటలు

లలితంగా ఉంటూనే పటువుగా ఉంటాయి. ఆయన భాష కొన్ని చోట్ల కటువుగా ఉంటుందనే విమర్శను తిరస్కరిస్తూ పాత్రోచితంగా, సందర్భోచితంగా సమాస భూయిష్ఠమైన భాష ఉండి తీరాలంటారు.

2. అసలా సన్నివేశంలో భవభూతి ఏమి రాసారో వినండి. బోను నుండి తప్పించుకొని అశోక వనానికి వచ్చిన పులి గురించి నేపథ్యం నుండి ఇలా వినిపిస్తోంది.

"రే! రే! శంకర పురవాసి జానపదాః ఏష ఖలు యౌవంనారంభ సంభరిత దుర్విషామర్ష రోష వ్యతికర బలాత్కార విఘటితోత్పాటిత లోహపంజర ప్రతిలగ్న సంగలిత నిగళో, నిజ లీలా విలాసోద్వేల్ల వల్లభతుంగ లాంగూల వికట వైజయన్తికా విషమ దామరోద్దామ శరీర సంనివేశో, మతాదపక్రమ్య తక్షణ సతృష్ణ కవలితానేక దేహి దేహావయవ మధ్య నిష్టురాస్థిఖండ ఖండన టంకారకటకటాయమాన కఠిన దంష్ట్రా కరాళముఖ కందరో, వికట విజృంభణోద్దామ దారుణ చపేటా మోటిత పరిమిలిత నరతురంగ జాంగలోద్గార భరిత గళగుహాగర్భ గంభీర ఘుర్ఘురో, రల్లి గల్లూరణ శబ్ద సందర్భ పరిపూరిత నభస్థలో, నిహత నిష్పేషిత నష్ట నిష్టాపితాశేషజననివహః, కఠోర నఖర కర్పర దళితాకృష్ట జంతు గాత్రావయవ ప్రవృత్త రక్త కర్దమిత గతిపథో, దుష్ట శార్దూలః కృతాంత లీలాయితం కరోతి."

ఇదంతా బోను నుండి తప్పించుకొని వచ్చిన పులి చేస్తున్న ఘోరకృత్య వర్ణన. ఘాతుక మృగవర్ణన కాస్త ఘాటుగానే ఉండాలిగాదా మరి.

మాధవుడు అఘోరఘంటుడుయుద్ధం చేస్తున్నారు. ఒకవైపు కపాలకుండల, మరొక వైపు మాలతి అది చూసి భయపడుతున్నారు. నాయక ప్రతినాయకులిరువురు ఆ సన్నివేశంలో ఒకే మాట చెప్పినట్లుగా ఉన్న ఈ శ్లోకం గమనార్హం.

ధైర్యం నిధేహి హృదయే హత ఏష పాపః కిం వా కదాచిదపి కేన చిదన్వభావి
సారంగ సంహృతి విధౌ ఇభ కుంభ కూట కుట్టాక పాణి కులిశస్య హరేః ప్రమాదాః ॥ (5-32)

ఇలా భవభూతి ఘంటం ధారాళంగా నిరాఘాటంగా పల్లానికి నీరు ప్రవహించినంత సునాయాసంగా ఎన్ని సమాసాలయినా వాడగలదు. ఎంత ప్రౌఢమయిన భాషనయినా అయన పలికించగలడు. వశ్య వాక్కునని చెప్పుకొన్నాడు గదా!

భవభూతి భాష గురించి శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రులవారు పేర్కొన్న విషయాలు గమనింప దగినవి.

Bhavabhuti never forces figures of the Rhetoric into his composition for embellishment but they grow up naturally with the sentiment. He is eloquent without effort. Concise without falling into obscurity or ambiguity, precise, decided, bold and authoritative …………nowhere uses words for mere show of learning, but always has the right word in the right place. His sound always varies and harmonies with the sense and sentiment. His language is chase, diction abundant. ...." భవభూతి భాష గురించి ఇంతకన్నా గొప్పగా మరేమీ చెప్పనవసరం లేదు కదా.

అంతే కాదు, తన కవిత్వం ధారాళంగా సాగాటానికి గల కారణాలు మాధవుని నోట కామందకి ఉపన్యాసాన్ని ముచ్చుకొంటున్నట్లు చెప్పిస్తాడు -గమనించండి.

శాస్త్రే ప్రతిష్ఠా సహజశ్చ బోధః ప్రాగాల్భ్యమభాస గుణా చ వాణీ
కాలానురోధః ప్రతిభా నవత్వం ఏ తే గుణాః కామా దుహః క్రియాసు ( 3-11)

వ్యాఖ్యాతలెవరూ ఈ శ్లోకంపై దృష్టి పెట్టినట్లు లేదు. ఇది ప్రాసంగికమే అయినా భవభూతి కవిత శక్తిని వెల్లడి చేసేదే. కోరుకొన్న రీతిలో కవిత సాగాలంటే భవభూతి లెక్క ప్రకారం కవికి ఈ క్రింది లక్షణాలు ఉండాలి. 1. శాస్త్ర పరిచయం, 2. సహజమయిన సూక్ష్మ పరిశీలనా శక్తి 3. నిరంతరాభ్యాస పరిష్కృత భాషా పటిమ, 4. ప్రతిభా విశేషం. ఈ లక్షణాలు భవభుతిలో పుష్కలంగా ఉన్నాయి. కనుకనే అతని నుండి మనకు మూడు నాటక రత్నాలు లభించాయి.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


## మాలతీ మాధవంలో శృంగార రస పోషణ :

1. అభిజ్ఞాన శాకుంతలం లో వలెనే ఇక్కడ కూడా నాయకుడయిన మాధవుడు పూలు కోస్తున్న నాయిక మాలతిని చూసి ఇలా అనుకొంటాడు.

జ్వలయతి మనోభావాగ్నిం మదయతి హృదయం క్రుతార్థయతి చక్షుః
పరిమృదిత చంపకావలి విలాస లులితాలసై రంగైః॥ (3-6 )

అంటే - మాలతి మాధవునిలో మన్మథాగ్నిని అధికం చేస్తున్నది. హృదయానికి మత్తు కల్గిస్తున్నది. కన్నులకు చూపు ఉన్నందుకు వాటికి సార్థకత కల్గిస్తున్నది. ఉన్నది మాలతి ఒక్కతే అయినా నాయకునికి ఆమె వల్ల కలిగే వికారాలు పలువిధాలు. కనుక ఇక్కడ కారక దీప అలంకారం కనిపిస్తున్నది.

2. కామందకి మాధవుని విరహావస్థను గురించి చెప్తూ "ఆ మాధవుడు మనోద్యాన యాత్ర చేసిన నాటి నుండి మనస్సు మసస్సులో లేక పరవశుడై, విరహ తాప దుఃఖితుడై ఉన్నాడు. అతడు విరహం వల్లనే

"యదిందావానందం ప్రణయిని జనే వా న భజతి
వ్యనక్త్యంతస్తాపం తదయమపి ధీరో2పి విషమమ్
ప్రియంగు శ్యామాంగ ప్రక ృతి రపి చాపాండు మధురం
వపుః క్షామం క్షామం వహతి రమణీయశ్చ భవతి"॥ (3-9)

అంటే... చంద్రుణ్ణి చూసినా, వెన్నెల్లో తిరిగినా, ఇష్ట మయిన వాళ్ళను చూసినా మాధవునికి ఆనందం కలగటం లేదట. మేరునగ ధీరుడయినప్పటికీ దుస్సహమయిన అంతఃతాపాన్ని వ్యక్తం చేస్తున్నాడు. ప్రియంగు లతికా సదృశమైన ఈతని శరీర కాంతి తెల్లగా అయినప్పటికీ మధురంగానే ఉంటుంది. శరీరం చిక్కి పోయినా రమ ణీయం గానే ఉంటుంది.

ఇక్కడ నాయకునిలో చింత, అధైర్యం, వెలవెల బోవటం ( వైవర్ణ్యం), చిక్కిపోవటం, వంటి శ్రుంగార రస సంబంధి సాత్విక భావాల వర్ణన బహు రమణీయంగా ఉంది. కామందకి మాధవుని జడత్వాన్ని ఇలా వర్ణిస్తున్నది.

ధత్తే చాఖుర్మకులిని రణత్ కోకిలే బాల
చూతే మార్గే గాత్రం క్షిపతి వకులామోద గర్భస్య వాయోః
దావ ప్రేమ్ణా సరస బిసినీ పాత్ర మాత్రోత్త రీయః
తామ్యన్మూర్తిః శ్రయతి బహుశో మ ృత్యవే చంద్ర పాదాన్ ॥ ( 3-12)

కలువ మొగ్గలు చూసి మన్మథ బాణాలనుకొని ఎక్కడ తగులుతాయోనని భయపడి గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు. గున్న మావి కొమ్మపై కూసే కోకిల శబ్దాలు వినిపించినంత సేపూ మన్మథ సైన్యమైన కోకిలల సమూహం కనిపిస్తున్నందున భయంతో పక్కనే ఉన్న తన గమ్యానికి చేరుకోలేడట. పొగడ పూల వాసన మోసుకొచ్చే మార్గం లో ముందుకు కదలక నిల్చిపోతాడటబీ ఎందు కంటే మదనుడి పంచబాణాలలో వకుళమొకటి గదా! ఆ బాణం తగులుతుందన్న భయం. కానీ కేవలం తాపో పశామనార్థం తామర పత్రోత్తరీయాన్ని ధరిస్తాడట. చివరకు విసుగుతో మరణించాలని భావించి వెన్నెలలోకి వస్తాడట.

ద్వితీయాంకంలో శ్మశాన బీభత్సాన్ని, పంచామాంకంలో బీభత్సరసాన్ని, యుద్ధవర్ణనలను చేసిన కవేనా ఈ శ్లోకం రాసింది? అనిపించక మానదు. అఘోరఘంట, మాధవుల యుద్ధాన్ని వర్ణించిన కవేనా ఈ మందాక్రాంతవృత్తం లో విరహి విరహాన్ని వర్ణించింది? అనిపించడం లేదా?

శృంగార రస పోషణ విషయంలో నాయికా నాయ కులు ప్రత్యక్షంగా మాట్లాడుకొనే దానికంటే మధ్యవర్తులు చెప్పే మాటల ప్రభావం అధికంగా ఉంటుంది. కామంద కిని అలాంటి మధ్యవర్తిగా ఉపయోగించాడు భవభూతి. ఆ కామందకి మూడవ అంకం లో మాలతి తో పలికిన మాటలు గమనించండి.

"తదేవం ప్రకృత్యా సుకుమారః కదాచిదపి అన్యత్రాప రిక్లిష్ట పుర్వతపస్వీ యతః శక్యమానేన మరణమప్యను భవితుం." (వచనం)

ఇతడు సుకుమారుడు., పెళ్లికానివాడు, నిరంతరం దుఃఖాన్నే భరిస్తున్నాడు. కనుక అత్యంత దుఃఖదాయక మైన మరణాన్నయినా ఎదుర్కొనగలడు. అంటే ' మాలతి అతని ప్రేమను అంగీకరించకపోతే ఆత ను చనిపోతాడని భావం. ఇంత మాట అన్న తరువాత ఎదుటివారిలో కద లిక రాక మానుతుందా? కనుకనే మాలతి తన చెలికత్తెతో ఇలా అంటుంది. "సఖి ఆత్మనః కారణాత్ మర్త్య లోకాల న్కారభూతస్య తస్య కిమప్యాశంకమానా భూతావిష్టేన న జానామి కిం ప్రతిపత్స్యత ఇతి. అంటే " అయ్యో! నా వల్ల ఈ జగదేక సుందరుడికి జరగరానిదేమయినా జరుగుతుందేమోనని భయంగా ఉంది. అని ఊరు కుంటుంది. దాని అర్థం తన తరపున చెలికత్తేనే సమా ధానం చెప్పమని అర్థం. సన్నిధిలో రాయబారమంటే ఇదే.

**ముగింపు :**

ఇలా అనుభావ విభావాలతో దశవిధ మన్మథావస్థ లను వర్ణిస్తూ శృంగారం అంగిరసంగా నాయికా నాయ కులు ఆలంబన విభావాలుగా వీర, అద్భుత బీభత్స రసాలు అంగ రసాలుగా నిరుపమానంగా నిర్వహించి మాలతీ మాధవంలో రసపోషణ చేశాడు మహాకవి భవభూతి.

✿ ✿ ✿

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# ఓబుళ నారాయణరెడ్డి 'శాంతి చక్రవర్తి' - సింహావలోకనం

– డా॥ పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

నాటి నుండి నేటి వరకు రాజకీయ, సాంఘిక, ఆర్థిక, నైతిక, సామాజిక స్థితిగతులలో జ్ఞానుల చరిత్ర ఎంతగా మనదేశంలో అవసరమో చెప్పాల్సిన అవసరం లేదు. సామాజిక సత్యధర్మాలు చాలా వరకు నశించాయి. ప్రేమ దయాస్వభావాలు కన్పించని తరుణమది. ద్వేషా సూయలు సంఘంలో ప్రబలిపోతున్నాయి. అహింసా భావం ఎవరిలో ఉందో కన్పించని తరుణంలో బుద్ధ మహాత్ముని గురించి అక్షరబద్ధం చేయబడిన గేయమాల 'శాంతి చక్రవర్తి' - రచయిత టి. ఓబుళ నారాయణరెడ్డి.

కవీంద్రుడు తత్త్వవేత్త అయిన సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ 1856లో ఇంగ్లాండు నుండి యవ్వన ప్రాయంలో మన దేశానికి వచ్చి, మన దేశీయ సాహిత్య పండితులని, మేధావులని కలిసి సంస్కృతం మొదలగు మన భాషలను కష్టపడి నేర్చుకొని భారత, రామాయణాదులను ఇంగ్లీషు లోకి అనువదించాడు.

సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ 1879లో 'లైట్ ఆఫ్ ఏసియా' పేరుతో ఆంగ్ల గ్రంథాన్ని రచించాడు. ఆ గ్రంథాన్ని గురించి లండన్ టైమ్స్, లండన్ డైలీ, టెలిగ్రాఫ్ మొదలైన పత్రికలు విశిష్టంగా ప్రశంసించాయి. మన జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, లైట్ ఆఫ్ ఏసియా' గ్రంథ ఔచి త్యాన్ని కీర్తించారు. పద్యభాగమై ఉన్న ఆ గ్రంథంలో మొదటి భాగం బుద్ధదేవుడి గురించి, రెండవది 'గీతా గోవిందం' గురించి పేర్కొనబడింది.

ఆర్నాల్డు బుద్ధుని గురించి ఇలా ప్రారంభించాడు. స్వర్గంలోని దేవతలు భూమండలంలోని సంఘ విద్రోహుల గురించి ప్రజలు పడే బాధల గురించి చూచి "Buddha will go again to help the world" "Yea 1 spoke he "Now I go to help the world". This last of many times this for birth and death end hence for me and those who learn my law. I will go down among the Sakyas" అని దేవుడు ప్రకటించినట్లు చెప్పాడు. శాక్యుల వంశంలో జన్మిస్తానని దేవుని నిర్ణయం చెప్పాడు. ఈ గ్రంథం చివరలో నీవే శరణ్యమని సర్ ఎడ్విన్ ఆర్నాల్డు మహాశయుడు బుద్ధుని కోరినట్లు రాసుకున్నాడు. అలాగే భారతదేశం ఇంగ్లాండు లాగా నాకు ప్రియమైన దేశం అని ఆర్నాల్డ్ పేర్కొన్నాడు. ఆ 'లైట్ ఆఫ్ ఏసియా' గ్రంథం చదివి. ఓబుళ నారాయణరెడ్డి గారి మనస్సులో గౌతమబుద్ధుని గురించి గాఢమైన ముద్ర పొందుపరచుకున్నాడు. నారాయణరెడ్డి 1956లో కీర్తి శేషులు శ్రీమాన్ కలచవీడు వెంకట రమణాచార్యులు గారిని నాకేదైనా చదువుకోటానికి పుస్తకం ఇమ్మంటే శ్రీ బుద్ధపురాణ గ్రంథాన్ని ఇచ్చాడు. బుద్ధపురాణ గ్రంథం గూర్చి సర్వేపల్లి రాధాక్రిష్ణ పండితుడు మొదలుకొని రాష్ట్రంలో పలువురు పండితులు ఈ గ్రంథం గూర్చి ప్రశం సించారు. ఈ రెండు గ్రంథాలలోని విశేషాలతో కూడిన ఘటనల సమాహారమే ఈ శాంతి చక్రవర్తి గేయమాల.

కోరికలను జయించి దుఃఖాన్ని దాటి మోక్షాన్ని చేరు కోమని బోధించిన బౌద్ధం ప్రపంచంలోని గొప్ప మతాల్లో ఒకటి. భారతదేశములో పుట్టి, విదేశాలకు విస్తరించి, సామాన్య జనానికి చేరువై సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. క్రీ.పూ. 6వ శతాబ్దంలో భారతదేశంలో ఆవిర్భ వించిన మతాల్లో ప్రధానమైంది బౌద్ధమతం. భారతదేశ సాహిత్యం, వాస్తు, కళారంగాలకు బౌద్ధమతం ఎనలేని సేవలను అందించింది. ఈ మతం క్రమంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. బౌద్ధమత స్థాపకుడు గౌతమ బుద్ధుడు.

క్రీస్తుకు పూర్వం 662 సంవత్సరాల కిందట శ్రీ బుద్ధ మహాత్ముడు జన్మించాడు. బుద్ధ మహాత్ముని వంశం రఘువంశమే. బుద్ధుని తల్లిదండ్రుల వంశం చరిత్రలు చాలా అమోఘమైన చరిత్రలు కల్గినవే. బుద్ధుని అవతారం భగవదవతారమే అని మన పూర్వులే ప్రకటించారు.

బుద్ధుని జననానికి పూర్వం ప్రపంచంలోని సర్వమానవులు అనగా మన భరతఖండంతో కలిపి అరాచక అల్లకల్లోల దుస్థితిలో ఉండి అనేక బాధలతో, దుఃఖంతో, అశాంతితో మునిగి దేవున్ని గురించి సుజనులంతా దేవుణ్ణి వేడుకోగా భగవంతుడవతరించాడని మన పురాణాలు ఘోషిస్తున్నాయి.

బాల్యమునందె వ్యామోహాది దుష్టభావంబుల
వీడెనెవరు.
బాల్యమునందె సంసారంబు వీడె నెవరు.
భారమైన సన్యాస ధర్మం లాచరించెనెవరు
భోగభాగ్యంబుల శాశ్వితంబులనె నెవరు
భువిలోని దుఃఖమయ యీసునసూయల వీడెనెవరు
భువి ప్రాణులెల్ల తనవలె సమానమేయని తెల్పెనెవరు
భువన మందు సత్య ధర్మాలే మనుజుని కాపాడునని
తెల్పెనెవరు
భూరి సుజ్ఞానమూర్తి యా బుద్ధదేవుడె

గేయాన్ని వచనంలా నడిపించడం నారాయణరెడ్డి గారి విశిష్టత.

"శ్రీ రాజిత ముని పూజిత రఘువంశ శాఖయె
శ్రీకర అయోధ్య నేలిన ఇక్ష్వాకు వంశశాఖయె
శ్రీరామచంద్రుని సూర్యవంశశాఖయె
శ్రీ బుద్ధ మహాత్ముని శాక్య వంశమయ్యె"

సూర్యవంశ శాఖయే గౌతమ బుద్ధుని శాక్య వంశంగా పరిణమించిందంటారు నారాయణరెడ్డి. బుద్ధుని తండ్రి శుద్ధోధనుడు ధర్మబద్ధంగా పరిపాలించాడు.

"శుద్ధోధన భూపాల పాలనలో విస్తరించె రాజ్యంబు
అధమునికైనా అన్యాయంబు జరుగుచుండలేదు
అధర్మమెందునా కానరాదయ్యె రాజ్యంబులోన
శుద్ధోధనుని భార్యలిర్వురు మెలగిరి పతిభక్తి తోడ"

శుద్ధోధనుని భార్య గౌతమి సద్గృహిణిగా చెలువారింది. పట్టమహిషిగా మాయాదేవి భర్త సేవలో తరించింది.

"ఒకనాటి రాత్రి మాయాదేవి చెలికత్తెల నడుమ
ఒకింత దీనవదనయై పరుండె చింతతో
ఒక తారక గగనంబు నుండి దిగె భువికి
ఒక శ్వేత గజంబై తన యింట ప్రవేశించి
ఒక జామున మాయాదేవి యుదరంబు చేరె
ఒకింత జలదరించి లేచి తలచెనది స్వప్నంబని"

మాయాదేవి ఆ స్వప్న విశేషాన్ని శుద్ధోదన మహారాజాకి తెల్పగా ఆ మహారాజు పురోహితులని పిలిపించి స్వప్న ఫలంబేమిటని అడిగితే

"ధరణీ తలంబంతయు నేలు పుత్రుండు కలుగు
పరమాత్మని బోలిన సుతుడు కల్గుమీకని" స్పష్టం చేస్తారు. ప్రధానామాత్యుడు "తనయుడు పూజ్యుడై వెలుగొందుతాడని, ఆ బాలుడు విశ్వప్రేమికుడౌతాడని తెలుస్తుంది అని మరలా విశేషాలను ఇలా విశదీకరించాడు.

"ధరణీతలంబున నిట్టి వారు జనించి యుండలేదు
దేవాంశ సంభూతుడా బాలుండు ప్రభూ
ధర్మగృహస్థాశ్రమంబు స్వీకరించినచో
ధైర్యస్థయిర్య లోకోత్తర విరాజితుండై సార్వభౌముండగు
దైవయోగంబున నాతడు సంసారంబు బాసిన
ధరణిలో శాంతిని స్థాపించు శాంతి చక్రవర్తియై"

"ధర్మసంస్థాపనాచార్యుడై శాంతిసౌఖ్యాల భువిలో స్థాపించు" ధర్మనిరతుడై కరుణామయుడై స్థాపించు ఆచంద్ర తారార్కంబుగ

"ధర్మసత్యాలు నాలుగు పాదాలు నిలుచు భువిలో
ధర్మసంస్థాపన చేసి భువిలో వెలుగు శాంతి చక్రవర్తియై
అనంత అన్యాయ దుర్మార్గాలతో నిండియున్న యీ భువిని
అహంకారాది యీసునసూయల పారద్రోలి
అజరామర శాంతి సౌఖ్యంబు పుడమిలో వర్ధిల్ల
అమ్మహాత్ముడు ధరణిలో ప్రచారంబు చేయు
అనన్య సర్వసమానత్వ సత్య ప్రేమాంచిత
అగణిత ప్రాణి రక్షకుడై నూతన సమాజస్థాపకుండౌను"

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

గౌతమబుద్ధుని పుట్టుక పూర్వం సమాజంలో మహా ఘోర హింసలు, కిరాతక చర్యలే కన్పించేవి. మత బోధ కులు, పరమత ద్వేషులై, మమత, కరుణలు అనేవి మహిలో మాయమైన పరిస్థితులుండేవి. నిరంతరం, పోరు, యుద్ధాలతో నిండిపోయిందని, సమస్త లోకం ఘోర హత్యలతో, నరనారీశీల భంగంతో, దోపిడీలతో మునిగి పోయి ప్రజల హాహాకారాల రోదనలే వినిపించేవి. రాజులే రాక్షసుల్లాగా ప్రజలను దోచుకొని రాక్షస పాలన సాగించే వారు. సర్వమానవ హాహాకారాల రోదనలే వినిపించేవి. రాజులే రాక్షసుల్లాగా ప్రజలను దోచుకొని రాక్షసపాలన సాగించేవారు. సర్వమానవవ హాహాకారాల శోకతప్త వేడి మంటలు స్వర్గంలోని దేవతలకు తాకగా దేవతలందరు విష్ణుదేవుని చెంతకు చేరి భూలోక అశాంతిని గూర్చి ఇలా వేడుకున్నారు.

"పాహిమాం పాహిమాం కావుమటంచు
ప్రభూ భువిలో శాంతి నెలకొల్పుము
ప్రభూ కరుణించి భువిని కాపాడలెమ్ము"

అని దేవతలు వేడుకొంటే ఆ విష్ణుమూర్తి కరుణా మయుడై

"నేను భువిలో అవతరించెద
నేను శాక్య వంశోద్భవుండనయ్యెద
నేను భువిలో శాంతినెలకొల్పెద
నిశ్చింతగా నమ్ముడు దేవతలారా"

అని సాక్షాత్తు విష్ణుమూర్తి చెప్పిన విధం గీతా శ్లోకంని తలపిస్తుంది.

"యదాయదా హిధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహం
పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే"

ధర్మసంస్థాపనకై దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం జన్మించి ఈ భువిలో సత్యధర్మాలను, శాంతిని భగవంతుడు నెల కొల్పుతాడని మనకు విశదమవుతుంది. శుద్ధోధనునికి మాయాదేవికి క్రీ.పూ. 563లో ప్రస్తుత నేపాల్‌లోని లుంబిని వనంలో బుద్ధుడు జన్మించాడు. శుద్ధోధనుడు 'సిద్ధించె తనకోర్కె' అని సిద్ధార్థుడు అని పేరు పెట్టాడు. ఆ తర్వాత కొన్నాళ్లకే మాయాదేవి క్షయరోగంతో కృశించి మహిని వీడి మాయమైందని, పినతల్లి గౌతమీదేవి గారాబంతో పెరిగి గౌతమసిద్ధార్థుడైనాడు. శుద్ధోధనుడు విశ్వామిత్రుని పిలిపించి విద్య నేర్పమని తన కుమారుని అప్పగిస్తాడు.

"మానవుని దుర్గుణమే హింస యనియె
మానవుని సంకుచితమే అపవిత్రము చేయుననియె
మానవుడు అహింస పాటించుటె ముక్తి మార్గమనియె
మానవుని ఆత్మప్రాప్తియే జీవిత ధ్యేయమనియె"

ఈ విధంగా వేదవేదాంగాలు సర్వశాస్త్రాలు, మల్ల విద్యలన్ని నేర్చుకున్నాడు. గౌతముడు విద్య నేర్చిన తరు వాత మానసిక స్థితి సంసార విరక్తిని కలిగిస్తే తండ్రి తన కుమారుని సార్వభౌముని చేయతలచి రాజనీతిశాస్త్ర ధర్మ తత్త్వం నేర్పిస్తాడు. కాని బుద్ధుడు భాగ్యభోగాలు అస్థి రాలుగా భావిస్తాడు.

"మోక్షప్రాప్తియే మన గమ్యం అని, మృత్యుదేవతతో మన సంపదలంతరిస్తాయని మరవొద్దు. పవిత్ర జీవనం చేయుట ధర్మమని బుద్ధుడు బోధిస్తాడు.

సిద్ధార్థుడు ఒకరోజు ఉద్యానవనంలో వినోదిస్తున్న సందర్భంలో ఆకాశమార్గంలో విహరిస్తున్న హంసల గుంపు మీద ఒక రాకుమారుడు వదలిన బాణానికి ఒక హంస నేలరాలితే బుద్ధుడు ఆ హంస గాయాన్ని మాన్పి ఆకాశంలో స్వేచ్ఛగా విహరించేలా చేసాడు. ఒకనాడురైతు ఎద్దుల కాడితో భూమిని దున్నుతున్నప్పుడు ఆ ఎద్దు వృద్ధాప్య బాధతో మెడపై పుండు నుండి రక్తం కారుతున్నా ఆ రైతు అదలించడం చూసి గౌతముడు బాధతో కన్నీరు కార్చాడు.

"ఒక చీమల బారుపై ఒక బల్లి చెట్టు నుండి దిగివచ్చి
ఒకింతసేపులోనె 'చీమలన్నింటిని మింగివేయ
ఒక పుట్టబొరియ నుండి ఒక పాము వచ్చి
ఒక్క పెట్టున యా బల్లిని మ్రింగివేయ
ఒక గ్రద్ధ రివ్వున ఆకసము నుండి వచ్చి యీ
పామును తన్నుకపోయె

ఓర్చుకొనలేక నిర్విణ్ణుడై యా వింత చూచి''

''ఒక ప్రాణి మరో ప్రాణికాహారంగా బలియగుటయే జీవనమా

ఒక ప్రాణిని మరో మనిషి బాధించుటయే జీవన సంసారమా

ఒక బలవంతుడు మరో బలహీనుని బాధించుటయే ప్రపంచ జీవనమా

ఓ దయామయా! కరుణామయా!

హింసలేనిదే భువిపై సంసారంబు లేదా?''

ఇలా సమాజంలోని పరిస్థితులను అవగతం చేసుకున్నాడు. 16 ఏండ్ల ప్రాయంలో యశోధరతో వివాహం అయింది. వీరికి రాహులుడు అనే కుమారుడు జన్మిస్తాడు. ఒకరోజు రథసారథి ఛన్నునితో కలిసి రాజనగరాన్ని చూడాలని కోరి వెళ్తుండగా వృద్ధుడు, వ్యాధిగ్రస్తుడు, మృతదేహం, సన్యాసుడిని చూసి తన ఆలోచన వైరాగ్యం వైపు మరల్చుకుంటాడు.

ఒక సన్యాసి గౌతమునితో

''అస్థిరంబీ సంసార జీవితంబు

అశాశ్వతంబీ శరీరంబు

అందరమీ చావుపుట్టుకల బంధనంబున

పండితులైన పామరులైన గాని

సారంబులేని సంసారంబున క్రుంగుట తప్పదు

సర్వులిందనుభవించు దుఃఖ భాజనులై

సాంసారిక నీచ పాశములంద గుల్కాని

సర్వపుత్ర మిత్ర కళత్ర ఆత్మీయులను రాగములెల్ల

సంపూర్ణ అనర్థములే సుమ్మీ యనియె''

సిద్ధార్థ రాకుమారునికి ఓంకార ముచ్చరింపుచుండుమని గురువు యుపదేశించాడు. ఈ ఉపదేశాన్ని ఆకలింపు చేసుకున్న సిద్ధార్థుడు రాచనగరికి వెళ్లి నిద్రిస్తున్న సమయంలో ఒక స్వప్నం సాక్షాత్కరిస్తుంది. ''సిద్ధార్థా ఉత్తమ సమయంబిది నీకు, సంసారమును త్యజించి జ్ఞానివై రాజ్యమును త్యజించటానికి'' అన్న భావనలు విన్న సిద్ధార్థుడు స్వప్నం నుండి తేరుకొనునంతలోనే

''అమాంతముగ దిక్కులు పిక్కటిల్ల దీనజీవులైన

అశేష సహస్ర స్త్రీ పురుషులు రక్షింపుము! రక్షింపుము!

ఆశ్రిత మందారుడవై వెను దిరిగిపోకుము

అనర్థమైన సంసారమును నమ్మకుము

అశాశ్వత జీవిత సంసారంబులో మునిగి

మావలె కామాగ్నికి బలి గాకుము

ఆదుకొనుము రమ్ము రక్షింపుమన్న''

ఆర్తనాదాలు గౌతమునికి వినబడ్డాయి. ''ఆ తరుణంలో గౌతముడు ఓ విశ్వేశ్వరా! విశాల విశ్వసేవయే శాశ్వతానంద బ్రహ్మలోక మూలమార్గంబని గ్రహించాను.

''వ్యామోహంబు వీడితి సంసారంబుపై

వ్యామోహంబు వీడితి పుత్రకళత్ర జీవితంబుపై

విశ్వభూతంబులో సర్వజీవ దయావృత్తియే నిర్వాణ మార్గంబు

వ్యామోహాతీత సర్వభూతహితానురక్తయే సర్వప్రాణి ధ్యేయంబు కావలె

విశాల మానవ ప్రపంచ చతుర్దిశల ద్వితీయ ప్రభావోద్భాసితమైయున్న

విశ్వేశ్వరా నీ దివ్య జ్యోతిని గాంచితి నేను సూక్ష్మ దృష్టిచే

విస్తీర్ణంబగు విశ్వక్షేత్రంబున సంచారము చేయుదు

వినలేని మూఢజనుల కపరసౌఖ్య ప్రదంబగు

విశిష్ట ఆధ్యాత్మిక ప్రబోధము చేయుదు ఇపుడే లేచి వత్తును''

అని వ్యామోహాన్ని విడిచి రథసారథి ఛన్నునితో కలిసి సర్వసంగ పరిత్యాగియై, సంపూర్ణ శాశ్వతానంద సంపాదనార్థమై గౌతముడు బయలుదేరాడు. తర్వాత ఛన్నుని ఇంటికి పంపించటం తర్వాత తల్లిదండ్రులు శోకించడం శుద్ధోధనుడు గౌతముని తోడ్కొని రమ్మని అడవులకు మంత్రులకు పంపడం, గౌతముడు మంత్రివర్యులకు సత్యం గూర్చి తెల్పడం జరిగింది.

ఒకరోజు గౌతముడు రాజగృహ సమీపంలో కొందరు గొల్లలు గొర్రెల మందను తోలుకొని వెళ్తున్నప్పుడు ఒక చిరుత గొర్రెపిల్ల తల్లి వెంట నడవలేక వెనకబడి అరు

స్తుంటే సిద్ధార్థుడు జాలిపడి తన మెడమీద వేసుకొని ఆ మందతో పాటు నడుస్తూ ఎక్కడికి అని గోపాలురనడిగితే బింబిసారుని యాగంలో వధించడానికి గొర్రెలను తీసుకు రమ్మనగా వెళ్తున్నామని అంటే గౌతముడు కూడా వెళ్లి అతనితో సంవాదం చేసి ధర్మబోధ చేస్తాడు.

కాంక్షయే నిత్యంబు దుఃఖంబు కల్గించు
కాంక్షయే సత్యంబుగ దురాశ కల్గించు
కాంక్షయే నిత్యంబుగ నిరాశ గల్గించు
కాంక్షయే రాగద్వేషాలందించు
కాంక్షయే నిరంతరంబుగ మోహంబు పెంపుచేయు
కాంక్షయే నితరంబులందు కరుణ ప్రేమలు లేకుండ చేయు
కాంక్షయే మోక్షంబు కోరనీయదు సుమ్మి

అవి అన్నింటికి కోరికలే కారణమని బుద్ధుడు బింబిసారునికి బోధిస్తాడు. పంజర బద్ధమగు పక్షి ప్రయత్న సంయోగవశం చేత ఆకాశానికి ఎగిరి విముక్తి బొంది తిరిగి పంజరంలో చేరుతుందా! అని ప్రశ్నిస్తాడు.

"హింస వలన నరకమె సంప్రాప్తమగును మోక్షంబు రాదు
హింస వలన మనుజుండు క్షయంబునొందు స్వర్గంబు చేరడు
హింస రాక్షస గుణంబెగాని మోక్షమొందు గుణంబు కాదు

అని బుద్ధుడు బింబిసారునికి చెప్పి గొర్రెలను వధించ వద్దని జ్ఞానబోధ చేస్తాడు. తరువాత సిద్ధార్థుడు ఇద్దరు సన్యాసుల వద్ద శిష్యరికం చేస్తాడు. అలారకలామ అనే సన్యాసి తన బోధనలతో సిద్ధార్థుని ప్రావీణ్యున్ని చేసి, తన వారసుడిగా ఉండమని కోరాడు. కాని ఆ బోధనల వల్ల సిద్ధార్థుని జ్ఞానతృష్ణ తీరకపోవడంతో ఆ కోరికను నిరాకరించాడు. తర్వాత సిద్ధార్థుడు ఉద్దారకుని శిష్య రికంలో యోగశాస్త్రాన్ని అభ్యసించాడు. ఇది కూడా జ్ఞాన తృష్ణని తీర్చకపోవడంతో వారసత్వం పుచ్చుకోమన్న ఆయోగి కోరిక నిరాకరిస్తాడు.

తరువాత అన్నపానీయాలు లేకుండా సాధన చేస్తాడు. కాని నిజ జ్ఞాన ప్రకాశం కాలేదు. ఆ యోగం నుండి లేవబోయినపుడు శక్తి లేక మూర్ఛితుడు కావడం శిష్యులైన అయిదుగురు వచ్చి చూసి సిద్ధార్థుడు మరణించాడని వెళ్లిపోతారు. దారిన వెళ్లే గోపాలుడు, సిద్ధార్థుని చూసి "ఒక మేకను తెచ్చి ఆ సిద్ధార్థుని నోటిలోపడేల పాలు పిండటం వల్ల సిద్ధార్థుడు స్పృహలోకి వస్తాడు. ఆకలిగా ఉంది. నీ దగ్గర ఉన్న మట్టిపాత్రతో పాలు త్రాగించి రక్షింపమనగా నీవు అగ్రజాతివాడివి. అందునా మహర్షివి. నాది నీచకులం అని గోపాలుడు అనగా సిద్ధార్థుడు

"పుట్టకచే జంధ్యముతో
పుట్టుకచే నొసట కుంకుమ బొట్టుతో
పుట్టలేదెవరు నుర్విలోన
పురుషస్త్రీ భేదంబులు రెండు మాత్రమె లెక్కకు
పుణ్యగోపబాలకా, సహోదరా తెలియుమయ్యా
"గన్నేరు పుష్పంబు గులాబి వలె ఘుమాళించు
కనలేము కాని అల్పముదైన
గన్నేరు పుష్పంబు సృష్టి
కలిగె యీశ్వర సంకల్పంబు తోడనె కదన్నా"
"ప్రేమ దయాకారుణ్యాల మానవుండె
ప్రేమ మీర బ్రాహ్మణుండగుడెవ్వరైన
ప్రేమలేనివాడు బ్రాహ్మణుడు కాడెవ్వరైన
జంధ్యముచే నెవ్వరును జన్మింపగలేదిలలోన"

అని సద్గుణమే గౌరవానికి కారణంబుకాని కులము కాదు అని చెప్పి.

"అన్నా మరణావస్థ యందున్న నన్ను బ్రతికించి
అగ్రశ్రేణి బ్రాహ్మణుండవైతివి
నీదగు కరుణాంచిత హృదయమే
నిన్ను బ్రాహ్మణుండుగా చేసిన దదియే
దయా మమకార సంభూతుండు కానివాడు
ధాతకాలేడు సుమా నీవే నా ధాతవు"
"సహోదరా పరోపకార గుణమే శ్రేయంబు
సంసారులు భ్రష్టులై జ్ఞానదూరులై
సంచరించువారు మిధ్యాభిమానులె సుమ్మి

స్వభాంబున నీవే ద్విజుడవు
సదసద్వివేకుండవై ఈశ్వర ప్రేమికుడవు నీవే''

అని గౌతముడు చెప్పగా గోపాలుడు గుప్తమగు జ్ఞానదయాన్ని పొందుతాడు.

సుజాతాదేవి సిద్ధార్థునిపై చూపిన పవిత్ర భక్తి

సుజాతాదేవిని సిద్ధార్థుని గాంచి నీలో నిరంతర ఆనందానికి కారణం ఏమనగా

''అనుకూలంబులు, ప్రతికూలంబులు నాకు లేవు
అన్నియును మనమేలునకేయని తలంతు
స్వార్థము వీడుటయే పరమార్థమని నమ్మెద
సంతోషానందములతో సర్వేశ్వరు నారాధింతు
జయాపజయంబులు లేవుజగంబునయని నమ్మెద
జగదేక స్వరూప పరమాత్ముడే కావగలడని నమ్మెద
మరణంబు నాహ్వానింతు నేను ప్రేమతో
మననంబున సుఖదుఃఖముల సమంగ చూసెద
''నాకు పుత్రుడు ప్రాప్తించ వేడితిని కాని
నాకు పుత్రప్రాప్తి కలుగకున్నను శోకించను
నేనీ లోకమున కన్న పరలోకము నందే విశేషా నందంబని
నిజంబుగ నమ్మెద జ్ఞానమార్జింపని వారికి
నిజంబుగ నిర్వాణముండక పునర్జన్మయే వారికి శరణంబనియె''

ఆ పల్కులు విన్న సిద్ధార్థుడు సుజాతాదేవిని సర్వదా మనశ్శాంతితో నీవు శాశ్వతానందంబుతో ముక్తి పొందెదవు అని ఆశీర్వదిస్తాడు.

## బోధివృక్షం కింద బుద్ధునికి జ్ఞానదర్శనం :

బుద్ధుడు బోధివృక్షం కింద నా శరీర మాంసము, యెముకలు, చర్మము నాశనమైనా, కల్పాంతమైనా, దుర్లభమైన బుద్ధిని, సిద్ధిని పొందకపోతే నేనీ బోధివృక్షం నుండి లేవనని ప్రతిన బూనుతాడు.

సర్వసుఖాభిలాషయే దుఃఖహేతువని తెలిసె
సమస్త ప్రాణుల జన్మ కూడ పాపహేతువని తెలిసె
విషయ వాంఛలే మృత్యుకారణంబని తెలిసె
వివిధ కాంక్షలె పునర్జన్మ కారణంబని తెలిసె
ధర్మమే సత్యంబని సిద్ధార్థుండు బుద్ధుడై పలికె
ధర్మంబె ప్రపంచ మనుగడకు కారణంబనియె
భ్రాంతి దుఃఖభయంబులే మానవుల
శాంతి లేమికి నిత్య సత్యంబని కలిగె జ్ఞానంబు
స్వేచ్ఛలేని బానిస భావబంధనంబు నుండి
స్వేచ్ఛను బడయుటే మానవ నిర్వాణపథంబని తెలిసె

ఈ జ్ఞానంతో పాటు అష్టాంగమార్గం కూడా బోధివృక్షం క్రిందే అవగతమైంది.

1. సర్వ ప్రాణులను సమదృష్టితో చూడుము
2. సర్వప్రాణులు క్షేమంగా ఉండేటట్లు చూడుము
3. సర్వప్రాణుల క్షేమాన్ని కాంక్షించుము
4. సర్వప్రాణులు క్షేమాకర్మలే చేయుము
5. సమమైన తక్కువ కాని లేక ఎక్కువ లేక స్థిరమైన వ్యాయామం చేయుము
6. సర్వప్రాణులను బాధించని పనులను చేయుము
7. సర్వులు క్షేమంగా ఉండే పనులు చేయుము
8. సర్వులు ఆనందించుటయె తన ఆనందమని తెలియుము.

ఆర్య సత్య చతుష్టయ ధర్మాలే బుద్ధుని అష్టాంగమార్గ విధానం.

దుఃఖము దుఃఖోదయ కారణంబు
దుఃఖనాశన మార్గంబు తెలియవలయు
దుఃఖ నివారణోపాయంబు తెలియవలయు అని బుద్ధునికి జ్ఞానదర్శనమయ్యింది.

## అష్టాంగమార్గవిధులు :

దుఃఖం, కోరికలు నశించాలంటే వీటిని పాటించాలి.

1. సమ్యగ్దృష్టి, 2. సమ్యక్సంకల్పం, 3. సమ్యగ్వాణి 4. సమ్యక్కర్మాంతము 5. సమ్యగ్జీవనముద్ర 6. సమ్యగ్వ్యాయామము 7. సమ్యక్స్మృతి 8. సమ్యక్స మాధి

శ్రావస్తీ నగరంలో కృష్ణాదేవి ఒక్కసారిగా వచ్చి బుద్ధుని పాదాలపై పడి ఏడ్వగా ఏమమ్మా నీ బాధ అంటే

''ఒక్కగానొక్క కొడుకుండె నాకు మహాత్మా
ఒక్కడు లేకుండ మరణించె మహాదేవా

మాణిక్య వైడూర్యాది కనకంబులిత్తునీకు
మృతుండైన నా కొమరుని బ్రతికించుమయ్య లేదేని
మరణించనుద్యమింతునేనును దేవా"

అని బదులివ్వగా బుద్ధుడు మందస్మిత వదనార విందుడై తలను నిమిరి అమ్మా తల్లీ! "సర్వసంగ పరిత్యాగి నైన నాకెందుకు ఆ వజ్రవైడూర్యాలు, నాకు కొన్ని నువ్వులు తీసుకురా! అవి కూడా ఎవరి ఇంట్లో మరణం సంభవించ లేదో ఆ ఇంటి నుండి తీసుకురమ్మనగా ఆ తల్లి వెళ్లింది. వెదికి, వెదికి అలసిసొలసి వచ్చి అటువంటి ఇల్లు లేదని ఘొల్లున ఏడ్చి తను క్షమించి ఆదరింపు తండ్రి అని కోరింది.

బుద్ధునికి జ్ఞానోదయం అయిందన్న విషయం తెలుసు కొని శుద్ధోధనుడు దూతను పంపించటం, బుద్ధుడు కపిల వస్తుపురికి రావడం, ఉదయాన్నే భిక్షాటనం ప్రారంభిం చడం, శుద్ధోధనుడు తన ధన భాండాగారం సర్వస్వం తీసుకోమనడం అది నాకిచ్చినట్లైతే, అందరికీ పంచుతా ననడం, ఆ తండ్రి నాకు పుత్రవాత్సల్యం వీడేలా దీవించ మనడం, యశోధర బాధపడి మేమెవరికోసం జీవించాలో చెప్పమని మా కర్తవ్యం ఏంటని అడగడం. ఈ జన్మతో నిర్యాణం చెంది ఈ జన్మ యికపై లేకుండా చేసికొనుము' అనడం, యశోధరాదేవి తన చెంతనే ఒదిగి ఉండటం, కుమారుడు రాహులుడు ధనం ఇమ్మని అడగడం, "నా వద్ద ప్రాపంచిక ధనంబులేదు ముక్తి యొసంగు ధనమున్న దని, ధర్మవిత్తం అదని దీవించడం జరుగుతుంది. బుద్ధుడు ఆమ్రపాలి అనే వేశ్య దగ్గర ఆతిథ్యం తీసుకోవడం, శిష్యుడైన ఆనందుని సందేహాలకు గౌతముడు సమాధానాలివ్వడం, క్షమాగుణ విశిష్టత, ధ్యాన మహాత్మ్య విశిష్టత తెల్పి మహాత్ముడు

"బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి"

ప్రశాంత నిశ్శబ్దం బెల్లెడల వ్యాపించె
ప్రశాంత జ్యోతియై మహాత్ముని ముఖారవిందంబు వెలిగె
ప్రశాంత మహాధ్యానములోనికి మహాత్ముడు వెడలె
ప్రశాంత ప్రకాశ ముఖంబై జ్ఞానజ్యోతియయ్యె
నిర్వాణమొందిన గురుదేవుని గూర్చి శిష్యులు

"నమో బుద్ధాయ
నమో ధర్మాయ
నమో సంఘాయ
నమో నమః
మహాజగతి నిశ్శబ్దం బయ్యె
ముఖారవిందమతి తేజంబయ్యె
మహాధ్యాన సమాధిలో లీనమయ్యె
మహాప్రస్థాన నిర్వాణమొందె
మహితాత్ముడై విశ్వమానవ శాంతి చక్రవర్తియై"

న్యాయం, ధర్మం, పాద ద్వంద్వంగా నడిచిన నారా యణరెడ్డి గారు కూడా శాంతి చక్రవర్తి. కాబట్టి ఈ 'శాంతి చక్రవర్తి' గేయమాలను శాంతస్వభావంతోనే సరళంగా సరళీకరించారు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# సీమ కరువు, ఫ్యాక్షన్ కథలు - సామాజిక జీవితం

- కె. గీత
పరిశోధక విద్యార్థి, తెలుగు & అనువాద అధ్యయనశాఖ,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

- డా॥ భూక్య తిరుపతి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు & అనువాద
అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

తెలుగు కథా సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన అనేక కథలను అందించిన ప్రాంతం రాయలసీమ. రాయలసీమ పేరులో ఒకప్పుడు ఉన్న రాజసం ఇప్పుడు లేదు. ఎక్కడ చూసిన కరువు, ఫ్యాక్షన్ గొడవులతో దర్శనమిస్తుంది. త్రాగునీరు, సాగునీరు లేక పంట భూములు బీడు భూములైతే, ప్రజా జీవితం వలసల పాలవుతుంది. అటువంటి దయనీయ సందర్భాన్ని కళ్ళకు కడుతూ ఈ ప్రాంతపు కవులు అనేక కథలు రాశారు.

రాయలసీమకు కథాసాహిత్యం ఆలస్యంగానే వచ్చినా, అసలు కథంటే రాయలసీమే అనేంతలా ఈనాడు కథా సాహిత్య తీవ్రత రాయలసీమలో ఉంది. అందుకు కారణం ఈ ప్రాంతపు వెనుకబాటుతనం, కరువు కాటకాలు, రాజకీయాలు, ఫ్యాక్షన్ గొడవలు, అంటరానితనం, నీటి సమస్య వంటి కథా వస్తువులు. సీమ కథా సాహిత్యంలో ప్రధానంగా చెప్పుకోవలసినవి కరువు, ఫ్యాక్షన్ కథలు. సింగమనేని నారాయణ, బండినారాయణస్వామి, శాంతి నారాయణ, పులికంటి కృష్ణారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి, వి.ఆర్.రాసాని వంటి వారు ఈ ప్రాంతపు అస్తిత్వాన్ని సమాజ జీవనాన్ని, తమ కథల్లో చిత్రికపట్టి, సమాజాన్ని చైతన్యపరిచారు. వారు రాసిన కరువు, ఫ్యాక్షన్ కథల్లోని సమాజ జీవితాన్ని విశ్లేషించడం ఈ పత్రోద్దేశం.

## కరువు కథలు :

రాయలసీమ అస్తిత్వాన్ని తెలియజెప్పేది కరువు కథలు. కరువు అనగానే రాయలసీమ అనేంతలా ఇక్కడి కథలు ఈ ప్రాంత జీవనాన్ని చిత్రిక పట్టాయి. ఇక్కడి వలసలు, రైతు జీవితం, నీటి సమస్య వంటి ఇతి వృత్తాలతో ఈ ప్రాంత అస్తిత్వాన్ని తెలిపిన అనేక కథ లున్నాయి. ఎంతో మంది కవులు తమ కథల్లో రాయలసీమ కరువు జీవితాన్ని వివిధ కోణాలలో సమీక్షించారు. ఆ కథల్లోని సీమ ప్రజల బతుకు పోరాటం దర్శనమిస్తుంది. అందులో కొన్ని కథలను పరిశీలిద్దాం.

### అడుసు :

సింగమేని నారాయణ రాసిన కథ 'అడుసు'. కరువు సేద్యం చేసి అప్పులపాలు కావడం కన్నా ప్రభుత్వం కల్పించే కరువు పనులకు కూలీలుగా పోవడం మంచిదని, వెంకటప్ప సేద్యం మనుకొని రోడ్డు పనికి దినకూలీగా వెళ్ళడానికి నిశ్చయించుకుంటాడు ఈ కథలో. కుటుంబాన్ని ఆర్థికంగా మెరుగుపరుచుకుందామని ఆహార పంటలు మాని, వ్యాపార పంటలు వేసి రాయలసీమ రైతు మరో రకంగా దగా పడుతున్నాడు. అష్టకష్టాలుపడి, ఇంటిల్లిపాదీ కష్టపడి కన్న బిడ్డలుగా చీనా చెట్లను పెంచి, పండించిన చీనాకాయల్ని మంచి ధరకు అమ్ముకుందామనుకున్న నారాయణప్ప అనంతపురం లారీ బ్రోకరు మొదలు నాగపూర్‌లో వేలం పాటగాళ్ళ దాకా దగా చేస్తే ఆయన వస్తుందనుకున్న ఆదాయంలో సగమే చేతికి రావడంతో విరక్తి చెంది ప్రేమతో పెంచిన చీనా చెట్లను నరికి పారేస్తాడు. ఈ కథ నారాయణప్పలాంటి ఎంతో మంది సీమ రైతులకు ప్రతీక. ఛిద్రమైన తమ బతుకు పోరాటానికి ఉదాహరణ.

### ఒక్క వానచాలు :

ఈ కథను సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రాశారు. ఎండిపోతున్న పైరును రక్షించుకోవడానికి వానకోసం ఎదురు చూసిన ఓ యువ రైతు దీనగాథే ఈ కథ.

చదువుకున్న యువకుడు ఉద్యోగం లభించక రైతుగా మారుతాడు. పందుల బారి నుంచీ వేరుశెనగ పైరును దక్కించుకోవడానికి తోటి రైతులతో కలసి కాపలాకు

వెళ్ళడం, వానలేక ఎండిపోతున్న పైరును చూసి ఆవేదన చెందుతాడు. పైరుకోసం చేసిన అప్పు గుర్తొచ్చి భయ పడతాడు. ఊర్లో పెద్దలంతా తప్పక వానొస్తుందటారు. బంగాళాఖాతంలో లేచిన వాయుగుండం వల్ల వారం రోజులపాటు ఏకధాటిగా వానకురుస్తుంది. వాన వెలిసిన రోజు రైతు తన పొలంలోని వేరుశనగ పైరును చూడడానికి వెళ్తాడు. వేరుశనగ ఆకులన్నీ కుళ్లిపోయి నల్లగా నేలకు అంటుకొని కనిపిస్తాయి. రైతు ఆశతో ఒక మొక్కను పీకుతాడు. వేర్లు కుళ్ళిపోవడంవల్ల కాయలు భూమిలోనే ఉండిపోతాయి. కనీసం గొడ్ల మేతకు కూడా పనికి రాకుండా పోతుంది. ఈ పరిస్థితిని తలచుకుంటూ దుఃఖంతో పొలంగట్టున కూలబడతాడు రైతు.

ఈ కథలో ఒకవైపు వానలురాక పంటలు ఎండిపోతే ఒక్కొసారి అధిక వర్షాల వల్ల పంటలు ఎలా నాశనమవు తున్నాయో రచయిత తెలియజేశాడు.

**బండి కదిలింది :**

ఈ కథా రచయిత 'వల్లంపాటి వెంకట సుబ్బయ్య'. ఈ కథలో కరువు బారిన పడిన ఒక పెద్ద రైతు యథార్థ గాధను, అతని దగ్గర పని చేసే జీతగాళ్ళ బాధలను, ప్రజలు పడిన పాట్లను ఎంతో చక్కగా వర్ణించాడు.

రామప్పరెడ్డి మోతుబరి రైతు. కరువు కాటకాల వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతుంటాడు. పిల్లల చదువులకు ఇంట్లో వెండి పళ్ళాలు అమ్ముకొంటాడు. కరువు వల్ల తన దగ్గర పని చేసే పాలెగాండ్లకు తిండి పెట్టడానికి కూడా చాలా కష్టంగా ఉంటుంది. రామప్ప రెడ్డి బావ మరిది కూతురు పెళ్లికి వెళ్లడానికి డబ్బులేకపోతుంది. కోమటిని అప్పు అడుగుతాడు. ఆ కోమటి కూడా వాయిదా వేస్తాడు. ఇలా డబ్బు అందక బాధపడతాడు. అనేక కష్టాలు పడి పెళ్ళికి వెళ్తాడు. తన దగ్గర పని చేసే పాలేర్లను, బక్కచిక్కిన పశువుల్ని చూసి దిగులు చెందు తాడు.

ఈ ప్రాంతంలో కరువు వల్ల బాధపడుతున్న ఎంతో మంది రైతులు యథార్థ జీవితాన్ని రచయిత రామప్పరెడ్డి పాత్ర ద్వారా తెలియజేశాడు.

**అన్నేకారిజల :**

'అన్నేకారి జల' 'వి.ఆర్.రాసాని' రాసిన కథయిది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దం గడిచిపోయినా భారతీయ రైతుల్ని ప్రత్యేకించి రాయలసీమ రైతుల్ని కరువు బారి నుండి తప్పించలేకపోయిన రాజకీయ వ్యవస్థలో రైతుల జీవితాలు గాలిలో దీపాల్లాగా ఎలా ఆరిపోతున్నాయో ఈ కథలో రచయిత చిత్రించాడు.

ఈ కథలోని మునెప్ప చిత్తూరుజిల్లా మెట్ట ప్రాంతంలో రైతు వర్గానికి ప్రతినిధి. టమోటా పంటను నమ్ముకుని సీమ రైతు పడే కష్టాలు. వర్షాలు లేక టమోట చెట్లు ఎండిపోతాయి. ఉన్న టమోటలను మార్కెట్‌కి తీసుకెళ్తే మంచి ధర రాక మునెప్ప బాధను కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు.

మట్టిని, పంటను ప్రేమించి వాటితో జీవితాన్ని ముడి పెట్టుకున్న మునెప్పను 'మాయ దారిపంట, మాయల మారి సేద్దెం' అనుకునే వైరాగ్య దశకు చేరుస్తున్న తీరు ఈ కథలో ప్రతిఫలించింది.

"బతుకే వొక జలజూదంగా మారిపోయిండే ఈ గడ్డన సొసంత్రంగా సచ్చిపోయే అదురుష్టం గూడా లేకపోయ" అని మునెప్ప లాంటి శ్రామిక రైతు అనుకునే స్థితిని ఈ వ్యవస్థ కల్పిస్తున్నది. సాహిత్యం సామాజిక పరిణామాలను, వాటి పర్యవసానాలకు చిత్రించే బాధ్యతకు ఈ కథ మంచి ఉదాహరణ.

ఈ కథలన్ని రైతుల కరువు జీవితాలను ఎత్తి చూపు తున్నాయి. "సమాజంలో అత్యంత కరువులో జీవించేది రైతే, ఆ సమాజాన్ని కరువు నుండి తప్పించేదీ రైతే"నన్న సత్యాన్ని ఈ కరువు కథలు బోధిస్తున్నాయి. ఎన్నో గొప్ప చదువులు చదివినా నిరుద్యోగంతో స్వశక్తితో వ్యవసాయం వైపు మళ్లే యువత సైతం నీళ్లులేక కరువు ప్రవాహంలో కొట్టుకుపోవడానికి ఈ కథలు నిరూపిస్తున్నాయి.

**ఫ్యాక్షన్ కథలు :**

రాయలసీమను కరువు పీడిస్తున్నట్లుగానే ఫ్యాక్ష నిజమూ పీడిస్తున్నది. ఆధిపత్య భావజాలంతో, ప్రజా స్వామిక స్వభావమేమి లేకుండా, ప్రకృతి వనరుల మీద

పెత్తనం చెలాయిస్తూ మనుషుల్ని కూడా అజమాయిషీ చేసే వర్గం ఫ్యాక్షనిస్టు వర్గం. ఇవాళ కాంట్రాక్టులు, రాజకీయాలు అన్నీ వాళ్ళవే. ఆఖరికి ప్రజల జీవితమే వాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోతున్నది.

ఒకనాడు కడప, కర్నూలు జిల్లాలకు పరిమితంగా ఉండిన ఫ్యాక్షనిజం అనంతపురం జిల్లాకు కూడా పాకి అనేక పేర్లతో చెలామణి అవుతూ, జిల్లాను రక్తపుటేరుల్లో ముంచుతున్నది. ఇది మానవ మనుగడకే ప్రమాదకారియై గ్రామాలను కలవరపెడ్తున్నది. పట్టణాలను వణికిస్తున్నది. ఈ నయా పాలెగాళ్ళ మీద రావల్సినన్ని కథలు అనంతపురం జిల్లా నుండి రాలేదు.

**కెంపు :**

'కెంపు' టి. రాఘవేంద్రరావు రాసిన ఈ కథలో రెండు గ్రామాలలో ఉన్న నాయకుల మధ్య గొడవలు కారణం. సంజీవరెడ్డి, నారాయణప్ప మధ్య ఫ్యాక్షన్ గొడవలు జరుగుతూ వుండేవి. సంజీవరెడ్డి దగ్గర భీమన్న, నారాయణప్ప దగ్గర వెంకటి పని చేసేవారు. భీమన్న, వెంకటి ఇద్దరు మామ అల్లుళ్లు. సంజీవరెడ్డి, నారాయణప్పల మధ్య జరిగిన బాంబు దాడిలో మామ, అల్లుడు ఇద్దరూ ప్రాణాలను విడిచారు. 'ఏం పార్టీలు, ఏం మూఠాలు, ఏం కక్షలూ! మామా అల్లుడూ ఇద్దరూ పోయినారు'!, 'గౌరమ్మ పండగ! తల్లి ముండమోసె, కూతురు ముండమోసె!'

మండుతున్న మా ఊరు: పులికంటి కృష్ణారెడ్డి రాసిన కథయిది. ఒకప్పుడు ఎంతో అందంగా, ప్రశాంతంగా ఉన్న పల్లెటూరు కొంతకాలం తర్వాత వర్షాలు లేక పంటలు పండక, కరువు కాటకాలతో, హత్యలతో, కక్ష్యలతో గ్రామాలు రెండు పార్టీలుగా విడిపోయి, ఒకరి మీద ఒకరు పగతో రగిలిపోతున్నారు.

వెంకటరెడ్డి గ్రామంలో ఉన్న కరువువల్ల పట్టణానికి వెళ్ళి స్థిరపడ్డాడు. కొంత కాలానికి గ్రామానికి తిరిగి వచ్చాడు. అప్పటికి గ్రామంలో మనుషులకు ఏ పని లేక ఒకరి మీద ఒకరికి కక్షలు పెరిగిపోయాయి. రెండు పార్టీలుగా విడిపోయి, ప్రక్క పార్టీ వాళ్ళ బాగా బతికితే ఓర్వలేక వాళ్ళు ఇంటిలో వున్న కోళ్ళలకు ఎలకల మందుపెట్టి చంపడం.

వాళ్ళు పగతో రైతుకు ఆరో ప్రాణం అయిన ఎద్దులు తాగే నీళ్ళలో ఎండ్రినను వేసారు. ఎండ్రినను కలిపిన నీళ్ళు త్రాగి కోడెదూడలు చనిపోవడం, కోడెలను చంపారన్న పగతో మనిషిని చంపారు. ఆ విధంగా గ్రామంలో పగలు, కక్షలూ పెరిగి ఒకరిని ఒకరు ఖూనీ చేసుకుంటూ, ఎప్పుడూ ఎవరిని ఎవరు చంపుతారో తెలియక గ్రామంలో ప్రశాంతత పోయింది.

'కేతువిశ్వనాథరెడ్డి' కథలో మాయపొరలు, స్వస్తి అనేవి ఫ్యాక్షన్ కథల్లో ప్రధానమైనవి.

**మాయపొరలు :**

రాయలసీమ గ్రామాల్లోని ముఠాల కక్షల, ఫ్యాక్షన్ల, ఫ్యాక్షనిస్టులు, పాలెగాండ్లు, కడప హింసా సంస్కృతి ప్రభావం, అనంతపురం ప్రశాంతం, ప్రతిహింస, రాజ్యహింస, విప్లవ హింస, మానవహక్కులహింస, నక్సలైట్ల హింస మొదలగు వాటిని గూర్చి తెలియజేస్తుంది ఈ కథ.

**స్వస్తి :**

ఎమ్మెల్యే దగ్గరగా వున్న గన్‌మెన్‌లు ఎదుర్కొనే సమస్యలకు సంబంధించిన కథ. ఎమ్మెల్యేకి అపోజిషన్ పార్టీకి మధ్య రాజకీయ పగలు. ఎమ్మెల్యే ఎప్పుడు బయటికి వెళ్తే అప్పుడు దాడి చేదాం అని అపోజిషన్ పార్టీ వాళ్లు ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యేని కాపాడటానికి 6 మంది గన్‌మెన్‌లను ఉన్నారు. ఎమ్మెల్యేపై దాడి జరిగినప్పుడు కొందరి గన్‌మెన్‌లు ప్రాణాలు వదిలేస్తే, కొందరు కాళ్ళు చేతులు విరిగి హాస్పిటల్ పాలెయ్యారు. తర్వాత గన్‌మెన్‌ల పరిస్థితులు, వారి కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుందో రచయిత ఈ కథలో వివరించాడు.

**'చుక్క పొడిచింది' :**

ఈ కథ పాలగిరి విశ్వప్రసాద్ రచించారు. ఈ కథలో పంచాయితీ ఎన్నికలు, ప్రెసిడెంట్ పదవి కోసం మొదలైన రాజకీయ కక్షలు ఇరు పార్టీల మధ్య బాంబు వెలుకొని, మనుషులను ఖూనీలు చేసే దాకా వెళ్ళింది. వాళ్ళ కుటుం

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 భావవీణ UGC Approved Journal No. 42500

బంలో స్త్రీలు పడే బాధ, వాళ్ళ పిల్లలను బయట పంప డానికి అనుక్షణం దినదిన గండంగా గడుస్తుంది.

పంచాయితీ ఎన్నికలలో రవీంద్రరెడ్డి తండ్రి ఓడి పోయిన కొంతకాలానికి ఖూనీ చేయబడ్డాడు. రవీంద్రరెడ్డి బాగా చదువుకొని, సుజాత అనే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. సుజాత తన భర్తతో మనకు ఈ గొడవలు వద్దు, పిల్లలను తీసుకొని పట్టణానికి వెళ్ళి ఏదో ఒక పని చేసుకొని బతుకుదాం అన్నది. కానీ రవీంద్ర ఆమె మాటలను పట్టించుకోలేదు. తండ్రి పోయిన తర్వాత రవీంద్రనే ఆ ఇంటికి, ఆ ఊరికి పెద్ద దిక్కు. తల్లికి, భార్యపిల్లలకి, అతని ఇద్దరు తమ్ముళ్లలకు, వాళ్ళ అను చరులకు, గ్రామ ప్రజలందరికి ఆయనే దిక్కు.

తండ్రిని చంపారన్న కక్షతో రవీంద్రుని తమ్ముళ్లు, వాళ్ళ అనుచరులు ప్రెసిడెంట్ చిన్న కొడుకుని బాకులతో పొడిచి చంపారు. రవీంద్రునుకి ఆ ఖూనీతో సంబంధం లేకపోయిన పోలీసు కేసు పెట్టి, అరెస్టు చేసి ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. ఆరు నెలల తర్వాత రవీంద్ర ఇంటికి వచ్చాడు. సుజాత మనం బయట వెళ్ళి బతు కుదాం. ఇక్కడ వదండి అని చెప్పింది. కాని వినిపించు కోలేదు. కొంతకాలం తర్వాత పట్టణం వెళ్ళి వస్తున్న రవీం ద్రునిపై దుర్గమ్మ వంక దగ్గర బాంబులతో దాడి చేయగా రవీంద్ర మరణించాడు.

రవీంద్రుని చంపిన వారిని చంపేదాక సుజాతను విధవను చేయకుండా అలానే ఉంచారు. రవీంద్రుని తల్లి కూడా పగతో రగిలిపోతుంది. సుజాత కక్షలు వద్దు ప్రశాంతంగా బతుకుదాం. ఎక్కడి కన్నా దూరంగా వెళ్ళి పోదాం. పిల్లలన్న ఈ గొడవలకు, పగలకు దూరంగా బతుకుతారు అని చెప్పింది. కాని ఆ కుటుంబంలో ఎవరు పట్టించుకోలేదు. కొంతకాలం గడిచిన తర్వాత సుజాత చెప్పిన మాటలను ఆమె తోడికోడలు నిజమేనని నమ్మి సపోర్ట్ చేశారు. చివరికి ఇంట్లో అందరిని పిలిచి సుజాత నా పిల్లలను తీసుకొని రేపు ప్రొద్దున పట్టణానికి వెళ్ళిపోతాను అని చెప్పి పిల్లలను పడుకోబెట్టి తను ప్రశాంతంగా పడుకుంటుంది.

**'గర్భస్రావం' :**

శాంతినారాయణ రాసిన కథల్లో గర్భస్రావం ఎంతో హృదయ విదారకరమైన కథ. సింగమనేని 'అనంతం', దేవపుత్ర 'సమిధులు', శాంతి నారాయణ 'గర్భస్రావం' ఈ దృష్ట్యా వచ్చిన కథలు. కర్నూలు, కడప జిల్లాల నుండి ఫ్యాక్షన్ కథలు బాగానే వచ్చాయి. ఫ్యాక్షనిజం ఒక వారసత్వంగా మారి శివారెడ్డి లాంటి యువకులు అమా యకంగా, అనివార్యంగా ఫ్యాక్షనిజం సర్పయాగంలోపడి మాడిపోతున్న తీరుపట్ల ఈ కథ ఆలోచనలు రేకెత్తిస్తుంది. అంతేకాక ఫ్యాక్షనిజం స్త్రీల భవిష్యత్తు మీద వాళ్ళ సుఖసంతోషాల మీద చూపే దుష్ప్రభావాన్ని కూడా ఈ కథ ప్రదర్శించింది.

పార్వతి శివారెడ్డిని ప్రేమించి పెద్దలను ఎదిరించి పెళ్ళి చేసుకుంది. పార్వతి తండ్రి సుబ్బారెడ్డికి రాజ కీయాలు, పగలు, కక్షలన్న నచ్చేదికావు. కాని శివారెడ్డి పార్టీలంటూ అనుచరులను వెంటేసుకొని తిరిగేవాడు. కుటుంబాన్ని కాని, పార్వతిని కాని, ఇంటి సమస్యలు ఏమి పట్టించుకునేవాడే కాదు. భర్త బయటికి వెళ్ళింది మొదలు ఇంటికి తిరిగి వచ్చే దాక ఏ క్షణంలో ఏ మాట వినాల్సి వస్తుందో అని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవితాన్ని గడుపుతుంది. భర్తతో సంతోషంగా గడిపిన క్షణమే లేదు.

పార్వతి శ్రీమంతం వేడుక రోజు కూడా ఇంటి నిండ స్నేహితులు, బంధువులతో ఉండగా శివారెడ్డి మాత్రం పార్టీలంటూ బయట వుండేవాడు. ఎప్పుడూ ఇంటికి వస్తాడో ఎప్పుడు బయటికి వెళ్తాడో తెలియదు. ఒకరోజు ఊరిలో గొడవలు ఎక్కువగా జరుగుతున్న సమయంలో పార్వతికి నొప్పులు రావడం, ఆ సమయానికి తనని ఆదు కోవడానికి ఎవ్వరు ముందుకు రాలేదు. ఆ గొడవులలో పార్వతి, తన కడుపులో బిడ్డ ఇద్దరు కూడా ప్రాణాలను కోల్పోయారు. ఇలా ఈ కథ ముగుస్తుంది. ఒక్క పక్క కరువు విజృంభిస్తున్న, మరోవైపు పగలు, ప్రతీకారాలు వంటివి ఈ ప్రాంతంలో విపరీతమన్న విషయం ఈ కథల్లోని సారాంశం.

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. విలువైన కథా రచయితల చేతుల్లో పదునైన సాహిత్యం పుట్టి, సమాజం చైతన్యమవుతుంది. కరువులతో, కక్షలతో కాలుతున్న సమాజం యొక్క వాస్తవికతను తమ రచనలతో చిత్రికపడుతూ, సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ అనేక విలువైన కథలు ఈ ప్రాంతం నుండి వెలువడ్డాయి. ఈ కథల ఉద్దేశం సీమ అంటే కరువులు, కక్షలు అని చెప్పడం కాదు గాని కరువులు, కక్షలు లేని సమాజాన్ని నిర్మించడం. సీమను కరువులనుండి, కక్షలనుండి విముక్తి చేసే దిశగా ప్రభుత్వాన్ని, సమాజాన్ని చైతన్య పరచడం.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. నారాయణ సింగమనేని., సింగమనేని కథలు, శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాద్, 2012.
2. విశ్వనాథ రెడ్డి కేతు., కేతు విశ్వనాథరెడ్డి కథలు, విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్, 2004.
3. వెంకట సుబ్బయ్య వల్లంపాటి, వల్లంపాటి కథలు, వల్లంపాటి ప్రచురణలు, మదనపల్లి, 2009.
4. కర్నూలు జిల్లా కథల సంకలనం, డా॥ ఎం. హరికిషన్, కర్నూల్ బుక్ ట్రస్ట్, కర్నూలు, 2005.
5. కడపజిల్లా కథల సంకలనం (1956-2006), సంపాదకుడు - తవ్వా ఓబుల్‌రెడ్డి, ప్రచురణకర్త - అబ్బిగారి రాజేంద్ర ప్రసాద్, నందలూరు కథానిలయం, కడప.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC Approved Journal No. 42500

# జాషువా సాలీడు, గిజిగాడు

- డాక్టర్ ఎం.మునిరత్నం, శాఖాధిపతి, తెలుగు విభాగం, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై, తమిళనాడు.

## పరిచయం :

కులమతాల కంటే మానవ సంబంధాలు బలపడాలని తపన గల వీరయ్య, లింగమాంబ దంపతుల పుణ్య ఫలమే జాషువా. 1895 సెప్టెంబర్ 28న వినుకొండలో జన్మించారు. కుల, మత వివక్షలను ఎదిరించి పేదరికాన్ని అధిగమించి బాధమయ జీవితంలో ఆధునిక భావాలు జీర్ణించుకున్నవారు జాషువా. నరనరాల్లో పెల్లుబిగే భావ తీవ్రత ఆయన కవిత. అంటరానితనమనే మదగజాన్ని పద్యమనే అంకుశంతో పొడిచి సమాజాన్ని, సాహిత్యాన్ని సంస్కరించారని ఖ్యాతికెక్కారు. జాషువా ఖండ కావ్యానికి అఖండ ఖ్యాతిని, అనంత వ్యాప్తిని చేకూర్చారు. ఆయన రచనలు 'స్వప్నకథ'(అనాథ), 'పిరదౌసి', 'గబ్బిలం', 'కాంది శీకుడు', 'ముంటాజ్‌మహల్', 'నేతాజీ', 'బాపూజీ', 'స్వయంవరం', 'రాష్ట్రపూజ', 'కొత్తలోకం' ఖండకావ్యాలు ఏడు సంపుటాలు, 'నా కథ'(స్వీయచరిత్ర మూడు భాగాలు), 'ముసాఫరులు', 'క్రీస్తుచరిత్ర', 'నాగార్జున సాగర్' మొదలైనవి. నాటకాల్లో 'రుక్మిణీ కళ్యాణం', 'చిదానంద ప్రభాతం', 'ధృవవిజయం', 'మీరాబాయి', 'తెరచాటు' ప్రచురితమయ్యాయి. అముద్రిత రచనల్లో 'హిమదామార్కధర పరిణయం', 'కన్యకాపరమేశ్వరి', 'మదాలస', 'దావీదుచరిత్ర' ఉన్నాయి. 'క్రీస్తుచరిత్ర' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. ఉభయ భాషా ప్రవీణులైన జాషువా తొలినాళ్ళలో ప్రాథమిక ఉపాధ్యాయునిగా పనిచేశారు. ప్రపంచ యుద్ధ సమయంలో ప్రచారకునిగా, ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో తెలుగు వార్త ప్రయుక్తగా పనిచేశారు. ఆయన కవికోకిల, కవితా విశారద, కవిదిగ్గజ, మధుర శ్రీనాథ, నవయుగ కవిచక్రవర్తి, విశ్వకవి సమ్రాట్ బిరుదులను పొందారు. గండపెండారం ధరించి, కనకాభిషేకాలు పొంది, గజారోహణ చేసి, పగటి దివిటీల పల్లకిలో ఊరేగిన కవి చక్రవర్తి జాషువా. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసన మండలి సభ్యత్వం ఇచ్చి గౌరవించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం కళాప్రపూర్ణ బిరుదునిస్తే, భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది.

## జాషువా వ్యక్తిత్వం-కవిత్వం :

"జాషువా కవిత్వాన్ని అతని వ్యక్తిత్వం నుంచి విడదీసి చూడలేము. అవి ఒకదాని కొకటి కారకాలు. ఉప స్కారకాలు. అవిభాజ్యంగా కలిసి మండిన అనల జ్వాలలు" అని సినారె పేర్కొన్నారు.(తెలుగు సాహిత్య చరిత్ర, ద్వానాశాస్త్రి, పుట.386)

"నాదు కన్నీటికథ సమన్వయము సేయ
నార్ద్ర హృదయంబు గూడ కొంతవసరంబు"

అని జాషువా వాపోయారు. ఇలాంటి జాషువా కవిత్వాన్ని ఆర్ద్రహృదయంతో పరిశోధనాత్మకంగా విశ్లేషించినా సినారె యువభారతి వారి కవితా లహరిలోని 'గుర్రం జాషువా' వ్యాసం ఆధారంగా జాషువా కవితా నైపుణ్యాన్ని తెలుసుకుందాం.(తెలుగు సాహిత్య చరిత్ర, ద్వానాశాస్త్రి, పుట.387)

"ఆధునికాంధ్ర సాహిత్యరంగంలో తొలితరం కవుల్లో అన్ని విధాల విలక్షణంగా ప్రసన్నమయ్యే మహనీయ మూర్తి జాషువ. వారిది రాపిడి పడ్డ జీవితం. రాపిడిలో రాణించిన ప్రతిభ. ప్రతిభతో గుబాళించిన కవిత. "కుల మత విద్వేషంబుల్ తల సూపని కళారాజ్యం" కోసం కలలు గన్న ఆశావాది, సమతావాది, మానవతావాది జాషువా" అని జి.ఎన్.రెడ్డి కొనియాడారు. (తెలుగు సాహిత్య చరిత్ర, ద్వానాశాస్త్రి, పుట.386)

"జాషువా ఖండకావ్యాలకు సార్వజనీనత సిద్ధించింది. వస్తునవ్యత, వస్తు వైవిధ్యం, వ్యథా భరితమైన హృదయం నుండి పొంగి పొరలిన భావావేగం, క్షుద్ర వస్తువులో కూడా ఉదాత్తతను చూడగల సహృదయం వాటికొక ప్రశస్తిని

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

చేకూర్చినాయి. వాటికి తోడు విప్లొన్నతాలు లేని శైలి, సామాన్య ప్రజల వ్యవహారంలో బాగా నలిగిపోయిన పద ప్రయోగం, కొన్ని శతాబ్దాలుగా తెలుగువారికి సన్నిహితమై పోయిన హృద్యమూ, సంప్రదాయ బద్ధమూ ఐన పద్య రచన జాషువ కావ్యఖండికలకు మెరుగులను దిద్దాయి" అని భి.భాస్కర చౌదరి తెలిపారు (తెలుగు సాహిత్య చరిత్ర, ద్వానాశాస్త్రి, పుట.386). ఇలా ప్రముఖ రచయితలు జాషువా కవిత్వాన్ని గురించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. జాషువా కవిత్వానంతా విశ్లేషించుకోవడం సాధ్యమయ్యే పనికాదు. జాషువా రచనలు ఖండకావ్యం మొదటి భాగంలో భరతమాత, గిజిగాడు, సాలీడు, నెల బాలుడు, నెమిలి నెలత, తుమ్మెద పెండ్లి కొడుకు, దీర్ఘ నిశ్వాసము, శల్యసారథ్యము, భారతవీరుడు, బుద్ధ మహిమ, భీష్ముడు, రాజరాజు, శ్మశానవాటిక, శిశువు, బాష్ప సందేశము, తెలుగు తల్లి, శిల్ప, ఇంటిగెలుపు, రాజదర్శనము, గుంటూరు సీమ, సమదృష్టి, పశ్చాత్తాపము, క్రీస్తు, వీరపూజ, ఆంధ్రభోజుడు, మాంపాహి, రత్నచ్యుతి, శబ్దశాసనుడు, అయోమయము, కళాశాల, సఖి యుగంధర మంత్రి జేబున్నీసా పేర్లతో కవితా శీర్షికలు ఉన్నప్పటికీ అన్నిటిని పరిశోధనాత్మకంగా విశ్లేషించుకోవాలంటే ఈ వ్యాసం సరిపోదు. అందువల్ల 'సాలీడు', 'గిజిగాడు' కవితా శీర్షికలను మాత్రం తీసుకున్నాను.

## 'సాలీడు' కవితా వైభవం :

జాషువా రాసిన 'సాలీడు' ఆయన మొదటి ఖండ కావ్యంలో ఉంది. సాలీడు మీద జాషువా అయిదు పద్యాలు రాశాడు. ఈ అయిదు పద్యాలు జాషువా కవితా వైభవానికి నిదర్శంగా ఉన్నాయి. లోకంలో చడ్డగా రూఢి కెక్కిన వస్తువుల్లో మంచిని చూపించడం జాషువా పద్ధతి. లోకంలో 'సాలీడు'కు మంచి పేరు లేదు. సాలీడు తన ఆహారం కోసం తన అల్లికను చూసి ఆకర్షింపబడి దరి చేరిన పురుగులను బంధించి తినేస్తుంది. అందుకే 'సాలె గూటిలో చిక్కుకున్నాడురా!' అనే నానుడి లోకంలో ఉంది. సాలీడులోని మోసపుగుణాన్ని కాక దాని అల్లికలోని గొప్పతనాన్ని మెచ్చుకుంటూ పద్యాలు రచించాడు.

"నీలో నూలు తయారుజేయు మరగానీ, ప్రతి రాట్నంబు గా
నీ, లే దీశ్వరశక్తి నీ కడుపులోనే లీనమై యుండునో
యేలీలన్ రచియింతు వీజిలుగునూ! లీ పట్టు పుట్టంబు! లో
సాలీడా, నిను మోసగాడవని విశ్వంబేల ఘోషించెడిన్?"

(జాషువా రచనలు, ఖండకావ్యం, మొదటి భాగం, పుట.2)

నూలు తయారు చేసే మరయంత్రంగానీ, ప్రతి రాట్నంగానీ కడుపులో లేకపోయినప్పటికీ పట్టును తయారు చేసే ప్రజ్ఞ నీకు ఎలా లభించిందని కవి ప్రశ్నిస్తున్నాడు సాలీడును. చివరికి తనకు తానే సమాధాన పడ్డాడు. ఈశ్వరుని లీలవల్ల నీవు ఆ పని చేయగలుగుతున్నావని భావించాడు. లోకానికి ఉపయోగపడే పని చేసినప్పటికి సాలీడుని మోసగానిగా లోకం భావించడం కవికి ఆశ్చర్యాన్ని కలగజేసింది.

"ఢక్కామల్లుపసందు నేతపనివాంఢ్రా, నీ యుపాధ్యాయు? లి
ప్డెక్కండున్ గనరాడు దాగుకొనినారో నీదు గర్భంబున?
దిక్కాలంబున నిన్ను మించు పనివాడే లేడు, దుర్వృత్తికిన్
దిక్కై, నీ యనమాన కౌశలము వ్యర్థీభూతమై పోయెడిన్"

(జాషువా రచనలు, ఖండకావ్యం, మొదటి భాగం, పుట.2)

నీకు ఈ నేత విద్యను ఎవరు నేర్పారు? ఢక్కాకు చెందిన నేత పనివారా! నీ ఉపాధ్యాయులు వాళ్ళందరూ ఇప్పుడెక్కడున్నారో, నీ గర్భంలో దాక్కున్నారా? ఈ కాలంలో మాత్రం నిన్ను మించిన నేతగాళ్ళు లేరు. కాలం పాడైపోయింది గుర్తింపు లేక నీ సాటిలేని కౌశలం వ్యర్థమై పోయింది. కళాప్రౌఢిమ దుర్వృత్తికి కాకుండా, సామాజిక కళ్యాణానికి వినియోగించబడాలన్న అభిప్రాయం ఈ పద్యంలో అంతర్గతంగా ఇమిడి ఉంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC Approved Journal No. 42500

"తలపం బున్నమనాటి వెన్నెలల దిద్దంజాలు నీ నూలు పో
గుల సింగారము జూడవచ్చి యసువుల్గోల్పోయెడిన్ బ్రాణులో
తులువా! నెత్తురు ద్రావు నేతపను లెందుం జూడ! మోరంత ప్రొ
ద్దులు నీ కీ యుదరంభరిత్వ మనుకొందుం బెండ్లముం బిడ్డలున్"

(జాషువా రచనలు, ఖండకావ్యం, మొదటి భాగం, పుట.2)

వెన్నెల లాంటి కల్మషం లేని వస్త్రాల అందాలను చూడ వచ్చి పురుగులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇటువంటి నెత్తురు తాగే నేత పనులెక్కడ చూడలేం. ఇది నీ భార్య బిడ్డల కడుపు నింపటం కోసం చేస్తున్నావనుకుంటాను. ఒకసారి ఒక వీరుడు నీవు అల్లిన గూటిలో దాగి ఉండగా అతన్ని వెతుక్కుంటూ వచ్చిన దాయలు నీ మీద నమ్మకంతో వెళ్లిపోయారు. అంటే నువ్వ అతన్ని దాచి కాపాడావు. అందుకును నిన్ను మెచ్చుకుంటున్నాను.

## 'గిజిగాడు' కవితా వైశిష్ట్యం :

ప్రకృతిలో పక్షులు ఒక అంతర్భాగం. అందమైన పక్షులలో 'గిజిగాడు' పక్షి ఒకటి. ఈ పక్షి కట్టుకొనే గూడు కూడ అందంగా అందరిని ఆకర్షింపజేస్తుంది. ఆ గూటిలో భార్య పిల్లలతో ఆనందంగా గడిపే గిజిగాడు పక్షి మానవులకు ఆదర్శంగా కవి భావించాడు. గిజిగాడు పక్షి తన అవసరాలకు అనుగుణంగా అందమైన గూటిని నిర్మించుకుని తన భార్య పిల్లలతో ఆనందంగా జీవితం గడుపుతుంది. రాజువలె సుఖాలను అనుభవిస్తుంది. తన అందంతో చూసేవారిని ఆనందింపజేస్తుంది.

"జిలుగుం బంగరు రంగులం గులుకు మేల్చిన్నారి పూగుత్తి సొ
మ్ములు గీలించిన తుమ్మకొమ్మలకు, నీవు న్నీ సతీరత్నమూ
యెల గీమున్ దగిలించి రేబవలు హాయిందూగరా గాడ్పు బి
డ్డలు మీ కూడిగ మాచరింప, గిజిగాడా నీకు దీర్ఘాయువౌ"

(జాషువా రచనలు, ఖండకావ్యం, మొదటి భాగం, పుట.1)

గిజిగాడా! బంగారు కాంతులను వెదజల్లు చిన్నవైన, అందమైన పూలను సొమ్ములుగా కలిగిన తుమ్మచెట్టు కొమ్మలకు నీవు నీ భార్య ఉయ్యాలవంటి ఇంటిని తగిలించారు. చిరుగాలులు వీచి మీకు సేవ చేస్తుండగా రాత్రింబవళ్ళు ఆ ఇంటిలో ఊగుతూ ఆనందించే మీరు చిరకాలం జీవిస్తారు గాక! అని కవి ఆశీర్వచనం పలుకుతున్నాడు.

"తేలిక గడ్డి పోచలను దెచ్చి, రచించెద వీవు తూగటు
య్యేల గృహంబు, మానవుల కేరికి సాధ్యముగాదు, దానిలో
జాలరు, లందులో జిలుగు శయ్యలు నంతిపురంబు లొప్పగా
మేలు భళీ! పులుంగుటెకిమీడవురా గిజిగాడ? నీడజా!"

(జాషువా రచనలు, ఖండకావ్యం, మొదటి భాగం, పుట.1)

గిజిగాడా! నీవు బరువు లేనట్టి సన్నని గడ్డి పరకలను తెచ్చి ఉయ్యాలవంటి ఊగే ఇంటిని అందులో గదులను, ప్రక్కలను, కుర్చీలను ఏర్పాటు చేసుకోగలవు. అలా చేసుకోవడం మనుషులకు సాధ్యంకాదు. నీ నైపుణ్యాన్ని మెచ్చుకోవల్సిందే. నీవు పక్షులన్నిటికి రాజు వంటి వాడవని గిజిగాడు పక్షిని కవి మెచ్చుకుంటాడు.

"కులుకు పసిండినిగ్గుల దుకూలములన్ ధరియించి ముద్దు బి
డ్డలును, బడంతి నీ పొదిగిటన్ని దురింపగ గన్నెగాడ్పులూ
యెల సదనంబునూచ, భయమింత యెఱుంగక కన్నుమూయు నీ
యలఘు సుఖంబు మాకు గలదా! గిజిగా? యొక తేని కున్నదా?"

(జాషువా రచనలు, ఖండకావ్యం, మొదటి భాగం, పుట.1)

ఓ పచ్చని పిట్టా! బంగారు కాంతులను విరజిమ్ము సన్నని వస్త్రాన్ని కట్టుకొని నీ ముద్దు బిడ్డలు, నీ భార్య నీ ఒడిలో నిద్రిస్తుండగా, సన్నని చిరుగాలి మీరున్న ఉయ్యాల గృహాన్ని ఊపుచుండగా ఎటువంటి భయం లేకుండా నిద్రపోవునట్టి గొప్ప సుఖం మానవులకే కాదు. మానవులు రాజుకు కూడా లేదు. మానవుడు పొందలేని సుఖాన్ని గిజిగాడు పిట్ట పొందుతున్నదని కవి భావం.

"అందమున నీకు నీడగు నందగాడు
గృహవినిర్మాణమున నిన్ను గెలుచువాడు
వైభవంబున బోలు దేవతల జేడు
లేడురా గిజగా! మొనగాడ వోయి"

(జాషువా రచనలు, ఖండకావ్యం, మొదటి భాగం, పుట.1)

గిజగాడా! అందంలో నీకు సాటి అయినవారు ఇంకొకడు లేడు. వైభవంలో దేవేంద్రుడే నీకు సాటి. ఇంటిని నిర్మించడంలో నిన్ను మించినవాడు లేడు. నీవే మొనగాడవు.

"నీ గిజగాని నామకము, నీ తెలివిం బ్రకటించు గూడు, నీ
మైగల సోయగం బవని మానవకోటికి ముద్దుసేయునో
యీ! గిజగాడ! భీతిలకు! నీవు ధరాతలి నున్న బిట్టుగా
వాగెడు నాస్తికు ల్తలలు వంతు రనంతుని చెంత ఖిన్నులై"

(జాషువా రచనలు, ఖండకావ్యం, మొదటి భాగం, పుట.1)

ఓ పచ్చని పిట్టా! నీకు గిజగాడు అనే పేరు, నీ తెలివికి సూచకంగా నీవు కట్టిన గూడు, నీ శరీర సౌందర్యం, భూమిపైగల మానవులకు ముద్దును కలిగిస్తుంది. ఆకర్షిస్తుంది. భయపడవద్దు. నీవు భూమిపై ఉంటే భగవంతుడు లేడని ఎక్కువగా మాట్లాడేవారు కూడా చివరికి విష్ణు సన్నిధిలో సిగ్గుతో తలలు వంచి నమస్కరిస్తారు.

ఇందులో గిజిగాడు గృహనిర్మాణం నైపుణ్యాలు, మనకు లేని సౌఖ్యం, గిజగాడికి ఉన్న సౌఖ్యం, నాస్తికులు భగవంతుని ముందు ఎందుకు తలలు వంచుతారో తదితర విషయాలు చూడవచ్చు. జాషువా రచనల్లో సరళమైన పదాలతో గంభీరమైన భావం నిండి ఉంటుంది. అచ్చ తెలుగులో పదాలు పద్యాల్లో అందంగా అమరిపోతాయి. సన్నని వాయువులని చెప్పడానికి 'గాడ్పు బిడ్డలు', 'కన్యగాడ్పులు', 'మేల్చిచిన్నారి' వంటి విశేషణాలు జాషువా కవితకు జిలుగు వెలుగులనిస్తాయి. జాషువా కవిత్వానికి నిజాయితీ, ఆర్తి, ఆవేశం, ప్రతిఘటన అనేవి జీవలక్షణాలు. ఈయన రచనల్లో దయ, సానుభూతి, కరుణ, తొనకిసలాడుతాయి. జాతీయాభిమానం, సంఘ సంస్కరణాభిలాష వీరి రచనలలో ముఖ్యాంశాలు.

## ముగింపు :

జాషువా అలతి అలతి పదాలతో సంప్రదాయ బద్ధంగా పద్యాన్ని రచించినా సరళమయిన భాషతో గుండెలకు హత్తుకునేలా భావ సౌందర్యాన్ని పెంపొందించాడు. పద్య రచనలో మార్పులు తెచ్చారు. ఉర్దూ, అరబ్బీ, పారశీక భాషా పదాలను యథాతథంగా తెలుగు భాషలో చొచ్చుకునిపోయేలా చేశారు. ప్రారంభంలో ప్రణయ కవిత్వం రాసినా భావ కవిత్వం వైపు మాత్రం కన్నెతికూడా చూడలేదనే చెప్పాలి. ఊహలతో ఆకాశాన్ని అంటే భావ కవిత్వాన్ని విడచి నిజ జీవితంలో జరిగే ప్రతిఘటనలను తన కవిత్వంలో సిరాల నింపుకున్నాడు."అసమ సమాజం బాకులు గుమ్మినప్పుడు, అంటరానితనం విషాగ్నులు చిమ్మినప్పుడు, దుర్భర దారిద్ర్యం వెన్నాడినప్పుడు, దురంత వేదన గుండెల్లో తుకతుక ఉడికినప్పుడు జాషువా గుర్తొస్తారు. అతని ఫిరదౌసి గుర్తొస్తుంది. గబ్బిలం జ్ఞాపకానికి వస్తుంది. శ్మశానవాటిక నిట్టూర్పు పొగలతో కట్టెదుట నిలుస్తుంది. ఇంకా ఇంకా ఎన్నెన్నో ఖండకృతులు ప్రతిఘటనకు ఓంకృతులై ప్రతిధ్వనిస్తాయి" అని జాషువా నాడి పట్టుకున్నారు నారాయణరెడ్డిగారు.(తెలుగు సాహిత్య చరిత్ర, ద్వానాశాస్త్రి, పుట.388)

ఏ విషయం మీద పద్యం చెప్పినా జాషువా చూపు సరికొత్త చూపుగా ఎవరూ ఊహించని విధంగా కవితా వస్తువులను ఎంచుకొని వాటి ద్వారా అద్భుతమైనటువంటి సాహిత్యాన్ని సమాజానికి అందజేసే ప్రయత్నం చేస్తాడు. జాషువా కరుణ రసంలో నుంచి వీర రసాన్ని పండిస్తాడు. ఎవరూ ఊహించని అసమ సమాజం నుంచి కవితా వస్తువులను తెచ్చుకోవడానికి కోసం ఎన్నో చీకటి కోణాలను దర్శించి ప్రదర్శిస్తాడు. సాలెపురుగు, గిజిగాడు, గబ్బిలం, శ్మశానవాటిక తదితర పేర్లతో ఎవ్వరు ఊహించని విధంగా తలక్రిందులుగా ఉన్న వస్తువులను చెడుగా భావించే విషయాలను కవిత్వానికి ఇవి పనికిరావు అనే తలంపులను తోసి కవిత్వానికి అన్ని అర్హమైనవే అని చాటి చెప్పిన జాషువా ప్రజల నాల్కుల మీద సుకవిలా జీవిస్తున్న అసల సిసలైన కీర్తిశేషుడు.

## ఆధార గ్రంథాలు :

1. జాషువా రచనలు (ఖండకావ్యము, మొదటి భాగం), విశాలాంధ్ర బుక్ హౌస్, విజ్ఞాన్ భవన్, 4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్-500 001.
2. తెలుగు సాహిత్య చరిత్ర- డాక్టర్ ద్వా.నా.శాస్త్రి, ప్రగతి పబ్లిషర్స్, 3-11-275/1, శ్రీశంకర్ కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500 074, పరివర్ధిత చతుర్థ ముద్రణ: జూన్ 2008.
3. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు - డాక్టర్ సి.నారాయణరెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, 4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్-500 001, తృతీయ ముద్రణ: మార్చి 1999.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# మల్లెమాల 'నిత్యసత్యాలు' - సామాజిక దృక్పథం

- డా॥. సిహెచ్. శ్యామల కుమార్, శాఖాధిపతి, తెలుగు విభాగం, ఎ.జి.కె.యం. కళాశాల, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా.

తెలుగు సాహిత్యపు పూతోటలో సాహిత్య సువాసనలను వెదజల్లిన ఆధునిక తెలుగుకవి మల్లెమాల. సాహిత్య లోకంలో మల్లెమాలగా అందరికీ సుపరిచితులైన ఆయన పూర్తిపేరు మల్లెమాల సుందరరామిరెడ్డి. నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలో 'అలిమిలి' అనే చిన్న గ్రామమందు మల్లెమాల రామస్వామి రెడ్డి, రంగమ్మలకు 1924 ఆగష్టు 15న జన్మించారు.

మల్లెమాల 'అలిమిలి' గ్రామ వీధిబడిలో ఓనమాలు దిద్ది ప్రాథమిక విద్య పూర్తిచేశారు. అంతకంటే ఆ గ్రామంలో చదువుకోవడానికి బడిలేదు. పట్టణానికి పంపించి చదివించడానికి అప్పటి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేవు. తండ్రి రామస్వామిరెడ్డి పిల్లవాడిలో ఉన్న ఆసక్తిని గమనించి రత్నాకర వెంకటరాజు అనే పంతులు గారిని జీతానికి మాట్లాడి మరికొంతమంది పిల్లలను కలిపి చదువు చెప్పించాడు.

ఆయన కొంతకాలం చదువును, నేర్పి వీడిని బాగా చదివించమని చెప్పాడు. తల్లి రంగమ్మ "చదువుసాము లేనివాడు చట్టుబండతో సమానమని" తలంచి విస్తరాకులమ్మి ఆ డబ్బుతో కొడుకును గూడూరుకు పంపింది. అక్కడ కొంతకాలం చదువుకున్నాక మళ్ళీ ఆర్థిక పరిస్థితుల వల్ల చదువు కుంటుపడి స్వగ్రామానికి వచ్చేసి తండ్రితో పాటు వ్యవసాయం చేశాడు. బ్రతుకు తెరువుకోసం అనేక చిన్నచిన్న వ్యాపారాలు చేశారు. తరువాత మైకా కంపెనీ పెట్టి స్థిరపడ్డారు.

1951 అక్టోబరు 10న సౌభాగ్యమ్మతో వివాహం అయింది. ఆ తరువాత 1964సంవత్సరంలో గూడూరులో 'సుందర్ మహల్' అనే సినిమా థియేటర్‌ను కట్టించాడు. 1966 సంవత్సరంలో "కౌముది ఆర్ట్ పిక్చర్స్"ను స్థాపించి, తమిళ, కన్నడ భాషల నుండి సినిమాలను అనువాదం చేసి నిర్మాతగా మారాడు. 1967, 68 సంవత్సరాల నుండి తెలుగు సినీ నిర్మాతగా తన సినీ జీవిత ప్రస్థానాన్ని ప్రారంభించాడు. అప్పటి నుండి కవిగా, రచయిగతా పలు కావ్యాలను, పాటలను వ్రాసి తెలుగు సాహిత్యంలో మంచిపేరు సంపాదించారు.

ఆధునిక సాహిత్యంలో అచ్చతెలుగు పదాలతో అద్భుత పద్య కావ్యాలను కూర్చి తెలుగువారికి అందించాడు. ఆయన రచనలు సామాజిక స్ఫూర్తి కలిగించి నవ చైతన్యానికి దారులు వేశాయి. అటువంటి ఆయన కావ్యాలలో 'నిత్యసత్యాలు' అనేది వెలకట్టలేనిది. నిత్యసత్యాలు పద్యకావ్యంలో సామాజిక దృక్పథాలను, మానవతా వాదాలను సామాన్యుని జీవన స్థితిగతులను చక్కగా తెలియజేశారు.

## సామాజిక దృక్పథం - వివరణ :

సమాజమంటే అనేకమంది ప్రజలు కలసి సహజీవనం సాగిస్తూ జీవించే ప్రదేశం. అటువంటి సమాజంలో మానవులు ఎటువంటి జీవితాలను గడుపుతుంటారు. వారి మధ్య ఉండే జీవన విధానం ఏమిటి? వారి ఆలోచనలు, జీవన సరళి ఎలాంటివో తెలియచేసేవి - దృక్పథాలు. వీటినే సామాజిక దృక్పథాలంటారు.

సమాజం ఎలా ఉండాలి? ప్రజలు తమ నిత్య జీవితంలో దయ, జాలి, కరుణ, మంచితనం, స్నేహ భావం, సేవ, భగవంతుని యందు భక్తి, వితరణ, మానవతావాదం, సామాజిక స్పృహ వంటి లక్షణాలతో, విలువలతో మానవులు జీవించాలి. అటువంటిది మంచి సమాజం అవుతుంది. ఇలాంటి సామాజిక దృక్పథాలు ఈనాటి ఆధునిక సమాజంలో తగ్గిపోతున్నాయి.

సమాజమంటే ప్రజలు సహజీవనమని, మానవీయ విలువలతో జీవించటమని మరుస్తున్నారు. దీనివల్ల సమాజం పునాదులు దెబ్బతింటున్నాయి. మనిషి మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. కేవలం మనిషి యాంత్రికంగా

జీవనాన్ని గడుపుతున్నాడు. ఇది సరైన జీవన విధానం కాదు. సమాజంలో ఈనాడు ఏమి లోపిస్తున్నాయో వాటిని 'నిత్యసత్యాలు'లో చూపెట్టి ఆచరించమన్నాడు.

**'నిత్యసత్యాలు' సామాజిక దృక్పథం :**

మల్లెమాల రచించిన కావ్యాలలో 'నిత్యసత్యాలు' ఒకటి. 'నిత్యసత్యాలు' అని తన పుస్తకానికి పేరును పెట్టడంలోనే ఆయన అందులోఏమి చెప్పదలచు కున్నాడో స్పష్టమవుతుంది. 'కవిత్వాన్ని కాలానుగుణంగా కూర్చగలిగిన వాడే నిజమైన కవి'. తాను ఏమి రచించినా అది సమాజ హితమో, సాహిత్య ప్రయోజనమో అయి వుండాలి. మల్లెమాల 'నిత్యసత్యాలు' అంటువంటిదే.

మల్లెమాల నిత్యసత్యాలులో సమాజపు పోకడలను, లోతులను చూపించారు. నిత్యసత్యాలు గ్రంథంలో 'మహిత వినయశీలి మల్లెమాల'. అనే మకుటంతో రాసిన రెండు శతకాలున్నాయి. వాటిలో సమాజాన్ని స్పష్టంగా చదివిన ఆయన తీరు కనిపిస్తుంది. "కటిక వాస్తవాలే కరదీపికలు నాకు" అని సమాజంలో సత్యాలను దీపాలుగా వెలిగించి అందరికి దారి చూపించాలని కోరుచున్నాడు.

సామెతలను, పలుకుబళ్ళను, అచ్చ తెలుగు పదాలను తన పద్యాలలో ఉపయోగించి సామాన్యునికి సైతం తన పద్యాలు అర్థమయ్యే విధంగా రాశాడు. ఇందులో ఆయన చూపిన అనేక జీవన మార్గాలున్నాయి. సంపూర్ణంగా సమాజాన్ని తడిమి చూసిన ఆయన జీవితానుభవం ఉంది. నిత్యసత్యాలలో ఆయన చూపిన సామాజిక దృక్పథం అద్భుతం, ఆచరణీయం.

మల్లెమాల సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను తూలనాడాడు. మంచి కవిత్వం కవికి భూమిమీద పేరును తెస్తుంది. పేరు కోసమే రాశులుగా కవిత్వాన్ని వ్రాస్తే అది వ్యర్థమని 'కవికి రాశి కంటే వాసి' ప్రధానమన్నారు. అంటే, కవిత్వం సమాజ క్షేమం కోరేదిగా ఉండాలని ఆయన భావన.

సమాజంలో ఈనాడు రకరకాల వేషాలతో ప్రజలను మోసం చేస్తున్నారని చెబుతూ "వేషధారణమయిన విజ్ఞత పెరుగునా?" అని ప్రశ్నించాడు. నేటి సమాజంలో వేషాన్ని బట్టి గౌరవం ఏర్పడి ఉంది. సాధువులు జడలు పెంచుకుని దొంగ సాధువులుగా ప్రజలను మోసం చేస్తున్నారని, ఇది సరైనది కాదని ఆయన అభిప్రాయం.

మల్లెమాల 'నిత్యసత్యాలు'లో సమాజాన్ని పట్టి పీడిస్తున్న సామాజిక సమస్యల గురించి, మానవత విలువల గురించి మసిబారిపోతున్న రాజకీయం, విద్య, వైద్య, సామాజిక సంస్కృతి సంప్రదాయాలు, పేదరికం, స్త్రీ వెనుకబాటుతనం, మూఢాచారాలు, మతం, కులం, పేదరికం ఇలా ఎన్నెన్నో అంశాలను గురించి క్షుణ్ణంగా తెలియపరిచాడు.

**విద్య - ఆవశ్యకత :**

చదువొక పున్నమి వెన్నెల
చదువే సన్మార్గదర్శి సత్యార్జనకున్
చదువే హేతువు ధాతువు
చదువే సకలార్థ విజయ సాధనమిలలో

అనాగరికత నుండి నాగరికత వైపు మనిషి నడిపించినది విజ్ఞానం. ఆనాటి నుండి ఈనాటి వరకు మానవుని మనుగడ వికాసంలో విద్య ఎంతో ప్రాముఖ్యం వహించింది. విద్య అంటే పుస్తక జ్ఞానమొక్కటే కాదు. సమస్త అంశాలను గ్రహించటమని అర్థం. ప్రజ్ఞావంతులైన వారు సమాజంలో ఉంటేనే ఆ సమాజం త్వరగా అభివృద్ధిని సాధిస్తుంది. అటువంటి జ్ఞానం అందరికీ అందాలని తపన పడ్డారు మల్లెమాల.

జ్ఞానహీనుడైన వానికన్న - గడ్డిమేసి బ్రతుకు గాడిద మేల్గాదె? ఈ పద్య పాదాలలో మల్లెమాల జ్ఞానసంపదను మానవులందరూ సంపాదించాలన్నాడు. జ్ఞానహీనుడు గాడిద కన్నా తక్కువని అటువంటి జీవితం వద్దని అందరూ చదువుకోవాలని సూచించాడు. చదువే మనిషిని సంపూర్ణ మానవునిగా తీర్చిదిద్దుతుందని చదువు విలువల తెలుసుకొని జీవించమన్నాడు.

మన సమాజంలో విద్యలేనివారు వెనుకబడి ఉన్నారని, సమాజం అటువంటి వారిని తక్కువగా చూస్తుందన్నాడు. అందుకే సమాజంలో ఎక్కువమంది విద్యా

వంతులైతే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని చదువు యొక్క గొప్పతనాన్ని తెలియపరిచాడు.

## స్త్రీ స్వేచ్ఛ :

సమాజం అన్ని రంగాలలో ఎంతో మార్పును, అభివృద్ధిని సాధించిందని అయితే స్త్రీ ఇంకా వెనుకబడి ఉందని వారికి ఇంకా సంపూర్ణ స్వేచ్ఛాస్వాంత్ర్యాలు కలగ లేదని సమాజపు మూఢత్వంలో మ్రగ్గిపోతున్నారని ఆవేదన చెందాడు.

వధువు నరయునపుడె వరకట్న మెంతని
అడుగువాని కాలరొడిసి పట్టి
స్త్రీలు ఉమ్మివేసి చీకొట్టి వలయును
మహిత వినయశీల! మల్లెమాల?!

అని స్త్రీలు సమాజంలో వరకట్న వేధింపులతో బలై పోతున్నారని అటువంటి వాటి నుండి మేలుకోవాలని ఆరాటపడి స్త్రీ పక్షాన నిలబడ్డాడు.

స్త్రీలు విద్యావంతులైనా కూడా సమాజపు మూఢ కట్టుబాట్లలో పడి ఇంకా వెనకబడే ఉన్నారని ఆయన బాధపడ్డారు. వరకట్న సమస్యలు, స్త్రీలపై జరిగే అత్యాచారాలు, పేదరికం, స్త్రీలకు భద్రత లేకపోవడం, గురించి చెప్పి వాటి నుండి బయటపడాలని కోరాడు.

పురుషుడు చదివిన చదు వా
పురుషునక పరిమితమ్ము; పొలతి చదివినన్
గురువును తల్లియు తానై
గురవును బిడ్డలకు చదువు క్రమశిక్షణయున్

నేటి సమాజంలో చాలా వరకు మార్పు కనిపిస్తున్నదని ఇంకా మార్పు రావాలని కోరాడు. ఏ సమాజంలో స్త్రీలు విద్యావంతులై స్వేచ్ఛతో జీవిస్తారో ఆ సమాజం త్వరగా అభివృద్ధిని సాధిస్తుందని అందుకే స్త్రీ స్వేచ్ఛ కోసం పోరాడాలని ఆకాంక్షించాడు. 'నిత్యసత్యాలు'లో మల్లెమాల స్త్రీ ఔన్నత్యాన్ని స్వేచ్ఛను గురించి చక్కగా వివరించాడు.

## పేదరికం – సమాజ మార్పు :

ఏ సమాజినికైనా పేదరికం పెద్ద శాపమని, పేదరికాన్ని జయించడమే నిజమైన అభివృద్ధని మల్లెమాల నిత్య సత్యాలులో చెప్పారు. "కడుపునిండ తిండి కరువైన నరునకు" అంటాడు. ఆయన కవితలో లోతైన మానవతా వాదం దాగుంది. సమాజాన్ని తరచి చూచిన విధం కనిపిస్తుంది. తరతరాల నుండి బానిసత్వం, పేదరికంతో మ్రగ్గి పోతున్న మానవుని జీవన వేదన ఆయనలో ప్రతిధ్వనించిన భావాలలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"కడలిలోన చేపకన్నీటి విలువెంత
అంతియె నిరుపేద ఆర్తి విలువ"

ఈ పద్యపాదాలలో సముద్రంలో ఉన్న చేప నిజంగా కన్నీరు కార్చినా దాని కన్నీటికి విలువ ఉండదు. దాని ఆర్తిని గుర్తించేవారు ఉండరు. అలాగే సమాజంలో నిరుపేద వాటి ఆర్తికి, ఆకలికి విలువ లేదు. ఈనాడు సమాజంలో ఆర్థికంగా వెనకబడి కూటికి గతిలేని ఎందరో అభాగ్యులున్నారు. వారందరూ ఆకలితో, దరిద్రంతో బాధ పడుతున్నారు. అటువంటి వారంతా తమ దారిద్ర్యాన్ని తలచుకొని దాని నుండి తప్పించుకొనే మార్గంలేక అణగారిపోతున్నారు. వీరందరి ఆర్తిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. వీరికి ఓదార్పు లేదని మల్లెమాల నిత్య సత్యాలులో సత్యాన్ని చాటారు.

## రాజకీయ చైతన్యం :

"అంతుపొతులేని అవకాశవాదమే
రాజకీయములకు రాచబాట"

నేటి సామాజిక వ్యవస్థలో రాజకీయం ఎలా మారిందో, విలువలను ఎలా కోల్పోయిందో ఇది తెలుపుతుంది. ఈనాడు అవకాశవాదమే రాజకీయంగా మారింది. స్వార్థం, అవినీతి, రాజకీయంలో ప్రధాన భాగాలుగా మారాయి. సమాజం, దేశం ప్రగతి, అభివృద్ధి ఇవన్నీ చెప్పుకోవటానికి మాత్రమే మిగిలాయి. రాజకీయ పార్టీలన్నీ స్వంత లాభం కోసం పనిచేస్తూ, దేశాన్ని అధోగతి పాలుచేస్తున్నాయి. విలువలు లేని పార్టీలు ప్రజల్ని పీల్చుకొని తింటున్నారని కవి ఆవేదన వ్యక్తం చేశాడు.

"ఇంద్రజాల విద్య, లెల్లిముందుగ నేర్చి
ప్రజల మోసగించ పథకమందు"

పూర్వం బ్రతుకు తెరువుకోసం రకరకాల ఇంద్రజాల మహేంద్రజాల విద్యలను ఉపయోగిస్తే, ఈనాటి స్వార్థ రాజకీయ పార్టీలన్నీ ప్రజల్ని మోసగించడం కోసమే తమ పథకాలను ప్రవేశపెట్టి రకరకాలుగా ప్రజల్ని మభ్యపెట్టి మాయ విద్యలు నేర్చి మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

"వృత్తి రాజకీయవేత్తల కొలువులో
చిత్తశుద్ధి కొరకు మొత్తుకొనుట
మురికి గుంటలోన ముత్యాలు వెదకుటే"

రాజకీయ వ్యవస్థలో చిత్తశుద్ధి లేదు. ఈరోజు రాజకీయ నాయకులు కేవలం తమ స్వార్థ ప్రయోజనాలకోసం పనిచేస్తున్నారు. రాజకీయరంగంలో, రాజకీయ నాయకులలో చిత్తశుద్ధిని వెతకుట అనేది మురికికుంటలో ముత్యాలు ఏరుట వంటిదని కవి భావన.

మురికి గుంటలో ముత్యాలు దొరకనట్లే రాజకీయ నాయకులతో కూడా చిత్తశుద్ధి లేదని అటువంటివారి వల్ల సమాజానికి లాభం లేదని కవి ఆవేదన తెలియజేశాడు. సమాజం విలువలు లేని రాజకీయ నాయకుల వల్ల నష్టపోతున్నాడని ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురౌతున్నారని రాజకీయ వేత్తలు తమ దృక్పథాన్ని మార్చుకోవాలని, ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని, అటువంటి నిస్వార్థపరులే సమాజానికి అవసరమని మల్లెమాల నిత్యసత్యాలులో సూచించారు.

## మతం - మానవత :

మతం ఎప్పుడూ సమాజ శ్రేయస్సును కాంక్షించాలి. సర్వమత సమ్మేళనం సమాజహితమైనదని ఇందులో కవి చెప్తాడు. ఏ మత సిద్ధాంతమైన అది ఖచ్చితంగా మనిషి మనుగడకు ఆలంబన అవ్వాలి. మతం మనిషి జీవితాన్ని నాశనం చేయరాదంటారు.

"కులమత విద్వేషములను
పలువురిలో రగులు కొలిపి పదవులకొఱకై
విలువైన దేశభవితను
నిలువున బలిపెట్టువాడు నీచుడుసుమ్మీ!"

మతం మూల సూత్రం మనిషి సత్ప్రవర్తనతో జీవించేలా చేయటం. అటువంటి మతం కొంతమంది స్వార్థపరుల వల్ల ప్రజా సంకటంగా మారిందని కవి ఆవేదన వ్యక్తం చేశాడు. మత విధానం ప్రజల జీవన కోణాన్ని మార్చాలి. మంచి పౌరులుగా, మంచి సామాజిక వ్యవస్థను నిర్మించేలా ఉండాలని కవి సూచించాడు. ఏ మతమైనా మతసూత్రమైనా లోక హితాన్ని కోరాలని అటువంటి మతం సమాజ హితాన్ని కోరుతుందని కవి తెలియపరిచాడు. సమాజంలో మతం తన ప్రాభవాన్ని ఎప్పుడూ చాటుతూనే ఉంటుంది.

"మతములన్ని యెన్నియున్నను
ప్రతి మత లక్ష్మమ్మ లోక భాగ్యప్రదమే"

దేశంలో ఎన్ని మతాలున్నప్పటికి ఆ మతాల సారమెల్ల వాటి లక్ష్యమెల్ల లోకాన్ని మంచివైపు నడిపించుటమనే గొప్ప సందేశం కవి ఇచ్చాడు.

మతం ప్రధానతత్వం హితం. ఆ హితం సమాజ హితమై ఉండాలని, సమాజం సంక్షేమాన్ని కోరేదే నిజమైన మతమని అటువంటి మతాన్ని అందరూ అవలంభించాలని, ఆచరించాలని హత్యలు, దోపిడీలు, దొంగ పూజలు చేయకూడదని సమాజాన్ని ఇబ్బందులకు గురిచేసే మతసూత్రాలు ఉండరాదని చక్కని సందేశాన్ని నిత్య సత్యాలులో మల్లెమాల తెలియపరిచి హితమైన మతాన్ని ఆచరించమన్నారు.

## సమాజం - వివక్షత :

సమాజంలో వివక్షత ఎక్కువగా ఉందని, సమానత్వం లేదని దానికోసం పోరాటం చేయాలన్నాడు.

"ధనబలము కన్న గొప్పది
జనబలమేయనెడు నిత్యసత్యమెరుగుమా"

అని అద్భుతమైన సందేశాన్ని ఇచ్చాడు. అంటే, సమాజంలో ధనబలంతో వివక్షతో ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అటువంటి వివక్ష తగదని, జన బలం ఎప్పుడూ నిత్యసత్యమని తెలుసుకోవాలని ధన బలం కంటే జనబలమే గొప్పదని చాటాడు.

సమాజంలో పేదరికం, లేనితనం, వెనుకబాటుతత్వం ఉన్నాయని ఇటువంటి వివక్షతో సమాజం వెనుకబడి

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC Approved Journal No. 42500

పోయిందని ఆ విధానం మారాలని అటువంటి మార్పు వస్తే ప్రజలంతా సుఖశాంతులతో ఉంటారని కవి భావించాడు.

"శ్రమశక్తిలోన మొలచిన
చెమటను చెడుకంపటంచు చీకొట్టకు మీ"

అని పేదవాడి పక్షాన నిలబడి జాలిచూపి కర్తవ్యాన్ని బోధించాడు. కార్మికుని, శ్రామికుని శక్తితో పుట్టిన "చెమట కంపును" చీ కొట్టద్దని, శ్రామికుడు లేనిదే సమాజ మనుగడ లేదని, శ్రమశక్తిని గుర్తించేవాడే నిజమైన మనిషని శ్రామికుని శ్రమను దోచుకోవటం, నీచమైన పనని చాటి శ్రమశక్తి యొక్క గొప్పతనాన్ని తెలియచేశాడు కవి.

శ్రామికులు "ఆకలి దోపిడీలు, చావులు హత్యలు" సంస్కృతిలో అడుగంటి పోతున్నారని వారిని వాటినుండి తప్పించి నూతన జీవన విధానానికి అలవాటు చేయాలని వారిని సమాజంలో మనుషులుగా చూడాలని అది అందరి బాధ్యతని కవి చెప్పాడు.

సమాజాన్ని మల్లెమాల గారు ఎంతో లోతుగా పరిశీలించారు. "చెప్పులకు నోరు లేదని చెప్పుట వాస్తవముగాదు" అని సమాజంలోని కుల వ్యవస్థ వల్ల సమాజం ఎటువంటి వివక్షతకు గురైపోతుందో నిర్భయంగా చెప్పాడు.

సమాజంలో ఇంకో వివక్షత కులమత వివక్షత "కుల మత విద్వేషములను పలువురిలో రగులు కొలిపి పదవుల కొరకై" అంటాడు. స్వార్థ మానవులు తమ అవసరాలకు మతాన్ని వాడుకుంటున్నారు. ఇది సరైందికాదు. కులం మనుషుల మధ్య సమానత్వాన్ని పాడుచేస్తుంది. అటువంటి ఈ సమాజ వివక్షతలను రూపుమాపాలని కవి ఆరాటపడి వాటి నిర్మూలనకు అందరూ కలిసి జీవించాలన్నాడు.

సమాజ వివక్షత అనేది ప్రతి రంగంలో ఉంటుందని దీనిని అందరూ కలసి పారద్రోలాలని అటువంటివి సమాజాన్ని నాశనం చేస్తాయని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నిత్యసత్యాలులో మల్లెమాల అద్భుతమైన కవితాశక్తితో అంతర్లీనమైన భావంతో తెలియపరిచాడు.

## సంస్కృతి - సాంప్రదాయం :

మసిబారిపోతున్న, మారిపోతున్న తెలుగువాడి సంస్కృతి - సాంప్రదాయాలను ఎలుగెత్తి గొంతెత్తి వినిపించాడు మల్లెమాల తన నిత్యసత్యాలు కావ్యంలో. సమాజంలో నివసిస్తున్న మానవులకు వారి సామాజిక దృక్పథాలలో అంత్యంత ముఖ్యమైనవి సంస్కృతి - సాంప్రదాయాలని, వాటిని మనం విస్మరిస్తే మనల్లి మనం చంపుకున్నట్లేనని వాటికోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్తూ వాటి గొప్పతనాన్ని తెలియజేశాడు.

"మరచితిమి తెలుగు సంస్కృతి
మరచిమేనాడో తెలుగు మాధుర్యమ్మున్
మరచితిమి విజ్ఞులెందరో
స్వరపరిచిన తెలుగుపాట సౌందర్యమ్మున్"

ఎంత అద్భుతమైన భావన ఇది. తెలుగువాడిగా పుట్టిన మనం ఏమి కోల్పోతున్నామో చూడండి. తెలుగు సంస్కృతిని, మాధుర్యాన్ని, విజ్ఞులైన కవి పండితులను, తెలుగు పాటను దాని సౌందర్యాన్ని మరిచిపోతున్నామని, ఆ సంస్కృతిని కాపాడుకోవలసిన బాధ్యత మనదేనని మల్లెమాల తెలుగుజాతి సంస్కృతిని గురించి తెలియజేశాడు.

మన సాంప్రదాయాలు మనం మరుస్తున్నామని సాంప్రదాయాన్ని మరిస్తే మనిషికి మనుగడ లేదని సాంప్రదాయాల గొప్పతనాన్ని చెప్పాడు.

'కంచి పట్టుచీర కట్టిన స్త్రీలన్న' అంటూ స్త్రీలు చక్కని చీరకట్టులో గొప్ప సాంప్రదాయాన్ని పాటించారని ఈనాడు ఆ సంస్కృతి సంప్రదాయం గడపదాటిపోతుందని దానిని మనం పరిరక్షించుకోవాలనే ఆవేదన, ఆలోచన కవి ఇక్కడ తెలియజేశాడు.

"సుదతి అందమునకు నుదుటి కుంకుమ బొట్టు
చూడ ముచ్చటైన శోభగూర్చు
కాని, నాగరికత కాటువేసెను దాని"

ఇంతగా సమాజాన్ని తరచి చూచిన కవి ఆధునిక సమాజంలో లేదేమో అనిపిస్తుంది. స్త్రీలకు నుదిటిన పెట్టిన కుంకుమ బొట్టు అద్భుతమైన శోభను, అందాన్ని, చేకూర్చుతాయని, అటువంటి సమాజ సంస్కృతిని, ఆ

సాంప్రదాయాలను నేడు ఆధునిక సమాజ స్థితిగతులను 'నిత్యసత్యాలు'లో వ్యక్తీకరించారు.

వేదమంత ప్రాచీనమో మన సంస్కృతి అంతా ప్రాచీన మని తెలియజేసి అందరూ ఆధునిక నాగరికతలోపడి మన నాగరికత సంస్కృతిని మరుస్తున్నారని ఇది సరైన విధానం కాదని మన నాగరికతను మనమే కాపాడు కోవాలని కోరాడు.

### కళలు - కళా విశిష్టత :

"మున్ను తెలుగునాటి మిన్నంట వెలిగిన
బుర్రకథలు నేడు బువ్వలేక
డొక్కలెండిపోయి చిక్కిశల్యములాయె" అన్నాడు.

మన సంస్కృతిలో జానపద కళారూపాలలో హరి కథలు, బుర్ర కథలు, తోలు బొమ్మలాటలు, దొమ్మ రాటలు వంటి ఎన్నో కళలు అంతరించిపోతున్నాయని ఇవన్నీ మన సంస్కృతిలో భాగమని వాటిని మనం పరి రక్షించుకోవాలని కవి ఇందులో ప్రస్ఫుటంగా తెలియ జేశాడు.

మనదేశంలో కళలు ప్రాచీనకాలం నుండి మనషి జీవన విధానంలో ఒక భాగంగా వస్తున్నాయని, జీవితం కళాత్మకమైనప్పుడే పరిపూర్ణత వస్తుందని, ప్రతి దేశం కళలకు పెద్దపీటవేసి పోషిస్తున్నామని చెప్పారు. కళలు దేశ వారసత్వం సంపదని అటువంటి కళలను, వాటి యొక్క విశిష్టతను, మనం తెలుసుకొని కాపాడవలసిన బాధ్యత ఉన్నదని విశదపరిచాడు.

తెలుగునాట ఉన్న అనేక కళారూపాలు ఇప్పుడు కను మరుగు అవుతున్నాయని ఆవేదన చెందాడు. దొమ్మ రాటలు, తోలుబొమ్మలాటలు, గంగిరెద్దులాటలు, బుర్ర కథలు, హరి కథలు ఇలా ఎన్నెన్నో కళలు ప్రస్తుతం ఆద రణ లేక వాటి విశిష్టత కోల్పోయి, వాటి గురించి నేటి తరానికి తెలియకుండా పోయారని కవి ఆవేదన చెంది కళలను కాపాడమని, కళాకారులను పోషించాలని సూచిం చారు.

### తెలుగు భాష - ఔన్నత్యం :

"తెలుగంత మధురమైనది
తెలుగొకటే తప్పతుదకు తేనియయేనిన్
తెలుగువలె చవులుగొలుపదు
తెలుగున గలవంతు లేని తియ్యందనముల్

తెలుగు భాష యొక్క సాహిత్యం యొక్క ఔన్నత్యాన్ని, విశిష్టతను అద్భుతంగా తెలియజేసిన ఆధునిక పద్య కవులలో అగ్రగణ్యుడు మల్లెమాల. అచ్చతెలుగు పదాలతో రమ్యమైన భావలు పలికించి వీనులవిందు చేశారు. తెలుగంత తియ్యనైనది, మధురమైనది లేదని అంతటి రుచికరమగు భాష ఒక్క తెలుగుభాష అని ఆయన చెప్పిన తీరు అద్భుతం. తెలుగువాడి తల్లిభాష తెలుగు. అటు వంటి తల్లిభాషను కాపాడుకోవలసిన బాధ్యత ఉన్నదని చక్కగా వివరించారు.

మనదేశ భాషలందున
ఘనమైనది తెలుగుభాష గావునమనమా
జనరంజక మగుభాషను
కనుపాపగ మదినిదలచి కాపాడవలెన్

దేశభాషలందున తెలుగుభాషే గొప్పదని, ఘనమైన దని అటువంటి తెలుగుభాషను కాపాడుకోవాలని, జనరంజకమైన తేటతెలుగు తియ్యని తెలుగుభాషను కనుపాపగా, మన భాషగా మనం కాపాడుకోవాలని సూచిం చాడు.

ఆధునిక భాషావ్యామోహంలోపడి మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇది సరైంది కాదని తెలుగుభాషను ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఆచరించాలని కోరాడు. తెలుగు భాష ఎంతో విలువైనదని, భాషను జాగ్రత్తగా కాపాడు కోవాలని సూచించి మాతృభాషపై గల తన అభిమానాన్ని చాటాడు. తెలుగు వారందరికీ తెలుగుభాష యొక్క ఔన్నత్యాన్ని చాటాడు.

మల్లెమాల "నిత్యసత్యాలు - సామాజిక దృక్పథం" అనే ఈ వ్యాసంలో ఎన్నో సామాజిక విషయాలను చర్చకు తెచ్చారు. సమాజంలో అసమానతలుగా ఉన్న మతం, కులం, వర్ణం, జాతి, విభిన్న భాషలు, సంస్కృతులు, సాంప్రదాయాలు, జాతి వివక్షతలు ఏ విధంగా

సమాజాన్ని అధోగతి పాలు చేస్తాయో వాటివల్ల సమాజం ఎలా నష్టాన్ని చవిచూస్తోందో ఎంత పురోగభివృద్ధి ఆగిపోతుందో, మాన వులు ఆధునిక నాగరికత సమాజంలో అనేక విషయాలలో ఎందుకు ఇంకా వెనుకబాటుతత్వాన్ని కలిగిఉన్నారో కలిగిఉన్నారో తెలియజేశారు.

సమాజపు పరిస్థితులను లోతుగా పరిశీలించిన గొప్ప తాత్వికుడు. సమాజ శ్రేయోవాది సంఘ సంస్కరణాభి లాషిగా మల్లెమాలను మనం వేనోళ్ళ పొగడవచ్చును. ఆయన తత్వం అద్వితీయం, ఆయన మార్గం అనితర సాధ్యం. ఆధునిక కవిత్వంలో పద్య ప్రక్రియలో కావ్యాలు వ్రాసి తెలుగువారి కందించిన ఘనత మల్లెమాలకు దక్కు తుంది.

"మెడ వాల్చిన పూమొక్కకు
పుడిసెడు నీరమ్ముపోసి పోషించి నటుల్
కడుపెండి బక్కచిక్కిన
బడుగుకు సాయమ్ముచేసి బ్రతికించవలెన్"

సమాజమనే బక్కచిక్కిన పూమొక్కను చక్కని భావాలు, ఆదర్శాలు కలిగిన నీరును పోస్తే అది కల్మషం లేని రుగ్మతలు లేని అందమైన అద్భుతమైన నవ్య నాగరికత పుష్పం పూస్తుందని అటువంటి మంచి సమా జాన్ని సాధించాలని కవి కోరాడు.

# ‘ఆశావాది’ వారి ‘అంతరంగ తరంగాలు’ : అంతర్వీక్షణం

- బి. వి. ఎస్. గౌతమ, రిసోర్స్ పర్సన్, భారతవాణి ప్రాజెక్ట్, ఆంధ్ర ప్రదేశ్, భారతీయభాషా సంస్థ (CIIL), మైసూరు, కర్నాటక.

## పరిచయం :

ఆ మహాకవిచేతిలో ఎన్నిపద్యాలు ఆకారందాల్చాయో, ఎన్నికొత్త భావాలకు ప్రాణంపోసి తెలుగు సాహిత్యంలోకి పంపాడో తెలియదుకాని. ఎంతమందికి పద్యవిద్య నేర్పి మహానుభావులను చేసాడో. పద్యవిద్యకదా! కవిత్వం రాయలేడు అనుకున్నా అమరశిల్పి జక్కన చెక్కిన విధంగా ప్రతిఒక్క పద్యాన్ని అర్థవంతంగా చెక్కారు. అలా చెక్కిన వాటిలో ‘అంతరంగ తరంగాలు’ ఒకటి. ఇందులో కవితలు కావ్యలకు మించినవి. ఒకేసారి వందేళ్ళ అనుభవాన్ని ఇచ్చేవి కొన్ని. మరికొన్ని కవితలు మన విధులను గుర్తుచేసేవి. కొన్ని ప్రపంచీకరణ ద ృక్పథంలో సాగినా, ఇంకొన్ని కులవివక్ష ఎత్తిచూపిన కవితలు ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూపోతే ఒకటేమిటి యశోదకు చిన్నికృష్ణుడి నోటిలో అన్నిలోకాలు కనపడినట్టు నాకు అన్నిభావాలు, తత్త్వాలు ఈ ‘అంతరంగ తరంగాలు’ లో కనపడ్డాయి.

## అంతరంగ తరంగాలు : అంతర్వీక్షణం

ఈ ‘అంతరంగతరంగాలు’లో నాలుగు రకాలైన కవితలు ఉన్నాయి.

సాగరతరంగం (దీర్ఘకవితలు)
నదీతరంగం(సాధారణ కవితలు)
తటాక తరంగం (ఆలాపనాయోగ్యగేయకవితలు)
సౌదామినీ తరంగం(మినీకవితలు)

మొదటగా సాగర తరంగంలోని కవితలన్నీ దీర్ఘ కవితలు. గోరంతదీపం అనే కవితలో

ముక్కూ ముక్కూ నొక్కి రెక్కారక్కా తట్టి
కన్నూకన్నూ కలిపి యెదలో సొదలు రేపి
కంఠంలో మాధుర్యం చిలికిస్తూ పలికింది
మగకోయిల తన నేస్తంతో....
నీ నీడలో వెచ్చంగా ఉండాలనుకున్నా
నీ స్నేహంలో కరిగిపోవాలనుకున్నా
మన చెలిమికి చిహ్నంగా అంతులేని సంతానం పొందాలనుకున్నా
ఈ తోటంతా మన పిల్లలే
ఈ ఆకాశంలో నక్షత్రాల్లాకొమ్మకొమ్మనారెమ్మరెమ్మనా కేరింతలు కొడుతుంటే
కళకళాగలగలా నవ్వుతుంటే చూసి పొంగిపోవాలను కున్నా
ఓ నా ముద్దులచెలీ!నీవెంతపిచ్చిదానివే
పిల్లల పెంపకంలోని మాధుర్యం మనకేమైనా తెలుసా
నీ పని నీదినాపనినాదిగా ఉడాయిస్తున్నా
కాకి గూటిలో పడవేస్తున్నా.....
మన ఆదర్శ దాంపత్యం అందరికీ తెలిసేలా
ప్రక ృతిమధ్య మన ఉనికి ఆకర్షించేలా
మన ప్రేమలు తరగకుండేలా
గోరంత దీపం కొండలకు వెలుగులా
ఒక్కరోఇద్దరో మేలు. బ్రతుకు పండిస్తే చాలు.

నేను పరిచయ వాక్యాల్లో చెప్పిన విధంగా ఈ కవిత్వం వంద సంవత్సరాల అనుభవాన్ని రంగరిస్తే ఈ కవిత. ప్రస్తుత ప్రపంచీకరణద ృక్పథంలో జరుగుతున్న అన్యాయాన్ని తల్లిదండ్రుల ఉద్యోగాల హడావుడిలో కన్న పేగు తెంచుకొని పుట్టిన పిల్లల్ని ఎక్కడెక్కడో పడవేసి, సాయంత్రం వచ్చే సమయంలో గూటికి తీసుకొనివచ్చి మరలా అదే విధంగా తర్వాతి రోజు కూడా.. ఇలా అయితే బిడ్డకు తండ్రికి ఆప్యాయత కాదుకదా ఏవగింపు రావడం ఖచ్చితం. ధనార్జనా ధ్యేయంగా పెట్టుకున్న తల్లిదండ్రుల గురించే కాక, ప్రపంచ జీవన చిత్రాన్ని కవి గోరంతదీపంలో కొండంతలా చూపించారు.

ఇంకొక కవితలో నిజానికి కవిత అనడం సమంజసం కాదేమో అనిపిస్తుంది. ఎందుకంటే పచ్చినిజాలు కవితలో ఉండకూడదనికాదు. కవితలన్నీ అభూతకల్పనీ కాదు నా ఉద్దేశ్యం.ప్రత్యక్షంగా చూసిన మనసులో ఆ బాధను

అనుభవించి రాసిన విధంగా ఉంది. సంక్షోభ సంక్రాంతి కవిత.

మా గడపలో అడుగుపెడుతూ
మమ్మాశీర్వదించడానికి వస్తున్న సంక్రాంతి పురుషుడా
నీకు మనసారా స్వాగతం పలకలేక పోతున్నా
............................................
భోగిమంటల ఎదుట కేరింతలు కొట్టవల్సిన మేము
దహన సంస్కారాల మధ్య జాగరణ చేస్తున్నాం
కమ్మగా గొంతెత్తిగొబ్బెమ్మలుపాడవల్సిన మేము
ఉత్కంఠగా మూగవోయి దుర్భర వేదనా గీతికలు ఆలపిస్తున్నాం
ముంగిట రసరమ్యంగా రంగవల్లులు తీర్చవలసిన మేము
చేతుల చైతన్యం విరిగి మూలకూర్చొన్నాం
దాసరి తుంబుర మీటలో
సంబరం చూపవల్సిన మేము
కాంతి దరిగినకన్నుల్తో ఆకాశం వైపు చూస్తున్నాం
పశువుల అలంకరణలో చొక్కిపోవల్సిన మేము
విషాద మనస్కులమై అంధకారంలో చిక్కిపోతున్నాం
తామర తంపరగాపంటల్ని ఇంటికి తరలించవల్సిన మేము
సర్వం స్వాహా చేసిన జలప్రళయంతో రాజీ పడుతున్నాం.
అందుకే ఓ సంక్రాంతి పురుషుడా నీకు మనసారా స్వాగతం పలకలేక పోతున్నాం
ఇప్పుడే చెవులో ఇల్లుకట్టుకొనివినపడుతుందొక సత్యం
ప్రకృతిని ఆరాధించి ప్రేమిస్తే అది నిన్నుఆరాధిస్తూ ప్రేమిస్తుందని
ప్రేమకు దూరమైలంపటులౌతున్నందుకేనా
దెబ్బమీద దెబ్బగా ఎనలేని శిక్షలను అనుభవిస్తున్నాం.
నీవేనా ప్రకృతిని అదుపులో తేలేకపోతున్నాం.

సంక్రాంతి మారింది. ఒకప్పుడు పల్లెటూర్లు పచ్చని పొలాలతో పాడిపంటలతో పిల్లల కేరింతలతో గ్రామాల నిండా జనంతో ఆప్యాయపు పలకరింపులతో ఆనందానికి మరో చిరునామాగా ఉండేవి. ధాన్యాగారాలతో నిండి ఉండేవి. ఇప్పుడు ధాన్యమూలేదు. ధాన్యాగారాలూ లేవు. పాడిపంటలతో ఎదురు వచ్చే రైతులు “పాడి“ ఎదురొస్తున్నది. అభివృద్ధి పేరుతో కర్మాగారాలు కట్టుకొంటూపోతూ అభివృద్ధి పేరున అడవులు నరికివేస్తూ విస్తృతంగా పెరుగుతున్న నగరీకరణ చెప్పలేనంతగా పెరిగిపోతున్న వాహన కాలుష్యం ఒకటేమిటి మానవుడు చేస్తున్న అన్ని పనులు ప్రకృతికి విరుద్ధంగా చేస్తున్నాడు. ప్రపంచీకరణ అని చివరకు మనుగడ ప్రశ్నార్థకమౌతుందని రచయిత చాలా చక్కగా, లోతుగా అలతిఅలతి పదాలతో సంక్షోభ సంక్రాంతి కవితలో చెప్పడం జరిగింది.

భారీ పరిశ్రమలు అంటూ రాసిన కవితలో విద్యకు పరమార్థం విజ్ఞానమా ? కాదు,

ఆత్మవిశ్వాసం కలిగించడమా?అసలేకాదు- మరేమిటి?
ఉద్యోగం.... ఉద్యోగం.... అందుకే నేమో
విజ్ఞానానికి కొలబద్ధఆరంగుళాల సర్టిఫికేట్
కాయితాలమ్మే పరిశ్రమల దగ్గర రెండు పాదాల గాడిదలు క్యూలో నిలబడ్డాయి.
అదృష్టంతో వచ్చిన ఉద్యోగంతో కడుపు నిండడం లేదనిగడ్డిమేస్తున్నాయి
దినదినానికి గడ్డివిలువ పెరుగుతోంది

విద్యకు పరమార్థం విజ్ఞానమా ? కాదు, అనే వ్యంగ్య బాణాలను విసురుతూ, అదృష్టంతో వచ్చిన ఉద్యోగంతో కొంతమంది ఉద్యోగులు లంచంతీసుకున్నారని చెప్పడంతో పాటు లంచానికున్న విలువ మరిదేనికీ లేదంటూ పై కవితలో చెప్పడం జరిగింది.

కవి అన్నవాడు ప్రస్తుతంలో ఉండి భవిష్యత్తుగూర్చి హెచ్చరించే వాడని నా అభిప్రాయం. అలానే ఈ క్రింది కవిత ఆశావాదివారుపెనుభూతమనే కవితలో నేనెదిగా ఇప్పుడింకా ఎదుగుతున్నాను ముందు ఇంకెంతగానో ఎదుగుతాను చక్రవాక పర్వతం అంచులదాకా

చంద్రమండలందాకా కాదు కాదు ఆకాశం అంచుల దాకా స్వాతంత్రంతో నల్లబజార్లో విగ్రవీగాను

వెర్రివేషం వేశాను..... న్నన్నింకా మీరిలానే ఎదగనిస్తే మిమ్మల్నందర్నీ అట్టే మింగేస్తాను. ఇంతకూ ఎవర్ననా మీ అనుమానం. గుప్తధనంబొజ్జపైయజ్ఞోపవేతాన్ని అధిక ధరల పెనుభూతాన్ని..

సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న ధరలగూర్చి చక్కగా చెప్పారు. సున్నితంగా హెచ్చిరించారు. ధరలు పెరగడం వల్ల ఒక్కపూట తినడానికి తిండిలేక అలమటి స్తున్న వారున్నారు. ఇంకొంతమందిబడావ్యాపారవేత్తలు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. ఇలా ధరలు ఆకా శాన్నంటుతున్నాయంటూ ఆశావాది వారు చాలా చక్కగా కవిత్వీకరించారు.

ఇలానే ఎప్పుడూ అనే శీర్షికన ఒక కవితను రాశారు.

నేస్తం ఇక్కడంతా క్షేమం ఇంటిలో లాంతరు వెలిగిద్దా మంటే
కట్నంతేని కోడల్ని కొత్తలోకానికి పంపడానికి అత్తగార ప్పుడే కిరోసిన్ రిజర్వ్ చేసుకున్నారు
పొలాల జలాలకై ఇంజన్ నడుపుదామంటే మతాల మారణ హెూమాలు సృష్టించడానికి స్వార్థపరులప్పుడే డీజల్ రిజర్వ్ చేసుకున్నారు. నాల్గుమెతుకులు తినేదాకా కొవ్వొత్తి వెలిగిద్దామంటే జన్మదినాల సంబ రాలు జరుపుకోవడానికి వున్నవాళ్లు ఎప్పుడో వాటిని రిజర్వ్ చేసుకున్నారు. ఈ రిజర్వేషన్ల బెడద తీరే దెన్నడు. నిజమైన పేదరికానికి చేయూత ఎప్పుడు
స్వచ్ఛమైన ప్రతిభకు గుర్తింపు ఎప్పుడు

పై కవితలో ఆశావాదివారు ఆశావాదం వ్యక్తం చేస్తూ రాయడం జరిగింది. రిజర్వేషన్ అందినవాడు మళ్లీమళ్లీ ఉపయోగించుకుంటున్నాడు. అసలు కొంతమందికి అందనే అందదు.

నిజమైన పేదవాడు మరింతపేదవాడిగా మారు తున్నాడు. స్వతహాగా ప్రతిభ ఉన్నవాడు ఇంకా పనిచేసు కుంటునే ఉన్నాడు. ఇది కవితలో ఒకకోణం. మార్కెట్‌లో సులభంగా దొరకవల్సిన వస్తువులు దళారులు కృత్రిమ కొరతను సృష్టించి మధ్యతరగతి జనాన్ని కష్టాల పాలు చేస్తున్నారు ఇది రెండవ కోణం.

**ముగింపు :**

అంతరంగ తరంగాలు అనే వచన కవితా సంపుటి ద్వారా ఆశావాదివారు అక్కడక్కడా సమాజం మారుతుం దేమో అని ఆశావాదం వ్యక్తం చేస్తూ, మనిషికి ఉండాల్సిన నైతిక విలువలను గుర్తుచేస్తూ, అణగారిన వర్గాల్లో స్ఫూర్తిని నింపుతూ సమాజానికి మార్గదర్శకులైనారు.

**ఆధార గ్రంథాలు :**

1. ప్రకాశరావు,ఆశావాది. 2005. అంతరంగ తరంగాలు. ప్రొద్దుటూరు : నవ్య సాహితీ సమితి.
2. ప్రకాశరావు,ఆశావాది. 2008.ఆశావాదికవితాంతరంగం. కర్నూల్ : జిల్లా రచయితల సమితి.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# ధిక్కార భాస్వరం 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా'

– డా॥ వెల్దండి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

భూగోళం మీద కనపడని అక్షాంశాలు, రేఖాంశాల్లాగే ఈ దేశం మీద ఆధిపత్య వర్గాలు గీసిన కుల గీతలు కూడా కంటికి కనిపించవు కాని వాటి తాలూకు సెగ మాత్రం బాధితుల గుండెను తాకి మెలిపెడుతుంది. భారతదేశంలో వేల ఏండ్లుగా చాతుర్వర్ణ కుల వ్యవస్థ వేళ్ళూనుకుంది. కింది కులాల వాళ్లంతా ఐదేండ్లకు ఒకసారి వచ్చే బూటకపు ఎన్నికల్లో లైన్లో నిలబడి ఓటు వేయడానికి పనికి వస్తారు తప్ప ఇతర ఏ అధికారానికి, అభివృద్ధికి నోచుకోరు. 1980ల నుండి మొదలు పెట్టి తెలుగు సాహిత్యంలో రెండు దశాబ్దాల పాటు దళితవాద సాహిత్యం విస్తృతంగా వచ్చింది. ఆ సాహిత్యమంతా దళితుల మూతికాడి ముంతను, ముడ్డిచుట్టు కట్టుకున్న ఆకులను, కులం పేరుతో జరిగే దాడులను ప్రశ్నించింది. అంటే ఒక్క మాటలో అస్పృశ్యతను నిలదీసి అక్కడే ఆగి పోయింది. కాని నక్సలైట్లచే గ్రామీణ ప్రాంతాల నుండి తరిమివేయబడి, ప్రపంచీకరణను అందిపుచ్చుకుంటూ నగరాలకు తరలి వెళ్లిన భూస్వామ్య, పెట్టుబడిదారులు చాప కింద నీటిలాగా ప్రదర్శిస్తున్న ఆధునిక కుల వివక్షను, అస్పృశ్యతానంతర పరిస్థితులను ప్రశ్నిస్తూ వచ్చిన సాహిత్యం అతి తక్కువ. గత దశాబ్ద కాలపు అర్బన్ దళిత జీవితపు అలజడుల్ని, కుల సర్పం చిమ్మిన విషపు తీవ్రతను చిత్రించిన కథల సంపుటి డా. పసునూరి రవీందర్ రాసిన 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా'.

గ్లోబలైజేషన్ అనంతర దశలో అభివృద్ధి మరింత అగ్ర వర్ణాలకే పరిమితమైంది. దళితులకు రిజర్వేషన్లు అందినా మల్టీనేషనల్ కంపెనీల్లో, రియలెస్టేట్, విద్యా సంస్థలు, పలు కార్యాలయాల్లో కూడా ప్రతిభకు స్థానమే లేదు. కులమే దేన్నయినా నిర్ణయిస్తుంది. ఇక్కడ కులమే ప్రమాణం. ఈ హిడెన్ ఎజండా అమెరికా దాకా సాగి అక్కడ కూడా పలు సంస్థలు పెట్టుకునే స్థాయికి చేరడమే గాక, వేముల రోహిత్ లాంటి దళిత విద్యార్థులను ఆత్మ హత్యలకు పురికొల్పుతున్న విశ్వవిద్యాలయాలకు కూడా పాకింది. దీని ద్వారా దళితులు ఇంకా భౌతికంగా, మానసికంగా 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' లోనే ఉంచబడు తున్నారు. ఈ సంపుటిలోని 15 కథలు దేనికదే ఒక ప్రత్యేక కోణంలో పట్టణాల్లోని నయా దళిత వాదాన్ని వినిపిస్తాయి. కంటికి కనిపించకుండా రంగు మార్చుకున్న (Paradigm Shift) కుల వివక్షను పట్టిచూపుతాయి. ముఖ్యంగా 'గోవర్ణం' కథ ఆధునిక మనువుగాడి విశ్వరూపాన్ని చూపెడుతుంది. ఇప్పుడు ప్రపంచం చాలా మారింది ఇంకా కులాలెక్కడియి. అంతా కలిసే తింటున్నాం. కలిసే నడుస్తున్నాం. కలిసే ఉద్యోగాలు చేస్తున్నాం అని ఎంత వాదించినా రియలెస్టేట్ భూములు, విల్లాలు, అపార్ట్ మెంట్‌లు కులాల వారిగానే అమ్ముతుండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కులాన్ని బట్టే మనం ఎక్కడ ఫ్లాట్ కొనాలో డిసైడ్ అవుతుంది. అంటే నగర జీవితంలో డబ్బుతోపాటు కులం కూడా ఒక జీవన పరికరంగా పనిచేస్తుంది. కార్పోరేట్ యుగంలో కూడా కుల ప్రస్తావన ఎక్కడిదని అను కుంటూనే గుట్టు చప్పుడు కాకుండా ఒక వివక్ష వెంటాడు తుంది. వేధిస్తుంది. ఆత్మన్యూనతకు గురిచేస్తుంది. 'వేరెవర్ యూ గో..' ఇండియన్ క్యాస్ట్ సిస్టం ఫాలోస్ అన్నట్లు ఎక్కడికి పోయినా కులం వెంబడిస్తూనే ఉంటుంది. "కులం లేదు గిలం లేదని మాట్లాడుతున్నవ్ గని పట్నంల కూడా కులముంటదే. కాకుంటే బయటికి కనిపించకుండా దాని పని అది చేస్తుంటది. దానితో దెబ్బతిన్నోళ్లకేమో అది కనిపిస్తది. దాన్ని పాటిస్తూ, ఆధిపత్యం చెలాయించే పెద్దకులపోళ్లకు అది లేనట్టుగా భ్రమింపజేస్తది. గందుకే ఇగ బాధపడేటోళ్లు బాధపడుతుంటే, బాధపెడు తున్నోళ్లు మాత్రం ఇంకా కులమెక్కడిది? అని నీతులు చెబుతుంటరు" అని కథకుడు ఓ చోట కులం అసలు

రంగు ఎలా ఉంటుందో వివరిస్తాడు. నిమ్న కులాల వాళ్లు పట్టణాల్లో ఇల్లు అద్దె కోసం తిరుగుతుంటే చాలా చోట్ల 'వెజిటేరియన్స్ ఓన్లీ' అని బోర్డు కనిపిస్తుంటుంది. అంటే దాని అంతరార్థం మాదిగ, మాలలకు ఇల్లు కిరాయికి ఇవ్వమని. ఒక్క పొలైట్ మాటతో 'దేవుని బిడ్డలు' ఎక్కడుండాలో నిర్ణయించేస్తున్నారు. పొరపాటున ఇల్లు కిరాయికి ఇచ్చినా చుట్టు పక్కల వాళ్లు నాలుగు రోజుల్లో ఏ కులమో తెలుసుకొని వ్యూహాత్మకంగా ఒంటరిని చేసి కులాన్ని గుదిబండగా మెడకు కట్టి మెదలకుండా చేస్తారు. ఈ నిశ్శబ్ద హింస తీవ్రతకు అసలు తాను మనిషి నేనా అనే అనుమానం కూడా కలుగకపోదు.

తమ కొడుకులను, కూతుళ్లను డాలర్ల వేటలో అమెరికాకు పంపి, తామిక్కడ విప్లవవాదాన్ని వాఖ్యానిస్తూ, కవితలు, వ్యాసాలు రాస్తూ తమ అనుచరుల కొడుకులను మాత్రం విప్లవ భావాల వైపు అడుగులు వేయించే సూడో విప్లవ వాదులను నిగ్గదీసి అడిగిన గొప్ప కథ 'పొద్దయింది'. సామాజిక విప్లవాన్నో, సామ్యవాద విప్లవాన్నో ఆశించి నక్సలిజం వైపు మొగ్గు చూపిన వాళ్లలో ఎక్కువ మంది దళితులే కావడం గమనార్హం. వృద్ధాప్యంలోని తల్లిదండ్రులను కూడా చూడకుండా తరాలకు తరాలులో క్యాడర్‌లో చేరి రక్తబాట పట్టిన అమాయక యువకులు ఎంతో మంది నేలకొరిగారు. కుటుంబాన్ని వదిలి, కెరీర్‌ను వదిలి అడవి బాట పట్టిన యువకులకు విప్లవోద్యమం వల్ల జరిగిని నష్టాన్ని రచయిత ప్రశ్నిస్తాడు. అంతిమంగా దళితులు మట్టిలో, ఆధిపత్య వర్గాలు మన్నంటని చలువ రాతి మేడల్లో. ఈ అవకాశవాద ద్వంద్వ వైఖరికి విప్లవోద్యమం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసే కథ ఇది.

ఇలా ఈ సంపుటిలోని ప్రతి కథ ఆధిపత్య వర్గాల పునాదులను కదిలించే కథ. ఇప్పుడు రెండే కులాలు ఒకటి ధనిక, మరొకటి పేద అని అనుకుంటాం కాని తెర వెనక కులం పోషించే పాత్రను, కంటికి కనిపించని రీతిలో కులం రంగు మార్చుకుంటుంటే దీన్ని చర్చకు పెట్టిన కథలివి. ఒక సాంఘిక విముక్తి కోసం సాహిత్యం చేయాల్సిన పనికి ఒక చిన్న అడుగు ఈ కథలు. అయితే దళితులతో మమేకమై జీవించే బహుజనుల గురించి కూడా కథల్లో అక్కడక్కడ ప్రస్తావిస్తే మరింత బావుండేది. అంతేగాక ఈ కథలు కేవలం మాదిగ కులాన్ని మాత్రమే పట్టించుకున్నట్టుగా కనిపిస్తుంది. మాలల గురించి కూడా చెప్తే మరింత సమగ్రత వచ్చేది. కథకుడు ఈ కథల్ని 'తెలంగాణ దళిత కథలు' అన్నాడు కాని వీటిలో వాడిన భాష తెలంగాణ తెలుగుకు, సోకాల్డ్ ప్రామాణిక భాషకు మధ్యన ఊగిసలాడుతూ ఉంటుంది. ఇదిలా ఉంటే దళిత కథలు రాస్తూ దళిత సంస్కృతి, బూతు పదాలు, బీఫ్ తినడంలాంటివి లేకుండా రాయడం కథకుని సంస్కారం అనుకోవాలా? లేక సహజత్వానికి దూరం జరిగాడనుకోవాలా? అర్థం కాదు. మొత్తంగా ఈ కథలు నవ్వుతూ నవ్వుతూనే దొంగదెబ్బ తీసే ఆధిపత్య వర్గాల నైజాన్ని, మర్యాద పూర్వకంగానే జరిగే ఒక వింత దాడిని గ్రహించాలనే ఎరుకను కలిగిస్తాయి. ఇన్నేండ్లుగా మూస ధోరణిలో సాగిన దళిత కథలను ఒక మలుపు తిప్పిన కథలివి. పట్టణ దళితుల గొంతును, ఆక్రోషాన్ని వినిపించిన కథలు. మహానగరాల్లోని ఇరుకు మనుషుల మైలను కడిగేసిన కథలుగా గుర్తించాలి. ఇంత సాంకేతిక విప్లవంలో ఉన్న మనం ఇప్పటికైనా డీక్యాస్టీపై కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తున్నాయి. ఆధునికత వస్తువుల్లో, వేష, భాషల్లో కాదు మనిషి సంస్కారంలో, పరివర్తనలో, ప్రయాణంలో ఉండాలని మన దళసరి చర్మాన్ని, మన సును 'దబ్బనాల'తో కుచ్చి మరీ చెప్తాయి. ఇంకా మారక పోతే ఆత్మలోకంలో మనల్ని వెలివేస్తాయి. నిప్పుల కుంపట్లను నెత్తి మీద కుమ్మరించి కుదిపేస్తాయి.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(1), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

# Code Mixing and Code Switching by the Youth in Andhra Pradesh Universities : A Study

- ***Dalavayee Loknadham***, Ph.D Research scholar in Linguistics, Sri Venkateswarauniversity, Tirupati.

Code Mixing and Code Switching have been the inevitable consequences of language contact situation in the bilingual and multilingual countries like India. Hence, there is a need to focus on the socio-cultural and pragmatic factors of CM/CS in Indian English. To fulfill this need, with the help of the recognized database- Indian Component of International Corpus of English (ICE-IND), the researcher proposes to study Code Mixing and Code Switching in IE speech from the Sociolinguistic point of view. The researcher intends to establish IE as a widely recognized standard non-native variety of English on the basis of the peculiar use of CM and CS.

There have been individual studies on the aspects of CM and CS in by the youth in Andhra Pradesh Universities. Many of them use the written data (Kachru 1978b, Shastri 1988, Verma 1976). Only a few studies deal with the spoken data. Malik's (1994) study deals partly with the Spoken and partly with the Written data. The present work is perhaps, the only full scale and comprehensive study of the sociolinguistic and the pragmatic features and the frequency of CM and CS by the youth in Andhra Pradesh Universities

In the context of the observations of the studies and the theoretical framework built up in the foregone chapter, the researcher proposes to pursue the methodology concentrating on the following points:

1. To maintain the distinction between Code Mixing and Code Switching for the sake of description and propose the working definitions.
2. To provide the register-wise classification of Code Mixing,
3. To provide the category-wise classification for Code Switching,

The discussion of these points, offer the concrete statements about the methodology employed in the present study.

**Method of the Study :**

Several different methodologies and techniques have been used for analyzing the behavior of Code Mixing and the Code Switching. They vary as per the thrust areas of the studies. The methodology used for studying syntactic constraints in CM/CS, for example, is different from the methodology used in analyzing the contextual CM/CS. Again the techniques used for classifying Code Mixing from Code Switching differ from one restricted definition to the other. There is not, it seems, an ideal methodology that can be used for studying all the aspects of the huge and complicated phenomena of CM/CS.

**Purpose of the Study :**

The present study aims at investigating the influence on code mixing and code switching of Youth.

- Whether there is any impact of surroundings?
- Whether there is any effect of language?
- Whether there is any impact of intelligence?

- Whether there is any influence of study habits?

**Objectives of the Study :**

- To explore the socio-cultural and the socio-semantic features of Code Mixing and Code Switching contributing among university students.
- To explore the socio-cultural and the socio-semantic features of Code Mixing and Code Switching contributing between male and female university students.
- To evaluate how the CM/CS choices are situational determined and how shifts in situation are closely related to shifts in the language varieties.

**Hypothesis of the Study :**

- There would be significant impact of socio-cultural factors on CM and CS among university students.
- There would be significant impact of socio-cultural factors on CM and CS between male and female university students.
- There would be significant impact of socio-semantic factors on CM and CS among university students.
- There would be significant impact of socio-semantic factors on CM and CS between male and female.

**Limitations of the Study :**

- The present study limited to youth in AP Universities only.
- The present study limited to youth in Selected Government Universities only.

**The Result and discussion :**

Result and discussion of "the code mixing and code switching in the present context situation by the youth in AP Universities" will be discussed in this chapter.

**Summary, conclusion and recommendation in the study :**

At the end be drawn summarized, conclusion and recommendation of the study.

**Useful and Enriching to the Socity :**

The code mixing and code switching skill to develop vocabulary of different languages it is useful to enrich to livelihood skills in the social order.

**References :**

- Annamalai, E. (1978). The Anglicized Indian Languages : A Case of Code-mixing. In International Journal of Dravidian Linguistics.
- Jacobson, R. (1977). The Social Implications of Intra-sentential Code-switching. The New Scholar. Vol. 6
- Kachru, B.B. (1978a). Towards Structuring Code Mixing: An Indian Perspective. In Kachru and Shridhar, (eds.), 1978. Aspects of Socio-linguistics in SouthAsia.
- Lokanadham,D.(2016)Codemixing and Code switching by the youth in S.V,University. M.Phil thesis Linguistics(un published) S.V.University,Tirupati
- Malik, Lalita (1994). Sociolinguistics: A study of Code Switching.

# Telugu Students of Upper Primary and High School classes : Conversational Analysis : An Introductory Sketch

**- B. Suresh Naick**, Ph.D Research scholar in Linguistics, Sri Venkateswarauniversity, Tirupati.

Conversation analysis (CA) is an approach to the study of social interaction, embracing both verbal and non-verbal conduct, in situations of everyday life. As its name implies, CA began with a focus on casual conversation, but its methods were subsequently adapted to embrace more task- and institution-centered interactions, such as those occurring in doctors' offices, courts, law enforcement, help lines, educational settings, and the mass media. As a consequence, the term 'conversation analysis' has become something of a misnomer, but it has continued as a term for a distinctive and successful approach to the analysis of social interactions.

Conversational analysis argues that there are several rules to how we exchange with each other in everyday talk. They are:

- One person speaks at a time,
- People commonly speak at the same time, or overlap, although it is brief,
- Usually, transitions, or turns, have no gap and some overlap, although there can be both gaps and overlaps,
- The order of the turns varies,
- The length of turns varies,
- The order of turn is not predetermined.

There is no need to explain the necessity of interaction in the modern world. Conversation leads a society to "orderly and intelligible social interaction" (Godwin. C, 1990; p 283). People involving in conversation exhibit a lot of social, cognitive and linguistic ability they have acquired through experience. In Indian society, children lead a sheltered life under the care of parents, teachers and elders. The peer group interaction also exerts a lot of influence on them.

The present study is an attempt to identify the patterns of interaction school children involve in. The young minds are so active. The situations, they are exposed to, are so varied that are unpredictable for them, although they face them without any hesitation most of the times. Hence, a study of their competence will be of much use to both Applied Linguists and Socio-linguists.

The present investigation of"**Telugu Students of Upper Primary and High School Classes: Conversational Analysis"**This work confined some upper primary and high schools in Chittoor District.

At the fundamental level, conversation analysis is the study of talk. It studies the natural and authentic conversation in real life situations, especially to determine turn-taking organization, silence and repairing problem, sequence of utterances and transcription.

The term refers to analysis of larger linguistic units such as conversations or written texts, and most discourse analysts ultimately aim to understand the relationship between language and society. The scope of discourse analysis is vast, drawing on a variety of disciplines and encompassing an array of perspectives.

Conversational Analysis (CA) studies "the social organization of conversation" (Burns

& Browns; p 214). Goffman (p 234) distinguishes "Casual conversation" and "talk-in-interaction". This distinction is not focused in the present study. The present study is concerned with how the students involve in conversations. For the analysis of conversation, Adjacency Pairs (AP), "a sequence of two related utterances by two different speakers. The second utterance is always a response to the first", (Richards & Schmidt 2010; p 12) are considered which are "precisely specified" (Heritage, J 2005; p 106). The other patterns, as said by Richard & Schmidt are as follows:

Clarification request (p 78)
Closing (p 84)
Cocktail party phenomenon (p 86).

The production of the first part of the adjacency pair most determines the second part and so remains highly expectable (Bussmann, H 1996; p 18). The other highly related concepts of spoken language are: "Repairs" (Bussmann, H 1996; p 1000) and "False Start" ( Hunston& Oakey 2010; p 165) and etc. are considered here.

Paul, C (2001; p 97) makes distinction among Conscious, Careful speech and Ordinary casual conversation.

Since the study does not include telephonic conversation, features like "Call closing" (Gee &Handford 2012' p 113) are not included in this study.

In a nation like India, where most of the speakers are bilingual or multilingual, "Constant Code Switching" (Ball, M.J 2010; p 82) and "Code Mixing" (Malmkjaer 2010; p 55) have remained a part of everyday interaction.

Last but not the least, the society and the language are inseparable and hence "Communities of Practice" (Malmkjaer 2010; p 136) features are also analyzed.

The study "The Overall Structure of Emergency Service Call" by Zimmermann (1984 & 1992) is taken as a model for detailed analysis.

The aim of this study is to improving the conversational analysis of children at home, school and society.

**References :**


- Berns, Margie & Brown, Keith, Concise Encyclopedia of Applied Linguistics, Elsevier, 2010
- Goodwin, Charles, and John Heritage. "Conversation analysis." Annual review of anthropology 19.1 (1990): 283-307.
- Lerner, Gene H. (ed.) (2004) Conversation Analysis: studies from the first generation. Philadelphia: John Benjamins Publishing.
- Goodwin, Charles, and John Heritage. "Conversation analysis." Annual review of anthropology 19.1 (1990):

భావవీణ

# BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

Journal of Telugu Literary, Culture & Language Study

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

September (1) 2019




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.